

'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

రెడీ స్టడీ గో



వచ్చే నెల నుంచే పలు దేశాల్లో అడ్మిషన్ల ప్రక్రియలు ప్రారంభం

సరైన అవగాహనతో ముందుకెళితే సమస్యలు రాకుండా ఉంటాయంటున్న నిపుణులు

విదేశీ విద్యకు అర్హతలు, అవకాశాలపై సూచనలివీ

ఒకప్పుడు విదేశాల్లో చదువుకోవాలంటే అంత సులువైన విషయం కాదు. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య పెరిగిపోయింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ నుంచి చాలా మంది విద్యార్థులు విదేశాలకు వెళ్తున్నారు. వరంగల్, కరీంనగర్, నల్లగొండ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుంచి కూడా విదేశీ విద్య వైపు చూస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. వారంతా విదేశాలకు వెళ్లే ముందు హైదరాబాద్‌కే చేరుతున్నారు. ఇక్కడున్న కన్సల్టెన్సీలను సంప్రదించి విదేశీ విద్య కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో వచ్చే నెలలోనే కొత్తగా అడ్మిషన్ల ప్రక్రియలు మొదలవుతాయి. ఈ నేపథ్యంలో సరైన అవగాహనతో ముందుకెళితే.. సులువుగా విదేశీ విద్య పూర్తి చేసుకోవచ్చని, మంచి జాబ్ కూడా సంపాదించవచ్చని నిపుణులు చెప్తున్నారు. అసలు విదేశీ విద్యకు అర్హతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో స్పష్టంగా తెలుసుకోవాలని సూచిస్తున్నారు.

..: సాక్షి, హైదరాబాద్ :..

అవకాశం, అవగాహన పెరగడంతో..

విదేశాల్లో విద్య అంటే ఒకప్పుడు చాలా ఖర్చుతో కూడిన వ్యవహారమన్న భావన ఉండేది. దానికితోడు పెద్దగా అవగాహన లేకపోవడంతో.. విదేశాలకు వెళ్లడం ఎందుకులేనన్న పరిస్థితి ఉండేది. కానీ పెరిగిన అవకాశాలు, అవగాహన, ఇప్పటికే విదేశాల్లో ఉన్నవారితో సులువుగా అనుసంధానమయ్యే వీలు వంటివి.. విదేశాలకు వెళ్లి చదువుకునేవారి సంఖ్య పెరిగేందుకు దారితీస్తోంది. పాస్‌పోర్టు జారీ విధానం సులభతరం కావడం, విదేశాల వీసాలు సులువుగా దొరుకుతుండటం, స్కాలర్ షిప్‌లతో అవకాశాలూ పెరిగాయి. మరోవైపు స్థానికంగా విద్య కోసం ఖర్చులు కూడా బాగా పెరిగిన నేపథ్యంలో.. మరింత అదనంగా ఖర్చు చేస్తే విదేశాల్లో చదువుకోవచ్చని, అక్కడే ఉద్యోగమూ సంపాదించవచ్చని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు.

హైదరాబాద్ నుంచే ఎక్కువ

అమెరికాకు గతేడాది 75,000 మంది ఇండియా నుంచి వెళ్తే.. అందులో హైదరాబాద్ నుంచే 22,500 మంది ఉన్నట్టు అంచనా. ఇక కెనడాకు మొత్తం 1.3 లక్షల మంది వెళ్లగా.. దాదాపు 35,000 మంది హైదరాబాద్ మీదుగా వెళ్లారని.. ఇందులో సిటీవారే ఎక్కువని ఓపెన్ డోర్ సంస్థ నివేదిక చెబుతోంది. మిగతా దేశాలకు కూడా హైదరాబాద్ నుంచి వెళ్లిన విద్యార్థులే ఎక్కువని పేర్కొంటోంది.

ఏమేం అర్హతలు ఉండాలి?



- చదువుకున్న కాలేజీ నుంచి కండక్ట్ సర్టిఫికెట్ ఉండాలి.
- సరైన పాస్‌పోర్టు ఉండాలి.
- ఆదాయ వనరులు సరిగ్గా ఉండాలి
- ఆంగ్లంలో నైపుణ్యం ఉండాలి (ఐఈఎల్‌ఈఎస్, టోఫెల్‌లో మంచి స్కోర్ కలిగి ఉండాలి)
- మెడికల్, పోలీస్ క్లియరెన్స్ ఉండాలి.
- టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, డుయో లింగో, ఎస్ఏటీ, జీఆర్ఈ వంటి పరీక్షల్లో స్కోరును బట్టి యూనివర్సిటీలు అడ్మిషన్లు ఇస్తుంటాయి. ఒక్కో దేశంలోని ఒక్కో యూనివర్సిటీ ఒక్కో పరీక్షలో స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటుంది.
- వీసా కోసం అప్లికేషన్ చేసుకున్న తర్వాత కాన్సులర్ అధికారితో ఇంటర్వ్యూ ఉంటుంది. మీరు దరఖాస్తులో అందజేసిన వివరాలు సరైనవేనా, కాదా అనే విషయాన్ని ఇంటర్వ్యూలో రూఢీ చేసుకుంటారు. అక్కడికి ఎందుకు వెళ్లాలనుకుంటున్నారు? చదువు అయిపోయాక ఏం చేయాలనుకుంటున్నారనే విషయాలపై సమగ్రంగా ప్రశ్నలు అడుగుతారు.

స్టూడెంట్ వీసా తీసుకుని..



- స్టూడెంట్ వీసా ఉంటే ఆ దేశంలో సంబంధిత కోర్సు పూర్తయ్యేంత వరకు ఉండి చదువుకునేందుకు అనుమతి ఉంటుంది. తర్వాత కూడా రెండేళ్ల పాటు వర్క్ పర్మిట్ మీద ఉండేందుకు అనుమతిస్తారు.ఆ రెండేళ్లలోగా సరైన ఉద్యోగం పొందలేకపోతే.. స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి ఉంటుంది.
- స్టూడెంట్ వీసా కోసం ఏ దేశానికి వెళ్లాలనుకుంటే ఆ దేశానికి చెందిన కాన్సులేట్ కార్యాలయం లేదా రాయబార కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా వీసా అప్లికేషన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి.
- విద్యార్థులకు అమెరికా అయితే ఎఫ్, ఎం, జే వీసాలు ఇస్తుంది. యూకే అయితే టైర్‌-4 వీసాలు జారీ చేస్తుంది. కెనడా స్టడీ పర్మిట్స్ పేరిట ఇస్తుంది.

వీసాలు రిజెక్ట్ అవుతుంటాయి.. ఎందుకు?

- విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నవారికి ఒక్కోసారి వీసా రిజెక్ట్ అవుతుంటుంది. ఇందుకు కారణాలు చాలానే ఉంటాయి.
- ఆదాయ వనరులకు సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడం
- డాక్యుమెంట్లు సరిగ్గా లేకపోవడం.
- చదువు పూర్తయ్యాక తిరిగి స్వదేశం వెళతామని రుజువు చేయలేకపోవడం
- చదువులో మంచి మార్కులు లేకపోవడం
- ఏదైనా తప్పులు లేదా ఫ్రాడ్ చేయడం

వర్సిటీలపై స్టడీ చేయాలి

ముందుగానే ఏ యూనివర్సిటీ మంచిదో కాస్త పరిశోధన చేయాలి. ఆ తర్వాతే కన్సల్టెన్సీల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. అదే నేరుగా కన్సల్టెన్సీలను ఆశ్రయిస్తే.. సరైన కాలేజీ లేదా యూనివర్సిటీకి దరఖాస్తు చేయకపోవచ్చు. తర్వాత బాధపడి ఏమీ లాభం ఉండదు. కొన్ని కన్సల్టెన్సీలు ఎక్కువ కమీషన్ ఇచ్చే వర్సిటీలకు దరఖాస్తు చేయిస్తుంటాయి. అందుకే వర్సిటీలను జాగ్రత్తగా ఎంచుకోవాలి.



నిఖిల్ మండల, మాంచెస్టర్, బ్రిటన్

విదేశాల్లో స్కాలర్‌షిప్ పొందడమెలా?

విదేశాలకు చదువు కోసం వెళ్తున్న అందరికీ అక్కడి వర్సిటీల్లో ఫీజులు చెల్లించే స్తోమత ఉండకపోవచ్చు. అందువల్ల కాస్త ఆర్థిక భారం తగ్గించుకునేందుకు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవడం మంచిది. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే స్కాలర్‌షిప్ పొందడం కూడా సులువే..

1. విదేశాల్లో వర్సిటీలు మాత్రమే కాకుండా వేరే సంస్థలు కూడా స్కాలర్‌షిప్స్ ఇస్తుంటాయి. అందుకే యూనివర్సిటీ వెబ్‌సైట్లతోపాటు స్కాలర్‌షిప్‌లు అందించే ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల వెబ్‌సైట్లను కూడా తరచూ చూస్తుండాలి.
2. విదేశాలకు వెళ్లాలనుకోవడానికి ఏడాది ముందే స్కాలర్‌షిప్‌ల గురించి వెతుకుతుండాలి. ముందుగా స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలి.
3. చాలా స్కాలర్‌షిప్ టెస్టుల కోసం అడ్మిషన్ లెటర్ అవసరం ఉండదు. అందుకే

మిగతా IIవ పేజీలో ▶



అనాథలు కాదు ఆటగాళ్లు

ఆర్చరీలో ప్రతిభ చూపిస్తున్న ప్రభుత్వ బాలల సదనంలోని చిన్నారులు

వారిలోని ప్రతిభను గుర్తించి జువెనైల్ ఆర్చరీ అకాడమీ ఏర్పాటు

అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ఆధ్వర్యంలో కోచింగ్

- వివరాలు IIలో



ది డైమండ్..

ఇకపై అందరి నేస్తం

అందరికీ అందుబాటులో ల్యాబ్‌గ్రోన్ డైమండ్స్

సీవీడీ, హెచ్‌పీహెచ్‌టీ వంటి పద్ధతుల్లో తయారీ

హైదరాబాద్ మార్కెట్‌లో లభ్యం

- వివరాలు 11లో

నవీన్ (పేరు, వివరాలు మార్చాం) అనాథ బాలుడు. బంధువులు పట్టించుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బాల కార్మికుడిగా మారాడు. కర్మాగారాల్లో, పరిశ్రమల్లో దుర్భర పరిస్థితుల్లో పనిచేశాడు. అధికారులు రెస్క్యూ చేయడంతో.. నాలుగేళ్ల కింద సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనానికి చేరాడు. ఇప్పుడతను విలు విద్య (ఆర్చరీ)లో జాతీయస్థాయి క్రీడాకారుడు. స్కూల్ లెవల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలు దాటి గత నవంబర్‌లో గుజరాత్‌లో నిర్వహించిన జాతీయ బాలల ఆర్చరీ పోటీల్లో పాల్గొన్నాడు. అందులో 800 మంది పోటీపడితే 158వ స్థానం దక్కించుకున్నాడు. ఇప్పుడు సదనంలోని ఆర్చరీ అకాడమీలో కోచ్ సాయంతో రాటుదేలుతున్నాడు. భవిష్యత్తులో చాంపియన్ అవుతానంటున్నాడు.

..: సైదాబాద్ :..

.. ఇది ఈ ఒక్క బాలుడి కథనంకాదు, అతడిలా దుర్భర పరిస్థితుల్లో జీవించి, రెస్క్యూ ఆపరేషన్లలో సదనానికి చేరుకున్న మరెందరో చిన్నారులు తమదైన ప్రతిభ చూపుతున్నారు. మరో ముగ్గురు బాలలూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని, గుర్తింపు తెచ్చుకున్నారు.



అనాథలు కాదు ఆటగాళ్లు

- అధికారుల రెస్క్యూలో జువెనైల్ హోంకు చేరిన పిల్లలు
- వారిలోని చురుకుదనాన్ని గుర్తించి జువెనైల్ ఆర్చరీ అకాడమీ ఏర్పాటు
- అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ఆధ్వర్యంలో కోచింగ్
- రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రతిభ చూపుతున్న బాలలు

ఆర్చరీలో ప్రతిభ చూపిస్తున్న సైదాబాద్ ప్రభుత్వ బాలల సదనంలోని చిన్నారులు

తల్లిదండ్రులు లేక రహదారులపై భిక్షమెత్తుతూనో, రైళ్లలో సంచరిస్తూ, బాలకార్మికులుగానో పనిచేస్తున్న పిల్లలను అధికారులు రెస్క్యూ చేసినప్పుడు.. సైదాబాద్‌లోని ప్రభుత్వ బాలల సదనానికి తరలిస్తారు. అలా వచ్చిన పిల్లలు పెద్దయ్యేదాకా ప్రభుత్వమే చూసుకుంటూ ఉంటుంది. ఈ క్రమంలో ఆ బాలల్లోని ప్రతిభను వెలికితీయడంపై అధికారులు దృష్టిపెట్టారు. స్వతహాగా క్రీడాకారుడైన జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మీర్జా అలీ బేగ్ పలువురు బాలల్లో చురుకుదనాన్ని పసిగట్టారు. చక్కటి తర్ఫీదు ఇస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని గుర్తించారు. తన ఆలోచనను ఉన్నతాధికారులకు చెప్పి ఒప్పించారు. ఎక్కడా జువెనైల్ విభాగంలో లేనిరీతిలో.. హైదరాబాద్‌లోని సైదాబాద్ జువెనైల్ హోంలో 2022 నవంబర్‌లో జువైనల్ ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేయించారు. ఇక్కడ ఉదయం బాలికలకు, సాయంత్రం బాలురకు ఆర్చరీలో తర్ఫీదు ఇస్తున్నారు.

రెండేళ్ల క్రితం ప్రారంభమైన ఆర్చరీ అకాడమీ..

అకాడమీలో కోచ్‌గా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి, యూత్ ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన, వరల్డ్ 7వ ర్యాంకర్ హేమలతా యాదవ్‌ను నియమించారు. ఆమె 15 రోజుల శిక్షణతోనే అకాడమీలోని ఒక బాలుడు జిల్లా స్థాయి పోటీల్లో రాణించి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించడం.. ఆ పోటీల్లోనూ ఏడో స్థానంలో నిలవడం విశేషం. తర్వాత ఇక్కడి బాలలు నలుగురు రాష్ట్రస్థాయిలో, ఒకరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించారు.

అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి కోచ్‌గా..

ఒడిదుడుకుల బాల్యం నుంచి సదనానికి చేరిన తర్వాత బాలలు క్రమశిక్షణతో కూడిన జీవితానికి అలవాటుపడుతున్నారు. అధికారులు, సిబ్బంది సూచనలతో చదువులోనూ రాణిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు రాసి పాసవుతున్నారు. ఇద్దరు విద్యార్థులు సదనం నుంచి బయటికి వచ్చి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆ ఇద్దరూ ఆర్చరీ విభాగంలో రాష్ట్రస్థాయిలో చక్కగా రాణిస్తున్న వారే.

చదువులోనూ రాణిస్తూ..

చదువు, ఆర్చరీ రెండూ కొనసాగిస్తాం

"కఠినమైన బాల్యాన్ని చూశాం. అప్పటి రోజులు గుర్తుకొస్తే ఇప్పటికీ బాధేస్తుంది. సదనానికి వచ్చిన తర్వాత క్రమపద్ధతిలో జీవిస్తున్నాం. చదువుతూనే ఆర్చరీలో శిక్షణ పొందుతున్నాం. ఉన్నత విద్య పూర్తి చేయాలని, ఆర్చరీ పోటీల్లో చక్కటి గుర్తింపు పొందాలని కోరుకుంటున్నాం.."

ఆర్చరీలో ప్రతిభ చూపుతున్న బాలల మనోగతం



అంతర్జాతీయ ఖ్యాతి సాధించాలన్న..

తెలంగాణ ప్రభుత్వ బాలల సదనంలోని పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో రాణించి మంచి ఖ్యాతి గడించాలన్నదే మా ఆకాంక్ష. అందుకోసమే మరెక్కడా లేనట్టుగా సైదాబాద్‌లోని సదనంలో ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేశాం. ప్రభుత్వం, ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించడంతో అకాడమీ సాధ్యమైంది. ఆకాంక్షలకు అనుగుణంగా బాలలు రాణిస్తున్నారు. చదువులో, క్రీడల్లో వారు ఉన్నతులుగా ఎదిగేందుకు జువెనైల్ వెల్ఫేర్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ అధికారులు, సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారు.

మీర్జా అలీ బేగ్, జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్

నా విద్యార్థులు ఒలింపిక్స్‌లో ఆడాలి

నేర్చుకోవాలనే తపన, గెలవాలనే ఆకాంక్ష ఉన్న నా విద్యార్థులు ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో ఆడుతారు. అకాడమీ ప్రారంభమైన నాటి నుంచి విద్యార్థులు ఎంతో ఇష్టంగా ఆర్చరీ నేర్చుకుంటున్నారు. ఏకాగ్రత, లక్ష్యంపై వారి గురి అబ్బురపరుస్తోంది. నేర్చుకున్న అనతి కాలంలోనే వారు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించడమే దీనికి నిదర్శనం.

- హేమలతా యాదవ్, ఆర్చరీ అకాడమీ కోచ్





రెడీ.. స్టడీ.. గో..

స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్‌తో వెళ్లొచ్చు

▶ మొదటి పేజీ తరువాయి

అడ్మిషన్ లెటర్ వచ్చాక దరఖాస్తు చేసుకోవాలనుకోవడం సరికాదు.

4. పూర్తి స్థాయి స్కాలర్‌షిప్ కాకుండా కొంతమేరకే వస్తే మాత్రం వేరే స్కాలర్‌షిప్‌ల కోసం కూడా వెతకాలి. ఒకటికన్నా ఎక్కువ స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం కూడా ఉంటుంది.
5. మెరిట్ ఉన్న విద్యార్థులకే స్కాలర్‌షిప్ వస్తుందనుకోవడం పొరపాటు. స్పోర్ట్స్, ఇతర నైపుణ్యాల ఆధారంగా కూడా స్కాలర్‌షిప్ ఆఫర్ చేసే సంస్థలు చాలా ఉంటాయి. వాటిని గుర్తించాలి.

టోఫెల్‌లో అక్రమాలతో ఇబ్బంది..

గతేడాది టోఫెల్ పరీక్షలో భారీ అక్రమాలు వెలుగు చూశాయి. టోఫెల్, జీఆర్‌ఈలో మార్కులు ఎక్కువ వచ్చేలా చేస్తామంటూ విదేశాలకు వెళ్లాలనుకునే వారికి వల వేసిన గుట్టు రట్టయింది. అలాంటి వారిని నమ్మి పరీక్షలు రాయిస్తే.. తీరా విదేశాలకు వెళ్లాక అది ఫేక్ అని తేలితే చిక్కులు తప్పవు. ఆ విద్యార్థులను భారత్‌కు తిప్పిపంపడమేగాక.. భవిష్యత్తులో మళ్లీ విదేశాలకు వెళ్లకుండా నిషేధం విధించే ప్రమాదం ఉంటుంది.

భారత విద్యార్థులు విదేశాల్లోని అవకాశాలు అందిపుచ్చుకునేలా.. ఆయా దేశాల్లోని సంస్కృతి, సంప్రదాయాలు తెలుసుకునేలా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. వాటిద్వారా మన విద్యార్థులు విదేశాల్లోని వర్సిటీల్లో కొంతకాలం చదువుకొనేందుకు అవకాశం ఉంటుంది. 'సెమిస్టర్ ఎట్ సీ, రోటరీ యూత్ ఎక్స్ఛేంజ్ , ఎరామస్ ప్లస్, ఫుల్ బ్రైట్ నెహ్రూ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్, యూత్ ఫర్ అండర్ స్టాండింగ్' వంటి కార్యక్రమాల ద్వారా విదేశాల్లోని విద్యార్థులతో కలసి చదువుకుని, అక్కడి స్థితిగతులను అర్థం చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

ఉద్యోగ అనుభవంతో వెళ్తే మేలు..



సందీప్‌రెడ్డి , ఐర్లాండ్

విదేశాల్లో చదువుతోపాటు అక్కడే స్థిరపడాలనుకునే వారు డిగ్రీ అయిపోయాక ఇక్కడ కనీసం రెండేళ్లపాటు ఏదైనా ఉద్యోగం చేసి ఉంటే మంచిది. దీనివల్ల విదేశాల్లో ఎంఎస్ అయ్యాక.. ఇక్కడి అనుభవంతో అక్కడ ఉద్యోగం సులువుగా పొంది, స్థిరపడేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయి. ఏ దేశంలో త్వరగా సెటిల్ కాగలమో ముందుగానే తెలుసుకుని వెళ్తే బాగుంటుంది. ఐర్లాండ్ వంటి దేశాల్లో ఐదేళ్లలోనే గ్రీన్‌కార్డు వస్తుంది.

ప్రస్తుత పరిస్థితులు బాగోలేవు



సాయి సింధూజ న్యూజెర్సీ

అమెరికాలో ప్రస్తుత పరిస్థితులు అంత బాగోలేవు. ఆర్థిక మాంద్యం నడుస్తోంది. రెండేళ్ల నుంచీ ఉద్యోగాల్లేవు. ఉన్న వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నారు. స్టూడెంట్స్ చాలా మంది చదువు కోసం వస్తున్నారు. వారికి పార్ట్‌టైమ్ జాబ్స్ దొరకట్లేదు. ఇంటి అద్దెతోపాటు కూరగాయలు, నిత్యావసర ధరలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఇక్కడ జీవనం కష్టంగా మారుతోంది.


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 103

గురువారం 4-7-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తొలిసారి శిఖరాన...

వరల్డ్ 'నంబర్‌వన్' ఆల్‌రౌండర్‌గా హార్దిక్. భారత్ నుంచి తొలి ప్లేయర్. - 14లో



జగజ్జేతల ఆగమనం!

నేడు స్వదేశానికి చేరుకోనున్న టి20 వరల్డ్ చాంపియన్ టీమిండియా. - 14లో



ముందస్తు ఓటమే?!

సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలకు వేళైంది. సునాక్ పార్టీ ఈ ఎన్నికల్లో ఎదురీదుతోంది.

- వివరాలు 6లో



కూలడంలో.. వరస కట్టిన వంతెనలు

బిహార్‌లోని సివాన్ జిల్లాలో 11 రోజుల క్రితం ఒక వంతెన కూలగా బుధవారం అదే జిల్లాలో మరో వంతెన కూలింది.

- వివరాలు 6లో



బైడెన్ కంటే హారిస్ మేలు

డెమొక్రాట్లు అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ బరిలో దిగడమే మేలని పోల్ సర్వేలు చెబుతున్నాయి.

- వివరాలు 6లో



మళ్లీ జార్ఖండ్ సీఎంగా సోరెన్

జార్ఖండ్ ముఖ్యమంత్రి పీఠంపై మళ్లీ జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ ఆసీనులయ్యేందుకు రంగం సిద్ధమైంది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

46 లక్షల ఎకరాల్లో పంటల సాగు



వానాకాలం పంటల సాగు ఈసారి పెద్ద ఎత్తున చేపడుతున్నారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇప్పుడు అధికంగా పంటలు వేస్తున్నారు. గత సంవత్సరం వానాకాలంలో ఈ సమయానికి 25.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సీజన్‌లో 46.85 లక్షల ఎకరాల్లో సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది.

- వివరాలు 5లో

ప్రైవేటు భాగస్వామ్యంతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి



పర్యాటక ప్రాంతాలను ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్నో ప్రకృతి రమణీయ ప్రాంతాలు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు వాటిని అభివృద్ధి చేసుకోలేకపోయామన్నారు.

- వివరాలు 16లో

పెన్ను తొలగించినా దక్కని ప్రాణం



తలలో పెన్ను గుచ్చుకుని తీవ్రంగా గాయపడిన బాలికకు శస్త్రచికిత్స చేసినా ప్రాణాలు దక్కలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంకు చెందిన నాలుగేళ్ల చిన్నారి రియాన్షిక ఈనెల 1న ఆడుకుంటూ కింద పడిపోవడంతో.. చేతిలో ఉన్న పెన్ను ఆమె ఎడమవైపు చెవి దగ్గర తలలోపలికి చొచ్చుకెళ్లింది.

- వివరాలు 5లో



ఆషాఢం తర్వాతే..!

కేబినెట్ విస్తరణ, పీసీసీ, నామినేటెడ్ పదవుల భర్తీ వాయిదా

సమీకరణలు కుదరకపోవడంతో కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయం

- జిల్లాలు, సామాజిక వర్గాల ప్రాతిపదికపై కుదరని ఏకాభిప్రాయం
- ఖర్గే, రాహుల్, కేసీలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీలో రాని స్పష్టత
- వారం, పదిరోజుల తర్వాత మరోమారు చర్చించే అవకాశం
- మంత్రివర్గ విస్తరణ తేలిన తర్వాతే పీసీసీ అధ్యక్షుడి నియామకం!
- ఈ రెండూ ముగిసిన తర్వాత 'నామినేటెడ్'పై నజర్
- అన్నీ ఆగస్టులోనే ఉండే అవకాశం ఉందంటున్న ఏఐసీసీ వర్గాలు




బుధవారం ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్‌మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కె. కేశవరావు

సాక్షి, న్యూఢిల్లీ: సమీకరణలు కుదరలేదు. జిల్లాలు, సామాజిక వర్గాల ప్రాతిపదికపై ఏకాభిప్రాయం వ్యక్తం కాలేదు. దీంతో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం, నామినేటెడ్ పదవుల భర్తీ ఆశలపై కాంగ్రెస్ అధిష్టానం తాత్కాలికంగా నీళ్లు చల్లింది. ఆయా అంశాలపై మరో వారం, పదిరోజుల తర్వాత తీరిగ్గా చర్చిద్దామంది. అప్పటివరకు వేచి చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించింది. వాస్తవానికి జూలై మొదటి వారంలోనే కీలక పదవుల భర్తీ జరుగుతుందని సీఎం స్వయంగా ప్రకటించారు. ఆ మేరకు ముమ్మర కసరత్తు జరిగినా చివరకు అన్నీ వాయిదా పడ్డాయి. కేబినెట్ విస్తరణ సహా పదవుల పంపకాలన్నీ ఆషాఢ మాసం పూర్తయ్యాక ఆగస్టులోనే ఉండే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాలంటున్నాయి.

తాజా భేటీలోనూ తేలని సమీకరణలు

రాష్ట్ర కేబినెట్‌లో ఖాళీలు పూరించడం, కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపిక, నామినేటెడ్ పదవుల భర్తీపై గడిచిన వారం, పది రోజులుగా ముమ్మర కసరత్తు జరుగుతున్న విషయం తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి వారం కిందట కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఈ అంశాలపై చర్చలు జరిపారు. అధిష్టానం సైతం ఈ విషయమై రాష్ట్ర కాంగ్రెస్

మిగతా 2వ పేజీలో ▶



- టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి వివరాలు సేకరించారు
- చాలామంది ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారు
- ఓ వివాదంలో టీవీ5 సాంబశివరావుకు రూ.2 కోట్లు అందాయి
- ఇంటెలిజెన్స్ ఏఎస్పీ భుజంగరావు వాంగ్మూలంలో ఇవన్నీ వెల్లడించారన్న సర్కారు
- అఫిడవిట్‌ను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశం

జస్టిస్ శరత్, రేవంత్‌ల ఫోన్లు ట్యాపింగ్

ట్యాపింగ్ వ్యవహారంపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్

సాక్షి, హైదరాబాద్: 'ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వందల మంది జడ్జీలు, మాజీ మంత్రులు, జర్నలిస్టులు, న్యాయవాదులు.. ఇలా ఎంతో మంది ఫోన్ నంబర్లు, అడ్రస్‌లు, కాల్ రికార్డుల జాబితా అంతా సేకరించారు. వారి ఫోన్లు ట్యాప్ చేసి బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా మార్చుకునే యత్నం చేశారు. హైకోర్టు జడ్జి జస్టిస్ కాజా శరత్ ఫోన్ కూడా ట్యాప్ అయింది. ఓ వ్యక్తిపై కేసులు లేకుండా చేసేందుకు టీవీ 5 సాంబశివరావు రూ.2 కోట్లు తీసుకున్నారు' అని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం వివరించింది. ఈ మేరకు బుధ వారం హైకోర్టులో అఫిడవిట్ సమర్పించింది.

సుమోటోగా తీసుకున్న కోర్టు..

గత ప్రభుత్వ హయాంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ ఫోన్ ట్యాప్ అయిందని.. జడ్జీల ఫోన్లను ట్యాప్ చేసినట్టు ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు తన నేరాంగీకార వాంగ్మూలంలో పేర్కొన్నారని పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా

మిగతా 12వ పేజీలో ▶

80,000

- చరిత్రలో తొలిసారి ఈ మైలురాయిని దాటిన సెన్సెక్స్ సూచీ
- 79,987 వద్ద ముగింపు
- సరికొత్త రికార్డులతో బుల్ రంకెలు




- రోజుకో కొత్త రికార్డులతో రంకెలేస్తున్న బుల్.. బుధవారం మార్కెట్లను సరికొత్త శిఖరాలకు చేర్చింది. చరిత్రలో తొలిసారి బీఎస్ఈ సెన్సెక్స్ 80,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. లార్జ్‌క్యాప్ షేర్లు, బ్యాంకింగ్ షేర్లు ర్యాలీ చేయడంతో సెన్సెక్స్, నిఫ్టీ ఇంట్రాడే, ముగింపుల్లో సైతం కొత్త ఆల్‌టైమ్ గరిష్టాలకు దూసుకెళ్లాయి. ఇంట్రాడేలో 633 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్ 80,074 పాయింట్లను తాకింది. చివరికి 545 పాయింట్ల లాభంతో 79,987 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 183 పాయింట్ల ర్యాలీతో 24,307వద్ద ఆల్‌టైం హైకి చేరింది. బీఎస్ఈలో మొత్తం లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.445.5 లక్షల కోట్లకు చేరి కొత్త రికార్డులను సృష్టించింది.

- వివరాలు 15లో

ప్రశాంతంగా మణిపూర్

- రాజ్యసభలో ప్రధాని వ్యాఖ్యలు
- కాంగ్రెస్‌పై మరోసారి నిప్పులు
- ఏడాదైనా మణిపూర్‌కు ఎందుకు వెళ్లలేదని విపక్షాల మండిపాటు..
- సభ నుంచి వాకౌట్
- సభను అవమానించాయి: చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్



- విపక్షాల విమర్శల నేపథ్యంలో మణిపూర్ హింసాకాండపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు బుధవారం ప్రధాని బదులిచ్చారు. 'మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యా సంస్థలతో పాటు వ్యాపార సంస్థలు కూడా దాదాపుగా తెరుచుకుంటున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలను సంపూర్ణంగా పునరుద్ధరించేందుకు కేంద్రం అన్ని చర్యలూ చేపడుతోంది' అని అన్నారు. కానీ మోదీ వ్యాఖ్యలతో విపక్షాలు సంతృప్తి చెందలేదు. ఈ అంశంపై మాట్లాడేందుకు విపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశాయి. అందుకు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ నిరాకరించడంతో తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ప్రధాని మాట్లాడుతుండగానే సభ నుంచి వాకౌట్ చేశాయి.

- వివరాలు 6లో

అనుమతి 80 వేల మందికి.. హాజరైంది 2.50 లక్షలు

- ఫూల్‌రాయ్ సత్సంగ్ నిర్వహణలో భోలే బాబా అనుచరుల నిర్లక్ష్యం
- తొక్కిసలాటలో 121కి చేరిన మృతుల సంఖ్య
- ఇంకా పరారీలోనే భోలే బాబా



- ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా ఫూల్‌రాయ్ గ్రామంలో తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య బుధవారం 121కి చేరుకుంది. సత్సంగ్ నిర్వాహకులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఎఫ్ఐఆర్‌లో ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్‌తోపాటు ఇతరుల పేర్లను చేర్చారు. భోలే బాబా పేరు ఇంకా చేర్చలేదు. సత్సంగ్‌కు 80 వేల మంది హాజరు కావడానికే అనుమతి ఉందని, అయినా 2.50 లక్షల మంది తరలివచ్చారని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు పేర్కొన్నారు. తొక్కిసలాటపై హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో విచారణ జరిపిస్తామని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు.

- వివరాలు 6లో



జైలు నుంచి విడుదలవుతున్న సందర్భంగా డీజీ సౌమ్య మిశ్రాకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఓ ఖైదీ



ఎన్నాళ్లకెన్నాళ్లకు: పిల్లలకు గోరుముద్దలు తినిపిస్తున్న మహిళా ఖైదీ

'చెర' వీడిన సంతోషం..

ప్రభుత్వ క్షమాభిక్షతో విడుదలైన 213 మంది ఖైదీలు

శిక్ష కాదు.. శిక్షణ ఇచ్చాం

విడుదలైన ఖైదీలు సమాజంలో మోడల్ సిటిజన్‌గా ఉండాలి: జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా 16లో

- కుటుంబీకుల్ని కలుసుకుని ఆనంద బాష్పాలు
- జైలు జీవితం తమ బతుకు మార్చిందంటూ హర్షాతిరేకాలు
- చర్లపల్లి జైలు వద్ద ఉద్విగ్న క్షణాలు -16లో

నేటి నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్




- రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కేటాయింపు కోసం నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. 4వ తేదీ నుంచి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. https://tgeapcet.nic.in అనే వెబ్‌సైట్‌కు లాగిన్ అయి రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఈఏపీసెట్ కౌన్సెలింగ్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఏడాది జరిగిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలో ఇంజనీరింగ్ విభాగం నుంచి 1,80,424 మంది అర్హత సాధించారు. వీళ్లంతా కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ర్యాంకు ఆధారంగా కన్వీనర్ కోటా సీట్లు కేటాయిస్తారు.

- వివరాలు 2లో

సమైక్యవాద కుటిల వ్యవస్థలనే బద్దలు కొట్టాం

గిదో లెక్కా..!

- గెలుపోటములకు అతీతంగా బీఆర్‌ఎస్ వెంటే తెలంగాణ సమాజం
- ఓటమితో దిష్టి తీసినట్టయ్యింది
- ప్రజలే టార్చ్‌లైట్ పట్టుకొని బీఆర్‌ఎస్ కోసం వస్తారు
- ఎర్రవల్లిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: సమైక్యవాద కుటిల వ్యవస్థలనే బద్దలు కొట్టి తెలంగాణను సాధించి, కలబడి నిలబడిన సమాజం భవిష్యత్‌లో ఎటువంటి ప్రతిబంధక పరిస్థితులనైనా అధిగమిస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గెలుపోటములకు అతీతంగా తెలంగాణ సమాజం ఎల్లవేళలా బీఆర్‌ఎస్‌కు అండగా ఉందని, భవిష్యత్‌లోనూ ఉంటుందని ఆయన ప్రకటించారు. బుధవారం ఎర్రవెల్లిలోని నివాసానికి వచ్చిన మహబూబాబాద్, మేడ్చల్, నల్లగొండ జిల్లాల నాయకులు, కార్యకర్తలతో

మిగతా 3వ పేజీలో ▶

రేపట్నుంచి ప్రభుత్వ ఉద్యోగుల

బదిలీల ప్రక్రియ షురూ

సాధారణ బదిలీలపై ఉన్న నిషేధం ఎత్తివేసిన రాష్ట్ర ప్రభుత్వం

- రెండేళ్లలోపు వారికి అవకాశం లేదు.. నాలుగేళ్లు అయితే తప్పనిసరి
- మొత్తం ఉద్యోగుల్లో 40% మించకూడదు
- ఈ నెల 5వ తేదీ నుంచి రోజువారీ షెడ్యూల్
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థికశాఖ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలకు లైన్‌క్లియర్ అయ్యింది. బదిలీలపై ఉన్న నిషేధం ఎత్తివేస్తూ ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం..ఈ ఏడాది జూన్ 30వ తేదీ నాటికి ఒక ఉద్యోగి కనీసం రెండేళ్లు ఒకేచోట పనిచేసి ఉంటే బదిలీకి అర్హుడు. ఇక నాలుగేళ్లు ఒకే చోట పనిచేసిన ఉద్యోగికి బదిలీ తప్పనిసరి. ప్రత్యేక పరిస్థితి ఉంటే తప్ప నాలుగేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగికి బదిలీ నుంచి మినహాయింపు ఉండదని, గరిష్టంగా 40%ఉద్యోగులకు మించకుండా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. స్పౌజ్ కేటగిరీ, 2025 జూన్ 30వ తేదీ నాటికి పదవీవిరమణ పొందే ఉద్యోగులు, 70 శాతం డిజెబిలిటీ లేదా అంతకంటే ఎక్కువశాతం డిజెబిలిటీ ఉన్న ఉద్యోగులు, మానసిక వైకల్యంతో కూడిన పిల్లలున్న ఉద్యోగులు, వితంతువులు, మెడికల్ గ్రౌండ్స్ ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది.



బదిలీ ప్రక్రియ ఇలా...

బదిలీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శాఖాధిపతి ప్రభుత్వం ఇచ్చిన బదిలీల ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

- శాఖల వారీగా హెచ్‌ఓడీ సంబంధిత ఉద్యోగుల సీనియారిటీ జాబితా ప్రచురించాలి.
- ఉద్యోగి పనిచేస్తున్న స్థానం, పదవీకాలంతో సహా చెప్పాలి.
- శాఖలో ఉన్న ఖాళీల

మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కారే

- కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే బీజేపీ బలం పెరిగింది
- రాజ్యసభలో బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో బీజేపీ బలం పెరిగిందని..రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కచ్చితంగా బీజేపీ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పడుతుందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఐదునెలల తర్వాత జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని లక్ష్మణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ వైఖరితో విసిగిపోయి మార్పు కోరుకుంటున్నారని.. ప్రజలు ఇప్పుడు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో 35శాతం ఓట్లతో తెలంగాణలో 8 స్థానాలు గెలవడం కేవలం బీజేపీకే సాధ్యమైందని చెప్పారు. బుధవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో బీజేపీ తరపున లక్ష్మణ్ మాట్లాడుతూ, 2024 లోక్‌సభ ఎన్నికలతోపాటు నాలుగు రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాని మోదీ నేతృత్వాన్ని గెలిపించి ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సార్వత్రిక ఎన్నికల సమయంలో కేవలం రాజ్యాంగం, రిజర్వేషన్ల అంశాలను తెరపైకి తెచ్చి ప్రజలను మభ్యపెట్టి తప్పుదోవ పట్టించిందని లక్ష్మణ్ విమర్శించారు. రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి మాట్లాడే నైతిక హక్కు ఏమాత్రం లేదని గుర్తుచేశారు.

బీజేపీపై తిరగబడేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారు

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: బీసీల పట్ల బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరిపై బీసీలంతా ఆగ్రహంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. పదేళ్లుగా కులగణన చేయకుండా, హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీజేపీ మొండివైఖరిని వీడకపోతే హక్కుల సాధన కోసం, భవిష్యత్ కోసం, అభివృద్ధి కోసం చైనా, రష్యా లాంటి దేశాల్లో ప్రభుత్వాలపై అక్కడి ప్రజలు ఎలా ఎదురుతిరుగుతున్నారో.. అవే పరిస్థితులు ఇక్కడ కూడా త్వరలో వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. బుధవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీసీ యువజన సంక్షేమం సంఘం అధ్యక్షుడు నీల వెంకటేశ్‌లతో కలిసి కృష్ణయ్య మీడియా సమావేశాన్ని నిర్వహించారు. జనగణలో కులగణన కోసం 40 బీసీ సంఘాలతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తుచేశారు. కులగణన జరిగితే బీసీల్లో ఐక్యత ఉండదనే ఓ పనికిమాలిన సాకుతో బీజేపీ సుప్రీంను ఆశ్రయించడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. 76 కోట్లు ఉన్న బీసీల పట్ల బీసీ ప్రధాని అయిన నరేంద్ర మోదీ వైఖరి ఇంత దారుణమా? అని కృష్ణయ్య ప్రశ్నించారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఈనెల 25 వరకు ఎమ్మెల్సీ కవిత కస్టడీ పొడిగింపు



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కస్టడీని ట్రయల్ కోర్టు పొడిగించింది. ఈడీ కేసులో జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో బుధవారం కవితను వర్చువల్‌గా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు హాజరు పరిచారు. కేసులో కీలక కుట్రదారుల్లో ఒకరిగా కవితను భావిస్తున్నట్లు న్యాయమూర్తి పేర్కొన్నారు. బెయిల్ నిరాకరిస్తూ కేసు విచారణను జూలై 25కు వాయిదా వేశారు. దీంతో తదుపరి విచారణ వరకు ఎమ్మెల్సీ కవిత తిహార్ జైలులోనే ఉండనున్నారు. ఇదే కేసులో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు కూడా జూలై 25 వరకు కస్టడీని పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.

లోకేశ్‌కుమార్‌కు పీఆర్ సెక్రటరీ ఎఫ్ఏసీ బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: సీఈవో కార్యాలయంలో అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లోకేశ్‌కుమార్‌కు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) ప్రభుత్వం అప్పగించింది. పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్న సందీప్‌కుమార్ సుల్తానియాను ఈ పోస్టు నుంచి రిలీవ్ చేశారు. బుధవారం ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల సీనియర్ ఐఏఎస్ అధికారుల బదిలీల్లో సందీప్‌కుమార్‌ను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించడంతో పాటు పీఆర్ శాఖ బాధ్యతలను కొనసాగించారు. లోకేశ్‌కుమార్‌కు పీఆర్ ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించడంతో సందీప్‌కుమార్‌ను రిలీవ్ చేశారు.

నేటి నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

- 12 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్
- 8 నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ
- పెండింగ్‌లోనే కాలేజీల అఫ్లియేషన్.. తేలని సీట్ల లెక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కేటాయింపు కోసం నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ప్రారంభం కానుంది. 4వ తేదీ నుంచి విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఇందుకు 12వ తేదీ వరకు అవకాశం ఉంది. అనంతరం ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ ఆప్షన్లు, సీట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతుంది. https://tgeapcet.nic.in అనే వెబ్‌సైట్‌కు లాగిన్ అయి రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్ చేసుకోవాలని ఈఏపీసెట్ కౌన్సెలింగ్ క్యాంప్ ఆఫీసర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ ఏడాది జరిగిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలో ఇంజనీరింగ్ విభాగం నుంచి 1,80,424 మంది అర్హత సాధించారు. వీళ్ళంతా కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ర్యాంకు ఆధారంగా కన్వీనర్ కోటా సీట్లు కేటాయిస్తారు. గత ఏడాది లెక్కల ప్రకారం కన్వీనర్ కోటా సీట్లు 90 వేల వరకూ ఉన్నాయి. స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ఈ నెల 8వ తేదీ నుంచి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు.

8 వరకు ఆల్ క్లియర్!

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏయే బ్రాంచీల్లో ఎన్ని సీట్లున్నాయనే వివరాలు ఇంతవరకూ క్యాంపు కార్యాలయానికి అందలేదు. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే విద్యార్థులు వెబ్ ఆప్షన్లపై కసరత్తు చేయడానికి వీలుటుంది. ఈ వివరాలు ఈ నెల 8వ తేదీ నాటికి అందుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు యూనివర్సిటీల నుంచి అఫ్లియేషన్ రాకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వీసీలు తమ పదవీ కాలం ముగిసేలోపే ప్రైవేటు కాలేజీల్లో తనిఖీలు చేపట్టారు. ఫ్యాకల్టీ, మౌలిక వసతులు పరిశీలించారు. అయితే అనుబంధ గుర్తింపు ఇచ్చే సమయంలో పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో మరోసారి కాలేజీల తనిఖీలు చేయాలని కొత్తగా వీసీలుగా బాధ్యతలు చేపట్టిన ఐఏఎస్ అధికారులు భావిస్తున్నారు. ఈ కారణంగానే సీట్ల వివరాలు అందలేదని తెలుస్తోంది. దీంతో పాటు డిమాండ్ లేని బ్రాంచీల్లో సీట్లు తగ్గించి, సీఎస్ఈ సీట్లు పెంచాలని పలు కాలేజీలు కోరుతున్నాయి. ఈ ప్రతిపాదనలకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి అనుమతి లభించింది. కానీ యూనివర్సిటీల నుంచి అనుమతి రావాల్సి ఉంది. దీంతో ఎన్ని సీట్లు పెరుగుతాయనే దానిపై స్పష్టత లేకుండా పోయింది. అయితే ఈ ప్రక్రియ అంతా విద్యార్థులు ఆప్షన్లు ఇచ్చే సమయానికి పూర్తవుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఇంజనీరింగ్ తొలి దశ కౌన్సెలింగ్ ఇలా..

4-7-24 నుంచి 12-7-24	రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్
6-7-24 నుంచి 13-7-24	ధ్రువపత్రాల పరిశీలన
8-7-24 నుంచి 15-7-24	వెబ్ ఆప్షన్లు ఇవ్వడం
19-7-24	సీట్ల కేటాయింపు
19-7-24 నుంచి 23-7-24	సెల్ఫ్ రిపోర్టింగ్

బాసర ట్రిపుల్ ఐటీలో 1,404 సీట్ల కేటాయింపు

ఈనెల 8 నుంచి 10వరకు కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్/బాసర/భైంసా: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (బాసర ట్రిపుల్ ఐటీ)లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో 1,404 సీట్లు కేటాయించారు. టెన్త్‌లో ఉత్తీర్ణులైన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు ఈ సీట్లు ఇస్తారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం బీఆర్ అంబేడ్కర్ సెక్రటేరియట్‌లో ఎంపికైన విద్యార్థుల జాబితాను, సీట్ల కేటాయింపు వివరాలను విడుదల చేశారు. బాసర ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ వెంకటరమణ, జాయింట్ కన్వీనర్ పావని, దత్తు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీట్లు పొందిన వారిలో బాలికలే ఎక్కువ మంది ఉన్నారు. టెన్త్ మార్కుల్లో పొందిన ర్యాంకు ఆధారంగా సీట్ల కేటాయింపు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను www.rgukt.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

8, 9, 10 తేదీల్లో కౌన్సెలింగ్

ఈనెల 8, 9, 10 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వీసీ వెంకటరమణ తెలిపారు. వరుస క్రమంలో 8వ తేదీన 1 నుంచి 500 వరకు, 9న 501 నుంచి 1000 వరకు, 10న 1,001 నుంచి 1,404 వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక అవసరాలు, స్పోర్ట్స్ కోటాలో విద్యార్థులను ఈనెల 4న ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యా సంవత్సరానికి 976 మంది బాలికలు (69 శాతం), 428 మంది బాలురు (31 శాతం) ఎంపిక చేశారు. కాగా, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన 95 శాతం మంది విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు దక్కించుకున్నారు. ఈ విద్యాసంవత్సరంలో అత్యధికంగా సిద్దిపేట జిల్లాకు 330 సీట్లు రాగా ట్రిపుల్‌ఐటీ ఉన్న నిర్మల్ జిల్లా విద్యార్థులు 72 సీట్లు దక్కించుకున్నారు.



జాబితా విడుదల చేస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు

కేటగిరీ వారీగా సీట్ల కేటాయింపు

కేటగిరీ	బాలికలు	బాలురు	మొత్తం
ఓసీ	5	0	5
ఈడబ్ల్యూఎస్	123	61	184
బీసీ–ఏ	101	38	139
బీసీ–బి	259	79	338
బీసీ–సి	9	5	14
బీసీ–డి	201	82	283
బీసీ–ఇ	48	17	65
ఎస్సీ	156	73	229
ఎస్టీ	74	73	147
మొత్తం	976	428	1,404

ఎవరికి ఏ జీపీఏ వరకు సీటు

కేటగిరీ	బాలికలు	బాలురు
ఓసీ	10.2	10.2
ఈడబ్ల్యూఎస్	10	10
బీసీ–ఏ	10.1	10.1
బీసీ–బి	10.1	10.1
బీసీ–సి	9.2	9.5
బీసీ–డి	10.2	10.2
బీసీ–ఇ	10	10
ఎస్సీ	10	10
ఎస్టీ	10	10

ఏఈఈ (సివిల్) ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితా ప్రకటించండి

టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డికి కేటీఆర్ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ- సివిల్) ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రకటించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. 1180 పోస్టులకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక జాబితా ప్రక టించటంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జాబితాను వెల్లడించేలా ప్రభుత్వం ఒత్తిడి తేవాలంటూ పరీక్ష రాసినవారు బుధవారం కేటీఆర్‌ను కలిశారు. టీజీపీఎస్సీ చైర్మన్ మహేందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్ ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే ఏఈఈ (సివిల్) రాత పరీక్ష నిర్వహించడంతో పాటు సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తి చేసిందన్నారు. 22నెలల క్రితం నోటిఫికేషన్ విడుదలై పరీక్ష జరిగిందని, ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన జాబితాను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా విడుదల చేయడం లేదని తెలిపారు.

నేతన్న ఆత్మహత్యపై ఆవేదన

ఉపాధి లేక సిరిసిల్లలో చేనేత కార్మికుడు పల్లె యాదగిరి ఆత్మహత్య చేసుకున్నాడని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదని ఇది ప్రభుత్వం చేసిన హత్యేనని మండిపడ్డారు. చేనేత కార్మికుడి కుటుంబాన్ని ఆదుకు నేందుకు రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదుపై ఆగ్రహం

ప్రతిపక్షాలను బెదిరించే ఉద్దేశంతో విపక్ష ఎమ్మెల్యేలపై అక్రమకేసులు బనాయిస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ప్రజా సమస్యలను జెడ్పీ సమావేశం దృష్టికి తీసుకురావటమే కౌశిక్‌రెడ్డి చేసిన నేరమా అని నిలదీశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవాలక్ష్మిపై ఆసిఫాబాద్ పీఎస్‌లో అక్రమ కేసు నమోదు చేయడాన్ని కేటీఆర్ ఖండించారు. ఎమ్మెల్యేకు సరైన గౌరవం, ప్రొటోకాల్ ఇవ్వకుండా అడ్డగోలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల వైఖరికి నిరసన తెలిపినందుకు కేసు నమోదు చేశారా అని ప్రశ్నించారు.

కంటోన్మెంట్ విలీనంపై స్పష్టత ఇవ్వండి

కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌కు ఈటల విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్న నేపథ్యంలో పలు అంశాలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి సికింద్రాబాద్ కంటోన్మెంట్ భూములు, ఉద్యోగులకు సబంధించిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం తెలంగాణభవన్‌లో ఈటల విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న సివిల్ ఏరియాలను విలీనం చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించిందని, అయితే సివిల్ ఏరియా అంటే 16 సివిల్ బజార్‌లు మాత్రమేనా? మిగతా ప్రాంతం కూడానా? అనేది స్పష్టత ఇవ్వాలని కోరామని చెప్పారు. కంటోన్మెంట్ బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ తరపున రాజ్‌నాథ్ సింగ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు రాష్ట్రంతో పాటు తన నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రులు అర్జున్ రామ్ మేఘ్వాల్, శ్రీపాద నాయక్‌లను కలిసి ఈటల విజ్ఞప్తి చేశారు.

ఏడు మండలాల కోసం దీక్ష చేయండి

బీఆర్ఎస్‌కు డిప్యూటీ సీఎం భట్టి సూచన



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన ఏడు మండలాల కోసం బీఆర్ఎస్ దీక్ష చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఏడు మండలాలు ఏపీకి పోవడానికి కారణం బీఆర్ఎస్, బీజేపీ, కేసీఆరే కారణమని చెప్పారు. గాంధీ భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...విభజన చట్టంలో ఏడు మండలాల ప్రస్తావనే లేదన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్డినెన్సుతో ఏడు మండలాలను ఏపీలో కలిపారని తెలిపారు. ఏడు మండలాల కోసం పోరాటం చేస్తానని అసెంబ్లీలో చెప్పిన కేసీఆర్ ఏమయ్యారని ప్రశ్నించారు. రెండు లక్షల రుణమాఫీ త్వరలోనే అమలు చేస్తామని, రైతులు అప్పుల చేయకుండా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ నెల 6న ఏపీ, తెలంగాణ రాష్ట్ర సీఎంల సమావేశంలో పదేళ్ల పెండింగ్ సమస్యలను చర్చిస్తారని వివరించారు. మంత్రివర్గ విస్తరణ విషయంలో అధిష్టానం నిర్ణ యం తీసుకుంటుందని తెలిపారు. టీపీసీసీ నూతన అధ్యక్షుడి విషయంలో కసరత్తు కొనసాగుతుందని చెప్పారు. రైతు భరోసాపై సబ్ కమిటీ అన్ని వర్గాల అభిప్రాయం తీసుకుంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో రైతు ప్రభాకర్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధితులను శిక్షించాలని ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

సీఎంల భేటీకి ఏర్పాట్ల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఈ నెల 6న తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు భేటీ కానున్న నేపథ్యంలో సమావేశ ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరిశీలించారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వివిధ విభాగాల అధికారులు ప్రజా భవన్‌ను సందర్శించారు. సమన్వయంతో సమావేశానికి తగు ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ప్రొటోకాల్ విభాగం డైరెక్టర్ వెంకట రావు పాల్గొన్నారు.

ఆషాఢం తర్వాతే..!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల అభిప్రాయాన్ని తీసుకుంది. తాజాగా బుధవారం కూడా ఈ అంశాలపై చర్చించేందుకు ఢిల్లీ వచ్చిన రేవంత్‌రెడ్డి మరోమారు ఖర్గే, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కేసీలతో భేటీ అయ్యారు. సుమారు గంట పాటు చర్చలు కొనసాగాయి. మంత్రివర్గంలోకి తీసుకునేందుకు పరిగణనలోకి తీసుకుంటున్నవారి పేర్లను మరోమారు పరిశీలించారు. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వాకిటి శ్రీహరి, నిజామాబాద్ జిల్లా నుంచి పి.సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలూనాయక్, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, టి.రామ్మోహన్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రేంసాగర్‌రావు, వివేక్‌ల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో వాకిటి శ్రీహరి పేరుపై ఏకాభిప్రాయం ఉన్నప్పటికీ మిగతా పేర్ల విషయంలో పీటముడి నెలకొంది.

ఇలాగైతే ఏం చేయాలి..?

నిజామాబాద్ జిల్లా నుంచి పీసీసీ అధ్యక్ష రేసులో మహేశ్‌కుమార్ గౌడ్, గతంలో నిజామాబాద్ నుంచి ఎంపీగా ఉన్న మధుయాష్కీ గౌడ్‌లు ఉన్న దృష్ట్యా, ఒకవేళ వీరిలో ఒకరికి ఆ పదవి కట్టబెడితే, అదే జిల్లా నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న సుదర్శన్‌రెడ్డిని ఏమి చేయాలన్న దానిపై సందిగ్ధత నెలకొంది. దీనిపై నేతలు తర్జనభర్జన పడుతున్నారు. ఇక నల్లగొండ జిల్లాలో రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే, ఇదే జిల్లా నుంచి ఇప్పటికే ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిపి మొత్తం ముగ్గురు రెడ్లు మంత్రులవుతారు. ఒకవేళ ఆ అంశాన్ని పక్కన పెట్టినా, జిల్లా నుంచి ఎస్టీ ఎమ్మెల్యేగా ఉన్న బాలూనాయక్‌కు మంత్రి పదవి ఇవ్వడం కష్టంగా మారుతుంది. ఇక ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇద్దరు సీనియర్ నేతలు జి.వివేక్, ప్రేంసాగర్ రావుల విషయంలోనూ సందిగ్ధత నెలకొంది. భట్టి సహా ఇతర నేతలు మద్దతిస్తున్న వెలమ సామాజిక వర్గానికి చెందిన ప్రేంసాగర్‌ను కేబినెట్‌లోకి తీసుకుంటే ఓసీ సామాజిక వర్గం నుంచి మంత్రుల సంఖ్య పెరుగుతుంది. ఇక గ్రేటర్ హైదరాబాద్ నుంచి మల్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి రేసులో ఉండగా, ఇక్కడ ఒక మైనార్టీకి అవకాశం కల్పించాలనే డిమాండ్ కూడా గట్టిగా ఉంది. దీంతో వీరి విషయంలోనూ నిర్ణయానికి రాలేకపోయారు. ఇలా పలు పేర్ల విషయంలో పలు సమీకరణాలు ముడిపడి ఉండటంతో నేతలు ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేకపోయారు. ఈ దృష్ట్యానే కేబినెట్ విస్తరణ అంశాన్ని ప్రస్తుతానికి పక్కన పెట్టాలని, వారం, పదిరోజుల తర్వాత దీనిపై చర్చిద్దామని హైకమాండ్ పెద్దలు ముఖ్యమంత్రికి చెప్పినట్లుగా కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

పీసీసీ సైతం వాయిదానే..

బుధవారం నాటి భేటీలో పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై కూడా చర్చించినా, దీన్ని సైతం అధిష్టానం పెద్దలు తేల్చలేకపోయారు. అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేతలు మహేశ్, మధుయాష్కీలలో ఒకరికి కట్టబెట్టాలనే ఆలోచన చేసినప్పటికీ సమీకరణలు కుదరని దృష్ట్యా, ఎస్సీ సామాజిక వర్గం నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సంపత్‌కుమార్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి బలరాం నాయక్‌ల పేర్లు కూడా చర్చకు వచ్చినట్లు తెలిసింది. దీంతో జిల్లాలు, సామాజిక వర్గాల సమీకరణలు, మంత్రివర్గ విస్తరణ తేలిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకోవాలని అధిష్టానం భావించినట్లు తెలిసింది. ఇక కేబినెట్ విస్తరణ, పీసీసీ అధ్యక్షుడి నియామకం పూర్తయ్యాకే ఇతర పదవుల భర్తీ అంశంపై హైకమాండ్ దృష్టి పెట్టే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

కాంగ్రెస్ గూటికి కేకే

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మల్లికార్జున ఖర్గే
- కేకే అనుభవం కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తుందని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు కాంగ్రెస్ గూటికి చేరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం కేకేకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ లోక్‌సభా పక్ష నేత రాహుల్‌గాంధీ, రాష్ట్రీర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేకే రాకను స్వాగతించిన ఖర్గే, రాహుల్.. రాష్ట్రంలో పార్టీ పటిష్టతకు పని చేయాలని సూచించారు. కాంగ్రెస్‌లో చేరికతో తిరిగి సొంత ఇంటికి వచ్చినట్లుగా ఉందని కేకే వ్యాఖ్యానించారు. ఈ భేటీ అనంతరం కేకే రాకను స్వాగతిస్తూ ఖర్గే ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేకే అనుభవం పార్టీని బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

గురుకులాల్లో కామన్ టైమ్ టేబుల్

ఐదు సొసైటీల్లో ఒకే విధమైన బోధన, అభ్యసన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఐదు గురుకుల విద్యా సంస్థల్లో కామన్ టైమ్ టేబుల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు ఒక్కో సొసైటీలో ఒక్కో విధంగా బోధన కార్యక్రమాలు అమలవుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ గురుకుల సొసైటీలో అయితే డేస్కాలర్ స్కూల్ తరహాలో టైమ్‌టేబుల్ అమలు చేస్తున్నారు. దీంతో సాధారణ పాఠశాలకు, గురుకుల పాఠశాలకు తేడా లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలోనే అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఒకే విధమైన టైమ్ టేబుల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇకపై గురుకుల పాఠశాలల్లో బోధన అభ్యసన కార్యక్రమాలు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కొనసాగనున్నాయి. అందువల్ల విద్యార్థులు ఉదయం 5 గంటలకే నిద్రలేవాలి. 5:15–6 గంటల వరకు యోగా, వ్యాయామం, 6 గంటల నుంచి 7గంటల వరకు స్నానాలు, 7.45 వరకు అల్పాహారం, 8 గంటల వరకు కిచెన్ తనిఖీ, 8.15 గంటల వరకు అసెంబ్లీ ఉంటుంది. ఆ తర్వాత 8.15 గంటల నుంచి బోధన కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ప్రతి 45 నిమిషాలకు ఒక పీరియడ్ చొప్పున ఒక్కో సబ్జెక్టు బోధన సాగుతుంది. మధ్యాహ్నం 12.45 గంటల నుంచి 1.30 గంటల మధ్య రెండు విడతల్లో భోజన విరామం ఉంటుంది. ఇక సాయంత్రం 6:15–7గంటల వరకు డిన్నర్, ఆ తరువాత రాత్రి 9గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తారు.

మిషన్ భగీరథ ప్రకటనలు బోగస్ వేనా?

- తాగునీరు అందడం లేదని మీ శాఖనుంచే ప్రతిపాదనలు ఇస్తారేం?
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నలు
- ఇంటింటి సర్వే నివేదికలు స్థానిక ఎమ్మెల్యేలకు ఇవ్వాలని సూచన
- రికార్డుల్లో మిషన్ భగీరథ సరఫరాగా చూపిస్తున్నారు: కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'మిషన్ భగీరథ పథకం కింద అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతోందని సర్పంచుల సంతకాలతో గతంలో అసెంబ్లీలో ప్రకటించడం బోగస్ అని భావించాలా'అని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి లేదని ఆనాడు ప్రకటనతో పాటు, ఈ మేరకు గతంలో కేంద్రానికి నివేదిక పంపడం వంటి అంశాలపై ప్రశ్నించారు. 'రాష్ట్రంలోని 23,824 ఆవాసాలకు 1,156 ఆవాసాల్లో 50 శాతం నీళ్ల ఇవ్వగలుగుతున్నామని, ఆలేరు, భువనగిరి, నల్లగొండ నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడం లేదని, నిధులు కావాలని మీ శాఖ నుంచే ఫైల్ రావడం ఏమిటీ?'అని అధికారులను డిప్యూటీ సీఎం నిలదీశారు. బుధవారం సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి. ఈ పథకం కింద తాగునీటి సరఫరాపై ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే ఎప్పుడు పూర్తవుతుందని భట్టి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పూర్తికాగానే రాష్ట్రంలోని అందరు ఎమ్మెల్యేలకు ఆ నివేదికలు అందజేసి... తాగునీరు అందుతుందన్న విషయాన్ని వారి ద్వారా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. రూ.42 వేల కోట్లు ఖర్చు చేసినా ఇంకా తాగునీటి ఎద్దడి ఉండటం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా, ఆయా మున్సిపాలిటీలు మిషన్ భగీరథ కింద మంచినీరు సరఫరా చేస్తున్నట్టు రికార్డుల్లో ఎందుకు చూపిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ప్రశ్నించారు.

కార్మికుల జీతాలు పెండింగ్‌లో ఎందుకు?

ఈ పథకం కింద పనిచేస్తున్న సిబ్బంది జీతాలు నెలల తరబడి ఎందుకు పెండింగ్‌లో ఉంటున్నాయని అధికారులను భట్టి ప్రశ్నించారు. 'ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకంగా కార్మికుల వేతనాలు ఉంటున్నాయి, రూ.8 వేల నుంచి రూ.13 వేల వరకు అందుతున్నట్టు నాకు సమాచారం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న వేతనాల నిధుల్లో ఎక్కువ మొత్తం ఏజెన్సీలు కట్ చేసుకుని భగీరథ కార్మికులకు తక్కువ జీతాలు ఇస్తున్నారు. దీనిపై సమీక్ష చేయాలి'అని అధికారులను ఆదేశించారు. భగీరథ కార్మికులకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకంగా వేతనాలు ఉండేలా ఫిక్స్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, మెంబర్ సెక్రటరీ, టీఎస్ ఫైనాన్స్ కమిషన్ స్మిత సబర్వాల్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

సచివాలయానికి ఉద్యోగులు ఆలస్యంగా రావడమా?

ఆర్ అండ్ బీ శాఖలో మంత్రి కోమటిరెడ్డి ఆకస్మిక తనిఖీ



సచివాలయం ఉద్యోగులతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి గుండెకాయలాంటి సచివాలయానికి కొంత మంది ఉద్యోగులు ఆలస్యంగా రావడం భావ్యం కాదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసహనం వ్యక్తంచేశారు. మీరే ఇలా వస్తే జిల్లా, మండల, గ్రామ స్థాయి అధికారులకు మీరిచ్చే సందేశం ఏంటని ప్రశ్నించారు. బుధవారం సచివాలయంలో ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన పేషీని, సెక్షన్లను మంత్రి తనిఖీ చేశారు. ఆ సమయంలో 50% ఉద్యోగులు కూడా ఆఫీసులకు రాకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్లుగా మంత్రులను, ముఖ్యమంత్రులను కలిసే అవకాశం లేక ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. ప్రజలు మాకు ఎన్ని వినతులిచ్చినా, పరిష్కరించాల్సింది ఉద్యోగులేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని, సచివాలయానికి ఉద్యోగులు ఇంత ఆలస్యంగా రావడం భావ్యం కాదని హెచ్చరించారు. సమయానికి ఆఫీసుకు వచ్చిన ఉద్యోగుల కుర్చీల వద్దకు వెళ్లి అభినందించిన మంత్రి.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఒకరిద్దరు ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య పరి స్థితి బాగాలేద ని చెప్పగా.. వారితో కోమటిరెడ్డి మాట్లాడారు. మంత్రి తమ సెక్షన్‌కు రావడం మూలంగా సమస్యలు చెప్పుకునే అవకాశం దొరికిందని ఉద్యోగులు ఆనందం వ్యక్తంచేశారు.

క్లుప్తంగా...

నేడు మండలాలు.. రేపటి నుంచి జెడ్పీల్లో ప్రత్యేక పాలన

సాక్షి, హైదరాబాద్: మండల ప్రజాపరిషత్‌లలో గురువారం, జిల్లా ప్రజాపరిషత్‌లలో శుక్రవారం నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. బుధవారంతో మండల ప్రజాపరిషత్ పాలకమండళ్ల పదవీకాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్లుగా మండల అభివృద్ధి అధికారి పైర్యాంక్ అధికారులను నియమించాలని సూచిస్తూ కలెక్టర్లకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు జారీ చేసింది. జెడ్పీలకు కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల (స్థానిక సంస్థలు)ను ప్రత్యేక అధికారులుగా నియమించనున్నారు. దీనికి సంబంధించి గురువారం ఉత్తర్వులు వెలువడనున్నాయి. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా గతంలో ఆలస్యంగా ఎన్నికలు జరిగిన ఖమ్మం జిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అన్ని ఎంపీపీలు, మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల ఎంపీపీ, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ ఎంపీపీ, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం ఎంపీపీలు, ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, మంగపేట ఎంపీపీలు మినహాయించి మిగతా మండలాల్లో స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని సూచించారు. బుధవారం ఈమేరకు పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులిచ్చారు.

అధికారంలోకి వస్తానంటున్న కేసీఆర్ కలలు కల్లలే

- మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్



సాక్షి, హైదరాబాద్: మళ్లీ అధికారంలోకి వస్తానని కేసీఆర్ కలలు కంటున్నాడని, ఆయన కలలు కల్లలుగానే మిగిలిపోక తప్పదని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. ఈసారి అధికారంలోకి వస్తే 15 ఏళ్లు వరుసగా పాలన చేస్తామంటూ చెప్పుకుంటున్న ఆయనలో ఇంకా అధికార దాహం ఎంతుందో బయట పడుతోందని ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారం చేతిలో ఉందన్న అహంకారంతో పాలన సాగించిన కేసీఆర్‌కు ఒక్కో నాయకుడు పార్టీ వీడుతుండటంతో దిక్కుతోచడం లేదన్నారు. మొన్న పార్లమెంటు ఎన్నికల్లో ఆయన పార్టీ 8 చోట్ల డిపాజిట్ కూడా కోల్పోవడంతో తత్వం బోధపడిందని, రెక్కలు విరిగిన పక్షిలా ఆయన పార్టీ పరిస్థితి తయారైందని మధుయాష్కీ ఎద్దేవాచేశారు. ప్రజలను కలవడం దేవుడెరుగు, కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలకైనా అపాయింట్‌మెంట్ ఇవ్వని కేసీఆర్ ఇప్పుడు పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లను పిలుచుకొని మరీ మాట్లాడుతున్నాడని, ఓటమి ద్వారా ఆయనకు కాంగ్రెస్ నేర్పిన సంస్కారం అదని వ్యాఖ్యానించారు. ప్రజా విశ్వాసం కోల్పోయిన కేసీఆర్ పార్టీ ఇక బతికి బట్టకట్టడం కల్ల అని, సమష్టి నిర్ణయాలతో ప్రజాపాలన సాగిస్తున్న రేవంత్ సర్కారుకు తిరుగులేదని మధుయాష్కీ వ్యాఖ్యానించారు.

చైర్మన్‌గా మీరేం చేశారు?

- ప్రవీణ్‌కుమార్‌కు బల్మూరి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వేకెన్సీ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జీవో నంబర్ 81లో మార్పులు ఎందుకు చేయలేదని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. ఆయన గాంధీభవన్‌లో బుధవారం ఎస్సీ సెల్ చైర్మన్ ప్రీతమ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ 2018లోనే రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్‌గా జీవో 81లో మార్పులు చేసి ఉంటే సమస్య ఉండేది కాదన్నారు. 2018లో అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన వేకెన్సీ నిబంధనలనే ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. జీవో 46, 81లను తీసుకొచ్చిన బీఆర్‌ఎస్.. ఇప్పుడు ఆ జీవోలపై అడ్డంగా మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉందన్నారు.

పంచాయతీల్లో పాలన పడకేసింది!

- కేటీఆర్‌ను కలిసిన సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రామ పంచాయతీలను పట్టించుకునే నాథుడు లేక పాలన పడకేసిందని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ని కలిసి ప్రస్తుత గ్రామ పంచాయతీల పరిస్థితిని వివరించారు. గ్రామాల అభివృద్ధి ముఖ్యమని గత ప్రభుత్వంలో చేపట్టిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ప్రస్తుతం పారిశుధ్యం పడకేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలల్లో నయా పైసా విడుదల చేయలేదని, పెండింగ్ బిల్లుల విషయమై ఇటీవల గవర్నర్‌ను కలిసి మొరపెట్టుకున్నా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం లేదని గూడూరు ఆవేదన వ్యక్తంచేశారు. పారిశుధ్య కార్మికులు 7 నెలల నుంచి జీతాల్లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులు, పారిశుధ్య కార్మికులకు జీతాలు వెంటనే ఇచ్చేలా అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించాలని కేటీఆర్‌ను కోరారు. పెండింగ్ బిల్లులు వచ్చేవరకు తమ మద్దతు పూర్తిగా ఉంటుందని కేటీఆర్ చెప్పారన్నారు. కార్యక్రమంలో సంఘం నేతలు రామేశ్వర్‌రెడ్డి, యాదిరెడ్డి, ప్రకాశ్ పాల్గొన్నారు.

అగ్గే.. పిడుగు కాదు!

భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో అగ్నిప్రమాదంపై స్పష్టత

- జనరేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలేనని తేల్చిన 'రిలే' రక్షణ వ్యవస్థ
- కారణాలను విశ్లేషిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి జెన్‌కో నివేదిక

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం(బీటీఎస్)లోని యూనిట్–1కు చెందిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం కావడానికి పిడుగుపాటు కారణం కాదని జెన్‌కో దర్యాప్తులో తేలింది. పిడుగు పడిన సమయంలోనే యాధృచ్ఛికంగానే జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ అంతర్గత లోపాలతో..దాని లోపల మంటలు ఉత్పన్నమయ్యాయని, ఇందుకు బాహ్య కారణాలు లేవని నిర్ధారించింది. శనివారం బీటీఎస్‌లో జరిగిన అగ్నిప్రమాదానికి కారణాలను విశ్లేషిస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పించింది.

కారణాన్ని పట్టించిన రిలే వ్యవస్థ

ట్రాన్స్‌ఫార్మర్లలో 'రిలే'అనే రక్షణ వ్యవస్థ ఉంటుంది. ప్రమాదాలను ముందే పసిగట్టి వాటి నివారణకు సంబంధిత రక్షణ వ్యవస్థలను అప్పటికప్పుడు రిలే వ్యవస్థ క్రియాశీలం చేస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం కావడానికి అంతర్గత లోపాలు కారణమా? బాహ్య సమస్యలు కారణమా? అనే విషయాన్ని ఏ రకమైన రిలేలు ప్రమాద సమయంలో ఆపరేట్ అయ్యాయో పరిశీలించడం ద్వారా తెలుసుకోవచ్చు.

➤ బీటీఎస్‌లో ప్రమాదం జరిగినప్పుడు '87జీటీ, 64ఆర్'అనే రెండు వేర్వేరు రిలే వ్యవస్థలు మాత్రమే యాక్టివేట్ అయ్యాయి.

➤ ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత సమస్యలు ఉత్పన్నమైనపుడు మాత్రమే ఈ రెండు రిలేలు ఆపరేట్ అవుతాయి.

➤ ట్రాన్స్‌ఫార్మర్‌కు బాహ్యంగా ఏదైన సమస్యలు ఉత్పన్నమైనప్పుడు మాత్రమే యాక్టివేట్ అయ్యే '87 హెచ్‌వీ'అనే రిలే వ్యవస్థ ఆ సమయంలో స్పందించలేదు. దీంతో అంతర్గత సమస్యలతోనే జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమైందని జెన్‌కో ఇంజనీరింగ్ నిపుణులు నిర్ధారించారు.



దగ్ధమైన జనరేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్

ఆజ్యం పోసిన ఆయిల్ లీకేజీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని బీటీఎస్‌లో 270 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కి సంబంధించిన జనరేటింగ్ స్టేషన్‌లో 16కేవీ సామర్థ్యంతో విద్యుదుత్పత్తి అవుతుంది. దీనిని 400కేవీ సామర్థ్యానికి పెంచితేనే గ్రిడ్‌కు సరఫరా చేయడానికి వీలుంటుంది. ఈ పనిని జనరేటింగ్ ట్రాన్స్‌ఫార్మర్ చేస్తుంది.

➤ జనరేటింగ్ స్టేషన్‌లో ఉత్పత్తి అయిన విద్యుత్ ఆర్‌వైబీ(రెడ్ ఎల్లో బ్లూ) అనే మూడు ఫేజుల కండర్ల(తీగల) ద్వారా ట్రాన్స్‌ఫార్మర్ వరకు సరఫరా అయ్యి బుష్‌ల ద్వారా లోపలికి వెళుతుంది.

➤ ట్రాన్స్‌ఫార్మర్ లోపల చుట్టబడిన కాయిల్స్ ఆయిల్‌లో మునిగి ఉంటాయి.

➤ ఆర్‌వైబీ అనే మూడు ఫేజులుండగా, బీ–ఫేజ్ కాయిల్స్‌లో ఫాల్ట్ ఏర్పడి మంటలు చోటు చేసుకున్నట్టు 'రిలే'వ్యవస్థల స్పందన ద్వారా నిర్ధారించారు.

➤ ఎప్పుడైతే బీ–ఫేజ్‌కు ప్రమాదం జరిగిందో.. ఆర్ ఫేజ్ మధ్య విద్యుత్ ఓల్టేజీ భారీగా పెరిగి ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ ఉష్ణోగ్రతలు గరిష్టానికి చేరాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బుష్‌ల ద్వారా ఆయిల్ బయటకు వచ్చి లీక్ అయ్యింది.

➤ ఆయిల్ లీక్ కావడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టు అయ్యి ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా దగ్ధమైంది.

ఈ కారణాలను విశ్లేషించిన తర్వాత ప్రమాదం పిడుగు వల్ల కాకుండా ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడిన అంతర్గత లోపాలతోనే జరిగినట్టు జెన్‌కో నిపుణులు తేల్చారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.30కోట్లకు పైగా నష్టం జరిగినట్టు ఇప్పటికే ఓ నిర్ధారణకు వచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిగా విప్పి పరిశీలించిన తర్వాత నష్టంపై పూర్తి స్పష్టత వస్తుందని ప్రభుత్వానికి జెన్‌కో తెలియజేసింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో అంతర్గత లోపాలు ఏర్పడడానికి నిర్మాణ, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు కారణం కావొచ్చని భావిస్తున్నారు.

కమిషన్లతోనే సర్కార్ కాలయాపన

బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందా అన్నది అనుమానమే: రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, ఆయా అంశాలపై కమిషన్ల నియామకాలతోనే కాలయాపన చేస్తోందని బీజేపీ మెదక్ ఎంపీ ఎం.రఘునందన్‌రావు మండిపడ్డారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కాంగ్రెస్ పాలకులు టైంపాస్ చేస్తున్నారు. గుంపు మేస్త్రీ సరిగా ఉంటేనే ఇతర మేస్త్రీలు కూడా పనిచేస్తారన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు, వరి ధాన్యానికి మద్దతు ధర, రుణమాఫీ, ఇందిరమ్మ రైతు భరోసా, వడ్డీ లేని రుణం హామీ ఏమైందని ఆయన ప్రశ్నలు సంధించారు. లక్ష్మీనరసింహస్వామి మీద, ఏడుపాయల దుర్గమ్మ మీద రేవంత్ ఒట్లు వేసి రుణమాఫీ చేస్తామని చెప్పారు కానీ, దానిని ఎలా చేస్తారో చెప్పడం లేదన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు ఎన్ని ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడో అన్ని ఎకరాలకూ రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. మళ్లీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి పదిహేనేళ్ల పాటు అధికారంలో ఉంటామని మాజీ సీఎం కేసీఆర్ చెబుతున్నారు కదా అని ఓ విలేకరి స్పందించగా.. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అయ్యేనాటికి మరో 15 మంది ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్ కాపాడుకోలేని పరిస్థితి తలెత్తుతుందని వ్యాఖ్యానించారు. మరో 15 నెలలు బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందా అనేది కూడా అనుమానమేనని, అలాంటిది మళ్లీ అధికారంలోకి వచ్చి 15 ఏళ్లు ఉంటామంటే ఎట్లా అని బదులిచ్చారు.

కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన జెడ్పీ సీఈవో
- సీఈవోపై పోలీసులకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు

కరీంనగర్‌క్రైం: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పోలీసు కేసు నమోదైంది. కరీంనగర్ జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అధికారులపై దురుసుగా ప్రవర్తించడంతో పాటు విధులకు ఆటంకం కలిగించారని జెడ్పీ సీఈవో ఎం.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి కేసు నమోదు చేశారు. కొత్తగా అమలులోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) 221, 126(2) సెక్షన్ల కింద కేసు నమోదైంది.

జెడ్పీ సీఈవోపై ఎమ్మెల్యే ఫిర్యాదు

హుజూరాబాద్ నియోజకవర్గంలో సమస్యలపై తాను జెడ్పీ సమావేశంలో ప్రశ్నించేందుకు ప్రయత్నించగా జెడ్పీ సీఈవో తన విధులకు ఆటంకం కలిగించారంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి బుధవారం కరీంనగర్ సీపీకి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో దళితుల కోసం దళితబంధు, నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కోసం ప్రజాప్రతినిధిగా ప్రశ్నిస్తున్న సమయంలో తన విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా జెడ్పీ సీఈవో ప్రొటోకాల్ ఉల్లంఘించారని కౌశిక్‌రెడ్డి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే విచారణ చేసి సీఈవోపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.



సీపీకి ఫిర్యాదు చేసి తిరిగి వస్తున్న ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి

ఎమ్మెల్యే లక్ష్మిపై కేసు



ఆసిఫాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై మంగళవారం రాత్రి ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 1న జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద కోవ లక్ష్మి డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావును అసభ్యపదజాలంతో దూషించడం, దుర్భాషలాడటం, హెచ్చరించడంతో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నేత కుడుమెత విశ్వనాథ్ ఫిర్యాదు చేసినట్లు సీఐ సతీశ్ తెలిపారు.

రేవంత్ చిల్లర కుట్రలో భాగం కావద్దు

- మా పోరాటానికి మద్దతు ఇవ్వండి
- కోదండరాంకు దాసోజు శ్రవణ్ లేఖ



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న చిల్లర కుట్రలో భాగం కావద్దని బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్, తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను కోరారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలను నామినేట్ చేసే విషయంలో తాము చేస్తున్న హక్కుల పోరాటానికి నైతిక మద్దతు ఇవ్వకుండా దిగజారుడుతనంతో వ్యవహరించద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కోదండరాంను ఉద్దేశించి దాసోజు శ్రవణ్ బుధవారం లేఖ రాశారు. తనతో పాటు కుర్ర సత్యనారాయణను కేసీఆర్ ప్రభుత్వం గత ఏడాది జూలైలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందన్నారు. అయితే కేసీఆర్ ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలో భాగంగా రాజకీయ నేపథ్యం ఉందనే నెపంతో తమ ఇద్దరి అభ్యర్థిత్వాన్ని నాటి గవర్నర్ తమిళిసై తిరస్కరించిందన్నారు. గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ తాము హైకోర్టును ఆశ్రయించామన్నారు. తుది తీర్పు వచ్చే వరకు ఎమ్మెల్సీ పదవులు భర్తీ చేయబోమని రేవంత్ ప్రభుత్వం, నాటి గవర్నర్.. కోర్టుకు మాట ఇచ్చారన్నారు. మరోవైపు కోర్టును అగౌరవపరుస్తూ రేవంత్ ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ ఏడాది జనవరి 27న కోదండరాంతో పాటు మరో జర్నలిస్టును గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందన్నారు. తమకు న్యాయం కలగకుండా రేవంత్‌రెడ్డి చేసిన చిల్లర కుట్రలో కోదండరాం భాగం కావడం బాధించిందని విచారం వ్యక్తం చేశారు.

..గిదో లెక్కా!

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఉద్యమ చరిత్ర.. తెలంగాణ కోసం సాగించిన పోరును మరోసారి గుర్తు చేసుకున్నారు. రెండున్నర దశాబ్దాల బీఆర్‌ఎస్ ప్రస్థానంలో ప్రతి అడుగులో అద్భుతమైన విజయగాథలే తప్ప అపజయ గాథలు లేవని చెప్పారు. తెలంగాణ సాధన కోసం నాటి వ్యతిరేక పరిస్థితులనే తట్టుకొని నిలబడ్డ పార్టీకి నేటి పరిస్థితులు ఒక లెక్కే కాదని, ఏ ఆటంకాలనైనా అలవోకగా దాటుకుంటూ ప్రజాదరణ మరింతగా పొందుకుంటూ బీఆర్‌ఎస్ ముందడుగు వేస్తుందన్నారు. తెలంగాణ అస్థిత్వమే ప్రమాదంలో పడ్డ దిక్కుమొక్కు లేని చివరిదశ ఉద్యమకాలం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన, అటునుంచి పదేళ్ల ప్రగతిపాలన దాకా ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆనాడు తెలంగాణను అష్ట దిగ్బంధనం చేసిన సమైక్యవాద శక్తులు, వారి మీడియాతో సహా సమస్త రంగాలు, వారు రాసిందే రాత, గీసిందే గీతగా నడిచేదన్నారు. అత్యంత శక్తివంతమైన ఆంధ్రా వ్యవస్థలను తట్టుకోవడంతోపాటు తెలంగాణ వ్యతిరేకతకు, సమైక్యవాదానికి సింబాలిక్‌గా ఉన్న నాటి పాలకుడు చంద్రబాబును ఎదురించి నిలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని చెప్పారు. శత్రువులు, ప్రత్యర్థుల కుటిల యత్నాలను అధిగమిస్తూ అప్రతిహతంగా కొనసాగుతున్న బీఆర్‌ఎస్ విజయ ప్రస్థానంలో నిన్నటి ఓటమితో దిష్టి తీసినట్టయ్యిందని, తిరిగి పునరుత్తేజంతో మరింతగా ప్రజాదరణ కూడగట్టాలని కార్యకర్తల హర్షధ్వానాల నడుమ కేసీఆర్ ప్రకటించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలే తిరగబడతారు

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇచ్చిన అలవిగాని హామీలు అమలు చేయడం చేతగాక జిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నదని కేసీఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ నైజం మరోసారి అర్థమైన ప్రజలు, ఓటేసి పొరపాటు చేశామని నాలిక కరుసుకుంటున్నారని చెప్పారు. తెలంగాణలో మున్నెన్నడూ లేనివిధంగా ప్రశాంతమైన పాలన ద్వారా పదేళ్లపాటు సంక్షేమం, అభివృద్ధిని అందిస్తూ, అన్నితీర్లా అండగా నిలబడ్డ బీఆర్‌ఎస్‌ను తిరిగి తెలంగాణ సమాజం కోరుకుంటున్నదన్నారు. కేసీఆర్ మీద ద్వేషంతో, అసంబద్ధ ప్రకటనలతో, ప్రజాఆకాంక్షలకు విరుద్ధంగా నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు తిరగబడే రోజులు త్వరలోనే వస్తాయని చెప్పారు. తన చేష్టలతో తానే ప్రజలచేత ఛీ కొట్టించుకోవడమే యాభై ఏళ్ల కాంగ్రెస్ వైఖరి అని..ప్రజలు అనతికాలంలోనే కాంగ్రెస్ పాలనపై విరక్తి చెందారనే విషయం క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నదని కేసీఆర్ వివరించారు. మరికొద్ది రోజుల్లోనే టార్చ్‌లైట్ పట్టుకొని వెతుక్కుంటూ జనం బీఆర్‌ఎస్ కోసం వస్తారని కేసీఆర్ అన్నారు. అప్పటిదాక ఓపిక ప్రజాసమస్యలపైన పోరాడుతూ వారికి అందుబాటులో ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీమంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, జీవన్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీతారెడ్డి, నలమోతు భాస్కర్ రావు, రమావత్ రవీంద్రకుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, నేతలు కంచర్ల కృష్ణారెడ్డి, ఒంటెద్దు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలమందితో నిలబడి ఫొటోలు దిగుడు ఇబ్బంది అవుతుంది

'నన్ను కలవడానికి పిలిచినోళ్లు, పిలవనోళ్లు రోజూ వేలమంది వస్తున్నరు. మీ అభిమానానికి థ్యాంక్స్. అయితే అంతమందికి ఐదారు గంటల పాటు నిలబడి ఫొటోలు దిగాలంటే కాలిరిగిన నాకూ ఇబ్బందే అయితున్నది. ఒక్క మనిషి వేల మందితోని నిలబడి ఫొటోలు దిగితే ఎంత కష్టమో మీరే చెప్పండి. అందుకే సందర్శకులను ముందస్తు సమాచారం మేరకు మాత్రమే ఆహ్వానించాలనుకున్నాం. వారానికి రెండు నియోజకవర్గాల పేర్లు చెప్తం. చెప్పినవారు మాత్రమే వస్తే లొల్లి లేకుంట వారితో కడుపునిండ మాట్లాడుకొని పంపియ్యొచ్చు. మీరు నా మీద ఇంతగా చూపిస్తున్న అభిమానానికి మరోసారి మీకు పేరుపేరునా ధన్యవాదాలు'అని కేసీఆర్ పేర్కొన్నారు.

కొత్త విద్యుత్ కేంద్రం నిర్మించాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు పవర్ జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: కాలం చెల్లడంతో మూసివేస్తున్న 62.5 మెగావాట్ల రామగుండం బి–థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో ప్రతిపాదించిన 800 మెగావాట్ల కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించే బాధ్యతను సింగరేణి సంస్థకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విద్యుత్ ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కొత్త విద్యుత్ కేంద్రం నిర్మాణ బాధ్యతలను సైతం జెన్‌కోకే అప్పగించాలని కోరుతున్నాయి. తెలంగాణ పవర్ జేఏసీ నేతలు బుధవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లును కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రామగుండంలో కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని జెన్‌కోకు అప్పగిస్తే 2500 ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. కొత్త విద్యుత్ కేంద్రం నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి వాటా(ఈక్విటీ) నిధులను చెల్లించే శక్తి సామర్థ్యాలను జెన్‌కో కలిగి ఉందని వివరించారు. సింగరేణి సంస్థలో కేంద్రం 49, రాష్ట్రం 51% వాటాలు కలిగి ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. జెన్‌కో పెట్టుబడి వాటాను చెల్లించడానికి సిద్ధంగా ఉంటే ఆ సంస్థ ఆధ్వర్యంలోనే కొత్త విద్యుత్ కేంద్రం నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లు జేఏసీ నేతలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర డిస్కంలకు రూ.28,842 కోట్లు, రాష్ట్ర డిస్కంల నుంచి తెలంగాణ జెన్‌కోకు రూ.9,500 కోట్ల బకాయిలను ఇప్పించాలని కోరారు. మంత్రిని కలిసి వారిలో జేఏసీ కన్వీనర్ రత్నాకర్ రావు, కో– కన్వీనర్ బీసీ రెడ్డి, వైస్ చైర్మన్ అనిల్ కుమార్, వేణు, ఏ.వెంకట నారాయణరెడ్డి, పి.సదానందం, అబ్దుల్ తఖీ, కుమారస్వామి ఉన్నారు.

పాలనపై విసిగిపోయిన ప్రజలు

- ఎమ్మెల్యే హరీశ్‌రావు



దుబ్బాక: కేవలం ఏడు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విసుగు వచ్చిందని.. ఈ దుర్మార్గపు కాంగ్రెస్ పాలన ఎక్కువ రోజులుండదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో బుధవారం జరిగిన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ వీడ్కోలు సభలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో నిధుల్లేక గ్రామపంచాయతీలు మురికి కూపాలుగా మారాయని విమర్శించారు. అభివృద్ధి శూన్యమని, నేరాల సంఖ్య పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తోందన్నారు. రైతుబంధు, పెన్షన్ పెంపు, మహిళలకు గృహజ్యోతి, నిరుద్యోగభృతితో పాటు ఒక్క పథకానికి కూడా దిక్కులేదని పేర్కొన్నారు. ఓపిక పట్టండి.. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ నుంచి ఎవరు పోయినా ఏం కాదని స్పష్టం చేశారు. బలమైన పునాది ఉన్న బీఆర్‌ఎస్ మళ్లీ పుంజుకుని అధికారంలోకి వస్తుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

గిరిజన ఎమ్మెల్యేపై కేసు దుర్మార్గం

సాక్షి, హైదరాబాద్: ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మిపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తీవ్రంగా ఖండించారు. ప్రొటోకాల్ పాటించకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించినందుకు గిరిజన మహిళా ఎమ్మెల్యేపై కేసు పెట్టడం దుర్మార్గమని విమర్శించారు.

'సర్పంచ్‌లను రోడ్ల మీదకు తెచ్చిందే బీఆర్‌ఎస్'

సాక్షి, హైదరాబాద్: సర్పంచ్‌లను రోడ్ల మీదకు తెచ్చిందే బీఆర్‌ఎస్ పార్టీ అని, చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక సర్పంచ్‌లు ఉపాధి హామీ పనులకు వెళ్లారని టీపీసీసీ రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్లు సిద్దేశ్వర్ ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...బిల్లుల కోసం సర్పంచ్‌లు భిక్షాటన చేసింది మర్చిపోయారా అని మాజీమంత్రి హరీశ్‌రావును ప్రశ్నించారు. గ్రామ పంచాయతీల నిధులు ఇతర పథకాలకు మళ్లించి సర్పంచ్‌లను రోడ్ల మీదకు తెచ్చారని ధ్వజమెత్తారు. ఇవన్నీ చేసిన మీరు ఇప్పుడు సర్పంచ్‌ల కోసం మాట్లాడుతుంటే గురివింద గింజ సామెత గుర్తుకు వస్తుందన్నారు.

భవిష్యత్ ప్రధాని రాహుల్‌గాంధీ

- చంద్రబాబు దయతోనే మోదీ ప్రధాని అయ్యారు: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశానికి కాబోయే చక్రవర్తి రాహుల్‌గాంధీ అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, త్యాగాల చరిత్ర రాహుల్ గాంధీదైతే, మోసాల చరిత్ర బీజేపీది, మోదీదని విమర్శించారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ అడిగిన ప్రశ్నలకు మోదీ మైండ్ బ్లాంక్ అయ్యిందని, రాహుల్ వయసు గురించి మాట్లాడుతున్న మోదీకి కాంగ్రెస్‌కు ఉన్నంత వయసు లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ దయతో మోదీ మూడోసారి ప్రధాని అయ్యారే తప్ప ఆయన సొంత ప్రతిభ కాదని వ్యాఖ్యానించారు. భారత్ జోడోతో పరిపూర్ణత చెందిన రాహుల్.. ప్రతిపక్ష నేతగా మోదీని వెంటాడతారని చెప్పారు. పదేళ్ల మోదీ పాలనలో దేశం ఆర్థికంగా చిన్నాభిన్నం అయ్యిందని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. ప్రధాని ఏనాడూ ప్రజలను కలవలేదని, అద్వానీకి దక్కాల్సిన పీఠాన్ని ఆక్రమించుకున్నారని వ్యాఖ్యానించారు. నల్లధనం తెస్తాం, ధరలు తగ్గిస్తాం, పేదల అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తామన్న మోదీ ఆ విషయాన్ని మరిచిపోయారన్నారు. చంద్రబాబు అపాయింట్మెంట్ అడిగితే కూడా ఇవ్వని మోదీ, ఇవ్వాళ చంద్రబాబు కారణంగానే ప్రధాని అయ్యారని ఎద్దేవా చేశారు.

రుణమాఫీ పేరిట రైతులను వంచించారు

- మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రుణ మాఫీ పేరుతో రైతులను వంచించిన చరిత్ర కేసీఆర్ ప్రభుత్వానిదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ధ్వజమెత్తారు. 2018 ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు రుణ మాఫీ హామీ ఇచ్చి 2023 ఎన్నికల ముందు దాకా కేసీఆర్ మొద్దు నిద్ర పోయారని, రుణమాఫీ కోసం రైతులు నాలుగేళ్ల పాటు ఎదురు చూడాల్సి వచ్చిందని ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు. అప్పటికే రైతులు తీసుకున్న అప్పులు అపరాధ వడ్డీలతో కలిపి మూడు రెట్లు పెరిగాయని, రూ. లక్ష అప్పు మూడు లక్షలకు చేరిందని అన్నారు. మాఫీ పేరుతో ఎన్నికలకు ముందు విడుదల చేసిన నిధులు దేనికీ సరిపోక రైతులు నానా అవస్థలు పడ్డారని, రుణ మాఫీ ప్రయోజనమే లేకుండా పోయిందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం నిజమైన రైతు పక్షపాతిగా నిలిచిందని, 47 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల రుణాల మాఫీకి ఆదేశాలు జారీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ లేకపోయి ఉంటే ఈ పాటికి రుణ మాఫీ ప్రక్రియ పూర్తయ్యేదని వివరించారు. అర్హులైన రైతులందరికీ రూ. 2 లక్షల వరకు ఒకే దఫా రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసిన తర్వాత కూడా బీఆర్‌ఎస్ నేతలు విమర్శలు చేస్తుండటం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. రుణ మాఫీ జరిగితే గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ అదృశ్యమవుతుందనే భయంతో ఆ పార్టీ నేతలు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ప్రజలకు మంచి చేసే ప్రతీ కార్యక్రమాన్ని అన్ని పార్టీలు అభినందించాలని హితవు పలికారు.

బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకుంటాం

సింగరేణి అభివృద్ధితోనే ఉద్యోగావకాశాలు: ప్రొఫెసర్ కోదండరాం

పంజగుట్ట(హైదరాబాద్): బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వమే వేలం వేస్తాననటం ఎంతవరకు సబబని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ప్రశ్నించారు. సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కేంద్రం తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించకుండా వేలం పాటను ఏర్పాటు చేస్తాననడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ...సింగరేణి ప్రైవేటీకరణతో పాటు బొగ్గుగనుల వేలంను అడ్డుకుంటామన్నారు. సింగరేణిని మరింత అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయని రాష్ట్రం మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వెంటనే తెలంగాణలో బొగ్గు గనుల వేలం ఆపి దాన్ని సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ..దేశ భవిష్యత్ దృష్ట్యా బొగ్గుగనుల ప్రైవేటీకరణ ఏమాత్రం శ్రేయస్కరం కాదన్నారు. ఐక్యవేదిక యూనియన్‌లు హెచ్‌ఎమ్‌ఎస్, ఐఎఫ్‌టీయూ, టీఎస్‌యూఎస్, ఐఎఫ్‌టీయూ(ఎస్‌యూ), ఎఐఫ్‌టీయూ, టీఎస్‌టీయూసీ సంఘాల నాయకులు ఈ నెల 10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తామని వెల్లడించారు. సమావేశంలో హెచ్‌ఎమ్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, వివిధ యూనియన్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

కర్మ సూత్రం అనేది ఎప్పుడూ ఒక ప్రతిధ్వనిలా పనిచేస్తుందని గుర్తుంచుకోండి. ఒకరి గురించి చెడుగా మాట్లాడినప్పుడు అలాంటి అర్థంలేని మాటలే మీకూ ప్రతిధ్వనిస్తాయి.
– బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 4 జూలై 2024

ఘోరం... నేరం...

మానవ బలహీనతను సొమ్ము చేసుకోవడానికి నమ్మకాన్ని వాటంగా మార్చుకోవడం చరిత్రలో తరచూ కనిపించేదే. ఎవరికీ ఏ ఇబ్బందీ కలగనంత వరకేమో కానీ... ప్రజల అమాయకత్వాన్ని స్వార్థానికి వాడుకుంటున్నప్పుడు, ఆ ప్రక్రియ ఆఖరికి ప్రాణాంతకంగానూ మారినప్పుడు చూస్తూ సహించలేం. సమకాలీన సమాజంలో అలాంటి అనుభవాల్ని భరించలేం. ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లా ఫూల్‌రాయ్ వద్ద మంగళవారం జరిగిన ధార్మిక సభ, అక్కడ తొక్కిసలాటను చూసినప్పుడు అదే అనిపిస్తుంది. 121 మంది అమాయక భక్తులు మరణించిన హాథ్రస్ ఘటన ఘోర విషాదం. పాదధూళితో, పంపులో నీళ్ళతో సమస్త సమస్యలూ పరిష్కారమవుతాయని అమాయక ప్రజల్ని నమ్మిస్తున్న ఓ పెద్ద మనిషి తప్పిదానికి అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిశాయి. పాలకులు ఎప్పటి లానే సంతాపాలు తెలిపారు. నష్టపరిహారాలు ప్రకటించారు. సిట్ దర్యాప్తుకూ ఆదేశించారు. కానీ, తరచూ జరుగుతున్న ఇలాంటి దుర్ఘటనల్ని నివారించాల్సిన బాధ్యత లేదా? ప్రమాదవేళ తూతూ మంత్రంగా స్పందించి, ఆనక నివారణ చర్యలపై నిమ్మకు నీరెత్తినట్టుంటే సరిపోతుందా?

తాజా హాథ్రస్ ఘటనకు కేంద్రబిందువైన స్వయం ప్రకటిత దైవదూత నారాయణ్ సాకార్ హరి అలియాస్ భోలే బాబా కథ సుదీర్ఘమైనదే. ఆయన అసలు పేరు సూరజ్ పాల్. ఆధ్యాత్మిక గురువుగా మారక ముందు యూపీ పోలీసుల స్థానిక ఇంటెలిజెన్స్ విభాగంలో సాధారణ హెడ్ కానిస్టేబుల్. ఉద్యోగంలో ఉండగానే తాను ఆధ్యాత్మికత వైపు మొగ్గాననీ, అందుకే 1990లలో చేస్తున్న ఉద్యోగం మానేసి దైవమార్గం పట్టాననీ ఆయన కథనం. ఉత్తరప్రదేశ్‌లో ఓ చిన్న గ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన ఆయన చలువ కళ్ళద్దాలు, శ్వేత వస్త్రధారణతో పేరు, పలుకుబడి గల బాబాగా అవతరించడం ఆశ్చర్యమే. ఇవాళ యూపీ, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా తదితర ప్రధాన హిందీ రాష్ట్రాల్లో ఆయనకు లక్షలాది భక్తులు పోగుబడడం మరింత ఆశ్చర్యం కలిగిస్తుంది. చనిపోయిన బిడ్డను బ్రతికిస్తానంటూ 23 ఏళ్ళ క్రితం శ్మశానంలో గందరగోళం చేయడం మొదలు లైంగిక అత్యాచార ఆరోపణల దాకా ఈ బాబాపై అనేక కేసులున్నాయి. నాలుగేళ్ళ క్రితం 2020 జనవరిలో షాజహాన్‌పుర్‌లో ఈయన సత్సంగంలోనే ప్రసాద వితరణ వేళ మంటలు చెలరేగి, తొక్కిసలాట జరిగింది. సమయానికి అగ్నిమాపక దళం రావడంతో పెను ప్రమాదం తప్పింది. కానీ, దోవ కూడా సరిగ్గా లేని తాజా హాథ్రస్ ఘటనాస్థలిలో కనీసం అంబులెన్స్ లాంటివైనా లేకపోవడం ఘోరం, నేరం.

హాథ్రస్ ఘటనపై కఠిన చర్యలు చేపడతామని యూపీ సీఎం గర్జించారు కానీ, ఈ దుర్ఘటనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో అసలు భోలే బాబా పేరే పెట్టలేదు. ఇక, ఇంత భారీ దుర్ఘటన జరిగాక సదరు బాబా ఎవరికీ కనిపించకుండా పరారీలో ఉన్నారు. హాథ్రస్ ఘటన అత్యాశకూ, అపరిమిత నిర్లక్ష్యానికీ ప్రతీక. ఈ ఘటనలో తిలా పాపం తలా పిడికెడు. సత్సంగమంటూ 80 వేల మందికే అనుమతి తీసుకొన్నా, రెండున్నర లక్షల మందికి పైగా జనాన్ని అనుమతించడం ఎవరి తప్పు? తగినన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలైనా లేకుండా అంత భారీ ఆధ్యాత్మిక సభ జరిపిన నిర్వాహకులను ఏమనాలి? 'నా పాదధూళి ఇంటికి తీసుకెళ్ళి సమస్యల్లో ఉన్నవారికి రాస్తే అన్నీ చక్కబడతాయి' అని అమాయకుల బలహీనతతో ఆడుకొని, ఇంత ఘోరానికి కారకుడైన మహానుభావుణ్ణి ఏం చేయాలి? ఇంత జరిగాక కూడా ఆయన తన వకీలు ద్వారా ఈ దుర్ఘటన వెనుక అసాంఘిక శక్తుల కుట్ర ఉందంటూ నెపం నెట్టేసే పని చేస్తుంటే పాలకులు ఏం చేస్తున్నట్టు?

హాథ్రస్ ఘటన లాంటివి మనకు కొత్త కాదు. గతంలోనూ ఇలాంటివి అనేకం జరిగాయి. 2005లో మహారాష్ట్రలోని వాయిలో మంధరాదేవి గుడి వద్ద తొక్కిసలాటలో 340 మందికి పైగా చనిపోయారు. 2008లో రాజస్థాన్‌లో చాముండా దేవి ఆలయం వద్ద కనీసం 250 మంది, హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి గుడి వద్ద 162 మంది తొక్కిసలాటల్లోనే దుర్మరణం పాలయ్యారు. చరిత్ర పుటల్లో వెనక్కి వెళితే, 70 ఏళ్ళ క్రితం 1954లో స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి కుంభమేళాలో అలహాబాద్‌లో జరిగిన తొక్కిసలాటలో 800 మంది ప్రాణాలు కోల్పోవడం గుండెల్ని మెలిపెట్టే విషాదం. రద్దీని నియంత్రించే వ్యవస్థలు లేకపోవడం, భారీగా జనం తరలివచ్చే సందర్భాలకు తగ్గట్టు ముందస్తు ప్రణాళికా రచన చేయకపోవడం, సామాన్యుల నియంత్రణే కష్టంగా ఉండే సమయంలో వీఐపీల తాకిడి ఎక్కువై యంత్రాంగమంతా వారి సేవల్లో తరించడం లాంటి లోపాలు ఆనాటి నుంచి ఈనాటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. అది మరింత విషాదం.

భారతదేశంలో నూటికి 79 తొక్కిసలాటలు ధార్మిక సమ్మేళనాలు, తీర్థయాత్రల్లో జరుగుతున్నవేనని 2013లో ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం తేల్చింది. పైపెచ్చు, మన దేశంలో అనేక ఆలయాలు కొండల పైన, నదీ తీరాల్లో, ప్రయాణానికి సంక్లిష్టమైన ఇతర ప్రాంతాల్లో నెలకొన్నందున తొక్కిసలాటల ముప్పు ఎక్కువ. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక సమ్మేళనాలు నిర్వహిస్తుంటే వేలు, లక్షల్లో జనం రాకతో ఆ ప్రాంతాలు క్రిక్కిరిసి పోతున్నాయి. అలాంటి చోట్ల ప్రాథమిక వసతులే కాదు... కనీసం సరైన ప్రవేశ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో నిష్క్రమణ మార్గాలు సైతం ఉండట్లేదు. ఇవన్నీ ప్రమాదాలకు కారణాలే. వీటిని నివారించాలంటే జనసమ్మర్దాన్ని నియంత్రించే యంత్రాంగం కీలక పాత్ర పోషించాలి. 2014లోనే జాతీయ విపత్తుల ప్రాధికార సంస్థ జనసమ్మర్ద నియంత్రణపై మార్గదర్శకాలు ఇచ్చింది. కానీ, అవి ఎక్కడా అమలైనట్టు లేవు. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజా ఘటనతోనైనా పాలకులు నిద్ర లేస్తారా? ఓట్ల రాజకీయాల్ని వదిలేసి, మూఢనమ్మకాలు ప్రోత్సహించేవారికి ముకుతాడు వేస్తారా?

వినాశనపు ఒడ్డున ప్రపంచం

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

2024 జనవరి నాటికి తొమ్మిది అణ్వాయుధ దేశాల(ఎన్9) దగ్గర 12,121 అణ్వాస్త్రాలు ఉన్నాయని 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' నివేదిక చెబుతోంది. ఆయుధ సంపత్తిని పెంచుకునేందుకు, ఆధునికీకరించుకునేందుకు ఈ దేశాలు (భారత్ సహా) గత ఏడాది ఏకంగా 9,100 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాయి. రష్యా, అమెరికా వద్ద ఉన్నన్ని ఖండాంతర క్షిపణులను సిద్ధం చేసేందుకు చైనా ప్రయత్నిస్తోందని కూడా ఈ నివేదిక తెలియజేస్తోంది. ఇది దక్షిణాసియాకు క్షేమకరం కాకపోగా, పరోక్షంగా భారత్‌కు కూడా ముప్పే. శక్తిమంతమైన దేశాల మధ్య వ్యూహాత్మక అంశాల విషయంలో సమాచార వినిమయం జరగకపోవడం ఈ పరిస్థితికి కారణం. కనుచూపు మేరలో ఇది మెరుగుపడే సూచనలూ లేకపోవడం ఆందోళనకరం.

ప్రపంచ వినాశనానికి హేతువు కాగల అణ్వస్త్రాలు మరోసారి పడగ విప్పుతున్నాయి. గత నెల పదిహేడున విడుదలైన రెండు అంతర్జాతీయ స్థాయి నివేదికలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ భద్రతను సవాలు చేస్తున్నాయి. మొదటి రిపోర్టును ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టు అబాలిష్ న్యూక్లియర్ వెపన్స్(ఐసీఏఎన్) విడుదల చేయగా... రెండోదాన్ని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఐపీఆర్ఐ–సిప్రి) విడుదల చేసింది. రెండింటిలోని సమాచారం మానవాళిని హెచ్చరించేది మాత్రమే కాదు... భయపెట్టేది కూడా.



ఆకలి కంటే అణ్వాయుధాలే మిన్నా?

ఐసీఏఎన్ రిపోర్టు ప్రకారం, ప్రపంచం మొత్తమ్మీద అణ్వాయుధ సామర్థ్యమున్న తొమ్మిది దేశాలు (అమెరికా, యూకే, రష్యా, చైనా, ఫ్రాన్స్, ఇండియా, ఇజ్రాయెల్, పాకిస్తాన్, ఉత్తర కొరియా) తమ ఆయుధ సంపత్తిని పెంచుకునేందుకు, ఆధునీకరించుకునేందుకు గత ఏడాది ఏకాఏకి 9,100 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాయి. అన్ని దేశాల సమర్థింపు ఒక్కటే... 'ఇతరుల' నుంచి ముప్పు ఉందని! 2023లో అందరూ ఊహించినట్టుగానే అమెరికా అత్యధికంగా 5,150 కోట్ల డాలర్లు అణ్వాయుధాలపై ఖర్చు చేయగా... చైనా (1,180 కోట్ల డాలర్లు), రష్యా (830 కోట్ల డాలర్లు) ఖర్చు చేసినట్లు ఐసీఏఎన్‌నివేదిక తెలిపింది. ''గత ఏడాది ఈ తొమ్మిది దేశాలు కలిసికట్టుగా ప్రతి సెకనుకు సుమారు రెండున్నర లక్షల రూపాయలు ఖర్చు పెట్టాయి'' అని ఐసీఏఎన్ డైరెక్టర్ మెలిస్సా పార్క్ తెలిపారు. ఈ మొత్తం ప్రపంచం మొత్తమ్మీద ఆకలిని అంతం చేసేందుకు అవసరమయ్యే నిధులకంటే చాలా ఎక్కువని ఆమె వివరించారు. ఇంత మొత్తాన్ని మొక్కలు నాటేందుకు ఉపయోగించి ఉంటే ఒక్కో నిమిషానికి కనీసం పది లక్షల మొక్కలు నాటి ఉండవచ్చు అని మెలిస్సా అన్నారు.

వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా భూమ్మీద మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతున్న ఈ తరుణంలో ఇంత పెద్ద ఎత్తున మొక్కలు నాటే అంశాన్ని ఎత్తడం ఎంతైనా మంచి విషయమే కదా? ఈ ఏడాది వేసవి ఎంత మంట పుట్టించిందో, వడగాడ్పులకు ఎంత మంది మరణించారో మనకు తెలియంది కాదు. మనుషుల నిష్పత్తితో పోల్చినప్పుడు ఉండాల్సినన్ని వృక్షాలు లేకపోవడం వల్ల చాలా దేశాలు అనేక వాతావరణ సంబంధ సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ అంశంలో పెద్ద దేశాల్లోకీ ఇండియా అత్యంత ఎక్కువగా ప్రభావితం అవుతోంది.

సిప్రి ఇయర్‌బుక్–2024 అంతర్జాతీయంగా భద్రత విషయంలో వస్తున్న మార్పులేమిటి? ఆయుధాలు, టెక్నాలజీ రంగాల్లోని ముఖ్య పరిణామాలు ఏమిటి? అనేది సమగ్రంగా వివరిస్తుంది. దేశాల మిలిటరీ పెడుతున్న ఖర్చులు, ఆయుధాల ఉత్పత్తి, వ్యాపారాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న ఘర్షణలను కూడా ఈ ఇయర్ బుక్ వివరిస్తుంది. సంప్రదాయ ఆయుధాలతోపాటు అణ్వస్త్రాలు, జీవ, రసాయన ఆయుధాలపై కూడా ఇది దృష్టి పెడుతుంది. అణ్వాయుధాలకు సంబంధించి ఇందులో దాదాపు వంద పేజీల విలువైన సమాచారాన్ని పొందుపరిచారు.

పెరిగిన చైనా అణ్వాయుధాలు...

సిప్రి నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల సంఖ్య మాత్రమే కాదు... అందులో రకాలు కూడా పెరిగాయి. మొత్తం తొమ్మిది దేశాలు అణ్వాయుధాల ద్వారా మాత్రమే తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవచ్చునని అనుకుంటున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్నే తీసుకోండి. హద్దులు దాటొద్దని నాటోను హెచ్చరించేందుకు రష్యా అణ్వాయుధాలను వాడేందుకు వెనుకాడమని చెబితే... బదులుగా నాటో, అమెరికా కూడా అణ్వస్త్రాలతో యుద్ధానికి సిద్ధమన్నట్టు కాలు దువ్వుతున్నాయి.

2024 జనవరి నాటికి తొమ్మిది అణ్వాయుధ దేశాల(ఎన్9) దగ్గర దాదాపు 12,121 అణ్వస్త్రాలు ఉన్నాయని సిప్రి నివేదిక చెబుతోంది. ఇందులో 9,585... వాడుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అంతేకాదు... వీటిల్లో 3,904 అణ్వస్త్రాలు ఇప్పటికే నిర్ణీత ప్రదేశాల్లో ఏర్పాటు చేశారనీ, 2,100 అణ్వస్త్రాలను ఆపరేషనల్ అలర్ట్‌తో ఉంచారనీ కూడా సిప్రి ఇయర్ బుక్ చెబుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఆపరేషనల్ అలర్ట్‌తో ఉన్న అణ్వాయుధాలు ఈ ఏడాది దాదాపు వంద ఎక్కువ కావడం గమనార్హం. ప్రపంచం మొత్తమ్మీద ఉన్న అణ్వాయుధాల్లో 88 శాతం అమెరికా, రష్యాల వద్దే ఉండటం గమనార్హం. అయితే చైనా అణ్వాయుధ సంపత్తి 2023 నాటి 410 నుంచి ఈ ఏడాది జనవరి నాటికి 500కు చేరడం ఆందోళన కలిగించే అంశమని సిప్రి నివేదిక తెలిపింది. చైనా తన అణ్వాయుధాలను ఆధునికీకరించుకుంటోందనీ, రానున్న దశాబ్ద కాలంలో ఉత్పత్తిని కూడా గణనీయంగా పెంచుకునే ప్రయత్నాల్లో ఉందనీ సిప్రి నివేదిక తెలియజేస్తోంది. ''రష్యా, అమెరికాల వద్ద ఉన్నన్ని ఐసీబీఎం(ఖండాంతర క్షిపణు)లను సిద్ధం చేసేందుకు చైనా ప్రయత్నిస్తోంది'' అని ఈ నివేదిక రచయితలు తెలిపారు. చైనా తననితాను అమెరికాకు ప్రత్యర్థిగా భావించవచ్చు కానీ... చైనా ఈ మధ్యకాలంలో అణ్వాయుధాలను సిద్ధం చేయడం ఎక్కువ కావడం దక్షిణాసియా ప్రాంత భద్రతకు ఏమంత మంచిది కాదు. ఇంకోలా చెప్పాలంటే భారతదేశానికి కూడా పరోక్ష ముప్పు పొంచి ఉందన్నమాట!

కనబడని కాంతి

ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో, 1945 –1991 మధ్యన అమెరికా, ఆ దేశాన్ని బలపరిచే యూకే, ఫ్రాన్స్‌లు ఒక పక్క... ఒకప్పటి సోవియట్ రష్యా మరో పక్క అన్నట్టుగా అణ్వాయుధ పోటీ నడిచింది. 1962 నాటి క్యూబన్ మిస్సైల్ ఉదంతం తరువాత ఇరు పక్షాలు కూడా అణ్వస్త్ర నిరోధకతకు అనుకూలంగా కొంత తగ్గాయి. ఆయుధాల నియంత్రణ, మ్యూచువల్లీ అష్యూర్డ్ డిస్ట్రక్షన్ వంటి అంశాల ఆధారంగా ఈ సంయమనం సాధ్యమైంది.

2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసింది మొదలు ప్రపంచం అణ్వస్త్రాల విషయంలో రెండుగా విడిపోయింది. ఒకటేమో అమెరికా నేతృత్వంలోని మిలిటరీ భాగస్వాములుగా మారితే... రెండోదేమో రష్యా– చైనా, జూనియర్ పార్ట్‌నర్‌గా ఉత్తర కొరియా కూటమిగా నిలిచాయి. భారత్, పాకిస్తాన్, ఇజ్రాయెల్ ఏ కూటమిలోనూ చేరలేదు. కాకపోతే వాటి భౌగోళిక స్థితిని బట్టి ఎవరు ఎటువైపు అన్నది స్పష్టమే.

ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందని ఒకసారి ఆలోచిస్తే 2022 నాటి నుంచి ప్రపంచం మొత్తమ్మీద శక్తిమంతమైన దేశాల మధ్య వ్యూహాత్మక అంశాల విషయంలో సమాచార వినిమయం పెద్దగా జరగడం లేదని చెప్పాలి. అమెరికా దేశీయంగా ఎన్నో ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటోంది. డోనాల్డ్ ట్రంప్ మరోసారి పగ్గాలు చేపట్టే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇంకోపక్క ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని కొనసాగించాలనే నిశ్చయాభిప్రాయంతో రష్యా ఉంది. చైనా కూడా తన సరిహద్దుల విషయంలో దుందుడుకుగా వ్యవహరిస్తోంది. నిజంగానే ఇది ప్రపంచం ఎదుర్కొంటున్న ముప్పు అని చెప్పాలి. ఐసీఏఎన్, సిప్రి నివేదికలు ఈ ముప్పునే సవివరంగా వివరిస్తున్నాయి. కనుచూపు మేరలో పరిస్థితి మెరుగుపడే సూచనలూ లేవని చెబుతూండటం కఠోర సత్యం.

వ్యాసకర్త ఢిల్లీలోని సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మట్టి కోసం ప్రాణాలా?



హాథ్రస్ (ఉత్తరప్రదేశ్) తొక్కిసలాటలో మరణించినవారిలో అత్యధికంగా 108 మంది మహిళలు అని తెలియడం ఒకటైతే, 'వెళ్లిపోవడానికి ముందు బోధకుడు నడిచిన స్థలంలోని పాదధూళిని సేకరించే యత్నంలో' ఒకరిపై ఒకరు పడ్డారని తెలియడం ఈ దుర్ఘటనను ఎన్నో విధాల మరింత విషాదకరం చేస్తోంది.

– మిథాలీ శరణ్, కాలమిస్ట్

ఎంపిక కాదు!



పాశ్చాత్య దేశాల్లోని కుహనా స్త్రీవాదులు ఎప్పుడూ హిజాబ్–నఖాబ్ ఒక ఎంపిక అని చెబుతుంటారు! అవును, అది కేవలం ప్రజాస్వామిక పాశ్చాత్య దేశాల్లోని కొంతమంది మహిళలకే ఎంపిక. ఇస్లామిక్ నరక దేశాల్లోని లక్షలాది మంది మహిళలకు అది ఎంపిక కాదు.

– తిరాద్ రయీఫ్ బదావీ; బ్లాగర్, సౌదీ జైల్లో ఉన్న యాక్టివిస్ట్ రయీఫ్ బదావీ కొడుకు

సంఘ్ ఆపింది!



ఎమర్జెన్సీ తర్వాత బాబూ జగ్జీవన్ రామ్ ప్రధాని కాకుండా ఇందిరా గాంధీ అడ్డగించారని జూలై 2న లోక్‌సభలో ప్రధాని అనడం ఆశ్చర్యం కలిగించింది. 1977లో ఇందిరా గాంధీ ఓడిపోయారు. జనతా పార్టీ ప్రభుత్వంలో జన సంఘ్ భాగస్వామి. అది ఇతరులతో, ప్రత్యేకించి 'జేపీ'తో కలిసి, జగ్జీవన్‌ను ప్రధాని కాకుండా ముఖ్యపాత్ర పోషించింది.

– నీనా వ్యాస్, జర్నలిస్ట్

ఎత్తేస్తే ఏమి?



ఎంబీబీఎస్‌లో ప్రవేశాన్ని కోరుతున్నవారికి బోర్డు పరీక్షలను ఐచ్ఛికం చేస్తే ఎలా ఉంటుంది? మెడిసిన్‌లో చేరడానికి ఎటూ నీట్ ఒక్కటే మార్గం అయినప్పుడు, విలువలేని బోర్డు ఎగ్జామ్ ఉండాలి అనడానికి సానుకూల వాదన ఏముంటుంది?

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

భలే వినోదం



ప్రస్తుతం నడుస్తున్న అన్ని సినిమాలు, ఓటీటీల్లోని షోల కంటే పార్లమెంట్ మరింత రంజుగా ఉంది.


– చేతన్ భగత్, రచయిత

ఇన్ బాక్స్

మన్యం విప్లవ జ్యోతి

భారత స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ పథాన్ని అనుసరించి పోరాడిన వీరుల్లో అల్లూరి సీతారామరాజు అగ్రగణ్యుడు. విశాఖ జిల్లా పాండ్రంకిలో జన్మించిన ఆయన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సాధారణ విద్యతో పాటు యుద్ధ విద్య, జ్యోతిష్యం వంటివాటిని అభ్యసించాడు. తరువాత దేశ సంచారం చేసి దేశంలో ఉన్న పరిస్థితులను ఆకళింపు చేసుకుని విశాఖ జిల్లా కృష్ణదేవిపేట వచ్చి మన్యంలో తిరుగుబాటు మొదలుపెట్టాడు.

కవర్టు, హైటర్ వంటి అధికారులను సీతారామరాజును మట్టు పెట్టటానికి మన్యం పంపింది బ్రిటిష్ ప్రభుత్వం. లోతుగడ్డ వాగు దగ్గర సీతారామరాజు ఉన్నాడని తెలుసుకొని, 300 మంది పటాలంతో వాళ్లు బయలుదేరారు. ముందుగానే వారి రాకను పసిగట్టిన సీతారామరాజు విలువిద్యలో ఆరితేరిన గోకిరి ఎర్రేసు, గాము గంటం దొర, మల్లు దొర, పడాలు అగ్గిరాజువంటి వారితో కలిసి గొరిల్లా యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఇరుకైన మార్గంలో వస్తున్న కవర్ట్, హైటర్లు సీతారామరాజు దళం దెబ్బకు పిట్టల్లా రాలిపోయారు. ఇది రామరాజు మొదటి విజయం. దీంతో రామరాజు తలమీద బ్రిటిష్ గవర్నమెంట్ 10 వేల రివార్డు ప్రకటించింది.



అయితే ఈ దాడిలో మల్లు దొరకు తుపాకీ గుండు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పుడు రామరాజు బ్రిటిష్ వారితో పోరాడాలంటే విల్లంబులు చాలవనీ, తుపాకులు కావాలనీ భావించాడు. తుపాకుల కోసం ఎవరి మీద దాడి చేయకుండా, పోలీస్ స్టేషన్‌లో తుపాకులను, మందుగుండు సామగ్రిని కొల్లగొట్టాలి అని నిర్ణయించుకున్నాడు. అన్నవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల, నర్సీపట్నం పోలీస్ స్టేషన్లకు ఒకదాని తరువాత మరొకదానికి మిరపకాయ టపా పంపి తాను స్టేషన్‌పై దాడికి వస్తున్నట్లు తెలిపి మరీ తుపాకులను దోచుకున్నాడు. పోలీస్ రికార్డుల్లో తాను ఎన్ని తుపాకులు తీసుకువెళ్తున్నాడో ఆ వివరాలన్నీ రాసి కింద 'శ్రీరామరాజు' అని సంతకం చేశాడాయన.

గుంటూరు కలెక్టర్‌గా పనిచేస్తున్న రూథర్‌ఫర్డ్‌ను సీతారామరాజును అణచడానికి విశాఖ జిల్లాకు పంపించింది బ్రిటిష్ ప్రభుత్వం. ఇదే సమయంలో పరమ నీచుడైన బ్రిటిష్ మేజర్ గుడాల్, గిరిజన గూడేలపై పడి ఆడవాళ్ళపై అత్యాచారాలు చేస్తూ పసిపిల్లలను వధించటం, భార్యల ఎదుటే భర్తను చంపటం, గిరిజన గూడేలను తగలబెట్టడం లాంటి చర్యలకు ఒడిగట్టాడు. ఇది సీతారామరాజుకి తెలిసి, తన వల్ల అమాయకులైన గిరిజన జనం చనిపోవడం, ఇబ్బందులపాలు కావడం ఇష్టంలేక లొంగిపోవాలని నిర్ణయించుకున్నాడు. మార్గమధ్యలో గుడాల్ మాటు వేసి, తన సైన్యంతో సీతారామరాజును బంధించాడు. ఆయన్ని నులక మంచానికి కట్టి, నానా హింసలు పెట్టి, వీధుల్లో ఊరేగించి తుపాకీతో కాల్చి చంపాడు. ఆ విధంగా ఒక విప్లవ జ్యోతి అమరదీపమై దేశ స్వాతంత్రోద్యమానికి దారి చూపింది.

– పొత్తూరి సీతారామరాజు, కాకినాడ (నేడు అల్లూరి సీతారామరాజు జయంతి)

యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

అభిప్రాయం



డా॥ ఆంజనేయ గౌడ్

మారుమూల గ్రామాల నుంచి కలల మూటలు మోసుకొొచ్చి, సర్కార్ కొలువుల కోసం పుస్తకాలతో పెనుగులాడే యువలోకానికి ఎన్నో బాసలు చేసింది హస్తం పార్టీ. ఆర్ట్స్ కాలేజీ ముందు రేవంత్ రెడ్డి నుంచి మొదలుకొని, అశోక్ నగర్‌లో రాహుల్ గాంధీ వరకూ కాంగ్రెస్ నాయకులందరూ ఉద్యోగాల ఉట్టి కొడతామని నమ్మబలికారు. చివరికి సరూర్ నగర్ స్టేడియంలో ప్రియాంక గాంధీతో 'యూత్ డిక్లరేషన్' పేరిట తెలంగాణ రాష్ట్ర యువతకు నిర్దిష్టమైన హామీలిచ్చారు. ఆనాటి యువ సంఘర్షణ సభలో యూత్ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ పార్టీ యువతకు వ్రాసిస్తున్న బాండ్ పేపర్‌గా రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాకమ్మ కథలు కాదనీ, కమిట్ మెంట్‌కు నిదర్శనంగా యూత్ డిక్లరేషన్‌ను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేసి చూపిస్తామనీ ప్రియాంక గాంధీని సాక్షిగా పెట్టి నమ్మబలికారు. ఆ సభ ఉపన్యాసాలను నేడు నిరుద్యోగులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ వైఖరిని నిలదీస్తున్నారు.



వాస్తవానికి తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులు కొత్తగా ఏవీ కోరడం లేదు. విపక్ష పార్టీగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఉద్యోగాలనే భర్తీ చేయమని కోరుతున్నారు. ఏడాదిలోపు 2 లక్షల ప్రభుత్వ కొలువులను భర్తీ చేస్తామనీ, గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 1:100 విధానంలో క్వాలిఫై చేస్తామనీ, 4 వేల నిరుద్యోగ భృతి ప్రతి నెలా అందజేస్తామనీ హస్తం పార్టీ అధిష్టానమే హామీ ఇచ్చింది కదా? వాటితో పాటు మెగా డీఎస్సీ, నిరుద్యోగులకు రూ. 10 లక్షల వడ్డీలేని రుణాలు, ఉద్యమ అమరుల కుటుంబాలకు నెలనెలా 25 వేల పింఛన్లు, బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ... ఇలా ఎన్నో హామీలను రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. వాటి కోసమే ఏడు నెలలు ఎదురుచూసిన తర్వాత, నేడు యువలోకం నిలదీస్తున్నది. గురుకులాల ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ ప్రక్రియలో మళ్ళీ బ్యాక్ లాగ్‌లు మిగలకుండా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు కోరుతున్నారు. వీటి కోసం అడిగీ, అడిగీ, ఏడు నెలలుగా హస్తం పార్టీ ప్రభుత్వ పెద్దల చుట్టూ తిరిగి, ప్రయోజనం లేకనే నిరుద్యోగులు ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమిస్తున్నారు. మోతీలాల్ నాయక్ వంటి వారు నిరాహార దీక్షకు దిగుతున్నారు.

వినతిపత్రాలు చెత్త బుట్టల పాలై, కోదండరాం కానరాక, మల్లన్న మర్లి చూడక, ధర్నా చౌక్‌లో దినా రాత్రులు నినదించినా కనీసం పట్టించుకునే నాథుడే లేకపోవడంతో, పోరు దారి తప్ప మరో దారి లేక నవతరం నడిరోడ్డుపై నిలబడి నినదిస్తున్నది. నమ్మిన నిరుద్యోగులను కనీసం పిలిపించుకొని చర్చించే తీరిక కూడా కాంగ్రెస్ సర్కార్‌కు లేకపోడాన్ని ఏమనాలి? పరాయి పార్టీ ఎంఎల్ఏ లపై చూపుతున్న ప్రేమలో, పదోవంతు కూడా ప్రభుత్వం అప్పగించిన యువతరంపై ప్రదర్శించడం లేదు. ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ నిజరూప దర్శనం యువలోకానికి కనువిప్పు కలిగించింది.

ఊరించిన నోరే వెక్కిరించినట్లుగా మెగా డీఎస్సీ పేరుతో ఆర్భాటం చేసి, తీరా కేవలం 11వేల ఖాళీలు చూపెట్టడం మోసం కాదా? గ్రూప్–2 నోటిఫికేషన్‌కు అదనంగా 2 వేలు, గ్రూప్–3 నోటిఫికేషన్‌కు మరో 3 వేల ఉద్యోగ ఖాళీలను కలిపి భర్తీ చేపట్టాలని లక్షలాది నిరుద్యోగులు కోరుతున్నారు. లక్షలాది మంది నిరుద్యోగుల నినాదాలుగా మారిన వీటిని అన్యాయమైన డిమాండ్‌లు అని సర్కార్ భావిస్తున్నట్లున్నది.

రాజకీయ అంశాలపై తప్ప, రాష్ట్ర వర్తమాన అంశాలపై లోతైన దృష్టికోణమే కనుమరుగైపోయింది. మాసాలు గడుస్తున్నా వీసీల నియామకం లేక, ఇంఛార్జీల ఏలుబడిలో విశ్వవిద్యాలయాలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నాయి. గురుకులాల నుంచి వర్సిటీల వరకూ అన్ని విద్యాసంస్థలూ సమస్యల వలయంలోకి జారుకుంటున్నాయి. అవగాహన లేమితోనో లేక నిర్లక్ష్యంతోనో గానీ కాంగ్రెస్ సర్కార్ విద్యార్థి, యువజనులతో చెలగాటమాడుతున్నది. ఇది సరికాదు. ఇప్పటికైనా వారికిచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కార్యాచరణ చేపట్టాలి.

రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ ఛైర్మన్ । 9885352242


సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

మరణభయం పోవాలంటే...

చాలామంది 'మరణం' గూర్చి భయపడుతూ ఉంటారు. మరణ తత్వాన్ని అర్థం చేసుకోకపోవటమే ఈ భయానికి కారణం. మరణం అంటే శరీర సాధారణ స్థితిలో కలుగు మార్పు. శైశవం వదలి బాల్యంలోకి, బాల్యం వదలి యవ్వనంలోకి, అత్యంత ప్రియమైన యవ్వనం నుంచి ముసలి తనానికి ఈ మార్పు కారణం అవుతుంది. చివరగా ముసలితనం మరణానికి దారితీస్తుంది.

రాత్రి... గడచిపోయి సూర్యోదయానికి స్వాగతం పలుకుతుంది. ఉదయం గడచి మధ్యాహ్నానికి అవకాశమిస్తుంది. అదే విధముగా రాత్రి ప్రారంభం కాగానే మధ్యాహ్నం పోతుంది. ప్రకృతి తిరుగులేని నియమాన్ని ఎవ్వరూ నిరోధించలేరు. ఆ నియమం అనుసరించి జన్మించిన ప్రతి జీవీ మరణించవలసిందే. అలాగే మరణించిన ప్రతి జీవీ తిరిగి జన్మించవలసిందే. ఈ విషయాన్ని సరిగా అవగాహన చేసుకుంటే మరణం వల్ల భయం కలుగదు. ఈ భయ నివారణకు తిరిగి జన్మించకుండా ఉండటమే సరైన మార్గం. జననమే లేనప్పుడు మరణించే ప్రసక్తే ఉండదు కదా!

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఎంతకాలం 'ఈ దేహమే నేను' అనే దేహాత్మ భావన ఉంటుందో అంతవరకు మరణ తప్పదు. ఏ క్షణం శారీరక స్పృహను దాటుతామో, అప్పుడే మనం నాశ రహితులం అవుతాం. పుట్టిన ప్రతి జీవీ గిట్టకతప్పదని తెలిసినా ఎవరికి వారు తమకు మరణం లేదని అనుకొంటూ ఉండటమే ఆశ్చర్యకరమైన విషయం అని ధర్మరాజు మహాభారతంలో ఒకచోట అంటాడు. ఇది ఆలోచించదగిన విషయం. ఒకానొక సందర్భంలో ఓ యక్షుడు ధర్మరాజును అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏది? (కిం ఆశ్చర్యం?) అని అడుగుతాడు. ఈ ప్రశ్నకు ధర్మరాజు 'ప్రతి క్షణం లెక్కలేనన్ని జీవులు యముని (మృత్యుదేవత) రాజ్యాన్ని చేరుకొంటున్నాయి. అయినప్పటికీ జీవించి ఉన్నవారు మాత్రం తమకు మరణం ఉన్నదని తెలిసీ లేనివారివలె జీవిస్తారు' అని సమాధానం ఇస్తాడు. మానవుని జీవితం క్షణభంగురం. మరణం అనివార్యం. కాబట్టి మానవులందరూ ప్రతిక్షణాన్నీ సద్వినియోగపరచుకోవాలి. కాలం గడచిన పిమ్మట గతంలోకి తొంగిచూచుకొని 'అయ్యో! నేను కాలాన్ని సద్వినియోగపరచుకొనలేకపోయాన'ని బాధపడటానికి ఎలాంటి అవకాశం లేకుండా జీవితాన్ని గడపాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.5.38 వరకు, తదుపరి చతుర్దశి, తె.4.25 వరకు(తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** మృగశిర తె.4.20 వరకు(తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.10.00 నుండి 11.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.46 వరకు, తదుపరి ప.3.07 నుండి 4.00 వరకు, **అమృతఘడియలు:** రా.7.38 నుండి 9.12 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.33, **సూర్యాస్తమయం:** 6.35, మాసశివరాత్రి.

క్లుప్తంగా...

'రైతులు అధైర్యపడవద్దు'

సాక్షి, హైదరాబాద్: హక్కు ఉన్న ప్రతి రైతుకు భూమి హక్కు పత్రాలు వస్తాయని, ఎవరూ అధైర్య పడవద్దని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి కోరారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర చైర్మన్ అన్వేష్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. ఖమ్మం రైతు ప్రభాకర్ ఆత్మహత్యపై పూర్తి విచారణ జరపాలని కిసాన్ కాంగ్రెస్ నుంచి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతిపక్షంలోకి బీఆర్ఎస్ వచ్చాక ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

ఎత్తిపోతల సలహాదారు పదవీ కాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖ ఎత్తిపోతల పథకాల సలహాదారు కె.పెంటారెడ్డి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మే 15న ఆయన పదవీకాలం ముగియగా, 16 నుంచి పొడిగింపు అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో తెలిపారు. ట్రాన్స్‌కో ఎస్ఈ స్థాయిలో పెంటారెడ్డి పదవీ విరమణ చేశారు.

ఎస్సై ఆత్మహత్యాయత్నంపై ఎస్‌బీ అధికారుల విచారణ!

అశ్వారావుపేట రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యాయత్నం ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) పోలీసు అధికారులు రహస్య విచారణ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఎస్‌బీ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విచారణ ప్రారంభించారు. ఎస్సై శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆత్మహత్యాయత్నం వరకు వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులు, వేధింపులు, సహాయ నిరాకరణ వంటి అంశాలపై సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కాగా, ఎస్సై శ్రీనివాస్ వ్యవహారంలో సీఐ జితేందర్‌రెడ్డిపై ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు ఆయన్ను ఐజీకి అటాచ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మరో నలుగురు కానిస్టేబుళ్లను కూడా వీఆర్‌పై ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు తెలిసింది. అయితే దీనిపై అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు.

పురుగు మందు తాగిన తల్లి, కూతురు మృతి

- ప్రాణాలతో పోరాడుతున్న మరో ఇద్దరు కుమార్తెలు


అనిత


రమ్య

కాగజ్‌నగర్‌రూరల్ (కుమురంభీం ఆసిఫాబాద్): కుటుంబ కలహాలతో తల్లితోపాటు ముగ్గురు కుమార్తెలు పురుగుల మందు తాగగా..చికిత్స పొందుతూ బుధవారం తల్లీకూతురు మృత్యువాత పడ్డారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన ప్రతాప్, అనిత దంపతులు నలుగురు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ప్రతాప్ తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. కుటుంబ కలహాలతో సోమవారం అనితతోపాటు ముగ్గురు కుమార్తెలు లక్ష్మి, రమ్య, ఐశ్వర్య పురుగుల మందు తాగారు. వెంటనే వీరిని స్థానికులు సాయంతో కాగజ్‌నగర్ పట్టణంలోని ఆస్పత్రిలో చేర్పించగా.. పరిస్థితి విషమించి బుధవారం అనిత(45), రమ్య(16) మృతిచెందారు. లక్ష్మి, ఐశ్వర్య సైతం మృత్యువుతో పోరాడుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బదిలీలపై నిషేధం తొలగింపుతో ఉద్యోగుల్లో ఆనందం

సాక్షి, హైదరాబాద్: బదిలీలపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తివేయడంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల ఉద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఆరేళ్లుగా బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయడాన్ని టీజీవో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మాచర్ల రామకృష్ణ స్వాగతించారు. ఏడాది సర్వీస్ పూర్తి చేసిన వారికి కూడా బదిలీలు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె వెంకన్న విజ్ఞప్తి చేశారు. కొత్త అధ్యాపకులకు కూడా బదిలీల్లో అవకాశం కల్పించాలని టీజీజేఎల్ఏ-475 సంఘం నేత డాక్టర్ కొప్పిశెట్టి సురేశ్ కోరారు.

బదిలీలకు అనుమతిపై హర్షం

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగుల బదిలీలకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణలు రాష్ట్ర ప్రభుత్వానికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు నెలలో 1వ తేదీనే జీతాలివ్వడం, ఉద్యోగ బదిలీలకు ఆమోదం తెలపడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు.

46 లక్షల ఎకరాల్లో పంటల సాగు

- అందులో పత్తి ఒక్కటే 33 లక్షల ఎకరాలకు పైనే
- గత ఏడాది కంటే భారీగా వానాకాలం సాగు
- ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక
- 17 జిల్లాల్లో అధికం నుంచి అత్యధిక వర్షపాతం నమోదు



సాక్షి, హైదరాబాద్: వానాకాలం పంటల సాగును ఈ సారి పెద్ద ఎత్తున చేపడుతున్నారు. గత ఏడాది ఇదే సమయంతో పోలిస్తే ఇప్పుడు అధికంగా పంటలు వేస్తున్నారు. గత సంవత్సరం వానాకాలంలో ఇదే సమయానికి 25.79 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, ఈ సీజన్‌లో బుధవారం నాటికి 46.85 లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ ఏడాది వానాకాలం అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 35.76 శాతం విస్తీర్ణంలో పంటలు వేశారు. ఇప్పటివరకు వేసిన పంటల్లో అత్యధికంగా పత్తి ఏకంగా 33.81 లక్షల ఎకరాల్లో సాగైంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.48 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 66.97 శాతం వేశారు. ఈ ఏడాది పత్తిని 60 లక్షల ఎకరాల్లో పండించాలని చేయాలని ప్రభుత్వం రైతులకు పిలుపునిచ్చింది. కాగా, వరి సాధారణ సాగు విస్తీర్ణం 57.18 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.71 లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. అంటే మూడు శాతానికే పరిమితమైంది. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం 8.52 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.81 లక్షల ఎకరాల్లో వేశారు. అందులో ఒక్క కంది పంటనే 2.37 లక్షల ఎకరాలు కావడం గమనార్హం. మొక్కజొన్న సాధారణ సాగు విస్తీర్ణం 6.09 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 1.92 లక్షల ఎకరాలు సాగైంది. సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.29 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 2.55 లక్షల ఎకరాల్లో పంట వేశారు.

ఆదిలాబాద్ జిల్లాలో 99.96 శాతం..

ఆదిలాబాద్ జిల్లాలో రికార్డు స్థాయిలో పంటల సాగు నమోదైంది. ఇప్పటివరకు సాగైన జిల్లాల్లో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలోనే నమోదు కావడం విశేషం. ఈ జిల్లా సాధారణ పంటల సాగు విస్తీర్ణం 5,62,594 ఎకరాలు కాగా, 5,62,386 ఎకరాల్లో సాగైంది. అంటే 99.96 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ఇంత తక్కువ కాలంలో ఇంత సాగు కావడం విశేషం. అత్యంత తక్కువగా వనపర్తి జిల్లాలో కేవలం 8.16 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో ఆయా ప్రాంతాలను బట్టి సాధారణం, అధికం, అత్యధిక వర్షపాతం నమోదైందని వ్యవసాయశాఖ తెలిపింది. 17 జిల్లాల్లో అధికం నుంచి అత్యధిక వర్షపాతం నమోదైందని పేర్కొంది. నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నల్లగొండ జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఇక హైదరాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, వరంగల్, మహబూబాబాద్, జనగాం, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఏ జిల్లాలోనూ లోటు వర్షపాతం నమోదు కాలేదని వ్యవసాయ శాఖ తెలిపింది.

చనిపోయిన తర్వాత వస్తారా?

- బాధిత రైతు భూమిని పరిశీలించేందుకు వచ్చిన తహసీల్దార్ అడ్డగింత
- సకాలంలో స్పందిస్తే ప్రాణాలు దక్కేవని ఆగ్రహం
- న్యాయం చేయాలంటూ తహసీల్దార్ కాళ్లపై పడి వేడుకోలు


తహసీల్దార్ రమేశ్ కారును అడ్డుకుంటున్న ప్రభాకర్ కుటుంబసభ్యులు

చింతకాని: ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ భూసమస్యతో ఆత్మహత్య చేసుకోగా.. ఆయన వ్యవసాయ భూమిని పరిశీలించేందుకు బుధవారం తహసీల్దార్ రమేశ్ గ్రామానికి వచ్చారు. దీంతో ప్రభాకర్ కుటుంబసభ్యులు ఆయనను అడ్డుకున్నారు. భూసమస్యపై ఫిర్యాదు అందగానే అధికారులు స్పందిస్తే తన కుమారుడు ఆత్మహత్య చేసుకునేవాడు కాదని ఆయన తండ్రి బోజెడ్ల పెద్దవీరభద్రయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడు హడావుడి చేయడం వల్ల ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. గత వేసవిలో సుమారు రూ.8 లక్షలు వెచ్చించి తమ భూమిలోకి మొరం మట్టి తోలించగా, చెరువు శిఖాన్ని ఆక్రమించారంటూ మత్స్యశాఖ సొసైటీ మూడు ఎకరాల్లో మట్టి తొలగించిందని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్, ఎస్సై, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని వాపోయాడు. ఈ నేపథ్యంలో తహసీల్దార్‌ను పొలంలోకి రాకుండా అడ్డుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆయన కాళ్లపై పడి వేడుకున్నారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వాలని పట్టుబట్టడంతో ఎస్సై నాగుల్‌మీరా వారికి సర్దిచెప్పి తహసీల్దార్‌ను కారు ఎక్కించారు. అయినప్పటికీ వారు కారుకు అడ్డుగా కూర్చోవడంతో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పగా వారు శాంతించారు.

విచారణలో వేగం

రైతు ప్రభాకర్ ఆత్మహత్యను సీరియస్‌గా పరిగణించిన సీఎం రేవంత్‌రెడ్డి, పూర్తిస్థాయిలో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. దీంతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. రైతు ఆత్మహత్య చేసుకునే ముందు ఎవరెవరితో మాట్లాడాడో తెలుసుకునేందుకు సెల్‌ఫోన్ కాల్‌డేటాను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. అంతేకాక పోలీసులు తమకు లభించిన వీడియోలను సైతం పరిశీలిస్తున్నారు.

ముగిసిన యాసంగి ధాన్యం కొనుగోళ్లు

- 7,178 కొనుగోలు కేంద్రాల ద్వారా 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
- 9 లక్షల మంది రైతులకు రూ.10,547 కోట్ల చెల్లింపులు

సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం కొనుగోళ్లు ముగిశాయని, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 25 నుంచి జూన్ నెలాఖరు వరకు కొనుగోళ్లలో భాగంగా ప్రభుత్వం రైతుల నుంచి 48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించింది. ధాన్యం విక్రయించిన 8,99,546 మంది రైతులకు రూ.10,547 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 75.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశముందని పౌరసరఫరాలశాఖ అంచనా వేసింది. అయితే ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులు, మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయడంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తక్కువగా వచ్చింది.

సీఎంఆర్ బకాయిపడిన మిల్లర్లపై సీరియస్

రైతుల నుంచి కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేసి కస్టమ్‌మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కోసం ప్రభుత్వం మిల్లర్లకు అప్పగిస్తుండగా, వేలాదిమంది మిల్లర్లు సర్కారుకు టోకరా ఇస్తున్నారు. నిర్దేశిత సమయంలో సీఎంఆర్ పెట్టకుండా ధాన్యాన్ని సొంతానికి వాడుకున్నారనే అపవాదు ఉంది. 2021 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలోని సగంమంది మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా ప్రభుత్వాన్ని మోసం చేశారనే ఫిర్యాదులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిల్లర్ల ఆగడాలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా 1,532 మంది మిల్లర్లను సీఎంఆర్ ఎగవేసిన డిఫాల్టర్లుగా తేల్చింది. వీరిలో 116 మందిపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద పౌరసరఫరాల శాఖ కేసులు నమోదు చేసింది. 28వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

పెన్ను తొలగించినా దక్కని ప్రాణం

- చిన్నారి రియాన్షిక మృతి



భద్రాచలం అర్బన్: తలలో పెన్ను గుచ్చుకుని తీవ్రంగా గాయపడిన బాలికకు శస్త్రచికిత్స చేసినా ప్రాణాలు దక్కలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీకి చెందిన నాలుగేళ్ల చిన్నారి రియాన్షిక తలలో పెన్ను గుచ్చుకోగా.. శస్త్రచికిత్స చేయడం తెలిసిందే. ఈనెల 1వ తేదీన ఆమె ఆడుకుంటూ కింద పడిపోవడంతో.. చేతిలో ఉన్న పెన్ను ఆమె ఎడమవైపు చెవి దగ్గర తలలోపలికి చొచ్చుకెళ్లింది. దీంతో రియాన్షికను కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు 2వ తేదీ తెల్లవారుజామున రెండు గంటల పాటు శస్త్రచికిత్స చేసి తలలో గుచ్చుకున్న పెన్నును తొలగించారు. అనంతరం రియాన్షికను ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తుండగా అంతా బాగానే ఉందని భావించారు. కాగా, బుధవారం తెల్లవారుజామున ఆమె మెదడు పనిచేయడం లేదని ప్రకటించిన వైద్యులు.. ఇంజక్షన్ చేసిన కాసేపటికి మృతి చెందిందని చెప్పడంతో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తారని.. ఆపై ఇంటికి తీసుకెళ్లొచ్చని భావిస్తున్న తరుణంలో.. కన్నీరు మున్నీరవుతూ చిన్నారి మృతదేహాన్ని భద్రాచలం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కాగా, రేగా మణికంఠ – స్వరూప దంపతులకు 2020లో రియాన్షిక జన్మించింది. భార్యాభర్తలు వేరుగా ఉండడంతో బాలిక తల్లి వద్ద ఉంటోంది. స్వరూప చెల్లి సంధ్య – రాజు దంపతులకు కూడా పది రోజుల క్రితం జన్మించిన ఆడశిశువు రోజుల వ్యవధిలోనే చనిపోవడం.. ఇప్పుడు స్వరూప కుమార్తె రియాన్షిక సైతం కన్నుమూయడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది.

పాముకాటుతో హాస్టల్ విద్యార్థి మృతి!


శ్యామ్‌కుమార్

ఆత్మకూర్.ఎస్(సూర్యాపేట): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్సీ హాస్టల్‌లో ఓ విద్యార్థి బుధవారం అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పాముకాటుకు గురైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. శ్యామ్ కుమార్ (11) తల్లిదండ్రులు చనిపోవడంతో సూర్యాపేటలోని తన పెద్దమ్మ చల్లపు సైదమ్మ వద్ద ఉంటున్నాడు. ఆమె శ్యామ్‌ను గతేడాది ఆత్మకూర్ (ఎస్)లోని మోడల్ స్కూల్‌లో చేర్పించింది. అక్కడి ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ శ్యామ్ ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్నాడు.

మూత్రవిసర్జనకు వెళ్లగా..

మంగళవారం అర్ధరాత్రి దాటాక శ్యామ్‌కుమార్ మూత్ర విసర్జనకు హాస్టల్ ఆవరణలోకి వెళ్లాడు. చీకట్లో ఏదో కరిచినట్లు అనిపించడంతో లోపలికి వచ్చి తోటి విద్యార్థులకు, వంటపనిచేసే యాదగిరికి తెలిపాడు. ఆపై కొద్దిసేపటికే వాంతులు చేసుకున్నాడు. కడుపులో నొప్పిగా ఉందని చెప్పినా.. ఏమీ కాదు, పడుకో అని తోటివారు చెప్పడంతో అదే బాధతో పడుకున్నాడు. తెల్లవారుజామున స్టడీ అవర్ కోసం విద్యార్థులంతా లేచినా శ్యామ్ లేవలేదు. తోటి విద్యార్థులు లేపడానికి ప్రయత్నించగా అపస్మారకస్థితిలో ఉన్నాడు. వెంటనే యాదగిరి హాస్టల్ వార్డెన్‌కు ఫోన్‌లో చెప్పాడు. ఆయన సూచనతో హాస్టల్ వర్కర్లు శ్యామ్‌ను బైక్‌పై సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి బుధవారం ఉదయం 6 గంటల సమయంలో తరలించారు. అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. బాలుడి పెద్దమ్మ ఫిర్యాదు మేరకు అనుమానాస్పదమృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులుగౌడ్ తెలిపారు. కాగా, శ్యామ్ విషయంలో సరిగా స్పందించని కారణంగా వార్డెన్ రవికుమార్‌ను సస్పెండ్ చేసినట్లు సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు తెలిపారు. అతడిని సర్వీస్ నుంచి తొలగించేందుకు నివేదిక పంపిస్తున్నట్లు చెప్పారు.

రేపట్నుంచి ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

జాబితా కూడా ప్రచురించాలి.
- తప్పనిసరి బదిలీ కేటగిరీలో ఉన్న ఉద్యోగుల వివరాలు కూడా ప్రత్యేకంగా ప్రకటించాలి.
- బదిలీలకు సంబంధించి 5 ఐచ్ఛికాలను ఉద్యోగుల నుంచి తీసుకోవాలి.
- ప్రభుత్వం ఆప్షన్ పత్రాన్ని ప్రకటించింది. అయితే శాఖాపరంగా ఈ ఆప్షన్ పత్రాన్ని మార్పు చేసుకునే వెసులుబాటు కల్పించింది.
- బదిలీల ప్రక్రియతో ప్రతి కార్యాలయంలో కనీస సిబ్బంది ఉండేలా చూడాలి.
- అవకాశం ఉన్నచోట ఆన్‌లైన్, వెబ్ కౌన్సెలింగ్ పద్ధతిలో బదిలీలు చేపట్టాలి.
- ప్రభుత్వం జారీ చేసిన బదిలీల విధానానికి అనుగుణంగా విద్య, రెవెన్యూ, వైద్య,ఆరోగ్య తదతర శాఖలు కూడా ఉద్యోగులబదిలీలకు పూర్తిస్థాయి మార్గదర్శకాలు జారీ చేస్తాయి. అయితే ప్రభుత్వ అనుమతితో మార్గదర్శకాల్లో సవరణలు కూడా చేసుకోవచ్చు. కాగా, బదిలీల ప్రక్రియలో ఎలాంటి గందరగోళం జరగకుండా ఉండేలా కేడర్ వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కేడర్	కమిటీ
రాష్ట్ర స్థాయి	శాఖకు సంబంధించిన ప్రత్యేక ప్రధానకార్యదర్శి/ ముఖ్య కార్యదర్శి/ కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. హెచ్‌ఓడీ కన్వీనర్‌గా, అదనపు/సంయుక్త/ఉపకార్యదర్శులు సభ్యులుగా ఉంటారు
మల్టీజోనల్/జోనల్	హెచ్‌ఓడీ చైర్మన్‌గా ఉంటారు. కార్యదర్శి సూచించిన అదనపు/ సంయుక్త/ఉప కార్యదర్శులు సభ్యులుగా, ప్రాంతీయ అధికారులు లేదా అదనపు/సంయుక్త సంచాలకులు లేదా హెచ్‌ఓడీ సూచించిన వారు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.
జిల్లా కేడర్	జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, అదనపు కలెక్టర్/డీఆర్‌ఓ సభ్యులుగా శాఖకు సంబంధించిన జిల్లా అధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.
	(నిర్దేశించిన ఆదేశాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలి. బదిలీ ఉత్తర్వు ఇచ్చిన మూడో రోజు ఉద్యోగి పాత స్థానం నుంచి రిలీవ్ అయ్యి కొత్త స్థానంలో చేరాలి. రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడి బదిలీల ప్రక్రియ చేపట్టాలి.)

బదిలీల షెడ్యూల్ ఇలా...

డే 1 టు 4 (5 నుంచి 8 వరకు)	బదిలీ ఉత్తర్వులపై ఉద్యోగులు/ఉద్యోగ సంఘాల నేతలతో సంప్రదింపులు. ఉద్యోగుల సీనియారిటీ జాబితా, ఖాళీల ప్రదర్శన, తప్పనిసరి బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితా
డే 5 టు 8 (9 నుంచి 12 వరకు)	ఉద్యోగుల ఐచ్ఛికాలతో కూడిన దరఖాస్తుల సమర్పణ
డే 9 టు 14 (13 నుంచి 18 వరకు)	బదిలీ ఉత్తర్వులకు అనుగుణంగా వచ్చిన దరఖాస్తుల పరిశీలన, మాస్టర్ లిస్ట్ తయారీ
డే 15 టు 16 (19 నుంచి 20 వరకు)	బదిలీ ఉత్తర్వుల జారీ, మూడో రోజు ఉద్యోగుల రిలీవింగ్, కొత్త చోట చేరికలు

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎవరు?

- వీసీఎండీ ఉద్యోగ విరమణ
- భర్తీ చేయని ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ షెడ్యూల్ట్ క్యాస్ట్స్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్సీ కార్పొరేషన్) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (వీసీఎండీ) ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. జూన్ 30 వరకు వీసీఎండీగా పని చేసిన పి.కరుణాకర్ ఉద్యోగ విరమణ చేశారు. సాధారణంగా ఒక అధికారి ఉద్యోగ విరమణ పొందితే.. ఆ స్థానంలో కొత్త అధికారిని నియమించడమో.. లేక మరో అధికారికి బాధ్యత అప్పగించడమో చేస్తారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంటుంది. ఇప్పటివరకు కేడర్ అధికారులతో భర్తీ అయిన వీసీఎండీ పోస్టులను.. ఇటీవల అదేశాఖకు చెందిన అదనపు సంచాలకులతో భర్తీ చేశారు. ఇప్పుడు గత నెలలో వీసీఎండీ ఉద్యోగ విరమణ చేసినా.. ఆ స్థానాన్ని ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో ఖాళీగా ఉంది. ఆ స్థానంలో కనీసం తదుపరి కేడర్ అధికారికి సైతం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించలేదు. దీంతో తెలంగాణ షెడ్యూల్ట్ క్యాస్ట్స్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ కార్యాలయంలో గందరగోళం నెలకొంది.

పొంగులేటి పొలం బాట..


పొలాలను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

కల్లూరు రూరల్: రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలోని తమ పొలాల్లో వరి నారును పరిశీలించారు. స్వతహాగా రైతు అయిన పొంగులేటి.. ఏ కాస్త సమయం చిక్కినా నారాయణపురం వస్తారు. గ్రామంలోని తమ వ్యవసాయ క్షేత్రాల్లో కలియ తిరుగుతారు. పొలాలను సందర్శిస్తే ఆహ్లాదంగా ఉంటుందని, ఒత్తిడి తగ్గి మనసుకు ప్రశాంతత చేకూరుతుందని మంత్రి వ్యాఖ్యానించారు.

అమ్మను బాగా చూసుకుంటాం..!

- పోషణ బాధ్యతలకు అంగీకారం
- రాసిచ్చిన కొడుకులు.. పోలీసుల కౌన్సెలింగ్‌తో నిర్ణయం


కొడుకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న నెన్నెల ఎస్సై ప్రసాద్

సాక్షి ఎఫెక్ట్

నెన్నెల (మంచిర్యాల): కన్నతల్లి పోషణ బాధ్యతలు తీసుకోవడానికి కొడుకులు ముందుకొచ్చారు. ఎనభైఏళ్ల వయస్సున్న తల్లికి అండగా ఉండాల్సిన కుమారులు ఆస్తులు అనుభవిస్తూ ఆమె బాగోగులు పట్టించుకోకపోవడంపై మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన రాంటెంకి చిన్నక్క మంగళవారం పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. వృద్ధురాలి దీనగాథపై 'కొడుకులు బువ్వ పెట్టలేరు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. నెన్నెల ఎస్సై ప్రసాద్ బుధవారం ఆమె ముగ్గురు కుమారులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇక మీదట పోషణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. మరోసారి ఫిర్యాదు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో చిన్నక్కను పెద్ద కుమారుడు శంకర్ వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ఏ లోటు రాకుండా చూసుకుంటామని ముగ్గురు కుమారులు ఒప్పంద పత్రంపై రాసిచ్చారు. సమస్యకు పరిష్కారం చూపి న్యాయం చేసిన పోలీసులు, ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లేలా తన గోడును ప్రచురించిన 'సాక్షి'కి వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపింది.

నిలకడగా సిద్ధేశ్వరానంద భారతి ఆరోగ్యం



సాక్షి, హైదరాబాద్: సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి (88) ఆరోగ్యం స్థిరంగా ఉందని శ్రీసిద్ధేశ్వరి పీఠం సెక్రటరీ బి.రఘుకిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నట్లు వెల్లడించారు. ఈనేపథ్యంలో భక్తులెవరూ ఆయన గురించి వ్యక్తిగతంగా లేదా ఫోన్‌కాల్స్ ద్వారా పీఠమును, పీఠ సిబ్బందిని ఇబ్బంది పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. ఈనెల 2న చెన్నైలోని కావేరీ వైద్య సంస్థలో ఆయనకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అందులో భాగంగా కరోనరీ ఆంజియోగ్రఫీ నిర్వహించిన వైద్యులు స్వామికి ఎలక్టివ్ ఆంజియోప్లాస్టీ చికిత్సను అందించారు.

ముందస్తు ఓటమే?!

సునాక్ పార్టీ ఎదురీత • బ్రిటన్‌లో నేడే ఎన్నికలు

650 స్థానాలకు పోలింగ్	రేపటికల్లా ఫలితాల వెల్లడి	లేబర్ పార్టీదే గెలుపు: సర్వేలు	బరిలో 107 మంది బ్రిటిష్ ఇండియన్లు

సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలకు వేళైంది. హోరాహోరీ ప్రచారానికి బుధవారం సాయంత్రంతో తెర పడింది. పార్లమెంటు దిగువ సభ అయిన హౌజ్ ఆఫ్ కామన్స్‌లోని 650 స్థానాలకు గురువారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. సాయంత్రం నుంచే ఫలితాల వెల్లడి మొదలవుతుంది. శుక్రవారం ఉదయానికల్లా పూర్తి ఫలితాలు వెలువడతాయి. కొత్త సభ జూలై 9న కొలువుదీరుతుంది. స్పీకర్ ఎన్నిక, సభ్యుల ప్రమాణ స్వీకారాల తర్వాత నూతన ప్రభుత్వం బాధ్యతలు స్వీకరిస్తుంది. విపక్ష నేత స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ భారీ మెజారిటీతో 14 ఏళ్ల అనంతరం గద్దెనెక్కడం ఖాయమని ఒపీనియన్ పోల్స్ చెబుతున్నాయి. భారత మూలాలున్న ప్రధాని రిషి సునాక్ సారథ్యంలోని అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎదురీదుతోందని అప్పటికే స్పష్టం చేశాయి. సునాక్ కూడా బుధవారం ప్రచారాన్ని ముగిస్తూ, 'లేబర్ పార్టీకి ఘనవిజయం దక్కకుండా అడ్డుకుందాం' అని ప్రజలతో పాటు సొంత పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఎన్నికలు డిసెంబర్‌లో జరగాల్సి ఉన్నా ప్రజల్లో తీవ్రంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ముందే పసిగట్టి సునాక్ ముందస్తుకు వెళ్లారు. కానీ అది కూడా కలిసొచ్చేలా కన్పించడం లేదు...

- సాక్షి, నేషనల్ డెస్క్



బరిలో భారతీయం

బ్రిటన్ ఎన్నికల బరిలో భారతీయుల జోరు పెరుగుతోంది. 2019లో 63 మంది బ్రిటిష్‌ఇండియన్లు పోటీ చేయగా 15 మంది విజయం సాధించారు. ఈసారి ఏకంగా 107 మంది బరిలో దిగుతుండటం విశేషం. ప్రధాన పార్టీలైన కన్జర్వేటివ్, లేబర్‌తో పాటు రిఫామ్ యూకే వంటి కొత్త పార్టీల నుంచి కూడా ఇండియన్లు పోటీలో ఉన్నారు. పలు స్థానాల్లో బ్రిటిష్ ఇండియన్లే ప్రత్యర్థులుగా తలపడుతుండటం మరో విశేషం. హారో ఈస్ట్ స్థానం నుంచి ప్రిమేశ్ పటేల్ (లేబర్), రీతేంద్రనాథ్ బెనర్జీ (లిబరల్ డెమొక్రాట్స్), సారాజుల్హగ్ పర్వానీ (వర్కర్స్ పార్టీ ఆఫ్ బ్రిటన్) బరిలో ఉన్నారు. లీసెస్టర్ ఈస్ట్‌లో లండన్ మాజీ డిప్యూటీ మేయర్ రాజేశ్ అగర్వాల్ (లేబర్), శివానీ రాజా (కన్జర్వేటివ్) పోటీ చేస్తున్నారు.

37.3 లక్షల బ్రిటిష్ ఇండియన్లు

బ్రిటన్‌లో భారత మూలాలున్న వారి సంఖ్య ఏకంగా 37.3 లక్షలు దాటేసింది! ఓటర్లలోనూ వారు 10 లక్షల మందికి పైగా ఉన్నట్టు సమాచారం. పాకిస్తాన్, బంగ్లాదేశ్ మూలాలున్న వారు కూడా భారీగానే ఉన్నారు. దాంతో వారిని ఆకట్టుకోవడానికి పార్టీలన్నీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. లేబర్ పార్టీ నేత స్టార్మర్ ఇటీవల బ్రిటిష్ బంగ్లాదేశీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, గాజా దుస్థితిపై ఆ పార్టీ వైఖరి కారణంగా ముస్లిం ఓటర్లు గుర్రుగా ఉన్నారు. దీన్ని వీలైనంతగా సొమ్ము చేసుకునేందుకు కన్జర్వేటివ్ నేతలు ప్రయత్నిస్తున్నారు.

కన్జర్వేటివ్: ఏడుగురు సిట్టింగ్ ఎంపీలతో పాటు 23 మంది బ్రిటిష్ ఇండియన్లకు కొత్తగా టికెట్లిచ్చింది. వీరిలో ప్రధాని రిషి సునాక్, మాజీ మంత్రులు ప్రీతీ పటేల్, సుయెల్లా బ్రేవర్మన్‌తో పాటు చంద్ర కన్నెగంటి, నీల్ శాస్త్రి హర్స్‌ట్, నీల్ మహాపాత్ర, రేవ గుడి, నుపుర్ మజుందార్, ఎరిక్ సుకుమారన్ తదితరులున్నారు.

లేబర్: ఏడుగురు సిట్టింగ్ ఎంపీలు కాగా 26 మంది కొత్తవారు. వీరిలో ఉదయ్ నాగరాజు, హజీరా ఫరానీ, రాజేశ్ అగర్వాల్, జీవన్ సంధెర్ తదితరులున్నారు.

పార్టీ	బ్రిటిష్ ఇండియన్ల అభ్యర్థులు
కన్జర్వేటివ్	30
లేబర్	33
గ్రీన్ పార్టీ	13
రిఫామ్ యూకే	13
లిబరల్ డెమొక్రాట్స్	11



44 ఏళ్ల రిషి 2022 అక్టోబర్ 25న బ్రిటన్ ప్రధాని అయ్యారు. ఆ పదవి చేపట్టిన తొలి భారత మూలాలున్న వ్యక్తిగానే గాక తొలి హిందువుగా కూడా రికార్డు సృష్టించారు. కానీ వాగ్దానాలను నిలుపుకోవడంలో ఆయన విఫలమయ్యారన్న అసంతృప్తి ప్రజల్లో తీవ్రంగా ఉంది. ఆర్థిక సంక్షోభం కొన్నేళ్లుగా బ్రిటన్‌కు చుక్కలు చూపుతోంది. ముఖ్యంగా నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. ఆర్థిక నిపుణుడై ఉండి కూడా పరిస్థితిని రిషి చక్కదిద్దలేదన్నది బ్రిటన్‌వాసుల ఫిర్యాదు. ప్రధానమైన హౌజింగ్ సంక్షోభాన్ని చక్కదిద్దడంలోనూ ఆయన విఫలమయ్యారని వారు భావిస్తున్నారు. దాంతో ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తామన్న తాజా హామీలను ఎవరూ నమ్మడం లేదు. యూగవ్ తాజా సర్వేలో 52 శాతం మంది ఆర్థిక సమస్యలనే ప్రముఖంగా ప్రస్తావించారు. ఆరోగ్య సమస్యలు తమను బాగా కుంగదీస్తున్నట్టు 50 శాతం చెప్పారు. కీలకమైన వలసదారులు, వారికి ఆశ్రయం విషయంలో కన్జర్వేటివ్ పార్టీ వైఖరిని 40 శాతం మంది తప్పుబడుతున్నారు. ఎలా చూసినా సునాక్ పాలనకు 20 నెలలకే తెర పడటం ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా విన్పిస్తోంది.

సునాక్ ఎదురీత వెనక...

స్టార్మర్‌కు కలిసొచ్చిన అంశాలు...



ప్రధానంగా 14 ఏళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతే విపక్ష లేబర్ పార్టీకి ఈసారి అతి పెద్ద సానుకూలాంశంగా మారింది. ఆ పార్టీ నాయకుడు స్టార్మర్ (61) 'పార్టీ కంటే దేశం ముందు' నినాదంతో దూసుకెళ్లారు. ఆ నినాదం బ్రిటన్‌వాసులను విపరీతంగా ఆకట్టుకుంది. లేబర్ పార్టీకి ఓటేస్తే ఆర్థిక స్థిరత్వానికి వేసిన ట్టేనన్న ఆయన ప్రచారానికి విశేష స్పందన లభించింది. నిరుపేద కార్మిక కుటుంబం నుంచి వచ్చిన తనకు సామాన్యుల కష్టనష్టాలు బాగా తెలుసునని, ధరాభారాన్ని తగ్గించి తీరతానని, సుపరిపాలన అంటే ఎలా ఉంటుందో చూపిస్తానని హామీలిచ్చిన స్టార్మర్ వైపు ప్రజలు స్పష్టమైన మొగ్గు చూపుతున్నారు.


ఒపీనియన్ పోల్స్ ఏం చెబుతున్నాయ్..

లేబర్ పార్టీకి కనీసం 41 శాతం ఓట్లు ఖాయమని అత్యధిక ఒపీనియన్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. అధికార కన్జర్వేటివ్ పార్టీకి 21 శాతానికి మించబోవని అవి జోస్యం చెప్పాయి. రిఫామ్ పార్టీకి 16 శాతం, లిబరల్ డెమొక్రాట్లకు 12 శాతం రావచ్చని పేర్కొన్నాయి. అవే నిజమైతే లేబర్ పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమే.

ప్రస్తుత బలాబలాలు

బ్రిటన్ ఓటర్లు దాదాపు	5 కోట్లు
హౌస్ ఆఫ్ కామన్స్‌లో స్థానాలు	650
మెజారిటీకి కావాల్సింది	326

పార్టీ	స్థానాలు
కన్జర్వేటివ్	344
లేబర్	205
ఎస్ఎన్‌పీ	43
లిబరల్ డెమొక్రాట్స్	15
ఇతరులు	43



రాజ్యసభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



వాకౌట్ చేశాక మాట్లాడుతున్న సోనియా, ఖర్గే

ప్రశాంతంగా మణిపూర్

రాజ్యసభలో ప్రధాని వ్యాఖ్యలు • విపక్షాల మండిపాటు, వాకౌట్

న్యూఢిల్లీ: విపక్షాల విమర్శల నేపథ్యంలో మణిపూర్ హింసాకాండపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు బుధవారం ప్రధాని బదులిచ్చారు. రెండు గంటలపాటు సాగిన ప్రసంగంలో మణిపూర్ అంశంపై వివరంగా మాట్లాడారు. అక్కడ హింస క్రమంగా తగ్గుముఖం పడుతోందన్నారు. ''మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యా సంస్థలతో పాటు వ్యాపార సంస్థలు కూడా దాదాపుగా తెరుచుకుంటున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలను సంపూర్ణంగా పునరుద్ధరించేందుకు కేంద్రం అన్ని చర్యలూ చేపడుతోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో అన్నివిధాలా కలిసి పని చేస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పలు రోజుల పాటు ఉండి మరీ పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేశారు. హింసాకాండకు సంబంధించి ఇప్పటిదాకా 500 మందికి పైగా అరెస్టయ్యారు. 11 వేల పై చిలుకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి'' అని వివరించారు. మణిపూర్ హింసపై గత సమావేశాల సందర్భంగా రాజ్యసభలో తాను సుదీర్ఘంగా మాట్లాడానని ప్రధాని గుర్తు చేశారు. ''మణిపూర్ ఇప్పుడు వరదలతో సతమతమవుతోంది. కనుక ఈ అంశంపై విపక్షాలు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. పరిస్థితిని చక్కదిద్దేందుకు మాతో కలిసి రావాలి'' అని కోరారు. కానీ మోదీ వ్యాఖ్యలతో విపక్షాలు సంతృప్తి చెందలేదు. మణిపూర్లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉందన్నాయి. అక్కడ గత మేలో హింస చెలరేగితే ఏడాదైనా ఆ రాష్ట్రాన్ని సందర్శించేందుకు మోదీకి తీరిక చిక్కలేదా అంటూ మండిపడ్డాయి. ఈ అంశంపై మాట్లాడేందుకు విపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశాయి. అందుకు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ నిరాకరించడంతో తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ప్రధాని మాట్లాడుతుండగానే సభ నుంచి వాకౌట్ చేశాయి. దీనిపై చైర్మన్ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. విపక్షాలు సభనే గాక రాజ్యాంగాన్ని కూడా అవమానించాయంటూ ఆగ్రహించారు. ''మీరు వీడింది సభను కాదు, మర్యాదను'' అంటూ దుయ్యబట్టారు. అనంతరం మోదీ మాట్లాడుతూ మణిపూర్ జాతుల సంఘర్షణలకు మూలం దాని చరిత్రలోనే ఉందన్నారు. స్వాతంత్ర్యానంతరం అక్కడ 10 సార్లు రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చిందని గుర్తు చేశారు. 1993 నుంచి ఐదేళ్ల పాటు రాష్ట్రంలో భారీ స్థాయిలో సామాజిక సంఘర్షణ చోటుచేసుకుందన్నారు. ''కనుక మణిపూర్ సమస్యను పరిష్కరించే క్రమంలో ఓపికగా, ఆచితూచి వ్యవహరించాలి'' అన్నారు. నీట్ లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.

రాజ్యాంగాన్ని కాలరాసిందే కాంగ్రెస్!

అంతకు ముందు సభలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను మరోసారి తూర్పారబట్టారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడామన్న కాంగ్రెస్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ''ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్నే అపహాస్యం చేసిన వారినుంచి ఇలాంటి మాటలు విడ్డూరం! ఎమర్జెన్సీ అనంతరం జరిగిన 1977 ఎన్నికల సందర్భంగా ఇందిరాగాంధీ ప్రభుత్వం మీడియాపై ఉక్కుపాదం మోపింది. ఆ ఎన్నికల్లో మాత్రమే ప్రజలు రాజ్యాంగ పరిరక్షణ కోసం ఓటేశారు. కాంగ్రెస్ సర్కారును సాగనంపారు'' అంటూ దుయ్యబట్టారు. దాంతో మోదీ అబద్ధాలకోరంటూ విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. దీనిపై ఖర్గేకు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని పట్టుబట్టారు. వారి నినాదాల మధ్యే మోదీ ప్రసంగం కొనసాగించారు.

దర్యాప్తు సంస్థలకు మరింత స్వేచ్ఛ

అవినీతి, నల్లధనంపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపుతామని మోదీ స్పష్టం చేశారు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు చెప్పారు. ''అవినీతిపరులెవరినీ వదలబోం. ఇది మోదీ గ్యారంటీ'' అన్నారు.

రాజ్యసభ నిరవధిక వాయిదా

రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడింది. బుధవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని సభ ఆమోదించగానే చైర్మన్ ఈ మేరకు ప్రకటించారు. లోక్‌సభ మంగళవారమే నిరవధికంగా వాయిదా పడటం తెలిసిందే. దీంతో పార్లమెంటు సమావేశాలకు తెర పడింది.

రాహుల్ ఇంటి వద్ద భద్రత పెంపు

న్యూఢిల్లీ: అతివాద సంస్థల సభ్యులు రాహుల్‌గాంధీ ఇంటి వద్ద తరచూ నిరసనలకు దిగొచ్చనే నిఘా వర్గాల సమాచారంలో ఢిల్లీ పోలీసులు ఆయన ఇంటి వద్ద భద్రతను పెంచారు. రాహుల్ ఇంటి చుట్టూ ఒక ప్లాటూన్ పారామిలటరీ సిబ్బందితోపాటు ఢిల్లీ పోలీసు బలగాలు మోహరించారు. ఆయనకిప్పటికే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నారు.

రేపు ప్రమాణం చేయనున్న అమృత్‌పాల్

చండీగఢ్/అమృత్‌సర్: విచారణ ఖైదీగా అస్సాం జైలులో గడుపుతున్న ఖలిస్తానీ ప్రచారకుడు, సిక్కు వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ జూలై ఐదో తేదీన పార్లమెంట్ సభ్యునిగా ప్రమాణంచేయనున్నారు. 'వారిస్ పంజాబ్ దే' అధినేత అయిన అమృత్‌పాల్ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పంజాబ్ నుంచి గెలిచారు. ఖదూర్ సాహిబ్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి దాదాపు 2లక్షల భారీ మెజారిటీతో గెల్చిన విషయం తెల్సిందే. జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయి అస్సాంలోని దిబ్రూగఢ్ జైలులో అమృత్‌పాల్ విచారణ ఖైదీగా ఉన్నారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలంతా ప్రమాణంచేసేనాటికి ఈయనకు పెరోల్ లభించలేదు. తాజాగా జూలై 5వ తేదీ నుంచి నాలుగురోజులపాటు పెరోల్ దొరికింది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రైవేట్ ఛాంబర్‌లో ఈయనతో ఎంపీగా ప్రమాణం చేయిస్తారని ఫరీద్‌కోట్ స్వతంత్ర ఎంపీ సరబ్‌జీత్ సింగ్ ఖల్సా బుధవారం వెల్లడించారు.

కూలడంలో.. వరస కట్టిన వంతెనలు

బిహార్‌లో ఒకేరోజు కూలిన మూడు వంతెనలు

సివాన్(బిహార్): బిహార్‌లో వంతెనలు పేకమేడల్లా కూలుతున్నాయి. సివాన్ జిల్లాలో 11 రోజుల క్రితం ఒక వంతెన కూలగా బుధవారం అదే జిల్లాలో మరో రెండు వంతెనలు కూలాయి. సరన్ జిల్లాలో ఇంకోటి కూలింది. బుధవారం ఘటనలు కలుపుకుని గత 15 రోజుల్లో ఇలా రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది వంతెనలు కుప్పకూలాయి. జిల్లాలోని దేవరియా బ్లాక్ పరిధిలో గండకీ నదిపై దాదాపు 42 సంవత్సరాల క్రితం నిర్మించిన ఒక చిన్నపాటి వంతెన బుధవారం ఉదయం ఐదుగంటలకు కూలింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం చోటుచేసుకోలేదు. '' వంతెనలో కొంత భాగమే కూలింది. గత కొద్దిరోజులుగా వంతెనకు మరమ్మత్తులు చేస్తున్నారు. కుప్పకూలడానికి కారణాలపై దర్యాప్తు మొదలుపెట్టాం'' అని డెప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ముకేశ్ చెప్పారు. గత కొద్దిరోజులుగా గండకీ నది వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తోందని, ప్రవాహం ధాటికి తట్టుకోలేక బ్రిడ్జి కూలిందని అక్కడి గ్రామస్తులు చెబుతున్నారు. సివాన్ జిల్లాలో తెఘ్రా బ్లాక్‌లోనూ మరో వంతెన కూలింది. ఇటీవల మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లోనూ వంతెనలు కూలాపోయాయి. భారీ వర్షాలు, నదీ ప్రవాహం పెరిగిన ఈ తరుణంలో వంతెనలు కూలుతుండటంతో వాటి నాణ్యతపై అనుమానాలు పెరిగాయి. దీంతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసి వంతెనల సామర్థ్యం, స్థితిగతులపై సమీక్ష నిర్వహించనున్నారు.

ఎన్నికల వ్యయంలో తేడాలున్నాయి

ఇంజనీర్ రషీద్‌కు ఈసీ నోటీసు

శ్రీనగర్: ఎన్నికల వ్యయ నివేదికలో చూపిన ఖర్చులో తేడాలున్నాయని బారాముల్లా ఎంపీగా ఎన్నికైన షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజనీర్ రషీద్)కు ఎన్నికల సంఘం మంగళవారం నోటీసులు జారీచేసింది. తీవ్రవాదులకు నిధులు అందజేశారనే అభియోగాలను ఎదుర్కొంటున్న ఇంజనీర్ రషీద్‌ను 2019లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. అప్పటి నుంచి తీహార్ జైలులో ఉన్న రషీద్ బారాముల్లా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కోర్టు రెండు గంటలు పెరోల్ ఇవ్వడంతో ఈనెల 5న ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రషీద్ తనకు రూ.2.10 లక్షలు ఖర్చయిందని ఎన్నికల రిజిస్టర్‌లో చూపారని, అయితే ఎన్నికల పరిశీలకులు నిర్వహించిన సమాంతర రిజిస్టర్‌లో ఖర్చును రూ.13.78 లక్షలుగా చూపారని ఈసీ తెలిపింది. ఈ వ్యత్యాసంపై రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. జిల్లా వ్యయ పర్యవేక్షక కమిటీ ముందు రషీద్ లేదా ఆయన ప్రతినిధి హాజరై వివరణ ఇవ్వాలని, ఈసీకి సకాలంలో ఎన్నికల వ్యయ నివేదికను సమర్పించాలని కోరింది.

అనుమతి 80 వేల మందికి..

వచ్చింది 2.5 లక్షలు

- సత్సంగ్ నిర్వహణలో బాబా అనుచరుల నిర్లక్ష్యం
- 121కి చేరిన మృతుల సంఖ్య
- పరారీలోనే భోలే బాబా

హత్రాస్/న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా ఫూల్‌రాయ్ గ్రామంలో తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య బుధవారం 121కి చేరుకుంది. సత్సంగ్ నిర్వాహకులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్‌తోపాటు ఇతరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. భోలే బాబా పేరును ఇంకా చేర్చలేదు. 80 వేల మందికే అనుమతి ఉంటే 2.5 లక్షల మంది వచ్చారని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు స్పష్టం చేశారు. సాక్ష్యాధారాలు దాచిపెట్టేందుకు నిర్వాహకులు ప్రయత్నించారని ఆరోపించారు. అనుమతి తీసుకొనే సమయంలో తమకు సరైన సమాచారం ఇవ్వలేదని చెప్పారు. తొక్కిసలాటలో పోలీసుల తప్పిదమేమీ లేదని స్పష్టం చేశారు. ఫూల్‌రాయ్‌లో తొక్కిసలాటకు కారణమైన బాబా నారాయణ్ హరి అలియాస్ సకర్ విశ్వ హరి భోలే బాబా ఇంకా పరారీలోనే ఉన్నారు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. 121 మంది మృతుల్లో 117 మందిని గుర్తించారు. గాయపడ్డ 28 మందికి చికిత్స కొనసాగుతోంది. సత్సంగ్ టెంట్ వద్ద గుట్టలుగా పేరుకుపోయిన చెప్పులు దుర్ఘటనకు మౌనసాక్షిగా నిలిచాయి.

బాబా అనుచరుల వల్లే తొక్కిసలాట!

తొక్కిసలాటపై హత్రాస్ సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్(ఎస్‌డీఎం) బుధవారం జిల్లా మేజిస్ట్రేట్‌కు ప్రాథమిక నివేదిక సమర్పించారు. సత్సంగ్ ముగిసిన తర్వాత తన వాహనం వద్దకు తిరిగి వెళ్తున్న భోలే బాబాను దగ్గరగా చూసేందుకు, చేత్తో తాకేందుకు భక్తులు ఆరాటపడ్డారని, వారిని బాబా అనుచరులు దూరంగా తోసివేయడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగిందని నివేదికలో వెల్లడించారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో నేలంతా బురదగా ఉండడంతో జనం జారిపడ్డారని, ఒకరిపై ఒకరు పడిపోయారని పేర్కొన్నారు. కింద చిక్కుకున్నవారు ఊపిరాడక మృతిచెందారని నివేదికలో ప్రస్తావించారు. సత్సంగ్‌కు 2 లక్షల మందికిపైగా జనం హాజరయ్యారని వివరించారు.

జ్యుడీషియల్ విచారణ: యోగి

తొక్కిసలాటపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. దుర్ఘటన వెనుక కుట్రకోణాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు. చికిత్స పొందుతున్న వారిని ఆయన బుధవారం పరామర్శించారు. ఘటనా స్థలాన్నీ పరిశీలించారు.



విద్రోహ శక్తులే కారణం — భోలే బాబా

లక్నో: సత్సంగ్ వేదిక నుంచి తాను వెళ్లిపోయిన చాలాసేపటికి తొక్కిసలాట జరిగిందంటూ భోలే బాబా బుధవారం ప్రకటన విడుదల చేశారు. తొక్కిసలాటకు సంఘ విద్రోహ శక్తులే కారణమని ఆరోపించారు. ఆ సమయంలో తానక్కడ లేనన్నారు. భక్తుల మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

బాబా మంచోడు: గ్రామస్తులు

భోలే బాబా మంచోడని యూపీలో కాస్‌గంజ్ జిల్లాలోని ఆయన స్వగ్రామం బహదూర్‌నగర్ వాసులు చెబుతున్నారు. బాబా తమను ఏనాడూ చందాలు గానీ, కానుకలు గానీ అడగలేదని గ్రామస్థులు చెప్పారు. బహదూర్‌నగర్ సమీపంలో భోలేబాబాకు ఒక ఆశ్రమం ఉంది. బాబా దంపతులకు సంతానం కలగలేదు. ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 16 ఏళ్ల క్రితం ఆ బాలిక చనిపోయింది. ఆమె ప్రాణాలతో లేచివస్తుందన్న నమ్మకంతో మృతదేహాన్ని రెండు రోజులపాటు తన ఇంట్లోనే ఉంచారు. పోలీసులు, అధికారులు జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు అంత్య క్రియలు నిర్వహించారు.

బైడెన్ కంటే హారిస్ మేలు

- సీఎన్ఎన్ తాజా పోల్ వెల్లడి
- తప్పుకోవాలంటూ బైడెన్‌పై ఒత్తిళ్లు
- మరోసారి తెరపైకి మిషెల్ పేరు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బరి నుంచి తప్పుకోవాలంటూ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు జో బైడెన్‌పై ఒత్తిళ్లు నానాటికీ పెరుగుతున్నాయి. గత వారం రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన బిగ్ డిబేట్‌లో 81 ఏళ్ల జో బైడెన్ ఆద్యంతం తడబడటం తెలిసిందే. దాంతో ఆయన ఆరోగ్యంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. బైడెన్ తప్పుకోవాలని డెమొక్రట్ పార్టీకి చెందిన చట్టసభ సభ్యుడు లాయిడ్ డాగెట్, జరెడ్ గోల్డెన్ తదితరులు తాజాగా డిమాండ్ చేశారు. మొండిగా కొనసాగితే ట్రంప్ చేతిలో ఆయనకు ఓటమి ఖాయమని సొంత పార్టీకే చెందిన చట్టసభ సభ్యురాలు గ్లూసెన్‌కాంప్ పెరెజ్ తదితరులు జోస్యం చెప్పడం విశేషం! డెమొక్రాట్లు అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ బరిలో దిగడమే మేలని పోల్ సర్వేలూ చెబుతున్నాయి. బైడెన్ కంటే ఆమెకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేల్చాయి. సీఎన్ఎన్ తాజా సర్వేలో బైడెన్ కంటే ట్రంప్ ఆరు పాయింట్ల ఆధిక్యంలో నిలిచారు. అయితే, ట్రంప్‌కు 47 శాతం ఓట్లు రాగా 59 ఏళ్ల కమలకు 45 శాతం మంది ఓటేయడం విశేషం! మహిళల్లో 50 శాతం కమలకు సానుకూలంగా ఉండగా ట్రంప్‌కు 44 శాతం ఓట్లే పడ్డాయి. డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలకు 43 శాతం ఓట్లొస్తే బైడెన్‌కు 34 శాతమే వచ్చాయి. ఆమె 2020 ఎన్నికల్లో కూడా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడి చివరి నిమిషంలో తప్పుకున్నారు. డెమొక్రాట్ల అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ పేరు కూడా గట్టిగా వినిపిస్తోంది. ఐపాసిస్ పోల్‌లో ట్రంప్‌పై 60 ఏళ్ల మిషెల్ స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించడం విశేషం. ఆమెకు 50 శాతం ఓట్లొస్తే ట్రంప్‌కు 39 శాతమే లభించాయి!

చర్చ మధ్యలో కునుకు తీశా: బైడెన్

డిబేట్‌లో ట్రంప్‌కు దీటుగా బదులివ్వలేకపోయానని బైడెన్ తాజాగా మరోసారి అంగీకరించారు. ''అందుకు క్షమాపణలు చెబుతున్నా. డిబేట్‌కు ముందు ఊపిరి సలపని విదేశీ టూర్లు చేయడంతో అలసిపోయా. ఒక దశలో వేదిక మీదే దాదాపుగా కునుకు తీశా కూడా'' అని చెప్పుకొచ్చారు! ఆగస్టు 19 నుంచి 22 దాకా షికాగోలో జరిగే డెమొక్రటిక్ ప్రతినిధుల భేటీలో బైడెన్ అభ్యర్థిత్వంపై కీలక నిర్ణయం తీసుకువచ్చని చెబుతున్నారు.

కేబినెట్ కమిటీలు

- నియామక కమిటీలో మోదీ, షా ఇద్దరే
- రాజకీయ వ్యవహారాల కమిటీలో కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: ముఖ్యమైన భద్రత, ఆర్థిక, రాజకీయ వ్యవహారాలతో పాటు పలు కేబినెట్ కమిటీలను కేంద్ర ప్రభుత్వం బుధవారం నియమించింది. ఆయా అంశాల్లో కీలక నిర్ణయాలను ఈ అత్యున్నత స్థాయి కేబినెట్ కమిటీలు తీసుకుంటాయి. ఈ కమిటీల్లో ఎన్డీఏ మిత్రపక్షాలైన జేడీయూ, టీడీపీ, జేడీఎస్, శివసేన, ఎల్జేపీ (రామ్‌విలాస్)లకు చెందిన మంత్రులకు కూడా చోటు కల్పించారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో నియామకాలు జరిపే కీలకమైన అపాయింట్‌మెంట్స్ కమిటీలో ఎప్పటిలాగే ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలు ఇద్దరు మాత్రమే ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన జి.కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడులకు రాజకీయ వ్యవహారాల కమిటీలో చోటు దక్కింది.

మళ్లీ ఆస్పత్రిలో అద్వాణీ

న్యూఢిల్లీ: బీజేపీ కురువృద్ధుడు, మాజీ ఉప ప్రధాని ఎల్.కే.అద్వాణీ అనారోగ్య కారణాలతో బుధవారం రాత్రి ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. ''ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. అబ్జర్వేషన్‌లో ఉన్నారు'' అని అపోలో వర్గాలు తెలిపాయి. 96 ఏళ్ల అద్వాణీ ఏ సమస్యతో బాధపడుతున్నారో తెలియరాలేదు. ఆయన ఇటీవలే ఎయిమ్స్‌లో ఒక రోజుండి డిశ్చార్జవడం తెలిసిందే.

మళ్లీ జార్ఖండ్ సీఎంగా హేమంత్

- సీఎం చంపాయీ రాజీనామా
- సభాపక్షనేతగా హేమంత్
- నేడు సీఎంగా ప్రమాణం!

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి పీఠంపై మళ్లీ జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ ఆసీనులయ్యేందుకు రంగం సిద్ధమైంది. బుధవారం రాత్రి రాజ్‌భవన్‌లో జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంపాయీ సోరెన్ తన రాజీనామా లేఖను అందజేశారు. బుధవారం ఇలా పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. భూకుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్ట్‌చేసిన నేపథ్యంలో హఠాత్తుగా సీఎం పదవికి హేమంత్ రాజీనామా చేయడం, ఆయన స్థానంలో చంపాయీ సోరెన్‌ను జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం) ఎమ్మెల్యేలు ఎన్నుకోవడం తెల్సిందే. తాజాగా హేమంత్ బెయిల్‌పై విడుదలైన నేపథ్యంలో మళ్లీ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టబోతున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు హేమంత్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసే అవకాశం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే బన్నా గుప్తా బుధవారం చెప్పారు. తనను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను హేమంత్ కోరారు. కూటమి పార్టీల మద్దతు లేఖను అందజేశారు. చంపాయీ రాజీనామాకు ముందే జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి నేతలు, ఎమ్మెల్యేలు ఆయన నివాసంలో సమావేశమై హేమంత్‌ను తమ శాసనసభాపక్షనేతగా ఎన్నుకున్నారు. దాంతో హేమంత్ సీఎం కావడం ఇక లాంఛనమే.



5 నెలలు జైల్లో ఉండి...

మనీలాండరింగ్ కేసులో హేమంత్‌ను ఈడీ జనవరి 31న అరెస్ట్ చేసింది. దాంతో సీఎంగా రాజీనామా చేశారు. హైకోర్టు బెయిల్‌తో జూన్ 28న బయటికొచ్చారు. ఆయన బెయిల్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఈడీ భావిస్తోంది.

కాస్త తగ్గిన కూటమి బలం

81 సభ్యులుండాల్సిన రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తుతం 76 మంది సభ్యులున్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత జేఎంఎం సంకీర్ణ ప్రభుత్వ బలం కాస్తంత తగ్గింది. ఇద్దరు జేఎంఎం ఎమ్మెల్యేలు ఎంపీలుగా గెల్చారు. హేమంత్ వదిన సీత రాజీనామాచేశారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలను పార్టీ బహిష్కరించింది. ఇక, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ఎంపీలుగా గెల్చారు. ఒకరిని పార్టీ బహిష్కరించింది. దీంతో ప్రస్తుతం ఆర్జేడీకి ఒకరు, జేఎంఎంకు 27, కాంగ్రెస్‌కు 17 మంది సభ్యుల బలముంది. బీజేపీకి 24 సభ్యుల బలముంది.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 4 । జూలై । 2024



40 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ
నగర పోలీసు కమిషనరేట్‌లో పనిచేస్తున్న 40 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పిస్తూ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. -8లో



హార్టికల్చర్ హబ్
నగర శివారును హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తే..మరో 30 వేల ఎకరాల్లో సిటీ చుట్టూ ఉద్యానవన పంటల సాగుకు అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. -10లో

గరిష్టం/కనిష్టం
34.0/23.0
వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. గంటకు 08 నుంచి 12 కి.మీ వేగంతో పశ్చిమ/దక్షిణ పశ్చిమ దిశగా ఉపరితల గాలులు వీచే అవకాశం ఉంది.






భావోద్వేగ దృశ్యం..

వారంతా క్షణికావేశంలో నేరాలు చేసి జైలు కెళ్లారు. శిక్ష అనుభవిస్తూ పశ్చాతాపంతో మదనపడ్డారు. ఈ దశలో జైళ్ల శాఖ కల్పించిన అవకాశాన్ని వినియోగించుకుని మంచి ప్రవర్తనతో ఏకంగా జైలు నుంచి విడుదలయ్యారు. పంద్రాగస్టు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 213 మంది ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించగా..బుధవారం చర్లపల్లి జైలు నుంచి 61 మంది విడుదలయ్యారు. ఈ సందర్భంగా చర్లపల్లి జైలు వద్ద భావోద్వేగ వాతావరణం కన్పించింది. ఖైదీలు..వారి కుటుంబ సభ్యుల పలకరింపులు..ఆనంద భాష్పాలు అక్కడి వారిని కదిలించాయి.

'కౌన్సిల్' నేపథ్యంలో .. అడిషనల్ కమిషనర్లకు బాధ్యతలు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 6వ తేదీన జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో అడిషనల్ కమిషనర్ల స్థానాల్లో సర్దుబాట్లు చేశారు. శానిటేషన్ అడిషనల్ కమిషనర్‌గా ఉన్న ఉపేందర్‌రెడ్డి శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా వెళ్లడంతో శానిటేషన్, ట్రాన్స్‌పోర్ట్ విభాగాల అదనపు బాధ్యతలు(ఎఫ్‌ఏసీ) సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎస్.రవికిరణ్‌కు అప్పగించారు. ఇప్పటి వరకు ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న హెల్త్ విభాగం అడిషనల్ కమిషనర్‌గా ఎస్.పంకజకు పోస్టింగ్ ఇచ్చారు. ఇటీవలి కాలం వరకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్‌గా ఉన్న ఆమె స్థానంలో ఐఏఎస్ అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్‌ను నియమించడం తెలిసిందే. ఎలక్ట్రికల్, లీగల్ విభాగాల అడిషనల్ కమిషనర్‌గా ఉన్న కె.సత్యనారాయణకు అడ్వర్టయిజ్‌మెంట్ విభాగాన్ని అదనంగా అప్పగించారు. ఈ మేరకు కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ట్రాన్స్‌పోర్ట్, అడ్వర్టయిజ్‌మెంట్ విభాగాలు ఈవీడీఎం పరిధిలో ఉండేవి. ఈవీడీఎం డైరెక్టరే వీటి అడిషనల్ కమిషనర్‌గా వ్యవహరించేవారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఈవీడీఎం డైరెక్టర్ స్థానే ఈవీడీఎం కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను ఇటీవల నియమించారు.

ఇక 'అభివృద్ధి'పై దృష్టి

రూ.150 కోట్లతో పనులకు సిద్ధమవుతున్న జీహెచ్‌ఎంసీ
- ఆమోదం కోసం పాలకమండలి ముందుకు..



సాక్షి, సిటీబ్యూరో: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గత నవంబర్ నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఎన్నికల కోడ్ కారణంగా ఎలాంటి నిధుల విడుదల, పనుల ప్రారంభం జరగలేదు. అలాగే నిధుల లేమి కారణంగా కూడా నిర్వహణ పనులు తప్ప.. ప్రాజెక్టుల పనులంటూ చేపట్టలేదు. పది నెలల విరామం తర్వాత దాదాపు రూ.150 కోట్లతో ఇప్పుడు వివిధ ప్రాజెక్టుల పనులు చేపట్టేందుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమవుతోంది. ఇవి ఇప్పటికే స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందినప్పటికీ, పాలకమండలి సర్వసభ్య సమావేశం ఆమోదం పొందాల్సి ఉండటంతో, ఆమోదం పొందాక పరిపాలన అనుమతులు కోసం ప్రభుత్వానికి నివేదించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు.

పనులు.. అంచనా

పాలకమండలి ఆమోదం కోసం జీహెచ్‌ఎంసీ నివేదిస్తున్న పనులు, వాటి అంచనా వ్యయం వివరాలిలా ఉన్నాయి.
- జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆస్తులు, యుటిలిటీస్‌కు జీఐఎస్ సర్వే, మ్యాపింగ్ పనులకు రూ.21.98 కోట్లు.
- మూసారాంబాగ్ బ్రిడ్జి పనుల్లో భాగంగా యుటిలిటీస్ షిఫ్టింగ్ పనుల కోసం రూ.3.97 కోట్లు.
- బేగంపేట ఆర్‌ఓబీ మరమ్మతులు, పునరుద్ధరణల కోసం రూ.20 కోట్లు. ఆర్‌కేపురం ఆర్‌ఓబీ పునరుద్ధరణ పనులకు రూ. 6 కోట్లు.
- ఎల్‌బీనగర్ పరిసరాల్లో నాలుగు ఫ్లై ఓవర్లకు తొలి అంచనా కంటే పెరిగిన అదనపు వ్యయం రూ.67 కోట్లు.
- రహ్మత్‌నగర్ (పీజేఆర్ విగ్రహం) జంక్షన్ అభివృద్ధి పనులకు రూ.5.17 కోట్లు, యూసుఫ్‌గూడ జంక్షన్ అభివృద్ధి పనులకు రూ.4.90 కోట్లు.
- ఐఎస్ సదన్ డివిజన్‌లో బాలాజీనగర్ కాలనీ నుంచి బీఎస్‌ఎన్‌ఎల్ ఖాళీ స్థలం వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి రూ.4 కోట్లు.
- వీటితోపాటు మరికొన్ని పనులకు వెరసి దాదాపు రూ150 కోట్లు వ్యయం కానుంది.


నిధులెలా?

పాలక మండి ఆమోదం తర్వాత పనులకు ప్రతిపాదనలు, అంచనా వ్యయం గురించి ప్రభుత్వానికి నివేదించనున్నప్పటికీ, వీటికి అవసరమైన నిధులెలా సమకూర్చుకోగలరన్నది ప్రశ్నార్థకంగా మారింది. జీహెచ్‌ఎంసీ ఖజానాలో గత కొన్ని సంవత్సరాలుగా ఏనాడూ తగిన నిధులుండటం లేవు. ప్రతి నెలా సిబ్బంది జీతభత్యాల చెల్లింపులకే కనాకష్టమవుతోంది. గతంలో 20వ తేదీవరకు కూడా జీతాల చెల్లింపులకు జాప్యం చోటు చేసుకున్న ఘటనలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏది ఏమైనా, మిగతా పనులు ఆపివేసైనా సరే జీతాలు మాత్రం సకాలంలో చెల్లించాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఒకటో తేదీ వస్తోందంటేనే సంబంధిత అధికారుల గుండెల్లో దడ మొదలవుతోంది. మరోవైపు నిధుల లేమితో ఎస్సార్‌డీపీ కింద చేపట్టిన రహదారులు, ఫ్లై ఓవర్ల పనులు, జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులు, ఎస్‌ఎన్‌డీపీ కింద చేపట్టిన నాలాల అభివృద్ధి పనులు వంటివి కుంటుతున్నాయి. ఎస్‌ఎన్‌డీపీ రెండో దశ కింద చేపట్టాల్సిన పనుల్ని సైతం నిధుల లేమితోనే దాదాపు సగం కుదించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి పరిపాలన అనుమతులు పొందినప్పటికీ, ఈ పనులకు నిధులెలా అన్నదే అంతుబట్టడం లేదని ఓ అధికారి వ్యాఖ్యానించారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులు సైతం జరక్క పలు సందర్భాల్లో వారు ఆందోళనలు నిర్వహించారు. ఇలాంటి పరిస్థితుల్లో అనుమతులు పొందినా పనులెలా అన్నదే అంతుపట్టడం లేదు. అయితే ఆయా ప్రాజెక్టుల పనులకు ప్రభుత్వం నిధులందజేయగలదన్న ఆశలు సైతం జీహెచ్‌ఎంసీ వర్గాల్లో ఉన్నాయి. ఆ ఆశతోనే పాలకమండలి ఆమోదం పొందాల్సిన పనుల్లోనూ కొన్నింటికి ఇప్పటికే శ్రీకారం చుట్టారు.

పుస్తకాలెక్కడ?

ఇప్పటికీ అరకొరగానే పాఠ్యపుస్తకాల పంపిణీ

- ఇండెంట్ ప్రకారం సరఫరా కానీ కోటా
- పెండింగ్‌లో పార్ట్–2 పుస్తకాలు
- మరోవైపు సరఫరా అయినా.. కొన్నిచోట్ల పంపిణీలో జాప్యం
- నిర్లక్ష్యంపై ఎంఈవో, హెచ్‌ఎంలకు నోటీసులు
- ఇదీ గ్రేటర్‌లో సర్కారు బడుల పరిస్థితి



గ్రేటర్‌లో పుస్తకాల అవసరం ఇలా..

జిల్లా	సర్కారు బడులు	విద్యార్థుల సంఖ్య	అవసరమైన పాఠ్యపుస్తకాలు
హైదరాబాద్	691	1.20 లక్షలు	9.70 లక్షలు
రంగారెడ్డి	1309	1.26 లక్షలు	9.90 లక్షలు
మేడ్చల్	515	98 వేలు	4.39 లక్షలు

నిర్లక్ష్యానికి షోకాజ్ నోటీసులు

ఇటీవల హైదరాబాద్ జిల్లాలో ఒక పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించడంలో నిర్లక్ష్యం వహించిన విద్యాశాఖాధికారులు, హెడ్మాస్టర్లపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ కొరడా ఝుళిపించారు. గోల్కొండ ప్రభుత్వం బాలికల ఉన్నత పాఠశాల, సెకండ్ లాన్సర్ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠ్యపుస్తకాల పంపిణీపై ఆరా తీశారు. నేరుగా విద్యార్థులనే అడిగి తెలుసుకున్నారు. కొందరు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని తెలుసుకుని సంబంధిత డిప్యూటీ డీఈఓ, డిప్యూటీ ఐఓఎస్, ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.



సాక్షి, సిటీబ్యూరో: ఎప్పటి మాదిరిగానే సర్కారు బడులకు ఈసారి కూడా పాఠ్యపుస్తకాల కొరత వెంటాడుతూనే ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు దాటినా అరకొరగానే పాఠ్యపుస్తకాల సరఫరా జరిగింది. ఏ ఒక్క పాఠశాలకు కూడా ఇండెంట్ ప్రకారం పూర్తి స్థాయి పుస్తకాలు అందలేదు. సరఫరా అయిన పాఠ్యపుస్తకాల్లో సైతం సుమారు 20 శాతం పైగా విద్యార్థులకు పంపిణీ కాలేదు. ప్రతి పాఠశాలకు రెండు, మూడు సబ్జెక్ట్ పుస్తకాలు అందనట్లు తెలుస్తోంది. ఒకటి నుంచి పదవ తరగతి వరకు సైన్స్ పుస్తకం ఉంటే సోషల్ పుస్తకం, సోషల్ పుస్తకం ఉంటే సైన్స్ పుస్తకం లేకుండా పోయింది. అదేవిధంగా లాంగ్వేజ్ పుస్తకాలు సైతం పూర్తి స్థాయిలో అందలేదు. పలు సబ్జెక్టులకు సంబంధించి పార్ట్–1 సరఫరా జరిగినా..పార్ట్–2 సరఫరా మాత్రం పెండింగ్‌లో పడిపోయింది.

అంతంతే...!

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మొత్తం 2,515 సర్కారు బడులు ఉండగా..అందులో సుమారు 3.44 లక్షల మంది విద్యార్థులున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సుమారు 23.99 లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం ఉందని భావించి ఇండెంట్ పెట్టారు. ఇందులో ఇప్పటి వరకు 80 శాతం వరకు పాఠ్యపుస్తకాలు గోదాముల నుంచి సరఫరా అయినట్లు తెలుస్తోంది. వాస్తవంగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలు ప్రారంభం నాడే విద్యార్థులకు పుస్తకాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ముద్రణాలయం నుంచి గోదాములకు వచ్చిన పాఠ్యపుస్తకాలను వెంట వెంటనే స్కూల్ పాయింట్లకు సరఫరా చేశారు. కానీ, పూర్తి స్థాయిలో మాత్రం సరఫరా కాలేదని తెలుస్తోంది.

నిలోఫర్‌ను సందర్శించిన కలెక్టర్



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నాంపల్లి: పుట్టుక లోపాలు గల నవజాత శిశువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి చికిత్స అందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైద్యాధికారులకు సూచించారు. బుధవారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటెన్సివ్ కేర్ బ్లాక్, డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీ, రక్త పరీక్షల కేంద్రం, క్వాలిటీ కంట్రోల్ రూమ్, సీసీ టీవీ, ఫిజియోథెరపీ, పీడియాట్రిక్ సర్జికల్ వార్డు, ఆపరేషన్ థియేటర్స్, కాంప్రహెన్సివ్ లాక్టేషన్ మేనేజ్‌మెంట్ సెంటర్, నియోనటాలజీ యూనిట్‌లలో కలియదిరిగారు. రోగులకు అందుతున్న సేవలు, వైద్యాధికారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పుట్టుక లోపాలతో జన్మించిన శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. పుట్టుకతో వచ్చే లోపాలతో పిల్లలు జీవితాంతం బాధపకుండా ఉండేందుకు వారికి మెరుగైన చికిత్సలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి.ఉషారాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట్, ఆర్‌ఎంఓ–1 డాక్టర్ జ్యోతి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ వినోద్, డాక్టర్ రామ్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ అరుణ్‌కుమార్, డి.గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ లాగింగ్ పాయింట్లు ఎప్పటికప్పుడు క్లియర్



సాక్షి, సిటీబ్యూరో: వర్షాల నేపథ్యంలో రోడ్లపై భారీగా నిలిచే నీళ్లను ఎప్పటికప్పుడు క్లియర్ చేసే విధంగా జలమండలి డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దింపింది. ఇప్పటికే వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి ప్రత్యేక దృష్టి సారించింది. సుమారు 238 స్టాటిక్, 154 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు వర్షపు నీటి తొలగింపులో నిమగ్నమయ్యాయి. గత రాత్రి నగరంలో పలుచోట్ల కురిసిన వర్షానికి నీరు నిలిచిన ప్రాంతాల్లో ఈ బృందాలు నీటిని తొలగించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూశాయి. ఈసీఐఎల్ ఎక్స్ రోడ్, కాప్రా, ఏఎస్‌రావు నగర్, బేగంపేట్, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాల్లో వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని తొలగించారు. అదేవిధంగా విరిగిన చెట్ల కొమ్మలను సైతం తొలగించారు.

ఆమ్రపాలి.. ఆన్ డ్యూటీ

రహదారులపై తనిఖీలు
- పారిశుధ్య పనులపై ఆరా..



నల్లకుంటలో విద్యార్థినితో మాట్లాడుతున్న ఆమ్రపాలి

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమ్రపాలి నగరంలో బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నల్లకుంట శంకర్‌మఠ్ సమీపంలో ఆర్‌ఎఫ్‌సీ వాహన డ్రైవర్‌తో మాట్లాడి చెత్త తరలింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే దారిలో తనకు తారసపడిన ఓ విద్యార్థినితో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించే విధంగా తోటి విద్యార్థులకు అవగాహన కల్పించి స్వచ్ఛ హైదరాబాద్ సాధనకు కృషి చేయాలని ఆ విద్యార్థినికి చెప్పారు. నారాయణగూడ క్రాస్‌రోడ్స్ దగ్గర నిర్మించిన మార్కెట్ గదుల కేటాయింపులు పూర్తిచేయాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. కమిషనర్ వెంట తనిఖీలో శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రవికిరణ్ పాల్గొన్నారు. కాగా ఐఏఎస్ అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని, కార్యాలయాలకే పరిమితం కారాదని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, సీనియర్ ఐఏఎస్ అధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించడం తెలిసిందే.

సమావేశానికి సిద్ధం కండి

ఈ నెల 6న నిర్వహించనున్న జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశానికి ఆయా విభాగాల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఉన్నతాధికారులకు సూచించారు. బుధవారం తన చాంబర్‌లో ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. 4న జరగనున్న స్టాండింగ్ కమిటీ, 6న జరగనున్న సర్వసభ్య సమావేశం ఎజెండా అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి వచ్చే ప్రశ్నలకు సంబంధించి ఆయా విభాగాల అధికారులు సమగ్ర వివరణ ఇచ్చేలా సిద్ధం కావాలన్నారు. సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలన్నారు. ఆయా విభాగాలకు సంబంధించిన పలు అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.



నారాయణగూడలో సిబ్బందికి సూచనలు..

సునీల్ శెట్టి @ 185

మళ్లీ చిక్కిన ఘరానా దొంగ మహ్మద్ సలీం
- 33 ఏళ్లుగా నేరాలు... ఇప్పటికి 185 కేసులు
- ఈ ఏడాది జనవరి నుంచి 10 చోట్ల పంజా
- అరెస్టు చేసిన సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్

సాక్షి, సిటీబ్యూరో: అసలు పేరు మహ్మద్ సలీం ..బాలీవుడ్ యాక్టర్ మీద ఉన్న అభిమానంతో తన పేరును సునీల్ శెట్టిగా మార్చుకున్నాడు. సొంత దుకాణం నుంచే చోరీలు చేయడం ప్రారంభించాడు. 33 ఏళ్ల నేర ప్రస్థానంలో 175 చోరీలు చేశాడు..గతంలో 24 సార్లు కటకటాల్లోకి వెళ్లి వచ్చాడు..పీడీ యాక్ట్ సైతం ప్రయోగించినా మార్పు రాలేదు. గడిచిన ఆరు నెలల్లో 10 నేరాలు చేశాడు. చోరీ సొత్తుతో ఉత్తరాదిలో జల్సాలు చేయడంతో పాటు హెలీటూరిజం సైతం చేస్తుంటాడు. ఈ ఘరానా దొంగను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నట్లు డీసీపీ వైవీఎస్ సుధీంద్ర బుధవారం తెలిపారు. నవాబ్‌సాబ్ కుంటకు చెందిన సలీం నిరక్షరాస్యుడు. చాదర్‌ఘాట్‌లోని ఓ హోటల్‌లో చేస్తూనే అవకాశం చిక్కినప్పుడల్లా చిన్న చిన్న గృహోపకరణాలు తస్కరించడం మొదలెట్టాడు. 1991లో ఇతడి 18వ ఏట ఇత్తడి వస్తువుల చోరీ కేసులో తొలిసారిగా చాదర్‌ఘాట్ పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లాడు. జైల్లో పరిచయమైన 'సీనియర్ల' వద్ద తాళాలు పగులకొట్టడంతో మెళకువలు నేర్చుకున్నాడు.



సునీల్ శెట్టి అరెస్టును చూపిస్తున్న పోలీసులు

మధ్య, దిగువ తరగతి వాళ్లే టార్గెట్..

ఈ చోరుడు ప్రధానంగా మధ్య–దిగువ మధ్య తరగతికి చెందిన ఓ వర్గం వారి ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుంటాడు. చిన్న టార్చ్‌లైట్, కటింగ్ ప్లేయర్‌తో 'రంగం'లోకి దిగే ఇతగాడు తాళం వేసున్న ఇళ్లల్లో అనువైనవి గుర్తిస్తాడు. పగలు–రాత్రి..ఇలా ఎప్పుడు అవకాశం చిక్కితే అప్పుడు ఈ ఇంట్లోకి వెళ్లిన తర్వాత స్క్రూస్లు సహా అక్కడ ఉన్న ఉపకరణాలతోనే అల్మారాలు పగులకొట్టి వాటిలో ఉన్న సొత్తు తీసుకుని ఉడాయిస్తాడు. ఈ సొత్తు విక్రయించగా వచ్చిన సొమ్ముతో ముంబై, అజ్మీర్ సహా ఉత్తరాదిలో జల్సాలు చేస్తుంటాడు. బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి అంటే అమితంగా ఇష్టపడే సలీం తన పేరునూ అలానే మార్చుకున్నాడు. జుట్టునూ పొడవుగా పెంచుకుంటాడు. ముంబైలోని బాంద్రాలో ఉన్న ఆ హీరో ఇంటి వద్దకు అనేకసార్లు వెళ్లినా కలవడం సాధ్యం కాలేదు. గతంలో 175 నేరాలు చేసి 24 మార్లు అరెస్టు అయ్యాడు. శిక్షలు పూర్తయ్యే వరకు జైలు నుంచి రాని నేపథ్యంలో ఇతడిపై రెండుసార్లే పీడీ యాక్ట్ ప్రయోగం సాధ్యమైంది. 2021లో జైలుకు వెళ్లి గత ఏడాది జనవరిలో బయటకు వచ్చాడు. అప్పటి నుంచి మూడు కమిషనరేట్లలోని 5 ఠాణాల పరిధిలో 15 నేరాలు చేసి చిక్కాడు. ఇలా 24వ పర్యాయం జైలుకు వెళ్లిన సలీం గత ఏడాది డిసెంబర్‌లో విడుదలయ్యాడు. ఈ ఏడాది జనవరి నుంచి గత నెల 24 వరకు బాలాపూర్, చంద్రాయణగుట్ట, బండ్లగూడ ఠాణాల పరిధిలో పది నేరాలు చేశాడు. దీంతో 185 కేసుల 'స్కోర్'కు చేరుకున్న ఇతడిని పట్టుకోవాలంటూ టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు ఆదేశాలు జారీ చేయడంతో సౌత్ ఈస్ట్‌జోన్ టీమ్ రంగంలోకి దిగింది. ఇన్‌స్పెక్టర్ డి.వెంకట్‌రెడ్డి నేతృత్వంలో ఎస్‌ఐలు షేక్ కవియుద్దీన్, పి.సాయిరాం, రాఘవేంద్ర రెడ్డి, కానిస్టేబుల్ నయీం ఖాన్ పక్కా నిఘా ఉంచి సలీంను బుధవారం పట్టుకున్నారు. రూ.22 లక్షల విలువైన 292 గ్రాముల బంగారం, 1090 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సంతానం ఉన్న ఓ వితంతువును 1998లో వివాహం చేసుకున్న ఈ సునీల్‌శెట్టి ఇప్పుడు ఏడుగురి పిల్లలకు తండ్రని పోలీసులు చెప్తున్నారు.

యాంటీ డ్రగ్స్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

బంజారాహిల్స్: యాంటీ డ్రగ్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను బుధవారం నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. 'డ్రగ్స్ నిర్మూలిద్దాం.. సమాజాన్ని మేల్కొల్పుదాం' అంటూ జులై 1 నుంచి 31 వరకు ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు యాంటీడ్రగ్స్ పోస్టర్‌ను కమిషనర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఈ చైతన్య కార్యక్రమాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం చీఫ్ ప్యాట్రన్స్ డీజీ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి మారన్న, రఘు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



యాంటీ డ్రగ్స్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన సీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

బీమా టోకరా!

● కొత్త పాలసీలు, రెన్యూవల్ పేరిట మోసాలు
● అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: బీమా పాలసీలు, రెన్యూవల్ పేరుతో వచ్చే సందేశాలు, ఫోన్ కాల్స్, లింకులకు ముందూ.. వెనుకా చూసుకోకుండా స్పందిస్తే నిండా మునిగినట్టే. బహుమతులు, ఉద్యోగాలు, బీమా బదలాయింపులు, సాంకేతిక సమస్యల సాకుతో, రెన్యూవల్ పేరుతో సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ప్రముఖ బీమా కంపెనీల పేర్లతో నకిలీ ఈ-మెయిల్స్, సందేశాలు పంపి డబ్బు కొల్లగొడుతున్న సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది విద్యా వంతులు, వృద్ధులు ఉండటం గమనార్హం.

ప్రొవైడర్ల నుంచి డేటా కొనుగోలు

బీమా వివరాలు, వాటి గడువు, ఇతరత్రా సమాచారం ఇటు పాలసీదారులకు, అటు బీమా సంస్థలకు మాత్రమే తెలుస్తాయి. సైబర్ నేరగాళ్లు ఈ వ్యక్తిగత సమాచారాన్ని అడ్డదారుల్లో కొంటున్నారు. డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీలు రూ.10 వేలు ఇస్తే.. లక్షలాది మంది బీమా వివరాలను అందిస్తున్నాయి. ఇందులో పాలసీ వివరాలు, వాటి గడువు, వాహనాల నంబర్లు, వాటి ఇన్సూరెన్స్ పాలసీలు ఇలా పూర్తిగా వ్యక్తిగత వివరాలు ఉంటున్నాయి. ఈ సమాచారంతో సైబర్ నేరగాళ్లు పాలసీదారులకు ఫోన్లు, మెసేజ్‌లు చేసి కొత్త బీమా, రెన్యూవల్‌తో అధిక లాభాలు, బహుమతులు అందుకోవచ్చని నమ్మించి బ్యాంకు ఖాతా వివరాలను సేకరిస్తున్నారు. వీటితో అకౌంట్లు ఖాళీ చేసేస్తున్నారు.

జాగ్రత్తలివే..

◆ రెన్యూవల్, పాలసీ బదలాయింపు పేరుతో వచ్చే ఈ-మెయిల్స్, సందేశాలను నమ్మకూడదు.
◆ ప్రస్తుతం ఉన్న బీమా పాలసీకి బదులుగా కొత్తది తీసుకుంటే అధిక లాభాలు వస్తాయని చెప్పే మాయమాటలను విశ్వసించకూడదు.
◆ బీమా పాలసీలో మార్పులు చేసుకోవాల్సి వస్తే సదరు బీమా సంస్థను సంప్రదించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.
◆ ఇన్సూరెన్స్ వెరిఫికేషన్ కోసమని చెప్పి మీ పాన్, ఆధార్ నంబర్లు, బ్యాంకు వివరాలను అడిగితే.. అది సైబర్ మోసమేనని గుర్తించాలి.

జీవో నెంబర్ 121ను రద్దు చేయాలి

ముషీరాబాద్: గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 121ను రద్దు చేసి వీఆర్‌ఓలను రెవెన్యూ శాఖలోకి తీసుకురావాలని తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గరిగె ఉపేందర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల వీఆర్‌ఓల పరిస్థితి అధ్వానంగా తయారైందని వాపోయారు. బుధవారం రాంనగర్‌లోని ఎస్ఆర్‌టీ కాలనీ కమ్యూనిటీహాల్‌లో తెలంగాణ వీఆర్‌ఓల సంక్షేమ సంఘం రాష్ట్ర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్‌ఓలను రద్దుచేసి వివిధ శాఖల్లో నిర్వీర్యమైన పోస్టులు ఇచ్చి తమ జీవితాలను చిన్నాభిన్నం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వీఆర్‌ఓలను రెవెన్యూశాఖలో చేర్చి వారికి ఇంక్రిమెంట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగంలో చనిపోయిన వీఆర్‌ఓల పిల్లలకు కారుణ్య నియామకాలు జరపాలని కోరారు. వీఆర్‌ఓల అర్హతలను బట్టి ప్రమోషన్లు కల్పించాలన్నారు. తమ సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు వెంటనే స్పందించి న్యాయం చేయాలని లేదంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి ప్రసాద్‌బాబు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు విజయనాథ్, వివిధ జిల్లాల అధ్యక్షులు ప్రకాష్‌రావు, వీరస్వామి, కృష్ణమూర్తి, వెంకటేష్, నర్సింహులు, గోవర్ధనచారి, కృష్ణమ్మ, రాఘవేందర్, మద్దిలేటి తదితరులున్నారు.

బండ్లగూడ జాగీర్ మాజీ మేయర్‌పై అట్రాసిటీ కేసు

రాజేంద్రనగర్: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్‌తో పాటు మరో ఏడుగురిపై రాజేంద్రనగర్ పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..నాలుగు రోజుల క్రితం సన్ సిటీలో జరిగిన హరితహారం కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ లతా ప్రేమ్ గౌడ్‌పై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలోనే ఇరు వర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డాయి. ఈ సందర్భంగా ఒకటవ డివిజన్ కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్‌ను కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు మాజీ మేయర్ మహేందర్ గౌడ్‌తో పాటు మరో ఏడుగురిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

ఫౌండేషన్ పేరుతో రూ.లక్షలు వసూలు

కిద్మత్ ఫౌండేషన్ పేరుతో నకిలీ యాప్	హిస్సా ఇస్తామంటూ భారీగా వసూలు	నగర వ్యాప్తంగా వందల మందికి టోకరా	ముగ్గురు నిందితులను పట్టుకున్న కాప్స్	వీరి నుంచి రూ.23 లక్షల నగదు రికవరీ



నాంపల్లి: ఖిద్మత్ ఫౌండేషన్ పేరుతో నకిలీ యాప్ సృష్టించి, బక్రీద్ నేపథ్యంలో కుర్బానీకి సంబంధించిన హిస్సా ఇస్తానంటూ నగర వ్యాప్తంగా అనేక మంది నుంచి రూ. 63 లక్షలు వసూలు చేసి మోసం చేసిన కేసులో ముగ్గురు నిందితులను హబీబ్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. ఈ త్రయం సిటీలో 1049 మంది నుంచి 2179 హిస్సా కోసం నగదు వసూలు చేసిందని, కేవలం 500 హిస్సా పంపిణీ చేసిందని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో కలిసి బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూర్తి వివరాలు వెల్లడించారు.

నాలుగైదేళ్లుగా సక్రమంగా పంపిణీ...

నగరానికి చెందిన నిస్సార్ అహ్మద్ న్యూ మల్లేపల్లిలో కిద్మత్ ఫౌండేషన్ స్థాపించారు. నగర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న కౌంటర్ల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బక్రీద్ నేపథ్యంలో ఆ వర్గానికి చెందిన వాళ్లు కుర్బానీ చేసి, హిస్సా మాంసం తీసుకుంటూ ఉంటారు. నేరుగా వెళ్లి కుర్బానీ చేయలేని వాళ్లకు ఈ ఫౌండేషన్ గడిచిన నాలుగైదేళ్లుగా హిసాబ్స్ అందిస్తోంది. ఒక్కో యూనిట్‌కు నిర్ణీత మొత్తం వసూలు చేస్తూ ఇంటి వద్దే డెలివరీ చేసేవారు. బక్రీద్‌కు కొన్ని రోజులు ముందు తమ కౌంటర్ల ద్వారా, నేరుగా డబ్బు వసూలు చేసి... పండుగ రోజు హిస్సా అందించేవాళ్లు. దీంతో ఈ ఫౌండేషన్‌పై వివిధ ప్రాంతాలకు చెందిన వారిని బాగా నమ్మకం ఏర్పడింది.

ఈసారి యాప్‌లో రంగంలోకి ముగ్గురు...

ఈ నమ్మకాన్ని క్యాష్ చేసుకోవడానికి ముగ్గురు సభ్యుల ముఠా రంగంలోకి దిగింది. బహదూర్‌పురకు చెందిన ఎల్ఈడీ వర్కర్ మహ్మద్ నసీర్, బండ్లగూడ జాగీర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మహ్మద్ జఫార్ అహ్మద్, క్యాబ్ డ్రైవర్ మహ్మద్ అష్ఫఖ్ కలిసి కిద్మత్ ఫౌండేషన్ పేరుతో ప్రత్యేక యాప్ రూపొందించారు. దీంతో పాటు మల్లేపల్లి, శాలిబండ, టోలిచౌకిల్లో మూడు కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో హిస్సాకు రూ.2800 చొప్పున రేటు కట్టారు. నగర వ్యాప్తంగా 1049 మంది నుంచి 2179 హిస్సా కోసం డబ్బు వసూలు చేశారు. కొందరు నగదు రూపంలో, మరికొందరు ఆన్‌లైన్ ద్వారా, ఇంకొందరు యూపీఐ పేమెంట్లు చేశారు. బక్రీద్ నాడు (గత నెల 17న) కేవలం 500 హిసాబ్స్ మాత్రమే డెలివరీ కావవడంతో మిగిలిన వాళ్లు తాము మోస పోయినట్లు గుర్తించారు.

మల్లేపల్లికి చెందిన వాళ్లే 421 మంది...

ఇలా మోసపోయిన వారిలో హబీబ్ నగర్ ఠాణా పరిధిలోకి వచ్చే మల్లేపల్లికి చెందిన వాళ్లే 421 మంది ఉన్నారు. 10 హిస్సా కోసం రూ.28 వేలు చెల్లించిన అబ్దుల్ బారీ రెహాన్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన పోలీసులు ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. విచారణ నేపథ్యంలో తాము నగదుతో పాటు హిస్సా పంపిణీ బాధ్యతలు వేరొకరికి అప్పగించామని చెప్పుకొచ్చారు. దీంతో ఈ విషయాన్ని ఆరా తీస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఈ నిందితుల నుంచి రూ.23 లక్షల నగదు, ల్యాప్‌టాప్ తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై ఫిల్మ్ నగర్ ఠాణాలోనూ మరో కేసు నమోదైంది. నగర కోల్పోయిన వారి వివరాలు ఆరా తీస్తున్న సౌత్ వెస్ట్ జోన్ అధికారులు వారికి న్యాయం చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

340 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

అబిడ్స్: దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో గోషామహాల్ ఏసీపీ కోట్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో షాయినాయత్ గంజ్ సీఐ బాలు నాయక్, డీఐ సీహెచ్ శోభన్‌బాబు, ఎస్ఐలు లక్ష్మయ్యల బృందం షాయినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అనుమానాస్పదంగా కనిపించిన 340 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో 105 వాహనాలకు నంబర్‌ప్లేట్స్ సరిగా లేకపోవడం, నెంబర్‌ప్లేట్స్ లేకుండా వాహనం నడుపుతున్నందున సంబంధిత వాహన యజమానులకు జరిమానాలు విధించారు. అంతే కాకుండా నంబర్‌ప్లేట్స్‌ను వాహనాలకు ఫిక్స్ చేయించి, వాటిపై వాహనం రిజిస్ట్రేషన్ నంబర్ నిబంధనలకు అనుగుణంగా సవరించి ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బాలు చౌహాన్ మాట్లాడుతూ..సీపీ ఆదేశాల మేరకు షాయినాయత్‌గంజ్ పరిధిలో డ్రైవ్ కార్యక్రమం నిత్యం కొనసాగుతుందని, ద్విచక్ర వాహనదారులతో పాటు కార్లు, ఆటో రిక్షాలు, ఇతర వాహనాల యజమానులు నిబంధనలకు కట్టుబడి ఉండాని కోరారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

మృతదేహాన్ని ఐదారు కిలోమీటర్ల దూరం లాక్కెళ్లిన రైలింజన్



పకీర్ (ఫైల్)

ఘట్‌కేసర్: మతి స్థిమితం లేని ఓ వృద్ధుడిని రైలు ఢీకొనడంతో అతను మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మృతదేహాన్ని రైలింజన్ నాలుగైదు కిలోమీటర్ల దూరం వరకు లాక్కెళ్లింది. పోలీసులు తెలిపిన మేరకు.. భువనగిరికి చెందిన ఎర్ర పకీర్(74)కు మతిస్థిమితంలేదు. అతడి భార్య ఏడాది క్రితం మరణించింది. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. యాదాద్రి బీబీనగర్-ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ మధ్య మంగళవారం పకీర్ రైలు పట్టాలు దాటుతుండగా వరంగల్ వైపు నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్న లోకో సీహెచ్‌జీ ఎంటీ రేక్ రైలు ఢీకొట్టడంతో మరణించాడు. మృతదేహం రైలు ఇంజిన్ ముందు చిక్కుకోవడంతో ఐదారు కిలోమీటర్ల వరకు దానిపైనే వేలాడుతూనే ఉంది. ఘట్‌కేసర్ వద్ద స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చెర్లపల్లి-ఘట్‌కేసర్ మధ్య ఇంజన్ నుంచి నుంచి శవాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శాంతియుత వాతావరణానికి సహకరించండి



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి

హిమాయత్‌నగర్: హైదరాబాద్ మహానగరం శాంతియుత వాతావరణానికి ప్రతీక అని రానున్న బోనాలు, మొహర్రం పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కోరారు. బుధవారం బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోనాలు పండుగ, మొహర్రంలకు సంబంధించి సెంట్రల్ పీస్, వెల్ఫేర్ కమిటీతో సమావేశం నిర్వహించారు. గత కొన్ని దశాబ్దాలుగా సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ చేస్తున్న నిబద్ధత,కృషిని సీపీ ప్రశంసించారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సారి కూడా పండుగల నిర్వహణ కోసం నిరంతర సహకారం అందించాలని సీపీ కోరారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసు అధికారులకు తెలియజేయాలని, ఇతర అంశాలకు సంబంధించిన వివరాలను పంచుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. సమావేశంలో చీఫ్ ప్యాట్రన్ హఫీజ్ ముజఫర్ హుస్సేన్, నగర లా అండ్ ఆర్డర్ అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, నగర ట్రాఫిక్ అడిషనల్ సీపీ పి.విశ్వ ప్రసాద్, అడిషనల్ సీపీ సత్యనారాయణ, డీసీపీలు, అడిషనల్ డీసీపీలతో పాటు పలు మండలాలకు చెందిన 50 మంది కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రేటర్ సమగ్ర అభివృద్ధి కోసమే 'హై సిటీ'

పథకాల పేరు మార్పుపై జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: గత ప్రభుత్వ హయాంలో ఎస్సార్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ తదితర పేర్లతో ఉన్న పథకాల పేర్లను తొలగించడంపై జీహెచ్ఎంసీ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అసంపూర్తి పనులు పూర్తి చేయడం, మరింత అభివృద్ధికి నూతన పనులను ప్రతిపాదిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో పూర్తిచేయడం ఈ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంది. అందుకుగాను వివిధ పథకాలను అమలు చేసే బదులు ఒకే గొడుగు కింద సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన పథకమే ' హై సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్ ఫార్మేటివ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అని వివరణనిచ్చింది. గత ప్రభుత్వ పథకాల పేర్ల రద్దుకు సంబంధించి 'వ్యూహాత్మకంగానే' శీర్షికన మే 31వ తేదీన 'సాక్షి' కథనం వెలువరించింది. గ్రేటర్ హైదరాబాద్‌లో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పన, సమగ్ర అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం హై సిటీ పథకానికి రూపకల్పన చేసిందని తెలిపింది. అంతర్జాతీయంగా హైదరాబాద్ ఇమేజ్‌ను కొనసాగించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయమని పేర్కొంది. గతంలో చేపట్టిన పనులు పూర్తయ్యేందుకు, ఇప్పటి అవసరాల కనుగుణంగా ప్రాధాన్యంగల పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా తెలంగాణ ప్రభుత్వం జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించినట్లు తెలిపింది. అందుకనుగుణంగా నాలాల అభివృద్ధికి రూ.582.42 కోట్లతో 35 పనులు చేయాలని అధికారులు నిర్ణయించినట్లు వివరించింది. ఆ మేరకు జోన్ల వారీగా చేయనున్న పనుల గురించి తెలిపింది.

కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలి



కోఠి డీఎంఈ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ కార్మికులు

సుల్తాన్‌బజార్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన జీతాలు సక్రమంగా చెల్లించకుండా శ్రమదోపిడీ గురి చేస్తున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసుఫ్, ప్రాన కార్యదర్శి ఎం.నరసింహాలు అన్నారు. బుధవారం కోఠిలోని డీఎంఈ కార్యాలయం ముందు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్‌కేర్ సెక్యూరిటీ కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారన్నారు. కానీ జీఓ నెంబర్ 60 ప్రకారం రూ.13,600 జీతం రావాల్సి ఉన్నదని తెలిపారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నటువంటి ఏ ఒక్క ఆసుపత్రిలో కూడా ఈ జీతాలు అమలు కావడం లేదని మండిపడ్డారు. అనంతరం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, టీవీ వీపీ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, తోట రామాంజనేయులు, ఎం.లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా భేగం, పి.సురేష్, ఎస్.కిష్టమ్మ, సిద్రా దేవేందర్, వినోద్, జెలక్ష్మీ, సర్వేశ్వర్, మదన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు డ్రగ్ పెడ్లర్లు, 8 మంది వినియోగదారులు అరెస్టు

కంటోన్మెంట్: డ్రగ్స్ సరఫరా, వినియోగం పట్ల కఠినంగా వ్యవహరిస్తామని నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్ అన్నారు. తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో (టీజీఎన్ఏబీ), కార్ఖానా పోలీసులతో కలిసి ముగ్గురు డ్రగ్ పెడ్లర్లు, 8 మంది వినియోగదారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాల్, నార్కొటిక్ బ్యూరో పి. సాయి చైతన్య విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. టీజీఎన్ఏబీకి అందిన సమాచారం మేరకు, కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న మహ్మద్ అక్రమ్, సీఎస్ ప్రణయ్, రోహన్ విలియమ్స్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసిన నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భరణి కుమార్, రోషన్ సింగ్ ఒషాన్, సి. నారాయణ రెడ్డి, బి. అరుణ్ చౌదరి, పి. నిఖిల్ రెడ్డి, సూర్య తేజ, సాయి చరణ్ రెడ్డి, పృథ్వీనాథ్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. షాద్‌నగర్లోని ఓ బిజినెస్ మేనేజ్‌మెంట్ స్కూల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరికి తల్లిదండ్రులతో కలిసి కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. పలు విద్యా సంస్థల్లో డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని డీసీపీ తెలిపారు. ఆయా విద్యాసంస్థలు చొరవ తీసుకుని డ్రగ్స్ నియంత్రణకు సహకరించాలన్నారు.

బాలికపై లైంగిక దాడి.. వ్యక్తి అరెస్టు

అంబర్‌పేట: ఓ యువకుడు పక్కింట్లో ఉంటూ మైనర్ బాలికను మభ్యపెట్టి లైంగికదాడికి పాల్పడ్డాడు. అమాయక బాలికను లోబర్చుకొని పలుమార్లు లైంగికదాడికి పాల్పడటంతో ఆ బాలిక(14) భయభ్రాంతులకు గురై తల్లిదండ్రులకు చెప్పింది. ఈ సంఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం... అంబర్‌పేట చెన్నారెడ్డినగర్‌లో ఓ కుటుంబం నివాసముంటోంది. వీరు అద్దెకు ఉండే పక్క ఇంట్లోకి రెండు సంవత్సరాల క్రితం డేవిడ్(30) తన భార్యతో కలిసి అద్దెకు దిగాడు. నాలుగు నెలల క్రితం బాలికను మభ్యపెట్టి లొంగదీసుకున్నాడు. అనంతరం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరిస్తూ పలుమార్లు బాలికపై ఆఘాయిత్యానికి పలుపడ్డాడు. అతని చర్యలను తట్టుకోలేక బుధవారం తల్లికి జరిగిన విషయం చెప్పింది. తల్లి నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు డేవిడ్‌ను అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

నడుస్తున్న రైలు దిగబోయి వ్యక్తి మృతి

కాచిగూడ: నడుస్తున్న రైల్లోనుంచి దిగబోయి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన మేరకు.. గౌలిగూడ ప్రాంతానికి చెందిన అమర్ రామ్ (52) వ్యాపారం చేస్తుంటాడు. మైసూర్ వెళ్లడానికి మంగళవారం రాత్రి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. అప్పటికింకా మైసూర్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారంపైకి రాలేదు. ఫ్లాట్‌ఫారం పైకి వచ్చిన అజంతా ఎక్స్‌ప్రెస్ రైలును ఎక్కాడు. ఆర్ట్స్ కాలేజీ రైల్వే స్టేషన్ వద్దకు వెళ్లగానే పొరపాటుగా వేరే రైలు ఎక్కినట్లు గమనించాడు. దీంతో నడుస్తున్న రైలు నుంచి దిగడానికి ప్రయత్నించి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

కార్మికుడిపై పడ్డ క్రేన్..అక్కడికక్కడే మృతి



రాములు (ఫైల్)

నిజాంపేట్: భవనం పైకి మెటీరియల్ తీసుకు వెళ్లే క్రేన్ ప్రమాదవశాత్తు ఓ కార్మికుడిపై పడటంతో అతను అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయపడ్డారు.ఈ సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం, హస్నాబాద్ గ్రామానికి చెందిన రాములు (56)బీహెచ్ఈఎల్ అశోక్ నగర్‌లో భార్య ఇత్తమ్మ, ముగ్గురు కొడుకులతో కలిసి నివాసముంటున్నాడు. రెండుళ్లుగా బాచుపల్లి కౌసాల్య కాలనీలోని డాల్ఫిన్ కన్స్ట్రక్షన్‌లో పని చేస్తున్నాడు. బుధవారం రాములు క్రేన్‌లో మెటీరియల్ నింపుతున్నాడు. ఈ క్రమంలో క్రేన్ పైకి వెళ్లిన తరువాత ప్రమాద వశాత్తు క్రేన్ వైర్ తెగి రాములు తలపై క్రేన్ పడటంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. ఈమేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిదేళ్లకే 'ఆయుష్' తీరింది

ద్విచక్రవాహనం ఢీ కొని బాలుడి మృతి

మేడ్చల్ రూరల్: ఆడుకునేందుకు అమ్మమ్మ ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న బాలుడిని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో చిన్నారి మృతి చెందాడు. ఈ సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన మేరకు.. బిహార్ రాష్ట్రానికి చెందిన అమిత్‌కుమార్ కుటుంబంతో సహ గత 8 ఏళ్ల క్రితం మేడ్చల్‌కు వలస వచ్చి పట్టణంలోని ఉమానగర్‌లో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. వారి కుమారుడు ఆయుష్ (8) గత మంగళవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో ఆడుకునేందుకు సమీపంలో ఉండే అమ్మమ్మ ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా లక్ష్మి అపార్ట్‌మెంట్ సమీపంలో ఆయుష్‌ను గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బాలుడి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కొంపల్లిలోని రష్ ఆస్పత్రికి తీసుకెళ్లగా బాలుడు చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మరణించాడు. మేడ్చల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

40 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం

ఉత్తర్వులు జారీ చేసిన నగర కొత్వాల్

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్‌లో పని చేస్తున్న 40 మంది ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కల్పిస్తూ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల నేపథ్యంలో నగర పోలీసు విభాగానికి గుండెకాయ వంటి టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేశారు. మూడు జోన్ల బృందాలకు అనుభవం ఉన్న, సమర్థులను ఇన్‌స్పెక్టర్లుగా నియమించారు. ఇక్కడ పని చేస్తున్న 15 మందిని మల్టీ జోన్-2కు సరెండర్ చేయగా... ఆ జోన్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మందికి పోస్టింగ్ ఇచ్చారు.

అధికారి	బదిలీ అయిన స్థానం
ఎస్.రాఘవేంద్ర	సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్
కేఎన్ ప్రసాద్ వర్మ	సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్
కె.సైదులు	నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్
కె.చంద్రకుమార్	కాచిగూడ ఇన్‌స్పెక్టర్
జి.నాగరాజు	తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్
వై.అజయ్‌కుమార్	మధురానగర్ ఇన్‌స్పెక్టర్
సీహెచ్ పరశురామ్	మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్
మహ్మద్ ఆసిఫ్	కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్
డి.బాలాజీ	గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్
టి.అశోక్‌కుమార్	మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్
రాజు	చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్
ఎం.శంకర్	తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్
ఎం.అప్పలనాయుడు	నాంపల్లి ఇన్‌స్పెక్టర్

సీవరేజీ లైన్ పనులను సత్వరమే చేపట్టండి



జలమండలి వైఆర్‌గూడ సెక్షన్ మేనేజర్‌తో సమావేశమైన కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: నూతనంగా ప్రతిపాదించిన మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి బుధవారం జలమండలి వైఆర్‌గూడ సెక్షన్ మేనేజర్ శ్యాం దృష్టికి తీసుకువెళ్లారు. వైఆర్‌గూడ సెక్షన్ మేనేజర్ కార్యాలయంలో ఆయనను కలిసిన కార్పొరేటర్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులపై దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా కొత్తగా ప్రతిపాదించిన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.

దెబ్బతిన్న పైప్‌లైన్‌కు మరమ్మతులు



ఎన్‌బీటీనగర్‌లో మరమ్మతు చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఎన్‌బీటీనగర్‌లో జీహెచ్‌ఎంసీ రోడ్డు పనులు చేస్తుండగా జేసీబీ తగిలి బస్తీకి సరఫరా అయ్యే 300 ఎంఎం డయా మంచినీటి పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో మంచినీటి సరఫరా నిలిచిపోయింది. జలమండలి అధికారులు ఈ సమస్యను ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికులకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన వెంటనే పనులు పూర్తిచేయాలని ఎండీ ఆదేశించడంతో జలమండలి జీఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు తదితరులు పైప్‌లైన్ పగిలిన స్థానంలో సిబ్బంది సాయంతో మరమ్మతులు ప్రారంభించారు. 24 గంటల్లోనే దెబ్బతిన్న పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్లు వేసి స్థానికులకు నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఈ వాటర్ లైన్‌లో 1500 కనెక్షన్లు ఉండగా వీరందరికీ ఒక్కరోజు కూడా నీటి ఇబ్బంది లేకుండా త్వరితగతిన పైప్‌లైన్ పనులు పూర్తిచేసి నీటి సరఫరా చేశారు.

ఇళ్ల మధ్య చెత్త తొలగించాలని ఆందోళన

వెంగళరావునగర్: ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త కుప్పలను తక్షణమే తొలగించాలని సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ నాయకుడు సి.హెచ్.చంద్రశేఖర్‌రావు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ యాదగిరినగర్‌లో సీపీఎం నాయకులు బుధవారం పర్యటించారు. వారికి పలు సమస్యలను స్థానికులు వివరించారు. యాదగిరినగర్ బస్తీ దవాఖానా పక్కన ఉన్న చెత్త కుప్పలు తొలగించాలని అన్నారు. ఈ చెత్తకుప్పల పేరుకుపోయి ఉండటం వల్ల దోమలు, పందికొక్కులు, ఎలుకల బెడద ఎక్కువయ్యాయని అన్నారు. ఇంట్లో కనీసం ఉండలేని పరిస్థితి దాపురించిందన్నారు. తక్షణమే వాటిని తొలగించాలని నినాదాలు చేశారు. సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, వై.యాదగిరి, కృష్ణ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు రూ. 25 వేల కోట్లు కేటాయించాలి

లిబర్టీ: బీసీల ఆర్థిక అభ్యున్నతికి తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 25 వేల కోట్లను కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. అన్నింలా దయనీయ జీవితాలు వెళ్లదీస్తున్న బీసీలను, బీసీ కులవృత్తులను కాపాడేందుకు ఆర్థికపురోగతి కల్పించేందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించడం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి గాను పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో ఈ మేరకు నిధులను కేటాయించాలన్నారు.

'మహిళా ద్రోహి కాంగ్రెస్'



మహిళామోర్చా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

బంజారాహిల్స్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి రోజుకో కొత్త కథ చెప్తూ కాలం వెళ్లదీస్తున్నారని మహిళా మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త నీరజ ఆరోపించారు. హామీల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ జూబ్లీహిల్స్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు డొంగారి రాజకళ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సిద్దప్ప హోటల్ దగ్గర సంతకాల సేకరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కొత్త నీరజ మాట్లాడుతూ... మహిళలకు ప్రతి నెలా రూ. 2500లు ఇస్తామన్నారని, ఇంతవరకు మొదలుకాలేదన్నారు. కొత్తగా పెళ్లి చేసుకునే వారికి లక్ష రూపాయలు, తులం బంగారం, కాలేజీకి వెళ్లే వారికి స్కూటీ వంటి ఇస్తామని చెప్పారని, అవి ఇంతవరకు అమలు చేయలేదన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వ మెడలు వంచి హామీలు నెరవేరేలా చూస్తామని చెప్పారు. నాయకులు గడ్డం వెంకటస్వామి, ముద్దంగుల శ్రీనివాస్, రమ్య, మారెమ్మ, లక్ష్మీనరసమ్మ, నాగలక్ష్మీ, లక్ష్మక్క, పారిజాతం, ఇందిరా, పల్లెపు శంకర్, బోయ రామాంజనేయులు, దండగుల శేఖర్, మంజలి నరసింహ, ఆనంద్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎస్‌ఐని వేధించిన సీఐని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్

తెలంగాణ మాల సంఘాల జేఏసీ

హిమాయత్‌నగర్: దళిత ఎస్‌ఐని వేధిస్తూ ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణమైన సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామచందర్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌ను అకారణంగా సీఐ జితేందర్‌రెడ్డి వేధింపులకు గురిచేస్తూ తోటి సిబ్బంది ముందు అవమానపరిచాడని ఆరోపించారు. వీటిని భరించలేని ఎస్‌ఐ శ్రీనివాస్ ఆత్మహత్యకు ప్రయత్నించారని ఆరోపించారు. సీఐ జితేందర్ రెడ్డి వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేసి ప్రస్తుతం యశోద హాస్పిటల్ చికిత్స పొందుతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ఎస్‌ఐ శ్రీనివాస్‌కు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఐ కలిసి వేధింపులకు కారణమైన పోలీస్ సిబ్బందిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌కి న్యాయం జరిగే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్లు, వర్కింగ్ చైర్మన్లు ఎస్.నాను, దాసరి సత్యనారాయణ, శ్రీనివాస్, ఆర్.మల్లేష్,ఎన్.మల్లేష్ బి.యాదయ్య,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ

కాచిగూడ: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, పి.సుధాకర్, నందగోపాల్, రఘుపతి దొడ్డిపల్లిలతో కలిసి ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం బీసీల అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకుండా అన్యాయం చేస్తున్నదని దుయ్యబట్టారు. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్ రూ. 45 లక్షల 90 వేల కోట్లు కేటాయిస్తే బీసీలకు రూ. 2 వేల కోట్లు మాత్రమే కేటాయిస్తే ఏ మూలకు సరిపోతుందని ప్రశ్నించారు. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో నైనా బీసీలను ఆదుకునే విధంగా రూ. 2 లక్షల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాసినట్లు ఆయన పేర్కొన్నారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టాలని కోరారు. ఎస్సీ,ఎస్టీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పిస్తూ బీసీ యాక్ట్ తీసుకురావాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. జనాభా లెక్కలలో బీసీ కులాల వారీగా లెక్కలు సేకరించాలన్నారు.

బీసీల సమస్యలను పరిష్కరించకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తాం...

బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే పార్లమెంట్‌ను ముట్టడిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో పలువురు కేంద్ర మంత్రులను కలిసి బీసీల సమస్యలను వివరిస్తూ వినతి పత్రాలను అందజేసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వరదనీటి సమస్యలపై సమీక్షలేవీ?

- బిక్కుబిక్కుమంటున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు
- ఎన్నికలప్పుడే ప్రజాప్రతినిధుల పర్యటనలు
- 30 ఏళ్ల నాటి పైపులే నేటికీ వినియోగంలో...



రాజ్‌భవన్ రోడ్డులో పోటెత్తుతున్న వరద (ఫైల్)

బంజారాహిల్స్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో వరదనీటి ప్రాంతాలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. భారీ వర్షాలు పడ్డప్పుడు వరదలు రాగానే సంబంధిత అధికారులు హడావిడి చేయడం తప్పితే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో కొత్తగా వరదనీటి కాలువలను నిర్మించడంలో పూర్తిగా విఫలమవుతున్నారు.

> వర్షాలు కురుస్తున్నాయంటేనే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజానీయం భయాందోళనకు గురవుతూ ఉంటుంది. చిన్నపాటి వర్షానికే వరద నీరు రోడ్లపై నిలిచిపోతూ ట్రాఫిక్ స్తంభించిపోతుంది. సమస్య ఏయేటికాయేడు పెరగడమే కానీ, పరిష్కారానికి నోచుకోవడం లేదు.

- ఫలితంగా వరద వచ్చిందంటే జనం కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. వర్షాకాలం కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతి వార్డులోనూ ఒక స్టాటిక్ టీమ్‌ను, ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాటిక్ టీమ్ గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వర్షం పడ్డప్పుడు అక్కడే ఉండి వరద వెళ్లే మార్గాలను క్లియర్ చేయాల్సి ఉంటుంది.
- మ్యాన్‌హోళ్ల మూతలపై, వరదనీటి కాలువల జాలీలపై చెత్తాచెదారం, వ్యర్థాలు, రాళ్లు, బురద, మట్టి పేరుకుపోతే వెంటనే తొలగించి వరద వెళ్లేలా చర్యలు తీసుకున్నారు.
- ఈ స్టాటిక్ టీమ్ వాహనాల్లో నలుగురు కార్మికులు గడ్డపారలు, గంపలు, పారలు అందుబాటులో ఉంచారు. అయితే చాలాచోట్ల వీటి జాడ కనిపించడం లేదు. జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో 12 మేజర్ వాటర్ లాగింగ్ పాయింట్లను, ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధిలో 13 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించారు.
- ఆయా ప్రాంతాల్లో ఎప్పుడూ ఈ టీమ్‌లు అందుబాటులో ఉండేవిధంగా ప్రణాళికలు రూపొందించారు. వరద వచ్చినప్పుడు మాత్రం అరకొర టీమ్‌లు మాత్రమే కనిపిస్తుండగా ఎక్కువగా డీఆర్‌ఎఫ్ టీమ్‌లు, ట్రాఫిక్ పోలీసులు వరదను క్లియర్ చేస్తున్నారు.

మూడు ప్రాంతాల్లో ఆందోళనకరం...

జీహెచ్‌ఎంసీ రికార్డుల ప్రకారం ఖైరతాబాద్ జోనల్ పరిధిలో మూడు ప్రాంతాలు తీవ్ర వరద ప్రాంతాలుగా గుర్తించారు. ఎంఎస్ మక్తా, మారుతీనగర్, గాయత్రీహిల్స్ మేజర్ వల్లరబుల్ కాలనీలుగా నిర్ధారించారు.

- వర్షం పడిందంటే ఈ ప్రాంతాల్లోని ప్రజలు వరదనీటితో బిక్కుబిక్కుమంటున్నారు. ఆకాశంలో మేఘాలు కమ్ముకున్నాయంటేనే వీరి గుండెల్లో దడ పుడుతుంది. ఈ సమస్య గత మూడు దశాబ్దాల నుంచి వీరిని పట్టిపీడిస్తుంది. శాశ్వత పరిష్కారం మాత్రం లభించడం లేదు.

కొత్త పైప్‌లైన్ల ఊసేదీ...

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధుల్లో ప్రతియేటా వర్షాకాలంలో 48 ప్రాంతాల్లో వరదనీటి కష్టాలు స్థానికులను వెంటాడుతున్నాయి. మూడు నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి నివాసాలు, జనవాసాలకు అనుగుణంగా నిర్మించిన చిన్నపాటి వరదనీటి కాలువలు, చిన్న సైజు పైపులే ఇప్పటి జనావాసాలకు అందుబాటులో ఉన్నాయి.

- వాటి స్థానంలో పెద్ద సైజు పైపులు వేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వరదనీరు నిలిచే ప్రాంతాల్లోకి ప్రజా ప్రతినిధులు వెళ్లి సమస్యను తెలుసుకునే ప్రయత్నం కూడా చేయడం లేదు. మీడియాలో వార్తలు, ఫొటోలు రావడం తప్పితే వాటి గురించి చర్చ వీరికి పట్టడం లేదు. కొత్తగా వరదనీటి కాలువలు, పైపులు వేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. కనీస ప్రణాళికలు కూడా కరువయ్యాయి.
- ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య వరదనీటి సమస్యపై సమీక్షలు కూడా ఉండడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రమే ఎమ్మెల్యే, ఎంపీలు, కార్పొరేటర్లు బస్తీలు, కాలనీల్లో తిరుగుతున్నారు తప్పితే వరదలు వచ్చినప్పుడు మాత్రం ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల పర్యటనలు మాత్రం ఉండటం లేదు.
- అధికారుల నిర్వాకం, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారాయి. ప్రభుత్వాలు సైతం ప్రధాన వరదనీటి సమస్యపై దృష్టి పెట్టకుండా చేష్టలుడిగి చూస్తోంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారనంగా ఎన్‌బీటీనగర్ 11కేవీ ఫీడర్ సంజీవయ్య పార్క్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్‌బీటీనగర్, వికార్‌నగర్, ప్రకాశ్‌నగర్, పాటిగడ్డ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏడీఈ వివరించారు.

ఆనంద్‌నగర్ కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో...

ఖైరతాబాద్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ సైఫాబాద్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంట సేపు ఆనంద్‌నగర్, సేట్‌బ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏరియా, పీడీ ఏరియా, పోస్ట్ ఆఫీస్ ఏరియా, తహసీల్దార్ ఆఫీస్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

నమ్మించి ద్విచక్ర వాహనంతో జంప్...

వెంగళరావునగర్: నమ్మించి ద్విచక్ర వాహనం తీసుకుని పరారైన సంఘటన మధురానగర్ పీఎస్ పరధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమరావతి ప్రాంతానికి చెందిన భీమిరెడ్డి రామురెడ్డి శ్రీకృష్ణానగర్‌లో ఉంటూ వివిధ సినిమా షూటింగ్స్‌లో వర్క్ చేస్తుంటాడు. జె.మనోజ్ అనే యువకుడు అతనితో కూడా సినిమా షూటింగ్స్‌లో చేస్తూ కొంతకాలంగా వేరే ప్రొడక్షన్‌లోకి వెళ్లాడు. గత నెల 26న రాత్రి రాముబెడ్డి తన స్నేహితుడితో కలిసి మధురానగర్‌లో టీ తాగుతుండగా మనోజ్ వారి వద్దకు వచ్చాడు. పక్కనే ఉన్న తన స్నేహితుడి వద్దకు వెళ్లి వస్తానని ద్విచక్ర వాహనం కావాలని రాముర్డెడ్డిని అడిగాడు. దాంతో తెలిసిన వ్యక్తి కదా అని తన వాహనాన్ని ఇచ్చాడు. ఎంత సేపటికీ రాకపోవడంతో మనోజ్‌కు ఫోన్ చేశాడు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. అతని కోసం కొన్నిరోజులు వెదికినా అనంతరం తాను మోసపోయానని గ్రహించి బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది..

వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హిమాయత్‌నగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నారాయణగూడ పీఎస్ అడ్మిన్ ఎస్‌ఐ నరేష్ కుమార్ సమాచారం మేరకు... బుధవారం బషీర్‌బాగ్ బాంబే డయింగ్ క్లాత్ షాప్ ఎదురుగా రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని ఓ వ్యక్తి (45)ని ఓ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. సంఘటన స్థలంలో లభించిన టీఎస్09ఈయూ7861 అనే వాహన నంబర్ ప్లేట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ నేరాలపై జీఎస్‌టీ ఉద్యోగులకు అవగాహన



జీఎస్‌టీ కార్యాలయ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

హిమాయత్‌నగర్: లోన్ యాప్, ట్రేడింగ్ మోసాలపై ప్రజలు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని.. అవగాహనతోనే సైబర్ నేరాలకు చెక్ పెట్టవచ్చని నగర సైబర్ క్రైమ్ పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని జీఎస్‌టీ భవన్‌లో ట్రేడింగ్, ఫేక్ లోన్ యాప్‌లు, ఫెడెక్స్, బీఎస్‌ఎన్‌ఎల్, ట్రాయ్, పార్ట్ టైమ్ జాబ్ పేరుతో మోసాలు, సోషల్ మీడియాలో వేధింపులు ఇతర సైబర్ నేరాల పట్ల సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ బోస్ కిరణ్, ఎస్‌ఐ సురేష్‌ల బృందం ఉద్యోగులకు అవగాహన కల్పించారు. క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు, తమ వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, ఆకర్షణీయమైన ఆఫర్లతో ప్రకటనలు చేసే నకిలీ వెబ్‌సైట్లు, లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. పనిచేస్తున్న కంపెనీ వివరాలతో, కస్టమర్ కేర్‌ల పేరుతో వచ్చే నకిలీ ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైనట్లయితే, వారు వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి డయల్ చేసి, లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌ఎస్ అదనపు కమిషనర్, సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... మంగళవారం రాత్రి ఎల్లారెడ్డిగూడలో ఆశిష్ అగర్వాల్ అనే వ్యక్తి గుట్టు చప్పుడు కాకుండా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్నాడు. అతనిని అదుపులోనికి తీసుకుని అతని వద్ద ఉన్న హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ పెద్దది ఒకటి, చిన్నవి మూడు, మరో నాలుగు ఖాళీ చిన్న సిలిండర్లు, ఫిల్లింగ్ కిట్, వేయింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మహిళను బెదిరిస్తున్న వ్యక్తి...

వెంగళరావునగర్: శారీరకంగా కలవకపోతే న్యూడ్ ఫొటోలు బహిర్గతం చేస్తానంటూ ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ఉద్యోగి మహిళను బెదిరిస్తున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వివరాలివీ... ఎర్రగడ్డకు చెందిన ఓ మహిళ, మధురానగర్‌లోని ఓ రియల్ ఎస్టేట్ కంపెనీలో విధులు నిర్వహించే దేవేందర్ యాదవ్ అనే ఉద్యోగితో 2021 నుంచి సన్నిహితంగా ఉంటుంది. ఈ క్రమంలో ఇరువురూ కలిసి అనేక కంపెనీల్లో పని చేశారు. ఈ ఏడాది తొలినాళ్లలో మధురానగర్‌లోని కంపెనీలో ఇరువురూ కలిసి పని చేస్తున్న సమయంలో అనేకమార్లు శారీరకంగా కలిశారు. ఆమె మద్యం సేవించి ఉండగా దేవేందర్ యాదవ్ న్యూడ్ ఫొటోలు తీశాడు. అయితే తనకు రావాల్సిన రూ. 75 వేల జీతం ఇవ్వకపోవడంతో ఆరు నెలల కిందట ఆమె ఉద్యోగం మానేసింది. ఇటీవల ఆమెకు ఫోన్ చేసి తాను తీసిన ఫోటోలను పంపాడు. మళ్లీ తనను శారీరకంగా కలవాలని, లేకపోతే భర్త, పిల్లలకు ఈ ఫోటోలు పంపుతానని బెదిరిస్తున్నాడు. దాంతో మానసికంగా ఆవేదనకు గురైన బాధితురాలు బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

డబుల్ బెడ్‌రూంలు ఇప్పిస్తానని మోసం

వెంగళరావునగర్: డబుల్ బెడ్‌రూంలు ఇప్పిస్తానని పలువురిని మోసగించిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. వివరాలివీ... రహమత్‌నగర్ డివిజన్ కార్మికనగర్‌లో నివసించే గోవిందు డైలీ లేబ. అతనికి ఇందిరానగర్ ప్రాంతంలో నివసించే నర్సింహా అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. తనకు ఇల్లు లేదని గోవిందు చెప్పడంతో రాజకీయంగా తనకు పలుకుబడి ఉందని, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకోసం రూ. 50 వేలు ఇవ్వాలని అడిగాడు. అతని మాటలు నమ్మిన గోవిందు 2023లో తాను రూ. 50 వేలు ఇవ్వడమే కాకుండా మరో ముగ్గురితో కూడా రూ. 1.50 లక్షలు ఇప్పించాడు. ఎన్ని నెలలు గడచినా తమకు మాత్రం నర్సింహా డబుల్ బెడ్‌రూంలు ఇవ్వలేదు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందన లేదు. దీంతో బాధితులు బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

రేపు జాబ్‌మేళా

సనత్‌నగర్: రంగారెడ్డి జిల్లా ఉపాధి కార్యాలయం ఎన్‌సీఎస్ (నేషనల్ కెరీర్ సర్వీసెస్), డాన్‌బాస్కో దిశ సంయుక్తంగా ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. దిశా డైరెక్టర్ ఫాదర్ జస్టిన్, కోఆర్డినేటర్లు ఐవన్ వాజ్, కార్తీక్, రంగారెడ్డి జిల్లా ఎన్‌సీఎస్ యువ అధికారి విజయ్‌కుమార్ వివరాలను వెల్లడించారు. ఎర్రగడ్డ రైతుబజార్ ఎదురుగా ఉన్న సెయింట్ థెరిస్సా ప్రాంగణంలో ఉదయం 10 నుంచి జాబ్‌మేళా కొనసాగుతుందన్నారు. హెటిరో, టెక్ మహీంద్రా, అపోలో హోమ్ హెల్త్‌కేర్, ఎంజీబీ మోటార్ అండ్ ఆటో ఏజెన్సీ, రిలయన్స్ డిజిటల్ వంటి దాదాపు 17 కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఫోన్: 94940 92219, 89771 75394.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి



జెడ్‌సీకి వినతిపత్రమిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. ఈమేరకు బుధవారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతికి విజ్ఞప్తి చేశారు. ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో అనురాగ్ జయంతిని కలిసిన ఆయన సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా బాలిరెడ్డి ప్రధాన రహదారిలో సీసీ రోడ్డు పనులు వెంటనే చేపట్టాలన్నారు. ప్రారంభ దశలో ఆగిన ఇతర రోడ్లను సైతం పూర్తి చేయాలన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ త్వరితగతిన పనులను ప్రారంభించి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని లఖోటియా స్కూల్ ఆఫ్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిజంలో వివిధ కోర్సులను ప్రవేశపెట్టినట్లు ఆ సంస్థ అధిపతి డాక్టర్ కలువాయి అనిత తెలిపారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఫోర్త్ ఎస్టేట్‌గా భావించే జర్నలిజంలో రాణించాలని అందరికీ ఉంటుందని, ఈ పోటీ ప్రపంచంలో రాణించాలంటే సరైన శిక్షణ, విద్య అవసరమన్నారు. ఇప్పటివరకు జర్నలిజంలో ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ఆధిక్యంలో ఉన్నాయని, వాటికి తోడు ఇప్పుడు డిజిటల్ యుగంలో రాణించాలంటే వృత్తి నైపుణ్యత కోర్సులు చాలా అవసరం అన్నారు. డిప్లొమా ఇన్ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, బీఎం, ఎంఏ డిజిటల్ మీడియా అండ్ కమ్యూనికేషన్ కోర్సులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మీడియా రంగంలో అనుభవం కలిగిన అధ్యాపకులచే ఈ కోర్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. వృత్తిలో నైపుణ్యంతో కూడిన విద్యను అందించి ఉపాధి కల్పించడంతో పాటు ఇండిపెండెంట్ జర్నలిస్టుగా నిలదొక్కుకునే విధంగా ఈ కోర్సులు డిజైన్ చేస్తామని చెప్పారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఫోన్: 98854 91914లో సంప్రదించాలన్నారు.

కేఎల్‌హెచ్‌లో సందడిగా స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ



కేఎల్‌హెచ్‌లో కౌన్సెలింగ్ సెషన్

బంజారాహిల్స్: కేఎల్‌హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో మేనేజ్‌మెంట్, హ్యూమానిటీస్, సైన్స్ ప్రోగ్రామ్‌లలో ఆన్–స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ, కౌన్సెలింగ్ సెషన్‌లు బుధవారం ప్రారంభమయ్యాయి. అడ్మిషన్ల ప్రక్రియను సులభతరం చేయడం, విద్యార్థులకు మార్గదర్శకాలను అందించే లక్ష్యంగా కౌన్సెలింగ్ చేపడతామని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ కోనేరు లక్ష్మణ్ హవిష్ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ అవసరాలను తీర్చడానికి రాబోయే అకడమిక్ సెషన్‌లో విశ్వవిద్యాలయం కొత్త ప్రోగ్రామ్స్‌ను ప్రవేశపెడుతుందని వివరించారు. బ్యాంకింగ్, ఫిన్‌టెక్‌లో ఎంబీఏ తదితర కోర్సులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న విజయారెడ్డి

పంజగుట్ట: బోనాల పండగలోపు మహిళలకు ఇబ్బంది కలగకుండా నాణ్యతతో రోడ్డు పనులు పూర్తి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అధికారులకు సూచించారు. బోనాల పండగ స్పెషల్ బడ్జెట్ నుంచి ఖైరతాబాద్ తుమ్మలబస్తీలోని నాసర్ స్కూల్ నుంచి గండమ్మ దేవాలయం వీధి మొత్తం రూ. 35 లక్షల వ్యయంతో వేయనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ చరణ్, సీనియర్ నేత నాగేశ్వర్ రావు, మహిళలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ బోనాల ఉత్సవ కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులు

హిమాయత్‌నగర్: బషీర్‌బాగ్ చంద్రానగర్ బస్తీలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆషాఢ మాస బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఉత్సవ కమిటీ తెలిపింది. బుధవారం దేవాలయ బోనాల ఉత్సవ నూతన కమిటీని నియమించినట్లు బస్తీ పంచ్ కమిటీ అధ్యక్షుడు సల్లా పవన్, జనరల్ సెక్రటరీ జె.నవీన్ కుమార్ తెలిపారు. జులై 28న జరిగే హైదరాబాద్ బోనాల జాతర నేపథ్యంలో ముత్యాలమ్మ ఆలయ బోనాల ఉత్సవ నూతన కమిటీకి సభ్యులను నియమించామన్నారు. రెండు రోజులపాటు ఘనంగా జరిగే ఈ ఉత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అత్యంత భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మకు సేవ చేయాలని వారు కోరారు.

పచ్చదనంతో పర్యావరణాన్ని రక్షిద్దాం

కాచిగూడ: మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టి పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని స్కూల్ అసిస్టెంట్ టీచర్ ఎం.విజయలక్ష్మి అన్నారు. కాచిగూడలోని మార్వాడీ హిందీ విద్యాలయం, హెడ మోడల్ హైస్కూల్ ఆధ్వర్యంలో బుధవారం హరిత హారం ర్యాలీ నిర్వహించారు. చెట్ల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించుకోవాలని సూచించారు. స్కూల్ ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటి కాచిగూడ, ఇసామియాబజార్, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాలుష్యాన్ని తొలగించేందుకు మొక్కల పెంపకం దోహదపడుతుందన్నారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పదోన్నతులు కల్పించాలని వినతి



ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తూ..

పంజగుట్ట: 31 ఏళ్లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్న తమకు ప్రిన్సిపల్స్‌గా పదోన్నతి కల్పించాలని గవర్నమెంట్ జూనియర్ కాలేజీస్ లైబ్రేరియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బి.బాలునాయక్, ప్రధాన కార్యదర్శి ఒ.శివకుమార్ మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ ద్వారా 1994లో ఉద్యోగాల్లో నియమితులమయ్యామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే క్యాడర్‌లో లైబ్రేరియన్స్, ఫిజికల్ డైరెక్టర్స్‌గా పనిచేస్తున్నామని, ఎలాంటి పదోన్నతి ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నంబర్ 302 ప్రకారం, సర్వీస్ రూల్ ప్రకారం తమకు ప్రిన్సిపల్స్ అయ్యే అన్ని అర్హతలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. స్పందించిన కోదండరామ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్.మంజునాయక్, రాములునాయక్, మహిళా విభాగం కార్యదర్శి జ్యోతి, కె.సరస్వతి తదితరులు ఉన్నారు.

పారా అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా వీరయ్య

సాక్షి, సిటీబ్యూరో: పారా అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ముత్తినేని వీరయ్య ఎన్నికయ్యారు. బుధవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ముత్తినేని వీరయ్యను ఎన్నుకున్నారు. సికింద్రాబాద్‌లోని రైల్వే క్రీడా ప్రాంగణంలో మొదటి జూనియర్స్, సబ్ జూనియర్స్ పారా అథ్లెటిక్ చాంపియన్‌షిప్ –2024ను వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం పారా క్రీడలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగ క్రీడలను ప్రోత్సహించే విధంగా క్రీడల్లో పారా క్రీడలను చేరుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయన్నారు. పారా అథ్లెటిక్‌కు సీఎం రేవంత్‌రెడ్డి దిక్సూచిగా మారారన్నారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింగారపు బాబు, జనరల్ సెక్రటరీ గాడిపల్లి ప్రశాంత్, వీల్ చైర్ ఇండియన్ క్రికెట్ టీమ్ హెడ్ కోచ్ సైదులు, పారా క్రికెట్ ఇండియా కోచ్ చంద్రబాన్ గిరి, హెలెన్ కిల్లర్ విద్యా సంస్థలు చైర్మన్ ఉమర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తొలిసారిగా కబ్స్ అండ్ బుల్బుల్స్



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని సౌత్ లాలాగూడ రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ వేదికగా బుధవారం ప్రాంతీయ స్థాయి కబ్స్ అండ్ బుల్బుల్స్ బాల్ మహోత్సవాన్ని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్.ధనంజయులు ప్రారంభించారు. 5 నుంచి 10 సంవత్సరాల వయస్సుగల బాలబాలికలు(కబ్స్, బుల్బుల్స్) బాల్ మహోత్సవంలో పాల్గొంటారు. దక్షిణ మధ్య రైల్వే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా ఆర్.ధనంజయులు భారత్ స్కౌట్స్, గైడ్స్‌లోని వివిధ దళాలు, బాలబలికలను ఉద్దేశించి మాట్లాడారు. స్కౌటింగ్, గైడింగ్ సంస్థకు బాలబాలికలే పునాది, ఈ వయస్సులో వారు డ్రాయింగ్, పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్, యాక్టింగ్, సాహసోపేత కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నైపుణ్యాలను పెంచుకుంటారన్నారు. బాల్ మహోత్సవం వంటి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున వివిధ సంస్కృతులు–వారసత్వానికి చెందిన పిల్లలు కలిసి క్యాంపింగ్ చేయడానికి అవకాశం ఉందన్నారు. హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ పి.కిషోర్‌బాబుతో పాటు పలువురు సీనియర్ స్కౌట్స్–గైడ్స్ అధికారులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతితోనే సమాజ ప్రగతి

బంజారాహిల్స్: మహిళా అభ్యున్నతితోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని మిస్ ఇండియా మానస వారణాసి అన్నారు. బిల్డింగ్ బ్లాక్ గ్రూప్ ఆధ్వర్యంలో 'జయహో వనిత' పేరుతో బీబీజీ 449వ టాలెంట్ ఫ్యాక్టరీ అవార్డుల ప్రధానోత్సవం బంజారాహిల్స్‌లో జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం బీబీజీ ఫౌండేషన్ చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. విశిష్ట వక్తగా హాజరైన బాలలత మాట్లాడుతూ బీబీజీ బంగారు తల్లి ప్రోగ్రాం అద్భుతమన్నారు. బీబీజీ నుంచి ఫౌండేషన్‌కు రూ.15 లక్షల విరాళాన్ని డీజీపీ సృజన కర్ణం, మిస్ ఇండియా మానస చేతులమీదుగా అందజేశారు.

6న మెగా జాబ్‌మేళా

అంబర్‌పేట: నిరుద్యోగ యువత కోసం ఈ నెల 6న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, రాంకీ ఫౌండేషన్, లాయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్(గ్రీన్ ల్యాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు హరిసందీప్, ముప్వ రాంరెడ్డి, లక్ష్మీకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో ప్రముఖ సాఫ్ట్‌వేర్, ఫార్మా కంపెనీలతో పాటు ఇతర పేరొందిన సంస్థలు పాల్గొని వివిధ రకాల ఉద్యోగులను నియమించుకున్నట్లు వారు వెల్లడించారు. జాబ్‌మేళాలో 25 సంస్థలు పాల్గొని 5 వేల ఉద్యోగాలను భర్తీ చేసుకుంటాయని వారు తెలిపారు. రాణిగంజ్ గుజరాతీ హైస్కూల్ బోయగూడలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని అన్నారు. వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్‌సైట్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో సంప్రదించాలన్నారు.

పుష్పక్ ఏసీ జనరల్ బస్సు పాస్

సాక్షి, సిటీబ్యూరో: టీజీఎస్ ఆర్టీసీ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు రూట్‌లో పుష్పక్ ఏసీ జనరల్ బస్సు పాస్‌ను రూ.5 వేలతో ప్రవేశపెట్టింది. శంషాబాద్, ఆరాంఘర్, గచ్చిబౌలి, బాలాపూర్ క్రాస్‌రోడ్, ఎల్బీనగర్, నుంచి రోజువారి ఉద్యోగ నిమిత్తం ఎయిర్‌పోర్టుకు వెళ్లే ఉద్యోగుల సౌకర్యార్థం నెలసరి బస్సుపాస్‌లు అందుబాటులోకి తెచ్చినట్లు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. పుష్పక్ ఏసీ బస్సులు 24 గంటలపాటు ఎక్కువ ఫ్రీక్వెన్సీతో ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. గ్రీన్ మెట్రో లగ్జరీ ఏసీ మంత్లీ బస్‌పాస్ కేవలం రూ.1900లతో ప్రవేశ పెట్టినట్లు తెలిపారు.

హార్టికల్చర్ హబ్



శివారు నుంచి నగరానికి పండ్లు, పూలు, కూరగాయలు

- పంట పొలాల నుంచి మార్కెట్లకు సరఫరా
- ఏడాదిలో 32 వేల టన్నుల కూరగాయలు
- 20 వేల టన్నుల పండ్లు, 1200 టన్నుల పూల సరఫరా
- ఉత్సవాలు, ఫంక్షన్లకు ఉపయోగించే పూలు ఇక్కడివే..
- గత ప్రభుత్వ హయాంలో హార్టికల్చర్ హబ్‌పై హామీ

సాక్షి, సిటీబ్యూరో: శివారు రైతులు పండించే ఉద్యానవన(హార్టికల్చర్) ఉత్పత్తులన్నీ హైదరాబాద్ మహానగరానికి తరలిస్తున్నారు. నగరంలోని బోయిన్‌పల్లి, శామీర్‌పేట సమీపంలోని ఒంటిమామిడి, ఇతర ప్రాంతాలకు రైతులు కూరగాయలు తరలించి విక్రయిస్తున్నారు. వివిధ రకాల పండ్ల ఉత్పత్తులను మాత్రం గడ్డిఅన్నారం, కొత్తపేట పండ్ల మార్కెట్లకు తరలిస్తున్నారు. జర్‌బరా, బంతితో పాటు పలు రకాల పూలను గుడిమల్కాపూర్‌తో సహా నగరంలోని పలు బస్తీలకు తరలించి విక్రయిస్తుంటారు. జర్‌బరా పూలను ఎక్కువగా పెళ్లిళ్లు, ఫంక్షన్లు, ఇతర శుభకార్యాలకు వినియోగించుకుంటారని రైతులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఉద్యానవన పంటల(పండ్లు, పూల, కూరగాయలు) సాగుపై రైతుల దృష్టి మళ్లించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఉద్యానవన పంట సాగుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ వసతి, పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు, రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, రుణాలు తదితర వాటికి కట్టుదిట్టమైన ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

నగరాని 32 వేల టన్నుల కూరగాయలు

శివారుల్లో ఉద్యానవన పంట సాగులో నగరానికి రైతులు 32 వేల టన్నుల కూరగాయలను సరఫరా చేస్తున్నారు. అలాగే, 20 వేల టన్నుల మామిడి, జామ, దానిమ్మ, ద్రాక్ష పండ్ల ఉత్పత్తులను, 1200 టన్నుల పూలు పంట దిగుబడులను కూడా రైతులు నగరానికి సరఫరా చేస్తున్నారు. జర్‌బరా పూల ఉత్పత్తి మాత్రం ఒక హెక్టార్(రెండున్న ఎకరాల)కు ఆరు వేల పూలు వస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. శివారుల్లో ప్రధానంగా ఉద్యానవన పంటలను శామీర్‌పేట, మేడ్చల్, కీసర, ఘట్‌కేసర్, దుండిగల్ గండిమైసమ్మ మండలాల్లో రైతులు అధికంగా సాగు చేస్తున్నారు.

కష్టపడితేనే.. లాభం



ఆకు కూరల సాగు శ్రమతో కూడుకున్నది. పాడితో పాటు సాగు చేస్తే.. చేదోడుగా ఉంటుంది. 24 గంటలు శ్రమ చేయాల్సిందే.. కష్టపడితే లాభం వస్తోంది. పండించిన ఆకు కూరలను ప్రతిరోజూ నగరంలోని మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నాను.

– బొక్క చంద్రారెడ్డి, బొక్కొనిగూడ



12వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు..

శివారుల్లో 12 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటలను రైతులు సాగు చేస్తుండగా, మిగతా వ్యవసాయ భూముల్లో వివిధ రకాల పంటలు పండిస్తున్నారు. ఇందులో 7,500 ఎకరాల్లో కూరగాయ తోటలు, తీగజాతి పంటలు సాగవుతుండగా, 3,500 ఎకరాల్లో మామిడి, జామ, దానిమ్మ, ద్రాక్షతోటలను రైతులు సాగు చేస్తున్నారు. వంద ఎకరాల్లో పాలిహౌజ్(జర్‌బరా పూలు)పంటను పండిస్తున్నారు.

సన్న, చిన్నకారు రైతులే అధికం

శివారుల్లో 28,325 మంది రైతులు ఉండగా, ఎకరం నుంచి రెండు ఎకరాల భూమి కలిగిన రైతులు అధికంగా 19,317 మంది ఉన్నారు. మధ్యతరగతి రైతులు 5,216మంది ఉండగా, మోస్తరు మధ్యతరగతి రైతులు 979 మంది కాగా, 20 ఎకరాల కంటే ఎక్కువ భూమి కలిగిన రైతులు 123 మంది ఉన్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

రైతుల్లో అవగాహన

శివారుల్లో సాధారణ వర్షపాతం 759.6 మీల్లి మీటర్లు ఉండగా, కొన్నేళ్లుగా తక్కువ వర్షపాతం మాత్రమే నమోదవుతోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా అధికార యంత్రాంగం రైతులు వరి పంట సాగు నుంచి ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యానవన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు మార్కెట్ సౌకర్యంతో పాటు ధర లేనప్పుడు పంట నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీ వంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. విత్తనాలు నాటినప్పటి నుంచి ఎరువులు, పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోంది.

నిధుల కోసం రైతుల ఎదురుచూపులు..

మూడుచింతలపల్లి మండల కేంద్రంలో 2020 అక్టోబర్ 29న మాజీ సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ ప్రారంభించిన సందర్భంగా శివారుల్లో హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ప్రతిపాదనలు నివేదించాలని అధికార యంత్రాంగాన్ని కోరగా, ప్రాజెక్టు నిర్వహణ కింద మూడేళ్ల వ్యవధిలో రూ.250 కోట్ల ఖర్చవుతుందని సమర్పించింది. శివారుల్లో మొత్తం 99 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యానవన పంట సాగు చేస్తున్నారని, మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు వేస్తున్నట్లు పేర్కొంటోంది. మూడేళ్లలో అదనంగా 30 వేల ఎకరాల్లో ఉద్యానవన(హార్టికల్చర్) పంట సాగులో భాగంగా ప్రతి సంవత్సరం 10 వేల ఎకరాల చొప్పున దశలవారిగా 30 వేల ఎకరాల్లో హార్టికల్చర్ పంట సాగు పెంచవచ్చని పేర్కొంది. అలాగే, హార్టికల్చర్ శాఖలో ప్రస్తుత అధికారులు, సిబ్బంది సంఖ్యకు అదనంగా ఏడుగురు హార్టికల్చర్ అధికారులు, 10 మంది హెచ్‌ఈఓ పోస్టులు మంజూరు చేయాలని కోరింది. ఈ ప్రతిపాదనలన్నీ పెండింగ్‌లో ఉండటంతో రైతులు ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. శివారుల్లో హార్టికల్చర్‌హబ్‌ను అభివృద్ధి చేసేందుకు తక్షణమే నిధుల విడుదల చేయాలని సర్కారును రైతులు కోరుతున్నారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌కు..



దొండ, కాకర, బీన్స్ నగర సమీపంలోని రైతుబజార్‌తో సహా బోయిన్‌పల్లి మార్కెట్‌కు ఆటోలో తరలిస్తాను. పెట్టుబడి రావాలంటే గిట్టుబాటు ధర ఉండాలి. ధర పలికినప్పుడే కూరగాయలు అమ్ముకోవాలంటే.. నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీ వసతి కల్పించాలి.

– రాంరెడ్డి, బాబాగూడ

హార్టికల్చర్ హబ్‌పై రైతుల్లో ఆశలు

నగర శివారును హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తే.. దశలవారీగా మరో 30 వేల ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగుకు అవకాశం ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మూడేళ్ల వ్యవధిలో ప్రస్తుతం సాగవుతున్న ఉద్యానవన పంటకు అదనంగా 30 వేల ఎకరాల్లోకి సాగు పెంచేందుకు హార్టికల్చర్ శాఖ కూడా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి.. నిధుల కోసం ఎదురుచూస్తోంది.

సాగర్‌లో కనులవిందుగా సెయిలింగ్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హుస్సేన్‌సాగర్ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 38వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్‌లో నావికులు అత్యుత్తమ సెయిలింగ్ నైపుణ్యాలతో అలరించారు. విశాలమైన సాగర్ మీదుగా వీస్తున్న ఈదురుగాలులు, తేలికపాటి చిరుజల్లులను ఎదుర్కొంటూ సెయిలర్స్ మొదటి రోజు పోటీలను ముగించారు. ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ మీదుగా వెళ్లే నగరవాసులు ఈ సెయిలింగ్ పోటీలను ఆసక్తిగా వీక్షించారు. ఈఎమ్ఈ సెయిలింగ్ అసోసియేషన్, లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సెయిలింగ్ వీక్‌లో భాగంగా మొదటి రోజు ఉత్కంఠ భరితమైన ప్రదర్శనలో ఐఎల్‌సీఏ 7 విభాగంలో మోహిత్ సైనీ, ఐఎల్‌సీఏ 6(మహిళా విభాగం)లో రితికా డాంగి, ఐఎల్‌సీఏ 6 (ఓపెన్)లో రామ్ మిలన్, 470 క్లాస్ విభాగంలో శారద వర్మ, ఆర్‌కె శర్మ మొదటి స్థానాలను కైవసం చేసుకున్నారు.

దివ్యాంగుల విద్యపై త్వరలో కమిటీ

పంజగుట్ట: రాబోయే రెండు నెలల్లో దివ్యాంగుల్లో విద్యావంతులతో కమిటీ వేసి ఆయా రకాల వైకల్యాలు ఉన్న వ్యక్తులకు విద్యలో వస్తున్న మార్పుల్లో ఎలా విద్యను అందించాలని నివేదిక తెప్పించుకుంటామని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. రాజ్‌భవన్ కమ్యునిటీహాల్‌లో తెలంగాణ ప్రభుత్వం, ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ఫర్ ది డిసబుల్డ్(ఎఫ్ఈడీ) సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులైన విద్యార్థులకు విద్యను అభ్యసించడంలో ప్రపంచీకరణలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మార్పులు తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై బుధవారం సెమినార్ నిర్వహించారు. ఎఫ్ఈడీ చైర్మన్ గంగారం, ప్రధాన కార్యదర్శి చెరుకు నాగభూషణం, విద్యాశాఖ అధికారులు, వివిధ జిల్లాల నుంచి దివ్యాంగుల కోసం పనిచేస్తున్న మేధావులు పాల్గొన్నారు.

లోతైన వ్యక్తీకరణ ఇనాక్ కవిత్వం..



మాట్లాడుతున్న డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఇనాక్ కవిత్వంలో లోతైన భావవ్యక్తీకరణ, భిన్న సంకేతాలు, ప్రయోగాలు ఉంటాయని ప్రముఖ సాహితవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తెలిపారు. త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై వారం రోజుల పాటు జరుగుతున్న ఆచార్య కొలకలూరి ఇనాక్ 'సాహితీ సమాలోచన సప్తహం'లో భాగంగా ఇనాక్ కవిత్వం ఆయనపై ప్రసంగించారు. ఆధునిక కాలంలో వైవిధ్య ప్రక్రియల్లో రచనలు చేసిన ఇనాక్ కవిత్వ అక్షరం చైతన్యవంతమని వివరించారు. తెలుగు జాతికి ఆచార్య కొలకలూరి ఇనాక్ ఒక వరం, అక్షర స్వరమని కొనియాడారు. అంతేగాకుండా ఆయన బహుగ్రంథకర్త అన్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు డాక్టర్ సౌందర రాజన్ మాట్లాడుతూ.. ఇనాక్ మునివాహనుడు నాటకంలో పూజారి దళితుడిని భుజాలపై మోసుకొని దేవాలయ ప్రవేశం చేయించడం స్ఫూర్తితోనే తాను కూడా అలా స్వయంగా చేశానన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ సూర్యధనుంజయ్, కొలటి దామోదర్‌గుప్తా, కళాజనార్దన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయాలి

పంజగుట్ట: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌ల చిరకాల స్వప్నమైన బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ముదిరాజ్ మహాసభ కోరింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పల్లె బోయిన అశోక్ ముదిరాజ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా అభయహస్తంలో ముదిరాజ్‌లకు పలు హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చారని, కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ఆ జీవోను రద్దు చేశారని గుర్తుచేశారు. వెంటనే బీసీ కమిషన్‌కు ఆదేశాలు ఇచ్చి హామీని అమలు చేయాలని కోరారు. ముదిరాజ్‌ల అభివృద్ధి కోసం ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. సమావేశంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉషాదేవి, యాదగిరి, యూత్ అధ్యక్షుడు పండుగా బాలు, బల్ల సత్తయ్య, కనకయ్య పాల్గొన్నారు.

ఓరెగావ్ స్టేట్ యూనివర్సిటీతో గాడియం స్కూల్ ఎంఓయూ



- అంతర్జాతీయ విద్యావకాశాలే లక్ష్యంగా ఒప్పందం
- గ్లోబల్ లీడర్స్‌గా గాడియం విద్యార్థులు
- స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కీర్తిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని 'ద గాడియం స్కూల్' ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ప్రత్యేకమైన కెరీర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. గాడియం స్కూల్ విద్యార్థులకు అత్యున్నత విద్యావకాశాలను పెంపొందించడంలో భాగంగా కోర్వాలిస్‌లోని ఓరెగావ్ స్టేట్ యూనివర్సిటీ(ఓఎస్‌యూ)తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ప్రతిష్టాత్మక ఓరెగావ్ స్టేట్ యూనివర్సిటీ ఆనర్స్ కళాశాలలో ప్రవేశాలను అందించడమే కాకుండా అర్హులైన విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు పొందే అవకాశాలను కల్పిస్తారు. ఈ సందర్భంగా స్కూల్ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. గాడియం స్కూల్ విద్యార్థులను గ్లోబల్ లీడర్స్‌గా తయారు చేయడానికి విశేష కృషి చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయం ఓఎస్‌యూతో భాగస్వామ్యం కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యంతో గాడియం హైస్కూల్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అంతర్జాతీయంగా విశ్వవిద్యాలయంలో సులభతరమైన ప్రవేశ ప్రక్రియను అందిస్తారు. అమెరికాలోని కోర్వాలిస్‌లో చేరాలనుకునే విద్యార్థులకు యూనివర్సిటీ అందించే స్కాలర్‌షిప్‌లు అవకాశాలను పెంచుతాయని ఆమె వెల్లడించారు. ఎమ్ఓయూలో భాగంగా ఓరెగావ్ స్టేట్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ జయతి వై మూర్తి గాడియం స్కూల్‌ను సందర్శించారు. ఒకప్పటి తన జన్మభూమికి సేవలందించడం, ఇక్కడి ప్రతిభ కలిగిన విద్యార్థులకు అంతర్జాతీయ విద్యావకాశాలను అందించడం పట్ల డాక్టర్ జయతి వై మూర్తి సంతోషాన్ని వ్యక్తపరిచారు.

నిరుద్యోగుల టీజీపీఎస్సీ ముట్టడికి మద్దతు

పంజగుట్ట: యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 5వ తేదీన టీజీపీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చిన నిరుద్యోగులకు సంపూర్ణ మద్దతు ఇస్తూ అందులో భాగస్వామ్యం అవుతామని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ అన్నారు. బీసీ, గిరిజన, దళిత, విద్యార్థి, మహిళా సంఘాలతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, తాను అసలైన న్యాయం చేస్తానని గ్రామాల్లో ప్రచారం చేసుకుని ఓట్లు వేయించుకున్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల నోట్లో మట్టి కొట్టాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేత జీవన్‌రెడ్డి అలగ్గానే మొత్తం కాంగ్రెస్ నాయకులు ఆయన ఇంటికి క్యూ కట్టారని, గాంధీ ఆస్పత్రిలో మోతీలాల్ నాయక్ వారం రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆరోగ్యం క్షీణించినా ప్రభుత్వంలో కనీసం చలనం రాలేదని, ఏ ఒక్కరూ మాట్లాడిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ అశోక్‌నగర్‌లో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. వెంటనే గ్రూప్–2లో రెండు వేల పోస్టులు, గ్రూప్–3లో మూడువేల ఉద్యోగాలను పెంచాలని, గ్రూప్ 1ను 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేయాలని, 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన అధ్యక్షులు సంజీవ్ నాయక్, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, శారదాగౌడ్, కొంపెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజారాం యాదవ్

సమన్వయంతో పనిచేద్దాం..

అధికారులతో ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో ఈవీడీఎం విభాగం, పోలీసులు సమన్వయంతో పనిచేసి నగరంలో వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకుందామని ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్ అన్నారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్‌తో పాటు ట్రై కమిషనరేట్ల (హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ట్రాఫిక్ పోలీస్ అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షపాతం నమోదైనప్పుడు వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ అధికారులు తమ పరిధిలోని ప్రధాన వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి వరద నీటిని త్వరగా తరలించే మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో వర్షాకాలపు సమస్యలతో పాటు ఆక్రమణలకు గురైన ప్రాంతాలు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాల్ని తొలగించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ | గురువారం
| 4 | జూలై | 2024

ఇది మేధో వజ్రం..

ల్యాబ్ గ్రోన్ డైమండ్స్... హై ప్రెజర్ హై టెంపరేచర్ (హెచ్‌పీహెచ్‌టీ), కెమికల్ వేపర్ డిపాజిషన్ (సీవీడీ) అనే రెండు ప్రక్రియల్లో తయారవుతాయి. చిన్న ఉదాహరణ ఏమిటంటే... కోడిగుడ్డు నుంచి పిల్ల బయటకు రావడానికి కోడి 21 రోజులు గుడ్డు మీద పొదగడం అనేది ప్రకృతి సహజ మైన ప్రక్రియ. కోడి గుడ్లను కరెంటు బల్బు వేడితో పొదిగించడం మనిషి సాంకేతికతతో కనిపె ట్టిన ప్రత్యామ్నాయ మార్గం. ఈ ప్రక్రియలో కోడితో పని ఉండదు, కోడి గుడ్డు ఉంటే చాలు. ఇలాంటిదే లాబ్‌లో పెరిగే వజ్రం కూడా. కార్బన్ సీడ్ ద్వారా లాబ్‌లో వజ్రాన్ని తయారు చేయగలి గిన సాంకేతికత మనిషి సొంతమైంది. సైంటిస్టులు, జెమ్మాలజిస్ట్‌ల సంయుక్త పర్యవేక్షణలో డైమండ్ గ్రోయింగ్ గ్రీన్‌హౌస్‌లో ఈ వజ్రాలు తయారవుతాయి.



- సహజ పద్ధతిలో తయారీ
- సీవీడీ, హెచ్‌పీహెచ్‌టీ వంటి రెండు పద్ధతుల్లో...
- ఇకపై అందరికీ అందుబాటులో హైదరాబాద్ మార్కెట్‌లో లభ్యం

- వాకా మంజులారెడ్డి

'వజ్రం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. మన ప్రేమ కూడా అలాగే' అంటూ ఒక ప్రకటనలో ప్రియురాలి వేలికి ఉంగరం తొడుగుతూ ప్రియుడు చెప్పిన డైలాగ్ ఒక తరం మహిళలందరినీ కట్టి పడేసింది. ఆ ప్రక టనలో మహిళ ధరించిన వజ్రపుటుంగరం మహిళాలోకం మదిని దోచుకుంది. 'వజ్రపుటుంగరం, పైగా అంత పెద్ద వజ్రంతో' అని ఆ ప్రకటన మగవాళ్ల హార్ట్‌బీట్ పెంచింది కూడా... అదంతా ఒకప్పుడు. భూగర్భం నుంచి తవ్వి తీస్తే తప్ప వజ్రం దొరకని రోజుల్లో. ఇప్పుడు మ్యాన్‌మేడ్ డైమండ్స్ నగరంలోని ఆభరణాల మార్కెట్‌ను శాసిస్తున్నాయి. ఎల్‌జీడీ, ఎకో ఫ్రెండ్లీ డైమండ్, మ్యాన్‌మేడ్ డైమండ్... పిలిచే పేరు ఏదైనా అది వజ్రమే. సిటీ ఆఫ్ పెరల్స్‌గా పేరు తెచ్చుకున్న హైదరాబాద్ నగరం... ఇప్పుడు మ్యాన్ మేడ్ డైమండ్ ఆభరణాల హబ్‌గా మారుతోంది. ఇప్పుడు నగరంలో జరిగే వేడుకల్లో ఎంగేజ్‌మెంట్ రింగ్, చెవి దిద్దులు, గాజుల్లోనూ ప్రధానంగా ఈ వజ్రాలే ఉంటున్నాయి. నగరంలో మ్యాన్‌మేడ్ వజ్రాల శకం మొదలైంది. ఈ వజ్రాలు హైదరాబాద్ ఆభరణాల మార్కెట్‌ని ముంచెత్తబోతున్నాయి.

ది డైమండ్..
ఇకపై అందరి నేస్తం..



అదే వేడి- అంతే ఒత్తిడి

కార్బన్.. వజ్రంగా మారే ప్రక్రియ అంతా భూగర్భంలోనే జరుగుతుం ది. ఇప్పటి వరకూ మనకు తెలిసిన వజ్రం పుట్టుక ఇది. కార్బన్ సీడ్‌ని లోహపు పలకం మీద ఉంచి ఐదు వేల డిగ్రీల ఫారన్‌హీట్‌తోపాటు తగి నంత ఒత్తిడిని కలిగించడం, మీథేన్ వాయువుతో వ్యాక్యూమ్ చాంబర్‌లో కెమికల్ వేపర్ అందించడం ద్వారా పది - పన్నెండు వారాల్లో అచ్చ మైన అసలు సిసలైన వజ్రం తయారవుతుంది. భూగర్భం నుంచి తవ్వి తీసిన డైమం డ్‌ని మైన్డ్ డైమండ్ అని, డైమండ్ గ్రోయింగ్ గ్రీన్‌హౌ స్‌లో రూపొందిన డైమండ్‌ని మ్యాన్‌మేడ్ డైమండ్ అని వర్గీక రించవచ్చు. వజ్రం పుట్టుకలో ఉన్న రెండు రకా లివి. వజ్రం చేతికి వచ్చిన తర్వాత గ్రేడింగ్, కటింగ్ వంటి ప్రక్రియలన్నీ రెండిం టిలోనూ ఒకే రకంగా ఉం టాయని చెబుతున్నారు హైదరాబాద్‌కు చెందిన జెమ్మాలజిస్ట్ జియా.

ఈకో ఫ్రెండ్లీ..

భూగర్భంలో రూపుదిద్దుకున్న వజ్రాన్ని సేకరించే క్రమంలో వెలు వడే కర్బన ఉద్గారాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయి. గనుల పరిసరాల్లోని వాళ్ల ఆరోగ్యం మీద కూడా దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. మైనింగ్ ప్రక్రియలో పాల్గొనే వ్యక్తుల ప్రాణాలను కూడా ఫణంగా పెట్టాల్సిన పరిస్థితులు ఉంటాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని మ్యాన్‌మేడ్ డైమండ్స్‌ని ఈకో ఫ్రెండ్లీ డైమం డ్స్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రకృతి ప్రేమికులు, పర్యావరణ కార్య కర్తలు ఈకో ఫ్రెండ్లీ డైమండ్స్‌నే ప్రోత్సహిస్తున్నారు.

ఫోర్ సీలే ప్రామాణికం..

కట్, క్లారిటీ, కలర్, క్యారట్... ఇవి నాలుగూ డైమండ్‌కి ప్రామాణికాలు. ఈ నాలుగు ప్రామాణికతల పట్టిక ల్యాబ్ డైమండ్‌లోనూ ఉంటుంది. కాబట్టి పర్యావరణానికి, మనుషుల ఆరోగ్యానికి హాని కలిగించని వజ్రా లకు యూఎస్, యూకేలు ఇప్పటికే అధికారిక ఆమోదాన్నిచ్చాయి. గతేడాది భారత ప్రభుత్వం కూడా తన ఆమోదాన్ని పార్లమెంట్ సాక్షిగా ప్రకటిం చింది. పర్యావరణహితమైన జీవనశైలిని కోరుకునే వాళ్లు ఈ డైమండ్స్‌కే ప్రాధాన్యం ఇస్తారని ఆశా భావం వ్యక్తం చేశారు కేంద్రమం త్రి నిర్మలాసీతారామన్. విదేశాల నుంచి దిగుమతులను నిలువ రిస్తూ దేశీయ అవసరాలకు తగినంత ఉత్పత్తిని పెంచడం ద్వారా ధరను అందుబాటు లోకి తీసుకురావడంతో దేశీయ నిపుణులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారామె.





సామాన్యుల చెంతకు...

వజ్రాల పరిశ్రమలు థర్మల్ కండక్టివిటీ, కటింగ్ టూల్స్, హీట్ సింక్స్ వంటి తమ పారిశ్రామిక అవసరాలకు కూడా మ్యాన్‌మేడ్ డైమండ్స్ మీదనే ఆధార పడుతున్నాయి. వజ్రాల పరిశ్రమ కూడా మనుషుల ఆరోగ్యం, ప్రాణాలకు ముప్పు వాటిల్లని నైతికమార్గంలో తయారవుతున్న వజ్రంగా మ్యాన్‌మేడ్ డైమండ్‌నే గుర్తిస్తోంది. ఒకప్పుడు సంపన్నులకే పరిమితమైన వజ్రం ఇకపై సామాన్యుల చెంతకు చేరనుంది. హైదరాబాద్ నగరవాసుల్లో కొనుగోలు శక్తి పెరిగింది. మ్యాన్‌మేడ్ డైమండ్ కాంతులు యువకుల వేళ్లను మెరిపిస్తు న్నాయి, యువతుల చెవులకు సప్తవర్ణ కాంతులను అద్దుతున్నాయి.




ఫ్లాలెస్ వజ్రాలివి!

క్వాలిఫైడ్ జెమ్మాలజిస్టుగా నా పాతికేళ్ల అనుభవంలో నేను గుర్తించిదేమిటంటే... ఫ్లాలెస్ డైమండ్స్ మ్యాన్‌మేడ్‌లోనే వస్తు న్నాయి. భూగర్భంలో కార్బన్ వజ్రంగా మారే క్రమంలో వజ్రంలో ఇన్‌క్లూజ న్స్(ధూళి రేణువులు చేరి చుక్కలు, సన్నని గీతలుగా కనిపించడం) ఏర్పడు తుంటాయి. వందలో ఒకటి - రెండు మాత్రమే ఫ్లాలెస్ వజ్రాలుంటాయి. మ్యాన్‌మేడ్ డైమండ్స్‌లో సగానికి పైగా ఫ్లాలెస్ క్వాలిటీతో ఉంటున్నాయి. కార్బన్ వజ్రంగా మారడానికి ఏర్పాటు చేసిన గ్రీన్‌హౌస్‌లు స్వచ్ఛమైన వాతావ రణాన్ని కలిగి ఉండడం కూడా ఇందుకు కారణం అని చెప్పవచ్చు. ఒకప్పుడు వజ్రం అంటే భూగర్భం నుంచి తవ్వి తీసినది మాత్రమే కావడంతో లభ్యత తక్కువగా ఉండేది. ఇప్పుడు మార్కెట్ అవసరాలకు తగినన్ని వజ్రాలు తయార వుతున్నాయి. ధర విషయానికి వస్తే... మైనింగ్ ఖర్చులు కలుపుకుని ధర నిర్ణ యించాల్సి ఉంటుంది కాబట్టి మైన్డ్ డైమండ్ ధర ఎక్కువగా ఉంటుంది. మైనింగ్ ఖర్చులు లేకపోవడంతో మ్యాన్ మేడ్ డైమండ్స్ ధర మైన్డ్ డైమండ్‌తో పోలిస్తే తక్కువగా ఉంటోంది. అదే క్వాలిటీతో ధర తక్కువలో లభిస్తుండ డంతో వజ్రాన్ని ధరించాలనే వారి కల సులువుగా నెరవేరుతోంది.

- జియా, జెమ్మాలజిస్ట్, హైదరాబాద్

సం'గీతా' మాధుర్యం..



ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ గీతా మాధురి..మొద టిసారి తన సొంత మ్యూజిక్ బ్యాండ్ లైవ్ మ్యూజిక్‌తో నగరవాసు లను సంగీతసాగరంలో ముంచెత్తనున్నారు. ఈ నెల 12న నగరంలోని ఓడియం ప్రిజమ్ వేది కగా నిర్వహిస్తున్న లైవ్ మ్యూజిక్ కన్సర్ట్‌లో ఆమె స్వరాలతో అలరించనున్నారు. ఈ నేపథ్యంలో సింగర్ గీతా మాధురి మాట్లాడుతూ., సంగీత ప్రియులను సంతృప్తి పరచ డానికి వారికి అత్యంత ఇష్టమైన పాటల లిస్టును తయారు చేసుకుంటు న్నానని తెలిపారు. ఎస్‌వీఎమ్ గ్రాండ్, వేదమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో నిర్వహించ నున్న ఈ మ్యూజిక్ లైవ్ కన్సర్ట్‌లో పాడటానికి ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నానని గీతా మాధురి పేర్కొన్నారు. రాత్రి 8 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, బుక్ మైషోలో దీనికి సంబంధించిన టికెట్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



త్రీ ఐఐటీయన్స్ ఇన్ ఎ బోట్..

నగరంలో స్టాండప్ కామెడీ షోలకు పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో సోలోగా చేసే షోలతో పాటు ఇద్దరు..ముగ్గురు కలిసి అందించే ప్రదర్శనలు కూడా హిట్ అవుతున్నాయి. అదే క్రమంలో సమర్థ్ సరస్వత్, యాష్ బజాజ్, క్రితార్థ్ ఝా అనే ముగ్గురు కమెడియన్స్ కలిసి అందిస్తున్న 'త్రీ ఐఐటీయన్స్ ఇన్ ఎ బోట్' ప్రత్యేక హాస్య ప్రదర్శనను ఫిల్మ్ నగ ర్‌లోని ఆరోమేల్ కేఫ్ అండ్ క్రియేటివ్ కమ్యూనిటీ ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం గంటన్నర పాటు కొనసాగుతుంది.



కరావొకే నైట్..

పాటలు విని ఆనందించడమే కాదు సామూహికంగా పాడి ఆనందించే వారి కోసం నిర్వహించే కరావొకే నైట్ ఆహ్వానం పలుకుతోంది. నగరంలోని గచ్చిబౌలిలో ఉన్న అంజయ్యనగర్‌లోని కృష్ణా స్టూడియోలో ఈ కార్యక్రమం ఆదివారం జరుగుతుంది. ఓపెన్ మైక్ కాన్సెప్ట్‌తో సాగే ఈ కార్యక్రమంలో పలువురు ఔత్సా హిక గాయనీ గాయకులు సైతం పాల్గొంటారు.

హైసెన్స్ నుంచి ఎక్స్‌పీరియన్స్‌డ్ జోన్స్...

గృహోపకరణ ఉత్పత్తులకు పేరొందిన హైసెన్స్.. తన ఉత్పత్తులను విస్తరిస్తూనే, వాటికి మరింతగా అత్యాధునిక టెక్నాలజీ జత చేయనుంది. ఈ విషయాన్ని సంస్థ సీఈఓ పంకజ్ రానా తెలిపారు. అంతేకాకుండా నగరవా సుల కోసం ప్రొడక్ట్ ఎక్స్‌పీరియన్స్‌డ్ జోన్స్‌ను ఏర్పాటు చేయను న్నామని, దేశవ్యాప్తంగా ఇలాంటివి 1,000కిపైగా నెలకొల్పనున్నామని వివరించారు.

ఎక్స్‌ట్రా.. ఎఫెక్ట్

సాక్షి, సిటీబ్యూరో

నగరాల్లో ఎక్స్‌ట్రా ఇన్‌కమ్ కోసం మల్టీ జాబ్ కల్చర్ పెరుగుతోం ది.. ఒక సంస్థలో ఉద్యోగిగా ఉంటూనే మరో సంస్థలో కూడా పనిచేసే మల్టీ జాబ్ కల్చర్ పేరే... 'మూన్ లైటింగ్'... కరోనా అనంతరం వర్క్ ఫ్రమ్ హోమ్ నుంచి పుట్టుకొచ్చిన ఈ సంస్కృతి ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తూ... నగరంలోనూ కనిపిస్తోంది. నాలుగు చేతులా సంపాదించడం ఎలా ఉన్నా... నానా రకాల అనారోగ్యాల పాలుకావడానికి ఇదే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు.

తీవ్రపరిణామాలు తప్పవు...

తమ ఉద్యోగ పనివేళలు అయిపోయాక రెండో ఉద్యోగం చేయడం.. గత కొంత కాలంగా ఐటి సం బంధిత రంగాల్లో ఎక్కువగా, ఇతర రంగాల్లో కొద్దిగా కనిపిస్తోంది. ఈ మూన్‌లైటింగ్ సంస్కృ తిపై... పలు బహుళజాతి కంపెనీలు విధానపర మైన ఆదేశాలనూ జారీ చేశాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన కంపెనీల వల్ల అనేకమంది ఉద్యో గాలు కోల్పోయారు. నైతికంగా ఇది తప్పా.. ఒప్పా అనేది పక్కన పెడితే న్యాయవ్యవస్థ దీని చట్టబద్ధతను త్వరలో తేల్చనుంది. మరోవైపు ఇప్పటికే ఇది వ్యవస్థలో వేళ్లూనుకుంటుండ డంతో... దీని లాభనష్టాలను కూడా యువత చవిచూస్తోంది.

వారానికి 60 పని గంటలకు మించితే అనర్థాలే	ఒత్తిడి హార్మోన్లతో ఆందోళన, డిప్రెషన్	నగరానికి చెందిన వైద్య నిపుణుల హెచ్చరికలు

వారానికి 60 గంటలు మించితే..

అనతికాలంలోనే విజృంభించిన మల్టిపుల్ జాబ్స్ ట్రెండ్ వల్ల కలిగే అదనపు ఆదాయాలను లెక్కించే పనిలోనే అందరూ మునిగిపోయారు. ఇప్పటి దాకా దుష్ప్రభావాల గురించి పెద్దగా చర్చ లేదు. అయితే, వారానికి 60 గంటలకు మించి పనిచేస్తే మెదడు, గుండె మీద తీవ్ర ప్రభావం పడుతుంద ని.. ఒక్కోసారి అవి శాశ్వతంగానూ దెబ్బతినే ప్రమాదం లేకపోలేదని వైద్యనిపుణులు హెచ్చరి స్తున్నారు. ఒకేసారి రెండు ఉద్యోగాలు చేయడం, వాటిలో ఉండే పని ఒత్తిడి, పైగా ఆ విషయాన్ని రహస్యంగా ఉంచాల్సి రావడం... ఇవన్నీ మెదడు, గుం డెను దెబ్బతీస్తున్నాయని స్పష్టం చేస్తున్నారు.



పెరుగుతున్న బాధితులు...

- లక్షలాది మంది టెక్నాలజీ నిపుణులకు నిలయమైన నగరంలోని ఆస్పత్రులకు ఇప్పుడు మూన్‌లైటింగ్ దుష్ప్రభావాలతో వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. దీనిని ఉచ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ డైరెక్టర్, చీఫ్ ఫిజియోథెరపిస్ట్, రిహాబిలిటేషన్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ బత్తిన ధృవీకరిం చారు,
- 'బ్రెయిన్ స్ట్రోక్ లేదా గుండెపోటుకు గురైన, లేదా ఏదైనా శస్త్రచికిత్స చేయించుకుని మా పున రావాస కేంద్రానికి వస్తున్న వారిలో ఎక్కువ మందిని ఈ మల్టిపుల్ జాబ్స్ బాధితుల్నే చూస్తున్నాం. వీరిలో ఐటీ నిపుణులు, అందు లోనూ ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు చేస్తు న్నవారు, రాత్రుళ్లు సైతం నిద్ర లేకుండా, వారానికి 60 గంటలకు పైగా పనిచేస్తూన్న వారే అధికంగా ఉన్నారు. ఈ కొత్త కల్చర్...ఉద్యో గుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోం దని తెలుస్తోంది. అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

విశ్రాంతీ అవసరమే...

ఎక్కువ గంటలు పనిచేయడం దీర్ఘకాలిక ఒత్తిడికి దారితీస్తుంది. ఇది నాడీ సమస్యలతో సహా అనేక ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. మెదడులో ప్రి-ఫ్రంటల్ కార్టెక్స్‌లో వాల్యూమ్ తగ్గడం వంటి మార్పులకు కూడా కారణమవుతుంది. దీనివల్ల సరైన నిర్ణయం తీసుకోవడం, ప్రణాళిక, ప్రేరణ నియంత్రణ సామర్థ్యాలను దెబ్బతీస్తుంది. ఈ సం దర్భంగా అమోర్ ఆస్పత్రి కన్సల్టెంట్ న్యూరాల జిస్టు డాక్టర్ మనోజ్ వాసిరెడ్డి మాట్లాడుతూ ఒత్తిడికి గురైనప్పుడు కార్టిసాల్, అడ్రినలిన్ హార్మోన్లు విడు దలవుతాయి. వీటివల్ల ఆందోళన, డిప్రెషన్ వస్తాయి. నిరంతర ఆందోళన లేదా నిరాశ వల్ల రక్త పోటు అధికమై గుండెపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపు తుంది. జీవితం-పని బ్యాలెన్స్ గురిం


బోడుప్పల్‌లో నివసించే ప్రవీణ్..కరోనా సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేశాడు. అదే సమ యంలో తమ కంపెనీతో పాటు మరో రెండు కంపెనీలకు కూడా ఫ్రీలాన్స్‌గా పనికి కుది రాడు. హ్యాపీగా ఇంట్లోనే కూర్చుని మూడు జాబ్‌లూ చేస్తూ ట్రిపుల్ ఇన్‌కమ్ ఎంజాయ్ చేస్తూ వచ్చాడు. పైగా ఎక్స్‌ట్రా జాబ్స్ విషయం ఇంట్లో వారికి తెలీదు కాబట్టి వాటి వల్ల వచ్చే ఆదాయం పూర్తిగా ప్రవీణ్ సొంతం. ఎలా ఖర్చుపెట్టుకున్నా అడిగేవారు లేరు... కట్ చేస్తే... ఇటీవలే తీవ్ర అనారోగ్యానికి గురైన ప్రవీణ్ కొండాపూర్‌లోని ఒక రిహాబి లిటేషన్ కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. నగరంలో మల్టిపుల్ జాబ్స్ కల్చర్ వల్ల దెబ్బతింటున్న యువతకు ప్రవీణ్ ఓ ఉదాహరణ మాత్రమే.



చి యువత తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఎక్కువ గంటలు పనిచేసే ప్రొఫెషనల్స్ శారీరకం గా, మానసికంగా ఆరోగ్యానికి వ్యాయామాలు చేయాలని సూచిస్తున్నారు.

సూచనలు

- ఒక వ్యక్తి ఎంత ఎక్కువగా పనిచేస్తే, రోజువారీ ఒత్తిడి నుంచి కోలుకోవడానికి, పునరుత్తేజం పొందడానికి అతనికి అంత ఎక్కువ విశ్రాం తి అవసరం.
- ఒకటి కంటే ఎక్కువ ఉద్యో గాలు చేసేటప్పుడు మన గురించి మనం పట్టించు కోవడం కూడా ఒక బాధ్యతగా గుర్తించాలి.
- పనికీ పనికీ మధ్య తగిన విరామం తీసుకోవ డం, తగినంత నిద్రపోవడం, ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం లేదా ధ్యానం వంటి ఒత్తిడిని తగ్గించే అలవాట్లను అనుసరించాలి.



క్లుప్తంగా...

ఏపీపీఎస్సీ చైర్మన్ సవాంగ్ రాజీనామా

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిష్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. 2025 జూలై 9 వరకు పదవీ కాలం ఉండగా.. కూటమి ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకు పదవి నుంచి ఆయన తప్పుకున్నారు. తన రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేశారు.

ఏపీలో గ్రూప్-2 మెయిన్స్ వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలనుఏపీప్రభుత్వం వాయిదా వేసింది. ఈనెల 28న జరగాల్సిన మెయిన్స్‌ను పరిపాలనాపరమైన కారణాలతో వాయిదా వేస్తున్నట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, గతంలో జరిగిన ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీ ఉద్యోగ వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అన్న ప్రసాదాల తయారీలో మార్పులు అవాస్తవం: టీటీడీ

తిరుమల: తిరుమలలో అన్న ప్రసాదాల తయారీలో మార్పులు చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ''తిరుమల శ్రీవారికి నివేదించే అన్నప్రసాదాల తయారీకి సేంద్రియ బియ్యం వాడకాన్ని నిలిపివేసి, గతంలో వినియోగించే బియ్యాన్ని వాడాలని టీటీడీ నిర్ణయించిందని, అదేవిధంగా అన్నప్రసాదాల దిట్టం కూడా పెంచాలని టీటీడీ నిర్ణయించింది''అని సామాజిక మాధ్యమాల్లో ఒక వార్త ప్రచారం అవుతోందని, ఇది పూర్తిగా అసత్యమని పేర్కొంది. టీటీడీ ఈవో శ్యామలరావు మొన్న అర్చక స్వాములు, ఆలయ అధికారులతో సమావేశమై స్వామివారికి నివేదించే అన్న ప్రసాదాల గురించి, వాటి దిట్టం గురించి సుదీర్ఘంగా చర్చించారనీ, అంతే తప్ప వీటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది.

ఉత్తర తెలంగాణలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ క్యాంపస్

- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బి.వినోద్ లేఖ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని గ్రామీణ, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు వరంగల్ లేదా కరీంనగర్‌లో హైదరాబాద్ విశ్వవిద్యాలయం శాటిలైట్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్ కోరారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు బుధవారం ఆయన లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని గ్రామీణ, పట్టణ ప్రాంతాల నడుమ విద్యాపరమైన అంతరాలను తొలగించాలన్నారు. పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ, నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, నల్సార్, వంటి కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థల తరహాలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో తెలంగాణ విద్యార్థులకు స్థానిక కోటా ప్రవేశ పెట్టాలని విజ్ఞప్తిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) లో వెనుకబడిన జిల్లాలకు చెందిన విద్యార్థులకు డిప్రివేషన్ పాయింట్లు కేటాయించిన తరహాలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోనూ స్థానికులకు ఇవ్వాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (క్యూయెట్), యూజీసీ నెట్, జేఆర్‌ఎఫ్ పరీక్షలను మాతృభాషలో నిర్వహించాలని వినోద్ పేర్కొన్నారు.

బాబు భూ దోపిడీ ఖజానా!

అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం అరాచకాలు

- యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ భూముల దురాక్రమణ
- శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు బుట్టదాఖలు
- 'రాజధాని లీక్స్'పేరిట బురిడీ
- పక్కా పన్నాగంతో అమరావతి ఎంపిక
- బరితెగించి ఇన్‌సైడర్ ట్రేడింగ్..
- భయపెట్టి భూ మాయాజాలం
- అమరావతి కేంద్రంగా ఎల్లో గ్యాంగ్ రూ.లక్షల కోట్ల కుంభకోణం
- రాజధానిలో భూ బాగోతాలను కప్పిపుచ్చేందుకే శ్వేతపత్రం డ్రామా



సాక్షి, అమరావతి: ''ఏ''అంటే.. అమరావతి అని వక్కాణిస్తున్న సీఎం చంద్రబాబు రాజధాని ముసుగులో తన అవినీతి, అరాచకాలకు కేంద్రంగా చేసుకున్నారు! బరి తెగించి తాను పాల్పడిన అవినీతికి అక్షయ పాత్రలా మార్చారు! నాటి తెల్ల దొరలే తెల్లబోయేలా వ్యవహరించారు! బ్రిటీష్ పాలకుల సామ్రాజ్యవాద దోపిడీని మరిపిస్తూ టీడీపీ పెద్దలు సాగించిన భూ దోపిడీకి నిలువెత్తు సాక్ష్యం అమరావతి... బడుగులు, పేదలకు స్థానం లేకుండా చంద్రబాబు సృష్టించుకున్న నయా జమీందారీ వ్యవస్థకు నిదర్శనం అమరావతి! పచ్చ రాబందులు గుప్పిట పట్టిన రూ.లక్షల కోట్ల విలువైన భూ ఖజానా అమరావతి! దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ దోపిడీకి మౌనసాక్షి అమరావతి!! ఈ భూ బాగోతాలు, తన నిర్వాకాలను కప్పిపుచ్చి మభ్యపెట్టేందుకే తాజాగా అమరావతిపై శ్వేతపత్రం అంటూ మరో డ్రామాకు చంద్రబాబు తెర తీశారు.

మోయలేని భారం మోపుతూ...

రాజధానిగా అమరావతి ఎంపిక చేసిన ప్రాంతం ఇటు విజయవాడ కాదు.. అటు గుంటూరూ కాదు. మూడు పంటలు పండే సారవంతమైన పంట పొలాల్లో నిర్మాణ వ్యయం తడిసి మోపెడవుతుందని చంద్రబాబు అండ్ కో కట్టిన లెక్కలే చెబుతున్నాయి. ఒక్క ఎకరాలో కనీస మౌలిక వసతుల కల్పనకు (బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రూ.2 కోట్లు వ్యయం అవుతుందని, మొత్తం రాజధాని ప్రాంతం అభివృద్ధి చేయడానికి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చవుతుందని అప్పట్లోనే అంచనా వేశారు. ఏటా ఆ వ్యయం పెరగడమే కానీ తగ్గదు. విభజన అనంతరం రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత భారీగా నిధులు ఖర్చు చేయడం సాధ్యమయ్యే పని కాదని నిపుణులు చేసిన హెచ్చరికలను చంద్రబాబు పట్టించుకోలేదు. తాజాగా భారీగా నిధులు అవసరమంటూనే.. వివరాలు సేకరిస్తామని చెబుతున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన టీడీపీ ప్రభుత్వం.. సంపదను ఎలా సృష్టించి రాజధాని నిర్మాణం చేస్తుందనే ప్రశ్నకు జవాబు లేదు.

భూములు లాక్కుని గాలి మేడలు..!

అమరావతి వేదికగా చంద్రబాబు సాగించిన భూ దందాను అప్పట్లోనే నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అనువైనది కాదని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టం చేసింది. ఏడాదికి మూడు పంటలు పండే భూములను నాశనం చేయవద్దని పర్యావరణవేత్తలు అభ్యంతరం చెప్పారు. జీవనాధారమైన తమ భూములను కొల్లగొట్టవద్దని బడుగు, బలహీనవర్గాలు, పేద రైతులు వేడుకున్నారు. వారి విన్నపాలను బేఖాతర్ చేస్తూ చంద్రబాబు భారీ భూదోపిడీకి తెరతీశారు. అసైన్డ్ భూములను బినామీల ద్వారా హస్తగతం చేసుకుని పరిహారం ప్రకటించుకున్నారు. 2014-19 మధ్య రాజధాని పేరిట అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం చేయని దురాగతం లేదు. అదిగో రాజధాని.. అల్లదిగో అమరావతి..! అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. అంతకుముందు పక్కా పన్నాగంతో రాజధాని అక్కడ.. ఇక్కడ అంటూ పలు ప్రాంతాల పేర్లను తెరపైకి తెచ్చి సామాన్యులను బురిడీ కొట్టించారు. మరోవైపు ముందస్తుగా తాము భూముల కొనుగోలు చేసిన అమరావతిలో బినామీ మాఫియాను వ్యవస్థీకృతం చేశారు. అంతర్జాతీయ స్థాయి రాజధాని.. ఆకాశ హర్మ్యాల నగరం అంటూ గాలిలో మేడలు కట్టి రైతుల కాళ్ల కిందున్న భూమిని కాజేశారు.

పచ్చ దండు దురాక్రమణ..

దేశంలోనే కాదు ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీకి చంద్రబాబు బరి తెగించారు. రాజధాని ప్రచారంతో మాయాజాలం... భూసమీకరణ ముసుగులో దోపిడీ... అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, లంక భూముల స్వాహా... ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి మలుపులు... అస్మదీయులకు యథేచ్ఛగా భూ పందేరాలు... ఇలా ఒకటేమిటి ఎన్ని రకాలుగా భూదోపిడీకి పాల్పడవచ్చో అన్ని విద్యలూ ప్రయోగించారు. అమరావతిపై చంద్రబాబు 'పచ్చ దండు'దండయాత్ర చేసి రూ.లక్షల కోట్ల విలువైన భూముల దురాక్రమణకు పాల్పడింది. చంద్రబాబుతోపాటు ఆయన కుటుంబ సభ్యులు, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు, టీడీపీ నేతలు, వారి బినామీలు అమరావతి భూములపై వాలిపోయారు. చంద్రబాబు, లోకేశ్‌తోపాటు నారాయణ, సుజనా చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మాగుంట మురళీమోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామకృష్ణ, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావు.. ఇలా పచ్చ దండు అంతా అమరావతిలో భూములను కొల్లగొట్టింది. అన్యాయంగా, ఏకపక్షంగా విభజనకు గురై కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఆదిలోనే హంసపాదులా అభివృద్ధికి గండి కొట్టారు. తాత్కాలిక రాజధాని భవనాల పేరుతో కనికట్టు చేశారు.

మభ్యపుచ్చే యత్నాలు..

నాడు ఐదేళ్లలో భూముల దోపిడీకి పాల్పడటం మినహా టీడీపీ పెద్దలు రాజధాని కట్టింది లేదు.. అభివృద్ధి చేసింది లేదు. చంద్రబాబు బృందం సాగించిన భూ దోపిడీ ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతోసహా బట్టబయలైంది. సీఐడీ న్యాయస్థానాల్లో చార్జిషీట్లు కూడా దాఖలు చేసింది. ఇక న్యాయ విచారణ ప్రక్రియ కొనసాగితే చంద్రబాబుకు యావజ్జీవ ఖైదు ఖాయమని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అధికారంలోకి రాగానే చంద్రబాబు సరికొత్త కుట్రలకు పన్నాగం పన్నుతున్నారు. అమరావతిలో తన భూ బాగోతాన్ని కప్పిపుచ్చేందుకు శ్వేతపత్రం పేరుతో డ్రామాకు తెరతీశారు. రాజధాని నిర్మాణానికి తాను ఏం చేస్తానో చెప్పకుండా ఊకదంపుడు ఉపన్యాసంతో ఊదరగొట్టారు. రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. కానీ అమరావతి పేరిట చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన దోపిడీ దాచేస్తే దాగేది కాదు. ఇప్పటికే పూర్తి ఆధారాలతో సహా చార్జిషీట్ల రూపంలో నిక్షిప్తమైందన్నది నిఖార్సైన నిజం.

విరాళాలు, ఆస్తుల అమ్మకం

రాజధాని నిర్మాణానికి ఇలా నిధులు సమకూర్చుకుంటాం

- శ్వేతపత్రం విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు
- పాత ప్లాన్ ప్రకారమే అమరావతి నిర్మాణం
- పూర్తి చేయడానికి టైమ్ బాండ్ లేదట..
- ఎన్నేళ్లు పడుతుందో తెలీదట.. చేసుకుంటూ వెళతారట..
- ఏ లెక్కన ఇది ప్రజా రాజధానో శ్వేత పత్రంలో చెప్పని వైనం

'అసైన్డ్' ఆక్రమణ

బడుగుల భూముల్లో వాలిన పచ్చ గద్దలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను భయపెట్టి దోపిడీ..

బినామీల పేరిట అక్రమ జీపీఏ రిజిస్ట్రేషన్లు

రూ.5,500 కోట్ల విలువైన 1,100 ఎకరాలు హస్తగతం

'రింగ్'లో మింగారు!

- ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చేసి తమ భూములకు రెక్కలు
- ముందే ఖరారు చేసి కన్సల్టెన్సీ ద్వారా రాజముద్ర
- రూ.2 వేల కోట్లకుపైగా టీడీపీ పెద్దల దోపిడీ
- క్విడ్‌ప్రో కో కింద హెరిటేజ్‌కు భూములు
- పూర్తి ఆధారాలతో వెలికితీసిన సీఐడీ
- ఏ-1 చంద్రబాబు.. ఏ-2 నారాయణ, ఏ-3 లింగమనేని, ఏ-14 లోకేశ్

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

యువతిపై లైంగికదాడి

మియాపూర్ పీఎస్‌లో కేసు నమోదు

మియాపూర్(హైదరాబాద్): ఓ రియల్‌ఎస్టేట్ కంపెనీలో పనిచేస్తున్న ఓ యువతిపై..అదే కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా పనిచేస్తున్న ఇద్దరు లైంగిక దాడి చేశారు. మియాపూర్ సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... కడప జిల్లాకు చెందిన ఓ యువతి(25) ఉప్పల్‌లో ఉంటోంది. గత నెల 29న మియాపూర్‌లోని ఓ రియల్‌ఎస్టేట్ కంపెనీలో సేల్స్ డిపార్ట్‌మెంట్‌లో ట్రైనీగా చేరింది. మరుసటి రోజు 30న ఆఫీస్ నుంచి ఒకరు కాల్ చేసి యాదగిరిగుట్ట సన్‌సిటీలో ఉన్న కంపెనీకి చెందిన సైట్ వద్ద సమావేశం ఉందని.. ఆఫీస్ స్టాఫ్ వచ్చి మిమ్మల్ని కారులో తీసుకెళతారని చెప్పారు. దీంతో మియాపూర్‌లోని ఓ హాస్టల్‌లో ఆ యువతి ఉండిపోయింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న జహీరాబాద్ కవేలికి చెందిన సంగారెడ్డి, కర్నూల్ జిల్లా ఆళ్లగడ్డకు చెందిన జనార్దన్‌రెడ్డిలు వచ్చి ఆ యువతిని కారులో తీసుకువెళ్లారు. అదే రోజు రాత్రి 9 గంటలకు సమావేశం ముగిసిన తర్వాత తిరిగి బయల్దేరారు. మార్గమధ్యలో 10:30 గంటలకు బ్రేక్ డౌన్ అయ్యిందని ఆ ఇద్దరూ కారు నిలిపివేశారు. కొద్దిదూరంలో షాపునకు వెళ్లి కూల్‌డ్రింక్, స్వీట్లు తీసుకొచ్చి యువతికి ఇచ్చారు. కూల్‌డ్రింక్ తాగి స్వీట్ తిన్న తర్వాత ఆమె కళ్లు తిరిగి అక్కడే పడుకుంది. ఇదే అదనుగా భావించిన ఆ ఇదరూ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. మరుసటి రోజు తెల్లవారుజామున 3 గంటల వరకు లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఉదయాన్నే ఆమెను శ్రీ లక్ష్మీ హాస్టల్ వద్ద వదిలి వెళ్లిపోయారు. దీంతో ఆమె మంగళవారం మధ్యాహ్న సమయంలో ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో లైంగికదాడి చేశారని ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సాయంత్రం మియాపూర్ పోలీసులకు కేసు బదిలీ చేశారు. దర్యాప్తులో భాగంగా సంగారెడ్డి, జనార్దన్‌రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేల సిఫార్సులను అనుమతించాలి: కూనంనేని

సాక్షి, హైదరాబాద్: తిరుమలలో వెంకటేశ్వర స్వామి దర్శనానికి తెలంగాణ ఎమ్మెల్యేల సిఫార్సులు చెల్లకపోవడం దురదృష్టకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. దైవదర్శనానికి వచ్చే తెలంగాణ ఎమ్మెల్యేల నుంచి వచ్చే సిఫార్సు లేఖలను పరిగణలోకి తీసుకొని, దేవుడి దగ్గర భేదాభిప్రాయం లేకుండా చూడాల్సిన బాధ్యత ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు ఉందని ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం ఉభయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం అవుతున్న నేపథ్యంలో కూనంనేని ఈ విజ్ఞప్తి చేశారు. టీటీడీ భౌతికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పటికీ అది ఆధ్యాత్మికంగా రెండు తెలుగు రాష్ట్రాల దేవాలయమని వ్యాఖ్యానించారు.

శ్రీవారి సేవలో భారత మహిళా క్రికెటర్లు

తిరుమల: తిరుమల శ్రీవారిని మహిళా క్రికెటర్లు హర్మన్‌ప్రీతి కౌర్, షఫాలీ వర్మ, రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా..టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



తిరుమల ఆలయం వెలుపల భారత మహిళా క్రికెటర్లు

జస్టిస్ శరత్, రేవంత్‌ల ఫోన్లు ట్యాపింగ్

▶ మొదటి పేజీ తరువాయి

విచారణకు చేపట్టిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు కూడా జారీ చేసింది. తాజాగా ఈ అంశంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ టి.వినోద్‌కుమార్‌ల ధర్మాసనం బుధవారం మధ్యాహ్న విరామం తర్వాత విచారణ చేపట్టింది.

విచారణ 23వ తేదీకి వాయిదా..

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ.. ఫోన్ ట్యాపింగ్ కేసుపై అన్ని వివరాలతో కౌంటర్ దాఖలు చేశామని ధర్మాసనానికి వివరించారు. కేసు ఎప్పుడు నమోదు చేశారు? ఎవరెవరి ఫోన్లు ట్యాప్ అయ్యాయి? నిందితులెవరు? కేసు పురోగతి ఎంత వరకు వచ్చింది వంటి వివరాలు అందులో పేర్కొన్నామని.. కానీ ఇంకా రికార్డు కాలేదని చెప్పారు. ఈ వివరాలను రికార్డు చేయాలని కోర్టు అధికారులను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణలోగా కౌంటర్ వేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో తాను కూడా బాధితుడినేనని, పోలీసు అధికారుల నుంచి తీవ్ర వేధింపులు ఎదుర్కొన్నానని.. తనను ఈ పిటిషన్‌లో ఇంప్లీడ్ చేయాలంటూ సిద్దిపేట జిల్లాకు చెందిన హయతుద్దీన్ వేసిన పిటిషన్‌పై నిర్ణయాన్ని కూడా ధర్మాసనం వాయిదా వేసింది.

ప్రభుత్వం అఫిడవిట్లో పేర్కొన్న వివరాలివీ..

''నాయిని భుజంగరావు (ఏ3) వాంగ్మూలం మేరకు.. బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న విద్యార్థి సంఘాలు, కుల సంఘాల నాయకులు, జర్నలిస్టులు, జస్టిస్ కాజా శరత్, ఇతర హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వానికి సంబంధించిన కేసులను వాదిస్తున్న న్యాయవాదులు, పార్టీ నేతల వ్యక్తిగత జీవితం, చేసే పనులు తెలుసుకుని ప్రభుత్వానికి అనుకూలంగా ఉండేలా ప్రభావితం చేశారు. బీఆర్‌ఎస్‌కు ఇబ్బందికర పరిస్థితి వచ్చినప్పుడల్లా అవతలి వారి ఫోన్లు ట్యాప్ చేసి బెదిరించేవాళ్లు. హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో మాజీ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలకు ఎర కేసులో, టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ అంశం సమయంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా వివరాలు తెలుసుకున్నారు. 'నేను కీలక వ్యక్తుల పేర్లు, ఫోన్ నంబర్లు సేకరించి ప్రణీత్‌కుమార్‌కు అందజేసేవాడిని. వారి ఫొటోలు, అడ్రస్‌లు సేకరించి చర్యలు తీసుకోవడం కోసం ఇంటెలిజెన్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులకు పంపేవాళ్లం' అని భుజంగరావు చెప్పారు. టెలికం సర్వీస్ ప్రొవైడర్ల నుంచి వివరాలు సేకరించినట్టు, ఫోన్ నంబర్ చెబితే వారి కాల్‌లకు సంబంధించి వివరాలు కూడా సర్వీస్ ప్రొవైడర్లు ఇచ్చినట్టు తెలిసింది. జస్టిస్ కాజా శరత్, ఆయన సతీమణి మాధవి నంబర్లు, కాల్‌ల వివరాలు, అడ్రస్‌లు జియో ఆఫీస్ నుంచి తెలుసుకున్నారు.

కీలక వ్యక్తుల ఫోన్ ట్యాపింగ్..

సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి, ఎనుముల తిరుపతిరెడ్డి, విజయ్‌రెడ్డి, కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఈటల నితిన్, శివధర్‌రెడ్డి, ఏఆర్ శ్రీనివాస్, రాఘవేందర్‌రెడ్డి, రోనాల్డ్ రోస్, ధర్మపురి అర్వింద్, ఎం.రమేశ్‌రెడ్డి, మేఘా శ్రీనివాస్‌రెడ్డి, మైనంపల్లి రోహిత్, పీడీ కృష్ణకిశోర్, ఐఏఎస్ దివ్య, తాటినేటి శశాంక్, రాజ్‌న్యూస్ సునీల్‌రెడ్డి, చిలుకా రాజేందర్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, నరేంద్రనాథ్ చౌదరి, తీన్మార్ మల్లన్న (నవీన్), ఏఎంఆర్ ఇన్‌ఫ్రా మహేశ్‌రెడ్డి, వీరమళ్ల సత్యం, గాలి అనిల్‌కుమార్, రామసాయం సురేందర్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మేరెడ్డి స్వప్నిక, కాసాని జ్ఞానేశ్వర్, కొల్లే సరిత, అంజన్న (ఈటల గన్‌మన్), అనుమాండ్ల నరేందర్‌రెడ్డి, బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, మనాల మోహన్‌రెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు మరికొందరి ఫోన్లను ట్యాప్ చేశారు.

మధ్యవర్తిగా టీవీ 5 సాంబశివరావు..

సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు, టీవీ 5 సాంబశివరావులకు సంబంధించిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ వివాదం ఉంది. ఈ పంచాయతీని సాంబశివరావు భుజంగరావు వద్దకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావుపై చాలా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వాటి నుంచి బయటపడాలంటే రూ.15 కోట్లు బీఆర్‌ఎస్‌కు పార్టీ ఫండ్‌గా ఇవ్వాలని భుజంగరావు ఒత్తిడి తెచ్చారు. శ్రీధర్‌రావు రూ.13 కోట్లు విలువైన బీఆర్‌ఎస్ బాండ్లు కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం వహించిన సాంబశివరావు రూ.2 కోట్లు తీసుకున్నారని భుజంగరావు వాంగ్మూలంలో పేర్కొన్నారు..'' అని ప్రభుత్వం అఫిడవిట్‌లో తెలిపింది. వీటితోపాటు మరిన్ని వివరాలనూ వెల్లడించింది.

మరో డయాఫ్రమ్ వాల్ కట్టాల్సిందే..

ప్రాజెక్టు భద్రత దృష్ట్యా ఇప్పుడున్న దానికి సమాంతరంగా మరొకటి నిర్మించాలి ● సీడబ్ల్యూసీ చైర్మన్‌కు సూచించిన అంతర్జాతీయ నిపుణులు

డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేసినా ఫలితం ఉండదు

- ఎగువ కాఫర్ డ్యామ్‌లో లీకేజీలను కొంతవరకు అరికట్టవచ్చు
- లీకేజీలున్నా డయాఫ్రమ్ వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి ఇబ్బంది ఉండదు
- రెండు వారాల్లో సవాళ్లను అధిగమించే విధానం, డిజైన్లపై మధ్యంతర నివేదిక
- తాము సూచించిన విధానం మేరకు యాఫ్రి సంస్థ డిజైన్లు ఇవ్వాలి
- సీడబ్ల్యూసీ డిజైన్లను ఆమోదించిన అనంతరం వాటి ప్రకారం పనులు చేపట్టాలి
- అంతర్జాతీయ నిపుణుల సూచన



ఇటీవల డయాఫ్రమ్ వాల్‌ను పరిశీలిస్తున్న నిపుణులు

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్-2లో గోదవరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని అంతర్జాతీయ నిపుణుల బృందం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)కి సూచించింది. ప్రస్తుతం ఉన్న డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేసినా, దెబ్బతిన్న ప్రాంతాల్లో 'యూ' ఆకారంలో నిర్మించి అనుసంధానం చేసినా పూర్తి సామర్థ్యం మేరకు పనిచేస్తుందని చెప్పలేమని తేల్చిచెప్పింది. ఇప్పటికే గోదావరి వరదలను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్‌తోపాటు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను ప్రభుత్వం పూర్తి చేసినందున కొత్త డయాఫ్రమ్ వాల్‌ను సులభంగా నిర్మించవచ్చని నిపుణుల బృందం అభిప్రాయపడింది.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) నియమించిన యూఎస్ఏకు చెందిన డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, కెనడాకు చెందిన రిచర్డ్ డొన్నెల్లీ, సీస్ హించ్‌బెర్గర్, కాంట్రాక్టు సంస్థ మేఘా నియమించిన అంతర్జాతీయ కన్సల్టెంట్ యాఫ్రి సంస్థ (స్వీడన్) ప్రతినిధులు నాలుగు రోజులపాటు ప్రాజెక్టును పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. బుధవారం మరోసారి సమీక్షించిన అనంతరం నిపుణుల బృందంతో సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. గతంలో వరదను మళ్లించేలా స్పిల్ వే పూర్తి చేయకుండా, ఎగువ కాఫర్ డ్యామ్‌ను చేపట్టి ఇరు వైపులా ఖాళీ వదిలేయడం వల్లే వరద ఉధృతి మరింతపెరిగి డయా ఫ్రమ్‌వాల్ దెబ్బతిందని అంతర్జాతీయ నిపుణులు సీడబ్ల్యూసీ చైర్మన్‌కు తేల్చి చెప్పారు. గ్యాప్-2లో 1396 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల మేర దెబ్బతిందని నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) ఇచ్చిన నివేదికతో ఈ బృందం ఏకీభవించింది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తది నిర్మించడం శ్రేయస్కరమని సూచించింది.

జెట్ గ్రౌటింగ్‌లో లోపం వల్లే లీకేజీలు

ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి ముందు జెట్ గ్రౌటింగ్ చేసేటప్పుడు ఆ ప్రదేశంలో ఇసుక సాంద్రతను తప్పుగా అంచనా వేశారని ఈ బృందం తెలిపింది. అందువల్లే తక్కువ లోతు నుంచి స్టోన్ కాలమ్స్ వేసి, జెట్ గ్రౌటింగ్ చేశారని, దీనివల్లే లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. లీకేజీలకు కారణాలు కనుక్కోవడానికి కాఫర్ డ్యామ్ పైనుంచి 100 నుంచి 150 మీటర్లకు ఒక చోట మొత్తం 17 చోట్ల బోర్ హోల్స్ వేసి పరీక్షలు చేయాలని సూచించామని తెలిపింది. యాఫ్రి సంస్థ ఇప్పటికే నాలుగు చోట్ల పరీక్షలు చేసిందని వివరించింది. ఆ పరీక్షల ఫలితాలను విశ్లేషిస్తే.. లీకేజీలను పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయలేమని, కొంతవరకు అడ్డుకోవచ్చని అభిప్రాయపడింది. కొంతవరకు లీకేజీలు ఉన్నప్పటికీ కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించింది.

ముగిసిన అంతర్జాతీయ నిపుణుల పర్యటన

అంతర్జాతీయ నిపుణుల నాలుగు రోజుల పోలవరం పర్యటన బుధవారం ముగిసింది. వారు బుధవారం విజయవాడ చేరుకున్నారు. గురువారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి చేరుకుని, అక్కడి నుంచి వారి దేశాలకు వెళ్తారు.

రెండు వారాల్లో మధ్యంతర నివేదిక

పోలవరం ప్రాజెక్టు పరిశీలన, అధికారులతో సమీక్షలో వెల్లడైన అంశాల ఆధారంగా సవాళ్లను అధిగమించడం, నిర్మాణాల డిజైన్లపై రెండు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇస్తామని నిపుణుల బృందం తెలిపింది. ఆ నివేదిక ఆధారంగా కాంట్రాక్టు సంస్థ అంతర్జాతీయ కన్సల్టెంట్ యాఫ్రి సంస్థ సవాళ్లను అధిగమించడానికి చేపట్టాల్సిన నిర్మాణాల డిజైన్లను రూపొందించి తమకు పంపితే.. తాము పరిశీలించి మార్పులుంటే సూచిస్తామని చెప్పింది. యాఫ్రి, తాము ఏకాభిప్రాయంతో నిర్ణయించిన డిజైన్‌ను సీడబ్ల్యూసీకి పంపుతామని తెలిపింది. ఆ డిజైన్‌ను సీడబ్ల్యూసీ క్షుణ్ణంగా పరిశీలించి, ఆమోదించాకే దాని ప్రకారం పనులు చేపట్టాలని సూచించింది. ఇందుకు సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా అంగీకరించారు. నిపుణల బృందం మధ్యంతర నివేదిక ఇచ్చాక ఢిల్లీలో మరోసారి రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, అంతర్జాతీయ నిపుణులతో సమావేశం నిర్వహిస్తామని వోరా చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
గురువారం ॥ 4-7-2024

* ఉపాధి



చిలువేరు సాహితి

ఒక అందమైన ఆలోచనను సక్రమంగా అమలులో పెడితే పల్లెటూరు నుంచి కూడా విదేశాలకు విస్తరించవచ్చు అని నిరూపిస్తుంది చిలువేరు సాహితి. చేస్తున్న కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలేసి పాకశాస్త్ర ప్రావీణ్యంతో ఉపాధిని సృష్టిస్తోంది. 26 ఏళ్ల వయసులో తనతోపాటు మరో ఇరవై మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో వ్యవసాయాధారిత జీవనాల మధ్య వెలుగుతున్న సాహితిని పలకరిస్తే విజయావకాశాన్ని వంటలతో అందిపుచ్చుకుంటున్నానని వివరిస్తుంది.

టెకీ ఉద్యోగం నుంచి టేస్టీ ఫుడ్ బిజినెస్ వరకు

''నాకు రుచికరమైన ఆహారం అంటే చాలా ఇష్టం. అయితే ఆ ఇష్టం నాకో ఉపాధిని కల్పిస్తుంది అని మాత్రం ఊహించలేదు. బీటెక్ కంప్లీట్ అయ్యాక హైదరాబాద్ టీసీఎస్ కంపెనీలో నాలుగేళ్లు ఉద్యోగం చేశాను. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ రావడంతో ఊరు వచ్చేశాను. ఆ టైమ్‌లో మా అమ్మ కన్యాకుమారి చేసే వంటలను ఆస్వాదిస్తూ ఉండేదాన్ని. ఖాళీ సమయంలో సరదాగా తీసుకున్న వంటల ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' పేజీ క్రియేట్ చేసి పోస్ట్ చేసేదాన్ని. ఆ పోస్టులకు లైకులు వెల్లువెత్తుతుండేవి.

ఒకటి నుంచి మొదలు..

ఓరోజున ఉన్నట్టుండి ఒక ఫాలోవర్ నుంచి 'మాకు స్వీట్స్ చేసి పంపుతారా' అంటూ ఒక పోస్ట్ వచ్చింది. కాదనటమెందుకులే, ఒకసారి ప్రయత్నం చేసి చూద్దాం అని... ఆ ఆర్డర్ పూర్తిచేసి, కొరియర్ ద్వారా పంపించాం. ఆ తర్వాత మరో రెండు ఆర్డర్లు వచ్చాయి. అలా నెలకు ఒకటి రెండు ఆర్డర్లు రావడం మొదలయింది. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. నా వంటలకు మంచి డిమాండ్ ఉందని అర్థమైంది. దానినే ఉపాధిగా ఎందుకు చేసుకోకూడదూ అని... చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి, ఫుడ్ తయారీనే వ్యాపారంగా ఎంచుకున్నాను. ముందు మా ఇంటివరకే పనులు ఉండేవి. తర్వాత పనులు పెరగడంతో ఊళ్లోనే ఉన్న మా చుట్టుపక్కల మహిళలను ఫుడ్ తయారీకి నియమించుకున్నాం. స్నాక్స్, ఊరగాయలు, స్వీట్లు, మసాలా పొడులతో పాటు మిల్లెట్ ఉత్పత్తులు, ఇన్‌స్టంట్ మిక్స్‌లు తయారు చేయడం మొదలుపెట్టాం. ఇప్పుడు నెలకు 30 నుంచి 40 ఆర్డర్లు వస్తున్నాయి.

మరో 20 మందికి...

పదిహేనేళ్లుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న ఒక ఉద్యోగికి వచ్చే ప్యాకేజీని ఇప్పుడు నా వ్యాపారం ద్వారా పొందుతున్నాను. నాతోపాటు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పించే స్థితికి చేరుకున్నాను. వీరిలో పదిమంది తమ ఇళ్ల నుంచే పచ్చళ్లు, పొడులు, ఇతర పిండి వంటలు తయారు చేసి వాటిని అందంగా ప్యాక్ చేసి ఇస్తారు. మా ఇంటి మొదటి అంతస్తులోని రెండు గదులను నా కంపెనీ 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు'కి కేటాయించుకున్నాను. పదిహేను రకాల పచ్చళ్లు, 40 రకాల పిండి వంటలు, ఇన్‌స్టంట్ ఫుడ్ మిక్సర్లు, మసాల పొడులు.. దాదాపు 70 రకాల వంటకాలు తయారు చేస్తుంటాం. మన దేశంలోనే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ.. దేశాలలో ఉండే మన తెలుగువారికి కొరియర్ ద్వారా పచ్చళ్లు, పొడులు పంపిస్తున్నాను.



ఎక్కడా ప్లాన్ లేదు..

ఏ మాత్రం ప్లాన్ లేకుండా నా వ్యాపారం వృద్ధి చెందుతూ వస్తోంది. ఇంట్లో పెట్టిన ఆవకాయతో ఆరంభమైన ఈ బిజినెస్‌లో వచ్చిన ఆర్డర్ల ప్రకారం పెట్టుబడి పెడుతూ, ఆదాయాన్ని పొందుతున్నాను. ఫుడ్ బిజినెస్ కాబట్టి ఏడాది క్రితం లైసెన్స్ కూడా తీసుకున్నాను. మా ఊరికి మరింత పేరుతెచ్చేలా 'ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు' బ్రాండ్ ఉత్పత్తులను విస్తరించాలనుకుంటున్నాను. కానీ, తయారీ మాత్రం మా ఊరి నుంచి, మా ఇంటి నుంచే చేస్తుంటాను.

సవాళ్లను అధిగమిస్తూ..

రుచికరమైన వంటకాల తయారీలో పదార్థాలు కూడా అంతే నాణ్యమైనవి ఉండాలి. సరైన శుభ్రత పాటించాలి. ముఖ్యంగా ఆర్గానిక్ ఉత్పత్తులను సేకరించడం, వాటిని సమయానుకూలంగా తయారీలో వాడటం పెద్ద సవాల్‌గానే ఉంటోంది. అలాగే, సీజనల్‌గా ఉండే సమస్యల్లో ముఖ్యంగా వర్షాకాలం ప్యాకింగ్‌లు తడవడం వంటివి అప్పుడప్పుడు జరుగుతుంటాయి. ఎప్పుడైనా సమస్య వచ్చినప్పుడు తిరిగి రీప్లేస్ చేయడం వంటి జాగ్రత్తలు తీసుకుంటాను. చాలా మందితో డీల్ చేయాలి, కస్టమర్స్ అందరూ ఒకేలా ఉండరు కాబట్టి సహనంతో ఉండాలి. ఈ ప్రయాణం నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ఉపయోగపడుతుంది.



'చిన్న అమ్మాయివే కానీ, మా ఇంట్లో బామ్మలు చేసిన వంటకాల రుచి చవి చూస్తున్నాం' అంటూ మా వంటకాలను రుచి చూసినవారు నాకు ఫోన్ల ద్వారా, మెసేజ్‌ల ద్వారా ప్రశంసలు తెలియచేస్తుంటారు. నాణ్యత ద్వారా వారి ఆశీస్సులను, అభిమానాన్ని, మద్దతును ఎప్పటికీ అలాగే నిలబెట్టుకుంటాను అంటూ ఆనందంగా వివరిస్తుంది సాహితి.

– నిర్మలారెడ్డి

* ఆర్ట్

సహాయ కళలు

బామ్మ జీవితం నుండి ప్రేరణం పొంది అబ్‌స్ట్రాక్ట్ ఆర్టిస్ట్‌గానూ తల్లి సంగీత పరిజ్ఞానాన్ని ఒంటపట్టించుకొని సంగీత కళాకారిణిగానూ ఒకేసారి రెండు కళల్లోనూ రాణిస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది ఢిల్లీవాసి సహాయ శర్మ. తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ యువతరపు ఆలోచనలకు అద్దం పడుతుంది.




సహాయ శర్మ

''నా ఎదుగుదలలో సంగీతం పాత్ర చాలా పెద్దది. మా అమ్మ సంగీత కళాకారిణి. తను పాడుతుండటాన్ని నా చిన్ననాటి నుంచి వింటూ, నేనూ పాడుతూ పెరిగాను. సంగీత ప్రపంచం నుంచి నాదైన సొంత శైలిని కనుక్కోవడానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉండేదాన్ని. స్కూల్, కాలేజీ రోజుల్లో ఎప్పుడు సెలవులు వచ్చినా రకరకాల పాటల్ని డౌన్‌లోడ్ చేసుకొని, ఒక ప్రత్యేకమైన జాబితా తయారు చేసేదాన్ని.

సొంతంగా ఆల్బమ్స్ విడుదల

కిందటేడాది ముంబయిలో కిందటేడాది మా ఫ్రెండ్ మ్యూజిక్ స్టూడియోని సందర్శించాను. అక్కడ నేను రాసిన ఒక పాటను ప్లే చేశాను. ఆ పాట విన్నాక, వారు తమతో కలిసి పని చేయవచ్చని చెప్పారు. దీంతో కిందటేడాది జూలై నాటికి అనుకున్న పాటను పూర్తి చేశాను. ఈ యేడాది మార్చిలో 'ఫెడెక్స్ ఫెడప్' ని విడుదల చేశాను. నా వ్యక్తీకరణను ప్రపంచంతో పంచుకోవడానికి ఇది సరైన సమయం అని భావించాను.





సహాయ శర్మ

గొడవల నుంచి పాటలు

రెండేళ్ల క్రితం మా కుటుంబసభ్యులతో చాలా గొడవ పడ్డాను. భగవద్గీత ఒక శ్లోకంలో కోపానికి, భయానికి మూలకారణం అనుబంధమే అని చెబుతోంది. దీనినుంచే నా ఆల్బమ్ పుట్టిందని చెప్పవచ్చు. ఒక సమయంలో జీవితం స్తంభించుకుపోయినట్టుగా అనిపిస్తుంది. అలాంటి సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని మొదటి మ్యూజిక్ ఆల్బమ్ చేశాను. 96 బిపిఎమ్ అనేది నాన్నతో గొడవ తర్వాత రాశాను. ఈ గొడవ తర్వాత స్త్రీ ప్రవర్తన నాకు కొత్తగా అర్థమయ్యేలా చేసింది. జీవితంలోని ఆచరణాత్మక దృక్పథాన్ని, భగవంతుని పట్ల ఉండే భక్తి అన్నీ బలమైన మనిషిగా తీర్చిదిద్దాయి. నా పాటలోని సాహిత్యం అంతా ఇలాగే ఉంటుంది. 'నేను మళ్లీ కలుస్తూనే ఉంటాను. రౌండ్ అండ్ రౌండ్‌గా తిరుగుతూనే ఉంటాను...' అని సాగుతుంది. ఇప్పటికి మూడు ఆల్బమ్స్ విడుదలయ్యాయి.


చిత్రకళలో ఓదార్పు

రంగులలో లోతైన ఓదార్పును, శాంతిని కనుక్కోవడానికి ఉపయోగపడేదే పెయింటింగ్. సంగీతం ద్వారా నన్ను నేను బయటకు వ్యక్తపరుచుకుంటే పెయింటింగ్‌లో నన్ను నేను వెతుక్కోగలిగాను. ఇలా ఈ రెండు కళలు నన్ను కొత్తగా ఆవిష్కరింపజేశాయి. మా బామ్మ తన చీరలపై రకరకాల పెయింటింగ్స్‌ను చిత్రిస్తుండేది. వాటిని చూస్తూ నేనూ సాధన చేసేదాన్ని. అలా రంగుల ప్రపంచం నాకు పరిచయం అయ్యింది. అంతేకాదు, మా ఇల్లు రకరకాల పెయింట్స్, శిల్పాలతో ఒక ఆర్ట్ మ్యూజియంలా ఉంటుంది. మా నాన్న అంత అందంగా తీర్చిదిద్దారు ఇంటిని. ఇది కళాకారిణిగా నా విజువల్ కార్టెక్స్‌లోని ప్రతి భాగాన్ని ప్రభావితం చేసింది. అక్కడి కళాకృతుల సేకరణలో అమ్మ అభిరుచి, మన దేశీయ సంస్కృతి... నాలో లోతైన గాఢత నింపాయి. ఆ ఇష్టంతోనే సింగపూర్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ పూర్తి చేశాను. రంగులతో ఆధ్యాత్మిక ప్రపంచాలను సృష్టిస్తుంటాను. సోలో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తుంటాను. భారతదేశం, న్యూయార్క్, లండన్, బోస్టన్, దుబాయ్, హాంకాంగ్‌లోని కేఫ్‌లు, కోర్టులు, హోటళ్లు, గెస్ట్ హౌజ్ గోడలను నా పెయింటింగ్స్ అలంకరించాయి.

మార్చిన ప్రయాణాలు

అమ్మానాన్నలతో కలిసి దేశమంతా తిరిగిన రోడ్డు ప్రయాణాలు, జంగిల్ సఫారీలు, ట్రెక్కింగ్ ఏరియాలు నన్ను ప్రకృతికి దగ్గర చేశాయి. నా తల్లితండ్రులు ప్రయాణంలో సంగీతం, కళ, కథలు, సంస్కృతిని పరిచయం చేశారు. అప్పటినుంచి అందమైన ప్రకృతి దృశ్యాలను నా పెయింటింగ్స్ లో చూపించడం అలవాటు చేసుకున్నాను. కరోనా సమయంలో జీవితం ఎంత చిన్నదో కదా అనిపించింది. అప్పుడు భౌతికంగా, ఆధ్యాత్మికంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. విలాసవంతమైన జీవనం అవసరమా అనేది తెలుసుకున్నాను. నా వాస్తవికత ఏమిటో అర్థమయ్యాక నేనేం సృష్టించాలో తెలుసుకున్నాను. అందువల్ల మ్యూజిక్ ఆల్బమ్స్, పెయింటింగ్స్ నన్ను కొత్తగా మార్చాయి'' అని వివరిస్తుంది సహాయ.

ఆవిష్కరణ



అక్షితా సచ్‌దేవా

చూపున్న బాట

మనం ఏ బాట ఎంచుకోవాలో అనేది విధి నిర్ణయిస్తుందో లేదోగానీ పరిస్థితులు మాత్రం నిర్ణయిస్తాయి. డాక్టర్ కావాలనుకున్న అక్షితా సచ్‌దేవా పరిస్థితుల ప్రభావం వల్ల పరిశోధన రంగంలోకి వచ్చింది. ఎన్నో రంగాలకు చెందిన ఎంతోమంది అంధులతో మాట్లాడింది. వారి సమస్యల గురించి లోతుగా తెలుసుకుంది. వారు ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుక్కోవాలనుకుంది. బెంగళూరు కేంద్రంగా ఆమె ప్రారంభించిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ 'ట్రిస్టిల్ ల్యాబ్స్' అంధులకు బాట చూపించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ ల్యాబ్స్ నుంచి వచ్చిన 'కిబో' పరికరం ఆ దిశగా వేసిన తొలి అడుగు....

అక్షితా సచ్‌దేవా అమ్మమ్మ క్యాన్సర్‌తో చనిపోయింది. ఇక అప్పటి నుంచి డాక్టర్ కావాలనేది తన లక్ష్యంగా మారింది. అయితే కాలేజీ రోజుల్లో ఒక లెక్చరర్‌తో మాట్లాడిన తరువాత తన ఆలోచనల్లో మార్పు వచ్చింది.

'డాక్టర్ కావాలి' అనే తన లక్ష్యం గురించి చెప్పినప్పుడు క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించే సాంకేతికత, దాని ప్రాధాన్యతతో పాటు హెల్త్‌కేర్ రంగంలోని ఎన్నో ఆవిష్కరణల గురించి చెప్పారు ఆ లెక్చరర్.

'నా కళ్లు తెరిపించిన సందర్భం అది' అని ఆ రోజును గుర్తు చేసుకుంటుంది అక్షిత.

ఆ రోజు నుంచి హెల్త్‌కేర్ రంగానికి సంబంధించిన సాంకేతికత, సరికొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టింది.

ఫరీదాబాద్‌లోని మానవ్ రచన కాలేజీలో ఇంజినీరింగ్ చేస్తున్న రోజుల్లో దృష్టి లోపం ఉన్నవారి కోసం ఒక గ్లోవ్‌ను రూపొందించింది అక్షితా సచ్‌దేవా. చూపుడు వేలిపై కెమెరా ఉండే ఈ హ్యాండ్‌గ్లోవ్ సహాయంతో దృష్టి లోపం ఉన్నవారు చదవవచ్చు.

ఈ గ్లోవ్ గురించి న్యూ దిల్లీలోని నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్(ఎన్ఏబీ)కి వివరించింది అక్షిత.

దృష్టి లోపం ఉన్న ఒక యువకుడు ఈ గ్లోవ్‌ను ఉపయోగించి న్యూస్‌పేపర్ చదవగలిగాడు. ఈ విజయం ఆమెలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఇంకా ఏదో సాధించాలనే పట్టుదలను పెంచింది.

అంధులకు జీవనోపాధి, విద్య, దైనందిన జీవన విషయాల్లో సహాయపడడానికి తన ఆవిష్కరణను ముందుకు తీసుకువెళ్లాలనుకుంది.

అంధులు ఎదుర్కొనే సమస్యలను లోతుగా అర్థం చేసుకోవాలనుకుంది. బ్యాంకర్లు, పీహెచ్‌డీ స్కాలర్లు, గృహిణులు... వివిధ విభాగాలకు చెందిన అంధులతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకుంది. ఆ సమయంలోనే దీపాలి పవార్ అనే స్టూడెంట్‌తో మాట్లాడింది.

కాలేజీలో ఒక సెమిస్టర్ పూర్తి చేసిన దీపాలి హటాత్తుగా చూపు కోల్పోయింది. ఆమెను తిరిగి తీసుకోవడానికి కాలేజి వారు నిరాకరించారు. బ్రెయిలీ నేర్చుకోమని సలహా ఇచ్చారు. బ్రెయిలీ నేర్చుకోవడానికి దీపాలి రెండేళ్లు గడిపింది. అయితే అది ఆమెకు కష్టంగా ఉండేది.

బ్రెయిలీ నేర్చుకున్న తరువాత కూడా ఆమెకు కాలేజీలో చదివే అవకాశం రాలేదు. యశ్వంత్‌రావ్ చవాన్ మహారాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీలో చేరడమే దీపాలి ముందు ఉన్న ఏకైక మార్గం అయింది.

ఆడియో–రికార్డెడ్ పుస్తకాలను అందించే ఒక స్వచ్ఛంద సంస్థను సంప్రదించింది దీపాలి.

అయితే ఒక్కొక్క పుస్తకం కోసం నాలుగు నుంచి ఆరువారాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఆమె దగ్గర మూడు పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. ఆ పుస్తకాలను తీసుకువెళ్లిన అక్షిత వాటిని మొబైల్ అప్లికేషన్ ఫామ్‌లోకి మార్చి దీపాలికి ఇచ్చింది.

మూడు నెలల తరువాత....

దీపాలి నుంచి ఫోన్ వచ్చింది. 'సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్‌ను సింగిల్ అటెంప్ట్‌లో పూర్తి చేశాను' అని సంతోషంగా చెప్పింది. ఇది అక్షితకు మరో విజయం. మరింత ఉత్సాహాన్ని ఇచ్చిన విజయం. ఈ ఉత్సాహ బలమే బోనీదేవ్‌తో కలిసి బెంగళూరు కేంద్రంగా 'ట్రిస్టిల్ ల్యాబ్స్' అనే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ ప్రారంభించేలా చేసింది.

నాసిక్‌లోని 'నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్'లో పెద్ద యంత్రాన్ని చూసింది అక్షిత. అయితే అది పెద్దగా ఉపయోగంలో లేదు. ఈ మెషిన్ ప్రింటెడ్ డాక్యుమెంట్స్‌ను చదవగలుగుతుంది. అయితే కేవలం ఇంగ్లీష్‌లో మాత్రమే. అప్పుడే అక్షితకు ఎన్నో భారతీయ భాషలకు సంబంధించిన పుస్తకాలను చదవగలిగే యంత్రాన్ని రూపొందించాలనే ఐడియా తట్టింది. అది 'కిబో' రూపంలో సాకారం అయింది.

ఈ పరికరం విజయం సాధించడంతో నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్, ఐఐఎం–అహ్మదాబాద్... మొదలైన సంస్థల నుంచి ఆర్డర్లు రావడం మొదలయ్యాయి.

'భారతీయ భాషలపై దృష్టి కేంద్రీకరించిన తొలి అసిస్టివ్ టెక్ టూల్ కిబో' అంటుంది అక్షిత.



మరింతగా...

అంధులకు ఉపకరించే దిశగా ఆసియా, ఆఫ్రికాలలో మా సంస్థను విస్తరించాలనుకుంటున్నాం. 'కిబో'కు మరిన్ని భాషలను జోడించాలనుకొంటున్నాము. ఏఐ సాంకేతికతతో సెల్ఫ్–లెర్నింగ్, సెల్ఫ్–ట్రెనింగ్ మాడ్యూల్స్‌కు రూపకల్పన చేస్తాం.

– అక్షితా సచ్‌దేవా, కో–ఫౌండర్, ట్రిస్టిల్ ల్యాబ్స్

కిబో ఇలా...

'కిబో' వాటర్ బాటిల్ ఆకారంతో ఉంటుంది. దీని ఎడమవైపు ఉన్న బటన్‌ను నొక్కితే టేబుల్ ల్యాంప్ ఆకారంలోకి మారుతుంది. యూఎస్‌బీ కేబుల్ దీన్ని ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేస్తుంది. పుస్తక పాఠాన్ని 'కిబో' సంగ్రహిస్తుంది. అరవై భాషలలో ఏ భాషలలోనైనా అనువాదం అడగవచ్చు. వ్యక్తులు, సంస్థల కోసం విడిగా నాలుగు 'కిబో' ప్రాడక్ట్స్‌ను రూపొందించారు. 'కిబో ఎక్స్ఎస్'ను స్కూలు, కాలేజీలలోని లైబ్రరీల కోసం అందుబాటులో ఉంచారు. 'కిబో 360'ని వ్యాపారసంస్థలు, యూనివర్సిటీలు, ప్రచురణ సంస్థల కోసం రూపొందించారు.





ప్రిక్వార్టర్ ఫైనల్లో కృష్ణప్రసాద్ జోడీ

కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గరగ కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ (భారత్) జోడీ శుభారంభం చేసింది. కాల్గరీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ ద్వయం 30 నిమిషాల్లో 21-19, 21-11తో లాప్ కాన్ కెర్న్ పొంగ్ (కెనడా)-ల్యారీ పొంగ్ (ఇంగ్లండ్) జంటపై విజయం సాధించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో లిన్ బింగ్ వె-సు చింగ్ హెంగ్ (చైనీస్ తైపీ)లతో కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ తలపడతారు.

పంకజ్ అద్వానీ శుభారంభం



ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ విజయంతో బోణీ కొట్టాడు. రియాద్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పంకజ్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గాడు. బెంగళూరుకు చెందిన 38 ఏళ్ల పంకజ్ తొలి మ్యాచ్‌లో 4-2 ఫ్రేమ్‌లతో ఆంగ్ ఫియో (మయన్మార్)పై, రెండో మ్యాచ్‌లో 4-3 ఫ్రేమ్‌లతో యుట్టాపాప్ పక్‌పోజ్ (థాయ్‌లాండ్)పై గెలిచాడు. ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో పంకజ్ ఇప్పటివరకు తొమ్మిదిసార్లు చాంపియన్‌గా నిలిచాడు.

జగజ్జేతల ఆగమనం

నేడు స్వదేశానికి చేరుకోనున్న టి20 వరల్డ్ చాంపియన్ భారత్





సూర్య కుమార్
రోహిత్

- తొలుత ఢిల్లీలో ప్రధానితో రోహిత్ బృందం భేటీ
- సాయంత్రం ముంబైలో బీసీసీఐ ఆధ్వర్యంలో రోడ్ షో, సన్మానం



సిరాజ్



తల్లిదండ్రులతో అర్ష్‌దీప్ సింగ్

ఇక్కడేమో అభిమానులు... అక్కడేమో ప్రపంచకప్ గెలిచిన క్రికెటర్లు... ఎన్నాళ్లే నిరీక్షణ, ఎందుకీ పరీక్ష అని చూసే ఎదురుచూపులకు నేడు తెర పడనుంది. ప్రతికూల వాతావరణంతో బార్బడోస్‌లోనే ఇరుక్కుపోయిన టి20 వరల్డ్ చాంపియన్ భారత జట్టు గురువారం తెల్లవారగానే న్యూఢిల్లీకి చేరుకుంటుంది. వీరికి ఘనస్వాగతం పలికేందుకు బోర్డుతో పాటు వీరాభిమానులు తెగ ఆరాటం కనబరుస్తున్నారు. దీంతో దేశ రాజధాని ఢిల్లీ, వాణిజ్య రాజధాని ముంబై సంబరాల్లో మునిగితేలనున్నాయి.

ముంబై: టి20 ప్రపంచకప్‌ను జయించిన భారత క్రికెట్ జట్టు సభ్యులు కాస్త ఆలస్యంగా నేడు స్వదేశానికి చేరుకుంటున్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఎయిరిండియా సమన్వయంతో చార్టెర్డ్ ఫ్లయిట్‌లో చాంపియన్లు, జట్టు సహాయక సిబ్బంది, బోర్డు అధ్యక్ష కార్యదర్శులు రోజర్ బిన్నీ, జై షాలతో పాటు భారత్‌కు చెందిన మీడియా ప్రతినిధులు బార్బడోస్‌లోని గ్రాంట్లీ ఆడమ్స్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం బయలుదేరారు. ఫ్లయిట్ షెడ్యూల్ టైమ్ ప్రకారం గురువారం ఉదయం గం. 6:20 గంటలకు న్యూఢిల్లీ చేరుకుంటుంది. కాసేపు ఆటగాళ్ల ప్రయాణ బడలిక నుంచి సేదతీరాక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకుంటారు. 'ఢిల్లీ విమానాశ్రయంలో 6 గంటలకు ఫ్లయిట్ ల్యాండ్ అవుతుంది. కొద్దిసేపు విశ్రాంతి అనంతరం ఆటగాళ్లు ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీ నివాసంలో భేటీ అవుతారు. ఇదివరకే విజేత సభ్యులను సోషల్ మీడియా ద్వారా, ఫోన్‌లో అభినందించిన ప్రధాని కాసేపు క్రికెటర్లతో గడుపుతారు' అని బోర్డు సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపారు. ఈ భేటీ ముగిసిన వెంటనే మరో ప్రత్యేక విమానంలో టీమిండియా ముంబైకి పయనమవుతుంది. ముంబైలోనే బోర్డు అంబరాన్నంటే సంబరాలకు అన్ని ఏర్పాట్లు చేసింది. అక్కడికి చేరుకోగానే ముంబై, మహారాష్ట్ర క్రికెట్ సంఘాలు ఘనస్వాగతం పలుకుతాయి. 'సాయంత్రం 5 గంటలకు నారీమన్ పాయింట్ వద్ద ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓపెన్ టాప్ బస్‌లో క్రికెటర్ల రోడ్‌షో మొదలవుతుంది. అక్కడి నుంచి విఖ్యాత వాంఖెడే స్టేడియం వరకు సుమారు రెండు గంటలపాటు సాగే ఈ షోలో అభిమానులు అడుగడుగునా నీరాజనాలు పలుకుతారు. రాత్రి 7 గంటల సమయంలో స్టేడియంలో ఆటగాళ్లు, సహాయ సిబ్బందిని ఒక్కొక్కరిగా ఘనంగా సన్మానిస్తారు. బోర్డు ప్రకటించిన రూ. 125 కోట్ల ప్రైజ్‌మనీని కూడా అందజేస్తారు' అని శుక్లా పూర్తి బిజీ షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. ఈ విక్టరీ పరేడ్‌లో అభిమానులంతా పాల్గొనాల్సిందిగా బోర్డు కార్యదర్శి జై షా 'ఎక్స్' (ట్విట్టర్)లో విజ్ఞప్తి చేశారు. ఇలాంటి రోడ్ షో 17 ఏళ్ల క్రితం తొలి టి20 ప్రపంచకప్ గెలిచిన ధోని బృందానికి నిర్వహించారు. కానీ 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన అదే ధోని సేనకు ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కావాల్సి ఉండటంతో రోడ్ షోను నిర్వహించలేదు.

న్యూయార్క్ టు న్యూఢిల్లీ.. వయా బార్బడోస్

గత నెల 29న రోహిత్ శర్మ బృందం టి20 వరల్డ్‌కప్ గెలిచింది. ఆదివారం అర్ధరాత్రి లేదంటే సోమవారం ఉదయానికల్లా జగజ్జేతలు భారత్‌కు రావాలి. కానీ కరీబియన్‌లో భీకరమైన హరికేన్ తుఫాన్ వల్ల బార్బడోస్ ఎయిర్‌పోర్ట్‌ను మూసివేశారు. దీంతో టీమిండియా ఆటగాళ్లంతా అక్కడే ఇరుక్కుపోయారు. ఎట్టకేలకు కరీబియన్‌లో టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సభ్యులు కప్‌తో వచ్చేస్తున్నారు. ఎయిరిండియా చొరవ, న్యూయార్క్‌లోని ప్రయాణికుల సహకారంతో దారి మళ్లించిన విమానంలో టీమిండియా క్రికెటర్లు, మీడియా సంస్థల ప్రతినిధులు గురువారం ఉదయం న్యూఢిల్లీకి చేరుకుంటారు. అయితే వాతావరణ పరిస్థితిలో మార్పురావడంతో న్యూయార్క్ (అమెరికా) నుంచి న్యూఢిల్లీకి ప్రయాణించాల్సిన ఎయిరిండియా విమానాన్ని వయా బార్బడోస్ మీదుగా దారి మళ్లించారు. ఈ విమానం కోసం టికెట్లు బుక్ చేసుకున్న సాధారణ ప్రయాణికులకు ముందస్తు సమాచారం ఇచ్చి అసౌకర్యం కలుగకుండా చూశారు. ఇంకొందరికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇక విజేతల కోసం 'ఏఐసీ24డబ్ల్యూసీ' (ఎయిరిండియా చాంపియన్స్ 24 ప్రపంచకప్) పేరిట ఈ విమానాన్ని ముస్తాబుచేసి బార్బడోస్‌లో క్రికెటర్లను ఎక్కించుకొని బుధవారం బయలుదేరింది. అయితే నిర్ణీత రూట్ కాకుండా మరో రూట్ మారడంపై డీజీసీఏ (విమానయాన నియంత్రణ సంస్థ) ఎయిరిండియాను నివేదిక కోరింది.

తొలిసారి శిఖరాన...

వరల్డ్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా

- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా గుర్తింపు
- ఐసీసీ టి20 ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: తన అద్భుత ప్రదర్శనతో టి20 ప్రపంచ కప్‌లో భారత్‌కు టైటిల్ దక్కడంలో తనవంతు పాత్ర పోషించిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరో ఘనత సాధించాడు. బుధవారం విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా పాండ్యా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన ఆరో భారతీయ ప్లేయర్‌గా హార్దిక్ నిలిచాడు. గతంలో బ్యాటింగ్ విభాగంలో గౌతమ్ గంభీర్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్... బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్ ఈ ఘనత సాధించారు. గత ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న హార్దిక్ రెండు స్థానాలు పురోగతి సాధించి ప్రస్తుతం టాప్ ర్యాంక్‌లో ఉన్న శ్రీలంక కెప్టెన్ హసరంగ సరసన నిలిచాడు. వీరిద్దరి ఖాతాలో 222 రేటింగ్ పాయింట్లున్నాయి. 30 ఏళ్ల హార్దిక్ టి20 ప్రపంచకప్‌లో 144 పరుగులు చేయడంతోపాటు 11 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు పొందిన బుమ్రా 12 స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలిచాడు. అక్షర్ పటేల్ ఏడో ర్యాంక్‌లో, కుల్దీప్ యాదవ్ తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో సూర్యకుమార్ తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

రూడ్... రెండో రౌండ్‌లోనే అవుట్

మూడో రౌండ్‌లోకి అల్‌కరాజ్, మెద్వెదెవ్



రూడ్

లండన్: ఐదో ప్రయత్నంలోనూ నార్వే స్టార్ ప్లేయర్, ఎనిమిదో సీడ్ కాస్పర్ రూడ్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో రెండో రౌండ్‌ను దాటలేకపోయాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో రూడ్ 4-6, 5-7, 7-6 (7/1), 3-6తో ఫాబియో ఫాగ్నిని (ఇటలీ) చేతిలో ఓడిపోయాడు. 3 గంటల 18 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రూడ్ 15 ఏస్‌లు సంధించినా, 47 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్ 7-6 (7/5), 6-2, 6-2తో వుకిచ్ (ఆస్ట్రేలియా)పై, మెద్వెదెవ్ 6-7 (3/7), 7-6 (7/4), 6-4, 7-5తో ముల్లర్ (ఫ్రాన్స్)పై గెలుపొందారు. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. అంకా టొడోని (రొమేనియా)తో జరిగిన రెండో రౌండ్‌లో కోకో గాఫ్ 6-2, 6-1తో గెలిచింది. ప్రపంచ మాజీ నంబర్‌వన్, నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత నయోమి ఒసాకా (జపాన్) రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఎమ్మా నవారో (అమెరికా) 6-4, 6-1తో ఒసాకాను ఓడించింది. మరోవైపు భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ డబుల్స్‌లోనూ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. తొలి రౌండ్‌లో సుమిత్-లాజోవిచ్ (సెర్బియా) ద్వయం 2-6, 2-6తో మార్టినెజ్-మునార్ (స్పెయిన్) జోడీ చేతిలో ఓడిపోయింది.

బ్రెజిల్ ముందుకు...



సాంటాక్లారా (అమెరికా): కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ విజేత బ్రెజిల్ జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. కొలంబియా జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'డి' చివరి లీగ్ మ్యాచ్‌ను బ్రెజిల్ 1-1తో 'డ్రా'గా ముగించింది. బ్రెజిల్ తరఫున రాఫినా (12వ ని.లో), కొలంబియా తరఫున డేనియల్ మునోజ్ (45+2వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఏడు పాయింట్లతో కొలంబియా గ్రూప్ 'టాపర్'గా నిలువగా... ఐదు పాయింట్లతో బ్రెజిల్ రెండో స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఈక్వెడార్‌తో అర్జెంటీనా; వెనిజులాతో కెనడా; పనామాతో కొలంబియా; ఉరుగ్వేతో బ్రెజిల్ తలపడతాయి.

16 ఏళ్ల తర్వాత...



లీప్‌జిగ్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తమ జోరు కొనసాగిస్తూ టర్కీ జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఆస్ట్రియా జట్టుతో బుధవారం జరిగిన చివరి ప్రిక్వార్టర్ ఫైనల్లో టర్కీ 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. దాంతో 2008 తర్వాత ఈ టోర్నీలో టర్కీ జట్టు మళ్లీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. టర్కీ తరఫున మెరీ డెమిరల్ 1వ నిమిషంలో, 59వ నిమిషంలో రెండు గోల్స్ సాధించి తన జట్టును గెలిపించాడు. ఆస్ట్రియా తరఫున గ్రిగోరిష్ (66వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. ఈ మ్యాచ్‌తో ప్రిక్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు ముగిశాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో స్పెయిన్‌తో జర్మనీ; పోర్చుగల్‌తో ఫ్రాన్స్; ఇంగ్లండ్‌తో స్విట్జర్లాండ్; నెదర్లాండ్స్‌తో టర్కీ తలపడతాయి.

సినిమా

జోడీ రిపీట్?



● సమంత



● విజయ్

'కత్తి' (2014), 'తేరీ' (2016), 'మెర్సల్' (2017) చిత్రాల తర్వాత హీరో విజయ్-హీరోయిన్ సమంత మళ్లీ జోడీగా కనిపించే అవకాశం ఉందని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. విజయ్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వంలో ఓ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం విదితమే. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇప్పటికే మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే వంటి తారల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా సమంత పేరు వినిపిస్తోంది. ఇటీవల సమంతకు హెచ్. వినోద్ ఈ సినిమా స్టోరీ లైన్ చెప్పారట. కథ, ఇందులోని పాత్ర నచ్చడంతో సమంత ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఇక ఈ సినిమా తర్వాత విజయ్ పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి వెళ్లాలనుకుంటున్నారు. సో.. విజయ్ నటించే చివరి సినిమా ఇదే అవుతుంది. ఆల్రెడీ విజయ్‌తో మూడు సినిమాలు చేసిన సమంత ఆయన చివరి సినిమాలో కూడా హీరోయిన్‌గా నటిస్తారా? విజయ్-సమంతల జోడీ నాలుగోసారి రిపీట్ అవుతుందా అనే ప్రశ్నకు సమాధానం కొన్ని రోజుల్లో తెలిసిపోతుంది.

భార్య-భర్త-మధ్యలో మాజీ ప్రేయసి



● వెంకటేశ్, మీనాక్షి

'ఎఫ్ 2, ఎఫ్ 3' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత హీరో వెంకటేశ్-దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ కాంబినేషన్‌లో కొత్త సినిమా షురూ అయింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రూపొందుతున్న 58వ చిత్రమిది. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వెంకటేశ్‌కి జోడీగా మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. వెంకటేశ్-మీనాక్షీ చౌదరిలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సురేష్‌బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ''హీరో, అతని భార్య, మాజీ ప్రేయసి... ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. హీరో- దర్శక-నిర్మాతల కాంబినేషన్‌లో ఇప్పటికే రెండు బ్లాక్‌బస్టర్‌లు రావడంతో మూడో చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రేక్షకులకు మునుపెన్నడూ కలగని అనుభూతిని అందించడానికి టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు'' అన్నారు మేకర్స్. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయి కుమార్, వీకే నరేశ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: సమీర్ రెడ్డి.

సెప్టెంబరులో సెట్




● మహేశ్ బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను శరవేగంగా చేస్తున్నారు రాజమౌళి. సెప్టెంబరులో ఈ సినిమాని సెట్స్‌కి తీసుకెళ్లాలన్నది రాజమౌళి ముందున్న ప్రస్తుత టార్గెట్ అట. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో కొన్ని రోజుల క్రితమే ఈ చిత్రానికి చెందిన సెట్ వర్క్‌ను ఆరంభించారని తెలిసింది. జస్ట్ ఒక్క సెట్ కాదు... పలు రకాల సెట్స్‌ను డిజైన్ చేయిస్తున్నారట రాజమౌళి. వీటిలో ఆఫీస్ సెట్ కూడా ఉందని, ఎక్కువ శాతం షూటింగ్ ఈ సెట్‌లో జరుగుతుందని భోగట్టా. ప్రస్తుతం తయారు చేయిస్తున్న సెట్స్‌లో ఏదో ఒక సెట్‌లో తొలి షెడ్యూల్‌ని ఆరంభిస్తారట. ప్రస్తుతం ఈ సినిమాకు చెందిన నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారు రాజమౌళి. ఈ క్రమంలోనే ఈ సినిమాలోని విలన్ పాత్రకు మలయాళ నటుడు- దర్శక-నిర్మాత పృథ్వీరాజ్ సుకుమారన్‌ను తీసుకున్నారనే టాక్ ప్రచారంలోకి వచ్చింది.

లవర్స్ డేకి లైలా

● 'లైలా'గా విశ్వక్



విశ్వక్ సేన్ అమ్మాయి గెటప్‌లో ఎలా ఉంటారు? అంటే ఇదిగో ఇలా ఉంటారు అంటూ కళ్లు మాత్రమే చూపిస్తూ లుక్‌ను రిలీజ్ చేసింది 'లైలా' చిత్రబృందం. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'లో విశ్వక్ సేన్ కొన్ని సన్నివేశాల్లో లేడీ గెటప్‌లో కనిపించనున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా పరిచయం కానున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సీన్‌కి దర్శకుడు హరీష్ శంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు కె. రాఘవేంద్ర రావు క్లాప్ ఇచ్చారు. సినిమా స్క్రిప్ట్‌ను నిర్మాతలు వెంకట సతీష్ కిలారు, పి. కిరణ్ మేకర్స్‌కి అందజేశారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''విశ్వక్ సేన్‌కు ఇది బ్యూటిఫుల్ మేకోవర్. 'లైలా'లో విశ్వక్ మ్యాన్ అండ్ ఉమన్‌గా కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తనిష్క్ బాగ్చి, జిబ్రాన్, కెమెరా: రిచర్డ్ ప్రసాద్.



● విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ

కథ వినగానే మా అమ్మ గుర్తొచ్చింది - రానా



● విశ్వదేవ్, నివేదా థామస్, రానా

''పాఠశాలలో చదువుతున్నప్పుడు 35 నంబర్ నాకు పెద్ద పర్వతంలాంటిది (నవ్వుతూ). నందు '35-చిన్న కథ కాదు' చెప్పినప్పుడు నాకు నేను గుర్తొచ్చాను, మా అమ్మ గుర్తొచ్చింది. ఈ కథని మా అమ్మకు చెప్పాను. ఇది మన అందరి కథ. ఈ కథని అందరూ రిలేట్ చేసుకుంటారు'' అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35-చిన్న కథ కాదు'. నంద కిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రానా మాట్లాడుతూ- ''వాణిజ్య సినిమాలు చాలా వస్తుంటాయి. కానీ ఇలాంటి ప్యూర్ హార్ట్ వార్మింగ్ స్టోరీలు రావడం చాలా అరుదు. ఇలాంటి మంచి కథలు సురేష్ ప్రొడక్షన్‌లో చేయాలనేది మా ఉద్దేశం. థియేటర్స్‌లో ఈ సినిమా చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు. ''35-చిన్న కథ కాదు'లో తల్లి పాత్రలో కనిపిస్తాను. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రల్లో చాలా డిఫరెంట్ క్యారెక్టర్‌ని ఈ సినిమాలో చేశాను'' అన్నారు నివేదా థామస్. ''35-చిన్న కథ కాదు' చాలా పెద్ద సినిమా'' అన్నారు నంద కిశోర్. ''ఈ సినిమా గొప్ప అనుభూతినిస్తుంది. మాకు మైలురాయిగా నిలిచిపోతుంది'' అన్నారు సృజన్ యరబోలు. ఈ కార్యక్రమంలో నటుడు విశ్వదేవ్ మాట్లాడారు.

విజయ్ సేతుపతి సరసన...



● నిత్యా మీనన్

హీరో, క్యారెక్టర్ ఆర్టిస్టు, విలన్... ఇలా విభిన్న పాత్రలతో విలక్షణ నటుల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. ఇటీవల విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'మహారాజ' సినిమా విడుదలై, బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన హీరోగా తమిళ దర్శకుడు పాండిరాజ్ ఓ కథను రెడీ చేశారట. గతంలోనే ఈ కథను విజయ్ సేతుపతికి వినిపించారట పాండిరాజ్. ఈ సినిమాలో నిత్యా మీనన్‌ను హీరోయిన్‌గా అనుకుంటున్నారని కోలీవుడ్ సమాచారం. ఇదిలా ఉంటే... రెండేళ్ల క్రితం డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో డైరెక్ట్‌గా విడుదలైన '19 (1)(ఎ)' సినిమాలో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఈ ఇద్దరూ పాండిరాజ్ సినిమా కోసం మరోసారి స్క్రీన్ షేర్ చేసుకునే చాన్స్ ఉంది.

రావణుడు వస్తున్నాడు



● రక్షిత్

'పలాస 1978' మూవీ ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా రూపొందిన తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. సంగీర్తనా విపిన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్ర చేశారు. వెంకట సత్య దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఇందులో రక్షిత్ అట్లూరి చేసిన యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులను అలరిస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, కెమెరా: నాని చమిడిశెట్టి.

సరికొత్త రాచరికం



● అప్సర

అప్సరా రాణి, వరుణ్ సందేశ్, విజయ్ శంకర్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'రాచరికం'. సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో ఈశ్వర్ నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''సరికొత్త కథతో 'రాచరికం' చిత్రాన్ని రూపొందించాం, ఇటీవల ఈ సినిమా నుంచి ఉగ్ర రూపం దాల్చిన కాళీ మాతగా అప్సరా రాణి పోస్టర్ రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. థ్రిల్లింగ్ కాన్సెప్ట్, డిఫరెంట్ కంటెంట్‌తో సగటు ప్రేక్షకుడిని కట్టిపడేసే సన్నివేశాలతో ఈ సినిమా ఉంటుంది. అతి త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.

ఎమోషనల్ చౌకీదార్



● పృథ్వీ, ధన్య

పృథ్వీ అంబర్ నటిస్తున్న పాన్ ఇండియన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'చౌకీదార్'. ఈ బహు భాషా చిత్రాన్ని చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో కల్లహళ్లి చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. బెంగళూరులోని బండే మహంకాళి ఆలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. తొలి సీన్‌కి సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, కల్లహళ్లి చంద్రశేఖర్ క్లాప్ ఇచ్చారు. పృథ్వీ అంబర్ మాట్లాడుతూ- ''ఈ చిత్రంలో పలు జీవితానుభవాలు ఉంటాయి'' అన్నారు. ''ఓ డిఫరెంట్ కథను ప్రేక్షకులకు చెప్పాలని ఈ కథను రెడీ చేశాను'' అన్నారు చంద్రశేఖర్. ''చౌకీదార్' మంచి ఎమోషనల్ డ్రామా. ఇందులో నాది చాలా మంచి పాత్ర'' అన్నారు సాయికుమార్.

సాక్షి బిజినెస్

గురువారం
4-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	545	79,987
నిఫ్టీ ▲	163	24,287

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	18,188	▲	159
డోజోన్స్	39,308	▼	28
ఎఫ్‌టీఎస్ఈ 100	8,171	▲	50
డాక్స్	18,375	▲	210
షాంఘై	2,982	▼	50
నికాయ్	40,581	▲	210

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	72,226 ▲	534
బంగారం (99.5 స్వచ్ఛత)	71,937 ▲	532
వెండి (కిలో)	89,698 ▲	1,683

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.12	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.83	107.38
€	యూరో	ఎస్‌బీఐ	88.69	91.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.29	52.41
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.88	56.82
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44

సూచీల సరికొత్త రికార్డులు

- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్
- అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో బుధవారం మరో మరపురాని రోజు. బీఎస్ఈ సెన్సెక్స్ సూచీ తొలిసారి 80,000 శిఖరాన్ని తాకింది. బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్స్, పారిశ్రామిక షేర్లు ముందుండి నడిపించాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు 2% రాణించి సూచీలకు దన్నుగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే ముగింపులోనూ తాజా రికార్డులు నమోదు చేశాయి. ఉదయం సెన్సెక్స్ 572 పాయింట్ల లాభంతో 80 వేల స్థాయిపైన 80,013 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 633 పాయింట్లు పెరిగి 80,074 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. అయితే చివర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 545 పాయింట్ల లాభంతో 80 వేల స్థాయి దిగువన 79,987 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 183 పాయింట్లు ఎగసి 24,307 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 163 పాయింట్ల లాభంతో 24,287 వద్ద స్థిరపడింది. లార్జ్‌క్యాప్ షేర్లలో ర్యాలీ క్రమంగా చిన్న, మధ్య తరహా షేర్లకు విస్తరించింది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.86%, 0.86 శాతం రాణించాయి.

- బ్యాంకుల స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏలు) 12 ఏళ్ల కనిష్టమైన 2.8 శాతానికి పరిమితం కావడంతో బ్యాంకింగ్ షేర్లు మరింత రాణిస్తాయని విశ్లేషకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఫలితంగా కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ బ్యాంక్, ఎస్‌బీఐలు 2% లాభపడ్డాయి.
- బ్యాంకింగ్ షేర్ల ర్యాలీతో పాటు ఎంఎస్‌సీఐ ఇండెక్స్ ఆగస్టు సమీక్షలో వెయిటేజీ పెంచవచ్చనే అంచనాలతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 2% పెరిగి రూ.1,768 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 3.50% ఎగసి రూ.1,792 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. దీంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.28,758 కోట్లు ఎగసి రూ.13.45 లక్షల కోట్లకు చేరుకుంది.
- ఈ జూన్ 25న 78 వేల స్థాయిని అందుకున్న సెన్సెక్స్... 80,000 స్థాయిని చేరేందుకు కేవలం ఏడు ట్రేడింగ్ సెషన్ల సమయాన్ని మాత్రమే తీసుకుంది.
- ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం(జూన్ 9న) నాటి నుంచి 3,294 పాయింట్లు ర్యాలీ చేసింది.



సెన్సెక్స్ 80 వేల స్థాయిని అందుకోవడం దలాల్ స్ట్రీట్‌కు దక్కిన పెద్ద విజయం. లేమన్ సంక్షోభం (2008)లో 8800 స్థాయికి దిగివచ్చింది. కానీ 16 ఏళ్లలో 9 రెట్ల ఆదాయాలు ఇచ్చింది. నాలుగేళ్ల క్రితం కరోనా భయాలతో 26,000 స్థాయికి చేరుకుంది. అయితే పతనమైన ప్రతిసారీ అంతే వేగంగా పుంజుకుంది. ఈక్విటీ మార్కెట్లు దీర్ఘకాలానికి అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాయి అనేందుకు ఇది నిదర్శనం.

– శ్రీకాంత్ చౌహాన్
కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్

సెన్సెక్స్ రికార్డు ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ జీవితకాల గరిష్ట స్థాయి రూ.445.43 లక్షల కోట్లకు చేరింది.

వ్రజ్ ఐరన్ బంపర్ లిస్టింగ్

వ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్ తాకింది. బీఎస్ఈలో 16% ప్రీమియంతో రూ.240 వద్ద లిస్టయ్యింది. ఈక్విటీ మార్కెట్ రికార్డు ర్యాలీతో మరింత కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరికి 22% లాభపడి రూ.252 అప్పర్ సర్క్యూట్ వద్ద లాకైంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.831 కోట్లుగా నమోదైంది.


జూన్ 4: ఎన్డీయేకు బంపర్ మెజారిటీ ఖాయమన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ముందు రోజు 2,500 పాయింట్ల ర్యాలీ చేసి మార్కెట్ ఫుల్ జోష్ మీదుంది. అయితే, తెల్లారేసరికి అంచనాలు తారుమారయ్యాయి. మార్కెట్‌కు ఎన్నికల ఫలితాల ట్రెండ్ ఊహించన్ని షాకిచ్చింది. బీజేపీకి సొంతంగా మ్యాజిక్ ఫిగర్ కష్టమేనని తేలిపోవడంతో దేశీ స్టాక్ మార్కెట్‌పై అమ్మకాల సునామీ విరుచుకుపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 6,234 పాయింట్లు దిగజారి ఏకంగా 70,234 పాయింట్లకు కుప్పకూలింది. చివరికి 4,390 పాయింట్ల భారీ నష్టంతో 72,079 వద్ద ముగిసింది.

కట్ చేస్తే...

జూలై 3: ఎన్నికల ఫలితాలతో బ్రుత్తిరిగిన బుల్.. మళ్లీ రంకెలేస్తూ దూసుకుపోయింది. సరిగ్గా నెల రోజుల వ్యవధిలో (ఫలితాల రోజు కనిష్ట స్థాయితో పోలిస్తే) దాదాపు 10,000 పాయింట్ల ర్యాలీతో దుమ్మురేపింది. చరిత్రలో తొలిసారి 80,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. రోజుకో సరికొత్త రికార్డులతో హోరెత్తిస్తోంది.

సెన్సెక్స్ రోలర్ కోస్టర్

- నెల రోజుల్లో 10,000 పాయింట్లు జంప్
- ఫలితాల రోజున ఏకంగా 6,234 పాయింట్లు క్రాష్
- 70,234 పాయింట్ల కనిష్ట స్థాయికి పతనం



ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నింటినీ తలకిందులు చేస్తూ ఎన్నికల ఫలితాలు బీజేపీ, ఎన్డీయే కూటమిని బిత్తరపోయేలా చేశాయి. అయితే, మిత్రపక్షాల దన్నుతో మళ్లీ సుస్థిర ఎన్డీయే సర్కారు కొలువుదీరడంతో మార్కెట్ వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి. ఫలితాల రోజున నష్టాలన్నింటినీ మూడు రోజుల్లోనే ఎగిరిపోయాయి. వృద్ధికి ఊతమిచ్చేలా 100 రోజుల అజెండాను ప్రకటించిన మోదీ 'హ్యాట్రిక్' ప్రభుత్వ చర్యలు ఇన్వెస్టర్లలో మళ్లీ ఉత్సాహాన్ని నింపాయి. విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాల బాటను వీడి మళ్లీ కొనుగోళ్ల రూట్లోకి రావడం కూడా మార్కెట్‌కు మరింత ఇం'ధనాన్ని' అందించింది. రాబోయే కాలంలో మౌలిక రంగ ప్రాజెక్టులపై మోదీ సర్కారు భారీగా ఖర్చు చేయనుండటం, బడ్జెట్లో వృద్ధికి ఊతమిచ్చేలా పలు చర్యలు ఉంటాయన్న అంచనాలతో మార్కెట్లో ర్యాలీ కొనసాగుతోంది. తాజాగా 80,000 పాయింట్ల శిఖరాన్ని కూడా దాటేయడం దీనికి నిదర్శనం. కాగా, ఈ ఏడాది చివరికల్లా సెన్సెక్స్ 90,000 పాయింట్లను తాకే అవకాశాలు మెండుగా ఉన్నా యని సుందరం మ్యూచువల్ ఫండ్ మాజీ ఎండీ సునీల్ సుబ్రమణ్యం అంచనా వేయడం విశేషం. దీనికి ప్రధానంగా లార్జ్ క్యాప్ షేర్ల ర్యాలీ దన్ను గా నిలుస్తుందని కూడా ఆయన చెబుతున్నారు. కాగా, ఇన్వెస్టర్ల సంపద గత నెల రోజుల్లోనే రూ. 50 లక్షల కోట్లు దూసుకెళ్లింది. జూన్ 4న రూ.395 లక్షల కోట్లుగా ఉన్న బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జూలై 3న రూ.445.5 లక్షల కోట్లకు ఎగబాకడం గమనార్హం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇక 'కూ'త ఉండదు!

- నిధుల కొరత, భాగస్వామ్య యత్నాల వైఫల్యంతో మూసివేత
- వ్యవస్థాపకులు రాధాకృష్ణ, మయాంక్ వెల్లడి

న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్ (గతంలో ట్విటర్)కు ఒక దశలో దేశీ ప్రత్యామ్నాయంగా ఎదిగిన 'కూ' మూతబడుతోంది. నిధుల కొరత, దిగ్గజ కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో సేవలను నిలిపివేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు అప్రమేయ రాధాకృష్ణ, మయాంక్ బిదావత్కా వెల్లడించారు. 'పలు ఇంటర్నెట్ కంపెనీలు, దిగ్గజ సంస్థలు, మీడియా సంస్థలతో భాగస్వామ్యం కోసం ప్రయత్నించాం. అయితే, వాటితో చర్చలు మేము ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. మేము యాప్‌ను కొనసాగించాలనే అనుకున్నా టెక్నాలజీ సేవల వ్యయాలు భారీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదు' అని లింక్డ్‌ఇన్‌లో వారు పోస్ట్ చేశారు. 2021లో ట్విటర్, కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదం తలెత్తినప్పుడు 'కూ' చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఒక దశలో కోటి పైగా నెలవారీ యాక్టివ్ యూజర్లు, రోజుకు 21 లక్షల మంది యాక్టివ్ యూజర్లు ఉండేవారు.

సేవలకు కొత్త ఆర్డర్ల భరోసా

జూన్‌లో సూచీ 60.5కు అప్

న్యూఢిల్లీ: సేవల రంగం జూన్‌లో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 60.5కు ఎగసింది. మేలో సూచీ ఐదు నెలల కనిష్ట స్థాయి 60.2కు పడిపోయిన సంగతి తెలిసిందే.



కొత్త ఆర్డర్లు పెరగడం, దేశీయ, అంతర్జాతీయ విక్రయాల్లో పురోగతి వంటి అంశాలు జూన్‌లో పటిష్ఠ ఫలితాలు రావడానికి కారణం. కాగా, సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణించే సంగతి తెలిసిందే. సూచీ 50 దిగువకు పడిపోతేనే దానిని క్షీణతగా పరిగణిస్తారు. ఇదిలావుండగా, సేవలు–తయారీ విభాగాలతో కలగలిపిన హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా మేలో 60.5 వద్ద ఉంటే, జూన్‌లో 60.9కి ఎగసింది. 400 సంస్థల ప్యానెల్‌కు పంపిన ప్రశ్నపత్రాలకు వచ్చిన ప్రతిస్పందనలతో హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్‌ను ఎస్అండ్‌పీ గ్లోబల్ రూపొందిస్తుంది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ 230 కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ ఉత్పత్తుల లిస్టెడ్ సంస్థ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ ఉత్పత్తి, ఎగుమతి సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు రూ. 230 కోట్లు పెట్టుబడులు పెడుతోంది. ఇందులో సింహభాగం నిధులను గ్రూప్ సంస్థ ఏజీఐ గ్లాస్‌ప్యాక్‌లో ప్రస్తుత ఫర్నేస్‌లను ఆధునీకరించేందుకు, అధునాతన టెక్నాలజీలను వినియోగంలోకి తెచ్చుకునేందుకు ఇన్వెస్ట్ చేస్తోంది. ఏజీఐ గ్రీన్‌ప్యాక్ సీఈవో రాజేశ్ ఖోస్లా ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయంగా గ్లాస్ ప్యాకేజింగ్ మార్కెట్ 2024లో 67.28 బిలియన్ డాలర్లు ఉండగా 2032 నాటికి 93.69 బిలియన్ డాలర్లకు చేరే అంచనాలు ఉన్నాయని ఖోస్లా వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భువనగిరిలోని తమ స్పెషాలిటీ గ్లాస్ ప్లాంటుతో పాటు ఇతరత్రా ఉత్పత్తి సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. గ్లాస్ ప్యాకేజింగ్ ఉత్పత్తులను ఇప్పటికే అమెరికాకు ఎగుమతి చేస్తుండగా కొత్తగా మధ్యప్రాచ్యం, యూరప్ మార్కెట్లలో కూడా అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎన్ఎస్ఎల్‌టీకి చెందిన హిందుస్తాన్ నేషనల్ గ్లాస్ కొనుగోలు ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం తమ టర్నోవరు రూ. 2,421 కోట్లుగా ఉందని ఖోస్లా చెప్పారు.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐడీబీఐలో 31 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ)..స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 31.
» **పోస్టుల వివరాలు:** డిప్యూటీ జనరల్ మేనేజర్ గ్రేడ్ డి–03, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గ్రేడ్ సి–15, మేనేజర్ గ్రేడ్ బి–13.
» **విభాగాలు:** ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఆడిట్–ఇన్ఫర్మేషన్ సిస్టమ్, డిజిటల్ బ్యాంకింగ్ అండ్ ఎమర్జింగ్ పేమెంట్స్, రిస్క్ మేనేజ్‌మెంట్–ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గ్రూప్, సెక్యూరిటీ, ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ గ్రూప్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.06.2024 నాటికి జనరల్ డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి దరఖాస్తుల ప్రిలిమినరీ స్క్రీనింగ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.07.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.idbibank.in

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 2,700 అప్రెంటిస్‌లు

న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ప్రధాన కార్యాలయం, హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్‌లో.. దేశవ్యాప్తంగా పీఎన్‌బీ శాఖల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 2,700 (ఏపీలో 27, తెలంగాణలో 34 ఖాళీలు).
» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 30.06.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు రూరల్/సెమీ అర్బన్ ప్రాంతానికి రూ.10,000, పట్టణ ప్రాంతానికి రూ.12,000, మెట్రో ప్రాంతానికి రూ.15,000.
» **శిక్షణ వ్యవధి:** ఏడాది.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ రాతపరీక్ష, లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష ఉంటుంది. జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు–25 మార్కులు), జనరల్ ఇంగ్లిష్ (25 ప్రశ్నలు–25 మార్కులు), క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్ (25 ప్రశ్నలు–25 మార్కులు), కంప్యూటర్ నాలెడ్జ్ (25 ప్రశ్నలు–25 మార్కులు). పరీక్ష వ్యవధి: 60 నిమిషాలు.
» **పరీక్ష మాధ్యమం:** ఇంగ్లిష్/హిందీ.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 30.06.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 14.07.2024.
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 28.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.pnbindia.in

నేషనల్ హౌసింగ్ బ్యాంక్, న్యూఢిల్లీలో 48 పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ హౌసింగ్ బ్యాంక్(ఎన్‌హెచ్‌బీ).. కాంట్రాక్ట్/రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 48

పోస్టుల వివరాలు

» **రెగ్యులర్ పోస్టులు:** జనరల్ మేనేజర్(స్కేల్ 7)–01, అసిస్టెంట్ జనరల్ మేనేజర్(స్కేల్5)–01, డిప్యూటీ మేనేజర్(స్కేల్2)–03, అసిస్టెంట్ మేనేజర్(స్కేల్1)–18.
» **కాంట్రాక్ట్ పోస్టులు:** చీఫ్ ఎకనామిస్ట్–01, సీనియర్ ప్రాజెక్ట్ ఫైనాన్స్ ఆఫీసర్–10, ప్రాజెక్ట్ ఫైనాన్స్ ఆఫీసర్–12, ప్రోటోకాల్ ఆఫీసర్–01, అప్లికేషన్ డెవలపర్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, సీఏ/ ఐసీడబ్ల్యూఏఐ /ఐసీఏఐ/సీఎఫ్ఏ/ ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ, బీటెక్ (సీఎస్/ఐటీ) /ఎంసీఏ/ ఎంటెక్(సీఎస్ /ఐటీ)/బీఎస్సీ(సీఎస్/ఐటీ)/ఎంఎస్సీ(సీఎస్/ఐటీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రారంభతేది:** 29.06.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.07.2024.
» **వెబ్‌సైట్:** https://nhb.org.in

విదేశీ విద్యకు.. స్కాలర్‌షిప్స్ ఊతం!

విదేశీ యూనివర్సిటీల్లో చదువుకోవాలని కోరుకుంటున్న విద్యార్థులకు అక్కడి భారీ ఫీజులు, వ్యయాలు ప్రధాన అవరోధంగా నిలుస్తున్నాయి. దీంతో ఎంతోమంది అవకాశాలు వచ్చినా వదులుకుంటున్న పరిస్థితి. ఇలాంటి విద్యార్థులకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం కల్పిస్తున్నాయి.. స్కాలర్‌షిప్స్! అకడమిక్ ప్రతిభతోపాటు టాప్ యూనివర్సిటీలో ప్రవేశం పొందితే.. ఉపకార వేతనం లభించే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. స్టడీ అబ్రాడ్ విద్యార్థులకు అందుబాటులో ఉన్న పలు స్కాలర్‌షిప్‌ల వివరాలు..

» ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్న ఉపకార వేతనాలు
» అకడమిక్ రికార్డ్, ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్స్

ఫుల్‌బ్రైట్ మాస్టర్స్ ఫెలోషిప్స్

భారతీయ విద్యార్థులు తొలి గమ్యంగా భావించే అమెరికాలో.. ఎలాంటి కోర్సుల్లో చేరాలనుకున్న వారికైనా.. అందుబాటులో ఉన్న ఉపకార వేతనం.. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్స్. ఆర్ట్స్, ఎకనామిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/స్టడీస్, హయ్యర్ ఎడ్యుకేషన్ అడ్మినిస్ట్రేషన్, ఇంటర్నేషనల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ లీగల్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, పబ్లిక్ హెల్త్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ఉమెన్స్ స్టడీస్/జండర్ స్టడీస్ తదితర విభాగాల్లో పీజీ, ఆపై స్థాయి కోర్సుల్లో చేరిన వారు ఈ ఫెలోషిప్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన వారికి కోర్సు వ్యవధిలో ఒకసారి స్వదేశానికి వచ్చి వెళ్లేందుకు విమాన చార్జీలు, నివాస ఖర్చులు, ట్యూషన్ ఫీజు ఫండింగ్ వంటివి లభిస్తాయి.

- వెబ్‌సైట్: www.usief.org.in/Fullbright-Nehru-Fellowships.aspx

క్వాడ్ ఫెలోషిప్ ఫర్ స్టెమ్ కోర్సెస్

క్వాడ్ దేశాల కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైన స్కాలర్‌షిప్ ఇది. క్వాడ్ గ్రూప్‌లోని ఆస్ట్రేలియా, భారత్, జపాన్, అమెరికాకు చెందిన వంద మంది విద్యార్థులకు అమెరికాలోని యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో.. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ పీజీ, డాక్టోరల్ కోర్సుల్లో చేరే వారికి ఈ క్వాడ్ ఫెలోషిప్‌ను అందిస్తారు. దీనికి ఎంపికైన వారికి రూ.50 వేల డాలర్ల ఏక మొత్తం ఆర్థిక సహాయం అందిస్తారు. నీడ్ బేస్డ్ విధానంలో కోర్సు పూర్తి చేసుకునేందుకు అయ్యే వ్యయంలో భాగంగా మరో 25 వేల డాలర్లు ఇస్తారు.

- వెబ్‌సైట్: www.quadfellowship.org

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ ఫర్ ఎస్సీ క్యాండిడేట్స్

దేశంలో ఎస్సీ కేటగిరీలకు చెందిన అల్పాదాయ వర్గాల విద్యార్థులు విదేశీ విద్యను అందుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకం.. నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్. ఎస్సీ/ఎస్టీ, వ్యవసాయ కూలీ కుటుంబాలకు చెందిన విద్యార్థులు, డినోటిఫైడ్, సంచార, పాక్షిక సంచార జాతులు, సంప్రదాయ కళాకారుల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ ఆదాయం రూ.8లక్షలకు లోపు ఉండాలి. డిగ్రీ లేదా పీజీ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి.. విదేశాల్లో పీజీ లేదా పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకుని ఉండాలి. మొత్తం 125 స్కాలర్‌షిప్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఎస్సీ కులాల వారికి–115, సంచార, పాక్షిక సంచార జాతుల వారికి–06, భూమిలేని వ్యవసాయ కూలీలకు, సంప్రదాయ కళాకారులకు–04 స్కాలర్‌షిప్స్‌ను కేటాయిస్తారు. పీజీ కోర్సులో చేరితే మూడేళ్ల పాటు, పీహెచ్‌డీ చేస్తే నాలుగేళ్ల కాలానికి స్కాలర్‌షిప్స్‌ను మంజూరు చేస్తారు.

- వివరాలకు వెబ్‌సైట్: https://nosmsje.gov.in

ఏడీబీ-జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

జపాన్‌లోని యూనివర్సిటీల్లో ప్రవేశం ఖరారు చేసుకున్న మన దేశ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో ప్రముఖ స్కాలర్‌షిప్ పథకం.. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ జపాన్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్. ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇతర అభివృద్ధి సంబంధిత విభాగాల్లో ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో విద్యనభ్యసించే విద్యార్థులకు ఇవి లభిస్తాయి. ఎంపికైన వారికి పూర్తి స్థాయి ట్యూషన్ ఫీజు, హౌసింగ్ అలవెన్స్, బుక్స్ అలవెన్స్, ట్రావెల్ ఎక్స్‌పెన్సెస్ అందుతాయి.

- వివరాలకు వెబ్‌సైట్: www.adb.org

టోఫెల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

ప్రముఖ లాంగ్వేజ్ టెస్టింగ్ ఏజెన్సీ ఈటీఎస్.. టోఫెల్ స్కాలర్‌షిప్‌లను అందిస్తోంది. ఏ దేశంలో ప్రవేశం ఖరారు చేసుకున్నా.. ఈ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్‌గా 80 శాతంపైగా మార్కులు సాధించాలి. టోఫెల్‌లో సదరు యూనివర్సిటీ పేర్కొన్న స్కోర్ సాధించిన విద్యార్థులు అర్హులు. ఎంపికైన వారికి నెలకు ఏడు వేల డాలర్ల స్టయిఫండ్ లభిస్తుంది.



- వివరాలకు వెబ్‌సైట్: www.ets.org/toefl/grants

బ్రిటిష్ కౌన్సిల్ ఐఈఎల్‌టీఎస్ అవార్డ్స్

బ్రిటిష్ కౌన్సిల్.. ఐఈఎల్‌టీఎస్ స్కోర్ ఆధారంగా అందిస్తున్న స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ఇది. ఐఈఎల్‌టీఎస్ జాయింట్ ఫండెడ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ పేరుతో ఈ స్కాలర్‌షిప్స్‌ను ఏర్పాటు చేసింది. వీటికి బ్రిటిష్ కౌన్సిల్, ఐడీపీ, ఐఈఎల్‌టీఎస్ ఆస్ట్రేలియా సహకారం అందిస్తాయి. ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు కోసం రూ.మూడు లక్షల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.ielts.org/for-researchers/grants-and-awards

ఎరాస్‌మస్ ముండస్

యూరోపియన్ యూనియన్ దేశాల్లో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో చేరాలనుకునే వారికి అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్.. ఎరాస్‌మస్ ముండస్. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు, నివాస వసతి, మెడికల్ అలవెన్స్, ఇన్సూరెన్స్ తదితర ఖర్చుల మొత్తానికి సరిపడే విధంగా ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది.

- వివరాలకు వెబ్‌సైట్: eacea.europa.eu/erasmus_mundus/funding

కామన్వెల్త్ స్కాలర్‌షిప్స్-యూకే

కేంద్ర ప్రభుత్వ పరిధిలో అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకం ఇది. కామన్వెల్త్ సభ్య దేశాల జాబితాలోని ఏ దేశంలోనైనా చదవాలనుకునే వారు ఈ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుకు అర్హులు. మాస్టర్స్ స్థాయిలో ఒక ఏడాది, పీహెచ్‌డీ స్థాయిలో మూడేళ్లు ఈ స్కాలర్‌షిప్ లభిస్తుంది. అర్హులైన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు, నివాస వ్యయాలకు సరిపడ మొత్తంలో ఆర్థిక తోడ్పాటు అందుతుంది.

- వివరాలకు వెబ్‌సైట్: mhrd.gov.in/scholarships

డీఏఏడీ స్కాలర్‌షిప్స్

జర్మనీలో ఇంజనీరింగ్, సైన్స్ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డాక్టోరల్, పోస్ట్ డాక్టోరల్ స్టడీస్ అభ్యర్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకం ఇది. దీన్ని జర్మన్ అకడమిక్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ మేరకు అందిస్తారు. ఎంపికైన వారికి ట్యూషన్ ఫీజు, నివాస ఖర్చుల మొత్తానికి స్కాలర్‌షిప్ లభిస్తుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.daad.in/en

ఎ-స్టార్ యూత్ స్కాలర్‌షిప్

సింగపూర్‌లో గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన భారత విద్యార్థుల కోసం సింగపూర్ ప్రభుత్వం ప్రత్యేకంగా అందిస్తున్న స్కాలర్‌షిప్ పథకం ఎ-స్టార్ యూత్ స్కాలర్‌షిప్ ఫర్ ఇండియా.

- వివరాలకు వెబ్‌సైట్: www.a-star.edu.sg/Scholarships/for-graduate-studies

ఓఎఫ్ఐడీ స్కాలర్‌షిప్ అవార్డ్

ఆర్గనైజేషన్ ఆఫ్ పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ పథకం ఇది. ఓఎఫ్ఐడీ ఒపెక్ ఫండ్ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ పేరిట అందిస్తున్న ఈ స్కాలర్‌షిప్‌నకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లు/యూనివర్సిటీల్లో మాస్టర్ డిగ్రీలో చేరాలనుకుంటున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెందిన విద్యార్థులు అర్హులు. ఎంపికైన విద్యార్థులకు యాభైవేల డాలర్ల ట్యూషన్ ఫీజు, నివాస ఖర్చులు, రిలొకేషన్ గ్రాంట్, ప్రయాణ ఖర్చులు లభిస్తాయి.

- వివరాలకు వెబ్‌సైట్:www.ofid.org/FOCUS-AREAS/Beyond-the-scope/Scholarship-Award

ఛార్లెస్ వాలెస్ ఇండియా ట్రస్ట్ స్కాలర్‌షిప్స్

యూకేలో పీజీ, ఆపై స్థాయి కోర్సుల అభ్యర్థులకు అందుబాటులో ఉన్న స్కాలర్‌షిప్ ఇది. ఎంపిక చేసుకున్న కోర్సు మేరకు ఏడాదికి గరిష్ఠంగా 1400 పౌండ్ల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

- వివరాలకు వెబ్‌సైట్: www.britishcouncil.in/study-uk/scholarships/charles-wallace-india-trust-scholarships

అథ్లెట్‌కు సీతక్క చేయూత

ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ



సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కోయ నర్సాపురం గ్రామానికి చెందిన అథ్లెట్ పాయం కుమారి మనదేశం తరపున ఒలింపిక్స్‌లో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందు కోసం చత్తీస్‌గఢ్‌లో ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నారు. అయితే నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన కుమారి ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో...బుధవారం సచివాలయంలో మంత్రి ధనసరి అనసూయ సీతక్కను శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసిన కుమారి తనకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి సీతక్క.. భద్రాచలం ఐటీడీఏ అధికారులతో మాట్లాడారు. అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తక్షణ సహాయం కింద వ్యక్తిగతంగా రూ.ఐదు వేల ఆర్థిక సహాయం అందించారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై తెలంగాణ, దేశ కీర్తిని చాటేలా క్రీడాకారులందరినీ తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అన్ని రకాలుగా ఆదుకుంటుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకి పాయం కుమారి, ఆమె కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పటాన్‌చెరు ఎమ్మెల్యే బ్యాంక్ లాకర్ల తనిఖీ

మళ్లీ రంగంలోకి ఈడీ



పటాన్ చెరుటౌన్: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన కుటుంబీలకు చెందిన యాక్సిస్ బ్యాంక్ లాకర్ తెరిచి ఖాతా లావాదేవీలను కూడా ఈడీ అధికారులు బుధవారం తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. మంగళవారం ఆయన్ను తమ కార్యాలయానికి పిలిచి వారు విచారించారు. కాగా, గత నెల 20న ఎమ్మెల్యే, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డికి చెందిన సంతోశ్ శాండ్ అండ్ గ్రానైట్ క్వారీలో అవకతవకలపై వారి ఇళ్లపై సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో కొన్ని దస్త్రాలను వెంట తీసుకెళ్లారు. వీరితోపాటు కుటుంబీకులకు చెందిన మొత్తంగా ఐదు సెల్‌ఫోన్లను సైతం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఫోన్‌ల లాక్‌లు తెరిచి వివరాలు సేకరించారు.

చెర వీడిన సంతోషం!

ప్రభుత్వ క్షమాభిక్షతో విడుదలైన 213 మంది ఖైదీలు • కుటుంబీకుల్ని కలుసుకుని ఆనందబాష్పాలు



హైదరాబాద్ చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి బయటకు వస్తున్న ఖైదీలు

సాక్షి, హైదరాబాద్, కుషాయిగూడ, మల్లాపూర్: క్షణికావేశంలో నేరాలకు పాల్పడ్డారు. జైలు పాలయ్యారు. శిక్షా కాలంలో సత్ప్రవర్తనతో మెలిగారు. ప్రభుత్వం కనికరించక పోతుందా, క్షమాభిక్ష ప్రసాదించక పోతుందా అని ఏళ్ల తరబడి ఎదురుచూశారు. ఆరోజు వస్తే మళ్లీ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని భావించారు. బయట ఉన్న వారి కుటుంబసభ్యుల్లో కూడా అదే ఆశ. వారి నిరీక్షణ ఫలించింది. వారు ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్లలో సత్ప్రవర్తన కలిగిన 213 మంది ఖైదీలకు ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. దీంతో హైదరాబాద్‌లోని చర్లపల్లి కేంద్ర కారాగారం, చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం, హైదరాబాద్ సెంట్రల్ జైలు, హైదరాబాద్‌లోని ప్రత్యేక మహిళా జైలుతో పాటు వరంగల్, నిజామాబాద్ తదితర జిల్లా జైళ్లలో ఉన్న వీరంతా బుధవారం విడుదలయ్యారు. బాహ్య ప్రపంచంలో స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. తమ కోసం ఉదయాన్నే వచ్చి బయట వేచి చూస్తున్న కుటుంబ సభ్యులను కలుసుకుని ఆనందభాష్పాలు రాల్చారు. ఈ సందర్భంగా ఆయా జైళ్ల వద్ద కొంత ఉద్విగ్న వాతావరణం నెలకొంది. చర్లపల్లి జైలు నుంచి విడుదలైన కొందరు ఖైదీలు 'సాక్షి'తో మాట్లాడారు.

నా ఇద్దరు కొడుకులు విడుదలయ్యారు



మాది జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట. నాకు ఇద్దరు కొడుకులు, కూతురు. పెద్ద కొడుకు ఆకుల రామన్న భార్య, నా పెద్ద కోడలు కుటుంబ సభ్యులతో గొడవ జరిగి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో నా కొడుకు బామ్మర్ది వెంకటేష్ చనిపోవడంతో నా ఇద్దరు కొడుకులు రామన్న, చంద్రయ్యలపై హత్య కేసు నమోదయింది. 14 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించారు. ఎట్టకేలకు జైలు నుంచి వస్తున్నారు.

– ఆకుల రాజవ్వ

మద్యం మా బతుకుల్లో చీకటి నింపింది



మాది వరంగల్. నా భర్త మద్యం తాగడానికి డబ్బులు కావాలంటూ మా అత్తమ్మతో గొడవపడి ఆమెపై దాడి చేశాడు. దాంతో ఆమె చనిపోయింది. చేసిన తప్పుకు నా భర్త 14 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు. నాకు, నా పిల్లలకు దూరమయ్యాడు. నేను కూలీనాలీ చేసుకుంటూ పిల్లలను సాదుకుంటున్నాను. ఈ రోజుతో మా బతుకుల్లో నిండిన చీకటి తొలగిపోయింది.

– స్వర్ణలత

వ్యవసాయం చేసుకుంటూ గడిపేస్తాం



మాది నిజామాబాద్ జిల్లా. మా తండ్రికి ఇద్దరు భార్యలు. నేను వృత్తిరీత్యా ఆర్‌ఎంపీ డాక్టరును. తండ్రి బతికి ఉన్నప్పుడే ఆస్తి పంపకాలు జరిగిపోయాయి. ఎవరి బతుకు వారు బతుకుతున్నాం. అయితే కొంతమంది చెప్పుడు మాటలతో మా చిన్నమ్మ కొడుకు మాతో గొడవకు దిగాడు. కాపు కాసి నాపై దాడికి పాల్పడ్డాడు. నేను ఆవేశంతో చిన్నమ్మ కొడుకు పైకి విసిరిన కర్ర చిన్నమ్మ గంగు తలకు తగిలింది. ఆమె మృతి చెందడంతో నాతో పాటు, నా అన్న దాసరి గంగారాంపై మర్డర్ కేసు నమోదయింది. ఇద్దరం 14 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాం. ఆవేశం ఎంతటి అనర్థానికి దారితీస్తుందో తెలిసొచ్చింది. ఇకపై ఊళ్లో వ్యవసాయం చేసుకుంటు గడిపేస్తాం.

– దాసరి మురళి, దాసరి గంగారాం

జైలు జీవితం అన్నీ నేర్పింది



మాది బిహార్. బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి గార్డెనింగ్ చేస్తుండేవాడిని. మద్యం మత్తులో స్నేహితుడిని హత్య చేశా. 21 సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించా. ఇన్నేళ్ల జైలు జీవితం నాకు అన్నీ నేర్పింది. ఎదుటి వారిని ప్రేమించడం, పెద్దలను గౌరవించడంతో పాటు ఎలా బతకాలో కూడా నేర్పింది. ఆరు నెలల క్రితం జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రా మేడంను కలిసే అవకాశం దక్కింది. నా తండ్రి చనిపోయాడని, ఒంటరిగా ఉంటున్న అమ్మను చూసుకునేందుకు అవకాశం కల్పించమని వేడుకున్నా. నా అభ్యర్థన ఫలించింది. క్షమాభిక్ష లభించింది. నాకు డీజీ మేడం పునర్జన్మనిచ్చారు. జైల్లో నేను హార్పిక్, డిటర్జెంట్ కేక్, పౌడర్, ఫ్లోర్ క్లీనర్, డిష్‌వాష్‌ల తయారీపై తర్ఫీదు పొందా. బీహార్‌లో వీటి తయారీ కేంద్రం పెడతా.

– మున్నా

బతుకుకు భరోసా ఇచ్చారు



మాది సిద్దిపేట జిల్లాలోని నాచారం. నేను మటన్ షాపు నడిపేవాడిని. క్షణికావేశంలో ఓ మహిళను హత్య చేశాను. 14 ఏళ్ల జైలు జీవితంలో సత్ప్రవర్తనతో మసులుకున్నా. దీంతో నాకు క్షమాభిక్ష ప్రసాదించారు. జైల్లో ఉండగా పెట్రోల్ బంకులో పనిచేసేవాడిని. విడుదల అనంతరం కూడా నాకు చంచల్‌గూడ జైల్ పెట్రోల్ బంకులో ఉద్యోగం చేసే అవకాశం కల్పించింది.

– మహ్మద్ ఫరూక్

ముఖ్యమంత్రిని కలుస్తా

నల్లగొండ జైలు నుంచి విడుదలైన ఖైదీ నాగయ్య



నల్లగొండ క్రైం: తాను రెండురోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు వెళతానని, క్షమాభిక్ష నేపథ్యంలో బుధవారం నల్లగొండ జిల్లా జైలు నుంచి విడుదలైన ఖైదీ నాగయ్య చెప్పాడు. ఈ జైలు నుంచి విడుదలైన మొత్తం నలుగురు ఖైదీల్లో నల్లగొండ జిల్లా నిడమనూరుకు చెందిన నాగయ్య కూడా ఉన్నాడు. అయితే ఓ హత్య కేసులో శిక్ష పడిన నాగయ్య.. తనను నల్లగొండ జైలుకు తరలించకముందు హైదరాబాద్ చర్లపల్లి జైల్లో ఉన్నాడు. అయితే తాను అక్కడ ఉన్న సమయంలోనే 'ఓటుకు కోట్లు'కేసులో ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి కూడా చర్లపల్లి జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చారని నాగయ్య తెలిపాడు. ఈ సమయంలోనే పలు మార్లు రేవంత్‌రెడ్డితో మాట్లాడానని చెప్పాడు. జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కోసం ఒత్తిడి తేవాల్సిందిగా అప్పట్లో ఆయన్ను కోరానని చెప్పాడు. ఈ నేపథ్యంలోనే జైలు నుంచి విడుదలై తన వద్దకు వస్తే బతుకుతెరువు చూపిస్తానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పేర్కొన్నాడు. మరోవైపు రేవంత్‌రెడ్డి కూడా గతంలో కొన్ని ఇంటర్వ్యూలలో నాగయ్య పేరు పలుమార్లు ప్రస్తావించారు. కాగా మెదక్ జిల్లాకు చెందిన పాండు, సూర్యాపేటకు చెందిన కొమరయ్య, ములుగు ప్రాంతానికి చెందిన దశరథ కూడా నాగయ్యతో పాటు విడుదలయ్యారు.

శిక్ష కాదు.. శిక్షణ ఇచ్చాం

- అక్షర జ్ఞానం లేనివారు గోల్డ్‌మెడల్స్ సాధించారు
- విడుదలైన ఖైదీలు సమాజంలో మోడల్ సిటిజన్‌గా ఉండాలి
- జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా
- చర్లపల్లి జైల్లో 'మార్గదర్శనం.. ఉపాధి కల్పన' కార్యక్రమం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వివిధ కారణాలతో జైళ్లకు వచ్చిన వారికి శిక్షకు బదులుగా శిక్షణ ఇస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామని జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా పేర్కొన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులకు ఏళ్ల తరబడి కుటుంబాలకు దూరంగా, జైళ్లలో ఉన్న వారికి క్షమాభిక్ష ప్రసాదించాలని కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. విడుదలైన ఖైదీలంతా సమాజంలో మోడల్ సిటిజన్‌గా ఉండాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. బుధవారం క్షమాభిక్ష పొందిన ఖైదీల విడుదల సందర్భంగా చర్లపల్లి సెంట్రల్ జైల్లో 'మార్గదర్శనం..ఉపాధి కల్పన'పేరిట నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'రాష్ట్రవ్యాప్తంగా విడుదలైన 2013 మంది ఖైదీల్లో 205 మంది జీవిత కాలం శిక్ష పడిన వారు ఉండగా, అందులో 35 మంది మహిళలు ఉన్నారు. వీరందరికీ జైల్లో వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చాం. కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, టైలరింగ్, కంప్యూటర్, తదితర రంగాల్లో నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దాం. అక్షర జ్ఞానం లేనివారిని సైతం డిగ్రీ, పీజీ చదివించాం. కొందరు గోల్డ్ మెడల్స్ సంపాదించారు. 33% మంది ఖైదీలకు ఉపాధి చూపించాం. 70 మంది ఖైదీలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ బంకుల్లో ఉద్యోగాలు ఇచ్చాం. 10 మందికి టైలరింగ్ మిషన్లు అందజేశాం..'అని సౌమ్యా మిశ్రా తెలిపారు.

కర్మాగారాలుగా కారాగారాలు

జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు మాట్లాడుతూ.. 'కారాగారాలను కర్మాగారాలుగాను, పరివర్తనాలయాలగాను, విద్యాలయాలుగాను, దేవాలయాలుగాను మార్చాం. 10 నుంచి 15 ఏళ్ల పాటు జైళ్లలో ఉండి బయటకు వస్తున్న వారు తమతమ కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాం' అని అన్నారు. ఖైదీల విడులకు సంబంధించి గత నాలుగేళ్లుగా చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయని జైళ్ల శాఖ ఐజీ వై.రాజేష్ పేర్కొన్నారు. 'క్షమాభిక్ష దస్త్రాలు తీసుకుని వెళ్లినప్పుడు.. జైళ్లలో ఉన్న ఖైదీల్లో మార్పు వచ్చిందంటున్నారు. వారు మారిపోయారా? ఎలాంటి వ్యక్తులను రిలీజ్ చేస్తున్నారు? అని అడిగారు. మార్పు కనిపిస్తోందని ఉన్నతాధికారులకు చెప్పాం..'అని తెలిపారు. పెద్దపెద్ద తప్పులు చేసిన వారిని రిలీజ్ చేయడం లేదని. క్షణికావేశంలో పొరపాట్లు చేసి దశాబ్దాలుగా జైళ్లలో మగ్గుతున్న వారిని మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్, వరంగల్ డీఐజీలు డి.శ్రీనివాస్, ఎం.సంపత్, చర్లపల్లి, హైదరాబాద్, వరంగల్ కేంద్ర కారాగారాల ఎస్పీలు సంతోష్‌కుమార్, శివకుమార్ గౌడ్, కళాసాగర్, విడుదలైన ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఏం చేయాలో తోచక..

నవజాత శిశువు మృతదేహంతో బస్సులో ప్రయాణం



భద్రాచలం అర్బన్: ఆదివాసీ కుటుంబానికి చెందిన ఓ మహిళ భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో ప్రసవించగా ఆమెకు లోపాలతో మగశిశువు పుట్టాడు. దీంతో అంబులెన్స్‌లో వరంగల్ తరలించినా ఫలితం లేక శిశువు ప్రాణం కోల్పోవడంతో ఆ కుటుంబ పెద్ద మృతశిశువును సంచిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఉదంతమిది. భద్రాచలం సరిహద్దులో ఉన్న ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం చింతలపాడు గ్రామానికి చెందిన పొదం చుక్కమ్మ ప్రసవం కోసం ఈనెల 1న భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేరింది. అదేరోజు సాయంత్రం వైద్యులు ప్రసవం చేయగా రెండు కేజీల బరువుతో మగ శిశువు జన్మించాడు. కాగా, శిశువు (పొట్టలో ఉండాల్సిన పేగులు ఛాతీ భాగంలో ఉండడం) లోపంతో జన్మించినట్లు నిర్ధారించిన వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తే ఆ లోపాన్ని సరిచేస్తారని చెప్పి అంబులెన్స్‌లో పంపించారు. శిశువుతో పాటు చుక్కమ్మ మామ గంగయ్య వెళ్లగా వరంగల్‌లో వైద్యం అందిస్తున్న క్రమంలోనే ఆ శిశువు మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ విషయాన్ని వైద్యులు వివరించి.. మృతదేహాన్ని ఏం చేస్తారని ప్రశ్నిస్తుండగానే గంగయ్య బయటకు వచ్చేసినట్లు తెలిసింది. ఆపై ఆయన సంచిలో మృతదేహాన్ని పెట్టుకుని ఆర్టీసీ బస్సులో వరంగల్ నుంచి భద్రాచలానికి మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు చేరుకున్నాడు. ఇక్కడ కూడా బిడ్డ తల్లి ఉన్న ఆస్పత్రిలోకి వెళ్లకుండానే చుక్కమ్మ, ఇతర కుటుంబీకులకు సమాచారం ఇచ్చి బస్టాండ్ నుంచి స్వస్థలానికి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. చుక్కమ్మ బుధవారం ఉదయాన్నే తమకు చెప్పకుండా ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు సిబ్బంది తెలిపారు.

ప్రైవేటు భాగస్వామ్యంతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

త్వరలో టూరిజం పాలసీ: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: పర్యాటక ప్రాంతాలను ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. విదేశీ పర్యాటకులను సైతం గొప్పగా ఆకట్టుకోగల ప్రకృతి రమణీయ ప్రాంతాలు రాష్ట్రంలో ఉన్నప్పటికీ, ఇప్పటివరకు తెలంగాణలో వాటిని అభివృద్ధి చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో.. అలాంటి కేంద్రాలను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ)తో అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని వెల్ల డించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయటం ద్వారా ఆదాయ మార్గాలను అన్వే షించుకుంటామని, అది పర్యాటక శాఖ స్వయం సమృద్ధికి దోహదం చేస్తుందని వెల్లడించారు.

పదేళ్లలో పురోగతి లేదు...

గడిచిన పదేళ్లలో పర్యాటక శాఖ ఉన్నదనే విషయం మరిచిపోయారని, పర్యాటకరంగ అభివృద్ధికి ఓ విధానం అంటూ లేకుండా పోయిందని జూపల్లి విమర్శించారు. పర్యాటక పాలసీ లేకపోవటం వల్ల ఆ రంగం పురోగతే గతి తప్పిందని, దీన్ని వెంటనే సరిదిద్దాల్సిన అవసరం ఉందని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజంపై ప్రధానంగా దృష్టి సారిస్తూ పర్యాటక పాలసీ ముసాయిదాను సిద్ధం చేశామని, ముఖ్యమంత్రి సూచనలు, సలహాలు తీసుకుని దాన్ని త్వరలో అధికారికంగా వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఆరునెలల్లో పర్యాటక రంగాన్ని గాడిలో పెట్టడం ద్వారా పురోగతి సాధిస్తామన్నారు. తారామతి బారాదరి, హరిత హోటల్స్ నిర్వహణ సహా మొత్తం పర్యాటక ప్రాంతాలు అధ్వాన్నంగా తయారయ్యాయని, వాటిని యుద్ధప్రాతిపదికన బాగుచేసే చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. త్వరలో కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిని కలిసి తెలంగాణ పర్యాటక ప్రగతికి నిధులు కేటాయించాలని కోరతామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో తమ శాఖకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించామని, నిధులకు ఇబ్బందిగా ఉన్నందున ఎన్ని నిధులు కేటాయిస్తారో చూడాలని పేర్కొన్నారు. కృష్ణానది బ్యాక్ వాటర్స్‌లో సోమశిలను డెస్టినేషన్ వెడ్డింగ్, సాహస పర్యాటకానికి అనువైన ప్రదేశంగా గుర్తించామని, డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ప్రమోట్ చేయడానికి.. రామప్ప, లక్నవరం, నాగార్జునసాగర్, అనంతగిరి హిల్స్ లాంటి ముఖ్యమైన ప్రదేశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అనంతగిరిలో వెల్నెస్ టూరిజం రిసార్ట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బుద్ధవనాన్ని బుద్ధగయ తరహాలో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది తూర్పు, దక్షిణాసియా దేశాల పర్యాటకులను అకట్టుకునేలా వసతులు కల్పిస్తామని చెప్పారు. పేరిణి లాంటి నృత్య రూపాలను మరింత ప్రోత్సహిస్తామని, పర్యాటక ప్రదేశాలు, షాపింగ్ మాల్స్‌లో ఫ్లాష్ మాబ్స్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు.

'సీతారామ' వేగిరంపై దృష్టి

- గ్యాస్ పైప్‌లైన్ క్రాసింగ్‌కు చైనా సాంకేతిక నిపుణుల అవసరం
- మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల చర్చలు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: సీతారామ ప్రాజెక్టు పనుల వేగవంతంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టి సారించారు. ప్రాజెక్టుకు సంబంధించి 3 పంపుహౌస్‌ల నిర్మాణం పూర్తికాగా, ఇందులో బీజీ కొత్తూరు వద్ద మొదటి పంపుహౌస్‌లో గత నెల 27న చేపట్టిన ట్రయల్‌రన్ విజయవంతమైంది.

- వీకే రామవరం వద్ద ఉన్న రెండో పంపుహౌస్‌లోని పంప్‌ను ఈనెల 15న, కమలాపురం వద్ద ఉన్న మూడో పంపుహౌస్‌లోని పంపులను ఈనెల 20న ట్రయల్‌రన్ చేయడానికి సిద్ధమవుతున్నారు.
- ప్రాజెక్టు మెయిన్ కాల్వ పనులు ఈనెల 20 లోపు పూర్తి చేసి ఏన్కూరు కెనాల్(18 ఎల్) ద్వారా సాగునీరు సరఫరా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపడుతున్నారు.

గ్యాస్ పైప్‌లైన్‌పై సంప్రదింపులు

18 ఎల్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ 5.300 కిలోమీటర్ వద్ద జీఐటీఎల్ (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ట్రాన్స్‌కో లిమిటెడ్) వారి గ్యాస్ పైపులైన్ ఉంది. దీంతో కెనాల్ తవ్వకం సమయంలో గ్యాస్ పైపులైన్‌కు సమస్య రాకుండా చూడాలి. పైప్‌లైన్ నిర్వహణ గుజరాత్‌కు చెందిన కంపెనీ చూస్తుండగా, ఆ వివరాలను సీఎస్ శాంతి కుమారికి మంత్రి తుమ్మల వివరించారు. దీంతో ఆమె గుజరాత్ చీఫ్ సెక్రటరీతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయమై ఏపీలోని తాడేపల్లిగూడెంలో ఉన్న కంపెనీ ప్రతినిధులకు ఆదేశాలు ఇవ్వాలని కోరడమే కాక మంత్రి తుమ్మల సైతం సమస్యపై ఏపీ సీఎస్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గ్యాస్ పైపులైన్ క్రాసింగ్ అనుమతులు, లిఫ్ట్ మోటార్ల నిపుణులను చైనా నుంచి రప్పించే విషయమై ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్, ఇరిగేషన్ సెక్రటరీ రాహుల్‌బొజ్జాకు వివరించగా, వారు విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధులతో మాట్లాడారు. ఆగస్టు నాటికి వైరా లింక్ కెనాల్ పనులు పూర్తి చేసి సీఎం రేవంత్‌రెడ్డితో నీరు విడుదల చేయిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు.

మంత్రి తుమ్మలతో చేనేత నాయకుల భేటీ

మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బుధవారం తెలంగాణ సచివాలయంలో పద్మశాలి సంఘం, చేనేత సహకార సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. చేనేత సహకార సంఘాలు, మరమగ్గాల రంగాలకు సంబంధించిన సమస్యలను విన్నవించారు.

'నిషా'చరుడి ఆటకట్టు

- పట్టుబడిన బ్రీత్ ఎనలైజర్ దొంగ
- బ్రీత్ ఎనలైజర్ స్వాధీనం.. కారు సీజ్
- మూడు సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు



నిందితుడు శ్రవణ్ కుమార్

కంటోన్మెంట్ (హైదరాబాద్): మద్యం తాగి వాహనం నడుపుతూ గతంలో పోలీసులకు చిక్కినా.. పంథా మార్చుకోలేదు. మందుకొట్టి వాహనం నడిపాడు. పోలీసులు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించబోగా.. ఏకంగా దాన్ని లాక్కుని ఉడాయించాడు. ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. బ్రీత్ ఎనలైజర్‌తో పరారైన రాంపల్లికి చెందిన కొత్తపల్లి శ్రవణ్‌కుమార్ అలియాస్ సన్నీని బోయిన్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ బుధవారం విలేకరులకు అందించిన వివరాలివి.

ఒకసారి దొరికినా..

రామగుండానికి చెందిన సన్నీ వృత్తి రీత్యా కారు డ్రైవర్. గతంలో మద్యం తాగి కారు నడుపుతూ రామగుండం పోలీసులకు చిక్కాడు. ఆ సందర్భంలో కారును పోలీసులు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచినా అతని తీరు మారలేదు. గత నెల 27వ తేదీ రాత్రి కూడా మద్యం తాగి తన కారులో బోయిన్‌పల్లి పుల్లారెడ్డి చౌరస్తా వైపు బయల్దేరాడు. అదే సమయంలో మల్లారెడ్డి గార్డెన్స్ సమీపంలో బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అశోకా గార్డెన్స్ వైపు నుంచి బోయిన్‌పల్లి చౌరస్తా వైపు తన కారులో వస్తున్న సన్నీని ఆపారు. ఆ సమయంలో ట్రాఫిక్ జామ్ కావడంతో.. అతని కారును బారికేడ్ దాటించి రోడ్డుకు ఎడమ వైపు నిలపాలని సన్నీకి సూచించారు. సన్నీని పరీక్షించడానికి అతని వద్దకు వెళ్లిన ట్రాఫిక్ కానిస్టేబుల్ బ్రీత్ ఎనలైజర్‌లో గాలి ఊదమని కోరారు. ఊదితే మరోసారి చిక్కుతానని భావించిన సన్నీ.. బ్రీత్ ఎనలైజర్ లాక్కుని, కానిస్టేబుల్‌ను తోసేసి ఉడాయించాడు. వెంటనే తేరుకున్న ట్రాఫిక్ సిబ్బంది కారును వెంబడించే లోపే బోయిన్‌పల్లి చౌరస్తా దాటిపోయాడు. దీంతో ట్రాఫిక్ అధికారులు బోయిన్‌పల్లి లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐపీసీలోని 353 (విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులపై బలం ప్రయోగించడం), 356 (ఓ వస్తువును బలవంతంగా లాక్కుపోవడం), 379 (చోరీ) సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్నారు. వాహనం ఆనవాళ్లు దొరికినప్పటికీ, వెలుతురు సరిగ్గా లేకపోవడంతో కారు నంబర్‌ను గుర్తించడం కష్టసాధ్యంగా మారింది. బోయిన్‌పల్లి క్రైమ్ టీమ్ పోలీసులు తాడ్‌బంద్ మార్గంలో దాదాపు 300 సీసీ కెమెరాల్లో నమోదైన ఫీడ్‌ను సేకరించి అధ్యయనం చేశారు. ఎట్టకేలకు సన్నీ కారు నంబర్ (టీజీ 22 టీ 0365) గుర్తించారు. దీని ఆధారంగా ముందుకు వెళ్లిన అధికారులు రాంపల్లిలోని అతని నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించడంతో అరెస్టు చేసి.. అతని ఇంట్లోని బ్రీత్ ఎనలైజర్‌ను స్వాధీనం చేసుకుని, వినియోగించిన కారును సీజ్ చేశారు. ఈ కేసులో నేరం నిరూపణయితే సన్నీకి గరిష్టంగా మూడేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉంది.

మాస్టార్‌తోనే మేమూ..

- హెచ్‌ఎం బదిలీ అయిన బడికే 141 మంది విద్యార్థులు
- ఎనిమిది గ్రామాల నుంచి చేరిన పిల్లలు..



నూతనంగా చేరిన విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు

జన్నారం: బాగా చదువు చెప్పి.. బదిలీ అయ్యే ఉపాధ్యాయుడిని కన్నీటితో సాగనంపిన పిల్లలను చూశాం. ఆ ఉపాధ్యాయుడే కావాలని ఆందోళన చేసిన స్కూలు పిల్లలను చూశాం. కానీ ఇక్కడ విద్యార్థుల భవితకు కృషి చేసిన ఓ టీచర్ బదిలీ కాగా.. ఆయన వెళ్లిన పాఠశాలలోనే పాత స్కూలు విద్యార్థులూ చేరారు. ఒకరో ఇద్దరోకాదు.. ఏకంగా 141 మంది విద్యార్థులు, ఉపాధ్యాయుడు బదిలీ అయిన పాఠశాలలోనే చేరడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. మండలంలోని పొనకల్ ప్రాథమిక పాఠశాలలో 12 ఏళ్లుగా విధులు నిర్వర్తించిన ప్రధానోపాధ్యాయుడు జాజల శ్రీనివాస్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన పాఠశాలలో చేరిన మొదట్లో 27 మంది విద్యార్థులు ఉండేవారు. అంకితభావం, విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనే తపనతో తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యాబోధన చేస్తూ మంచి ఫలితాలు తీసుకొచ్చారు. గురుకుల, నవోదయ వంటి పరీక్షలకు శిక్షణ ఇస్తూనే, సాంస్కృతిక కార్యక్రమాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. అనతికాలంలోనే విద్యార్థుల సంఖ్య 252కు చేరింది. గత ఐదేళ్లుగా జూన్ చివరిలోనే ఆ స్కూల్లో 'నో అడ్మిషన్'బోర్డు తగిలిస్తున్నారు. పొనకల్‌లో ఉన్న పాఠశాలకు మండలంలోని పది గ్రామాల నుంచి పిల్లలను తల్లిదండ్రులు ఆటోలో పంపించేవారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల కంటే ఈ స్కూల్ నుంచే గురుకుల, నవోదయ పరీక్షల్లో ఎక్కువగా విద్యార్థులు ఎంపికవుతున్నారు. శ్రీనివాస్ వారికి అత్యుత్తమ బోధన అందించడమే కాకుండా తోటి ఉపాధ్యాయులతో కలిసి అంకితభావంతో జిల్లా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

బదిలీ అయిన బడికే..

ఇటీవల ఎస్జీటీలను ప్రభుత్వం బదిలీ చేయగా.. జాజల శ్రీనివాస్ మండలంలోని అక్కపెల్లి గూడ ప్రాథమిక పాఠశాలకు ఈ నెల ఒకటిన బదిలీ అయ్యారు. విషయం తెలుసుకున్న విద్యార్థులు అక్కడికే వెళ్తామని మారాం చేయడంతో తల్లిదండ్రులు కూడా ఆయనపై నమ్మకంతో పిల్లలను ఆ స్కూల్‌లో చేర్పించారు. ఇప్పటివరకు 11 మంది ఉన్న అక్కపెల్లిగూడ ప్రాథమిక పాఠశాలలో 141 మంది చేరారు. దీంతో 152 మంది విద్యార్థులతో ఆ బడి కళకళలాడుతోంది. టీజీపల్లి, దేవునిగూడ, కామన్‌పల్లి, కిష్టాపూర్, ఇందన్‌పల్లి, గాంధీనగర్, జువ్విగూడ, జన్నారం గ్రామాల నుంచి పిల్లలు ఆటోల్లో వస్తున్నారు.

నా విధులు సక్రమంగా నిర్వర్తించాను



ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా నా విధులు సక్రమంగా నిర్వర్తించాను. విద్యార్థులకు బోధన సక్రమంగా ఉండాలనే ఉద్దేశంతో నాతోటి ఉపాధ్యాయులతో కలిసి కష్టపడ్డా. మంచి ఫలితాలు వచ్చాయి. నాపై, సిబ్బందిపై నమ్మకంతో వివిధ గ్రామాల నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలను పంపారు. ఈ నెల 1న బదిలీపై అక్కపెల్లి గూడ పాఠశాలకు వెళ్లాను. బదిలీ విషయం తెలుసుకుని 141 మంది విద్యార్థులు కూడా నా పాఠశాలకు రావడం చాలా ఆనందంగా ఉంది. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి ఫలితాలు తీసుకువస్తాను.

– జాజల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు

సార్ వెళ్లిన చోటికే వెళ్తా అన్నాను



మాది టీజీ పల్లి. నేను జన్నారం ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి వర కు చదివాను. తర్వాత మా తల్లిదండ్రులు నన్ను పొనకల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. సార్లు మంచిగా చదువు చెప్పారు. ఇంగ్లిష్‌లోనే పాఠాలు చెప్పారు. కాని మా సారు బదిలీ అయిన విషయం తెలుసుకుని అక్కడికే వెళ్తాను అని చెప్పాను. మా నాన్న కూడా అక్కడికే పంపిస్తున్నారు.

– శ్రేష్టవర్మ, ఐదో తరగతి విద్యార్థిని

మంచిగా చూసుకుంటారు



మాది దేవునిగూడ. చదువు మంచిగా చెప్పుతున్నారని రెండేళ్ల క్రితం పొనకల్ ప్రాథమిక పాఠశాలలో మా పాప, బాబును చేర్పించాను. శ్రీనివాస్ సార్ మంచిగా చూసుకునే వారు. చదువు, హోంవర్క్ లాంటి విషయాల్లో శ్రద్ధ తీసుకునేవారు. మా పాప, బాబు ఇంగ్లిష్‌లో మాట్లాడుతారు. శ్రీనివాస్ సార్ బదిలీ కావడంతో ఆయన పని చేసే పాఠశాలకే పిల్లలను పంపాలని నిర్ణయించుకున్నాం.

– ఉల్వకాని మల్లేశ్, పేరెంట్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.